


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 153

శుక్రవారం 23-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ 'పసిడి పట్టు'

ప్రపంచ అండర్–17 రెజ్లింగ్ టోర్నీలో భారత అమ్మాయిలకు 4 స్వర్ణాలు - 15లో



ఇంగ్లండ్ గడ్డపై ఐదు టెస్టులు


వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో పర్యటించనున్న భారత క్రికెట్ జట్టు. - 15లో



నిందితుడి దుకాణాల కూల్చివేత

అయోధ్యలో బాలికపై గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి దుకాణ సముదాయాన్ని అధికారులు కూల్చి వేశారు.

- వివరాలు 6లో



లైంగిక వేధింపులు దిగ్భ్రాంతికరం

బద్లాపూర్ పాఠశాలలో ఇద్దరు బాలికలు లైంగిక వేధింపులకు గురికావడం నిజంగా దిగ్భ్రాంతికరమని బాంబే హైకోర్టు పేర్కొంది.

- వివరాలు 6లో



ఉక్రెయిన్‌లో శాంతికి సహకారం

ఉక్రెయిన్‌లో స్థిరత్వం, శాంతిని పునరుద్ధరించడానికి తాము చేయగలిగే పూర్తిసాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



కాంగ్రెస్‌తో పొత్తు కుదిరింది

జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్‌తో నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తు ఖరారైందని ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

సత్తాచాటేలా సిలబస్!



ఇంజనీరింగ్ కోర్సుల్లో పాఠ్యాంశాలు వచ్చే 20 ఏళ్ల సాంకేతికతను అందిపుచ్చుకొనేలా ఉండాలని ఏఐసీటీఈ సూచిస్తోంది. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్‌లో ఈ మార్పు అనివార్యమని అంటోంది.

- వివరాలు 16లో

'లేటరల్ ' నియామకాలకు మేం వ్యతిరేకం



యూపీఎస్సీ ద్వారా జరగాల్సిన నియామకాల్లో కేంద్ర ప్రభుత్వం లేటరల్ విధానం తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. లేటరల్ నియామకాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

- వివరాలు 12లో

చెక్‌లిస్టుపై సంతకం కోసం ఒత్తిడి చేశారు



హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్లకు సంబంధించిన అంశాలకు పూర్తిగా తనదే బాధ్యత అని అంగీకరిస్తూ హరిరామ్ లేఖ ఇచ్చాకే తాను చెక్‌లిస్టుపై సంతకం చేశానని నీటిపారుదల శాఖలోని సీడీఓ విభాగం రిటైర్డ్ సీఈ డి.నరేందర్‌రెడ్డి.. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు తెలిపారు.

- వివరాలు 5లో

కవితకు వైద్య పరీక్షలు



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొద్దిరోజులుగా స్వల్ప అస్వస్థతతో ఉన్నారు. గురువారం మధ్యాహ్నం సమయంలో ఆమెను ఎయిమ్స్‌కు తరలించారు. దాదాపు 5 గంటలపాటు గైనిక్, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి టెస్టులను చేసినట్లు తెలిసింది.

- వివరాలు 5లో



కంగ్రాట్స్! నీకు రుణమాఫీ అయింది!!

హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి, వివేక్, పొంగులేటి, వీహెచ్, పొన్నం, దానం, మహేశ్‌కుమార్, మల్‌రెడ్డి, అంజన్, సల్మాన్ ఖుర్షీద్, దీపాదాస్ మున్షీ తదితరులు



జాతి సంపద దోచిపెడుతున్న మోదీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

- అదానీతో సెబీ చైర్‌పర్సన్ కుమ్మక్కై లక్షల కోట్లు దోచుకున్నట్లు హిండెన్‌బర్గ్ చెప్పింది
- దీనిపై జేపీసీ వేయమంటే ప్రధాని పార్లమెంటు వాయిదా వేసి పారిపోయారన్న సీఎం
- ఈడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ భారీ ధర్నా..

2లో

గురువారం చేవెళ్లలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్



100% మాఫీ నిరూపిస్తే రాజీనామా

సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్

- ఏ గ్రామానికైనా ఇద్దరం కలిసివెళ్దాం.. నీ స్వగ్రామమైనా సరే, కొడంగల్ అయినా సరే
- రుణ మాఫీని రూ.49 వేల కోట్ల నుంచి రూ.7,500 కోట్లకు తెచ్చారు
- వందశాతం రుణమాఫీ నిజమైతే జర్నలిస్టులపై దాడి ఎందుకని నిలదీత

2లో

పాప పరిహార, ప్రక్షాళన పూజ నిర్వహిస్తున్న హరీశ్, దేశపతి శ్రీనివాస్ తదితరులు



రేవంత్ దైవద్రోహానికి పాల్పడ్డారు

దేవుని మీద ఒట్టుపెట్టి మాట తప్పాడు

రుణమాఫీ పూర్తిగా జరిగే వరకు బీఆర్‌ఎస్ పోరాటం: హరీశ్

సాక్షి, యాదాద్రి: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి చేసిన ప్రమాణం ఏమైందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలతో పాటు పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తామని యాదగిరిగుట్ట దేవుడిపై ఒట్టు పెట్టి రేవంత్‌రెడ్డి దైవ ద్రోహానికి పాల్పడ్డారన్నారు. గురువారం ఆలేరులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన.. ముందుగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న రైతులను పోలీస్‌యాక్ట్, లాఠీలతో ఆపలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా

మిగతా 2వ పేజీలో ▶

ట్రిపుల్‌వన్

అడ్రస్ తెలుసా హైడ్రా?

అక్రమ నిర్మాణాలకు కేరాఫ్‌గా ట్రిపుల్ వన్ జీవో ప్రాంతం

గండిపేట ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలను కూల్చేస్తున్న హైడ్రా అధికారులు

ఆ బుల్డోజర్లు అన్ని అక్రమ నిర్మాణాలపైకి వెళతాయా? 'ఎంపిక'చేసిన వాటికే పరిమితమా? అనే ప్రశ్నలు

ప్రస్తుతం లక్షల్లో గృహాలు, ఫామ్‌హౌస్‌లు, రిసార్టులు, వాణిజ్య భవనాలు

- 111 జీవో పరిధిలో 8 ఏళ్ల క్రితమే 12వేలకు పైగా అక్రమ నిర్మాణాలను గుర్తించిన సర్కార్
- చర్యలు తీసుకోకుండా అధికారుల ఉదాసీనత.. దాంతో మరింతగా ఉల్లంఘనలు
- హిమాయత్‌సాగర్, గండిపేట పరీవాహక ప్రాంతాల్లో స్థలమేదైనా 10 శాతమే నిర్మాణాలకు చాన్స్.. కానీ విచ్చలవిడిగా కట్టడాలు
- ఇలాగే కొనసాగితే మరో హుస్సేన్‌సాగర్ లాగా గండిపేట రిజర్వాయర్.. తాజాగా హైడ్రా, మున్సిపల్ శాఖల కూల్చివేతలతో ప్రజల్లో చర్చ



'పరిధి' దాటుతోందా?

చెరువుల పరిరక్షణ, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటైన 'హైడ్రా' పరిధి ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్) వరకు ఉంటుందని ప్రభుత్వమే నిర్వచించింది. కానీ ట్రిపుల్ వన్ జీవో పరిధిలోని జంట జలాశయాల పరీవాహక ప్రాంతంలో సింహభాగం ఔటర్ వెలుపలే ఉంది. దీంతో 'హైడ్రా' పరిధిని దాటి, టార్గెట్ చేసి మరీ బుల్డోజర్లను ప్రయోగిస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

సెలబ్రిటీల నిర్మాణాలను 'టచ్' చేస్తారా?

111 జీవో పరిధిలో చాలా మంది ప్రజాప్రతినిధులు, బ్యూరోక్రాట్లు, సినీ సెలబ్రిటీలు, క్రీడా ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు తక్కువ ధరకే పెద్ద ఎత్తున స్థలాలను కొనుగోలు చేశారు. వాటిలో నివాస, వాణిజ్య సముదాయాలు, ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లను నిర్మించుకున్నారు. ఇందులో ప్రభుత్వంలోని పలువురు కీలక మంత్రులు, మాజీ మంత్రులు, బహుళ జాతి సంస్థల అధినేతలు, సెలబ్రిటీల లగ్జరీ ఫామ్‌హౌస్‌లు కూడా ఉన్నాయి. మరి ప్రభుత్వం వాటిని 'టచ్' చేస్తుందా? ఆ అక్రమ నిర్మాణాలపైకి బుల్డోజర్లను ప్రయోగించగలదా? అని పర్యావరణవేత్తలు ప్రశ్నిస్తున్నారు.

12లో



డిసెంబర్ 15,16న గ్రూప్–2 పరీక్షలు

షెడ్యూల్ విడుదల చేసిన టీజీపీఎస్సీ

రెండు సెషన్ల చొప్పున నాలుగు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి సంబంధించి అర్హత పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో నాలుగు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు.. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపింది.

ఐదోసారి ప్రకటన

వివిధ ప్రభుత్వ శాఖల్లో 783 గ్రూప్–2 ఉద్యోగ ఖాళీల భర్తీకి టీజీపీఎస్సీ 2022 డిసెంబర్ 26న నోటిఫికేషన్ విడుదల చేయడం తెలిసిందే. ఈ ఉద్యోగాలకు సంబంధించి అర్హత పరీక్షలు ఇప్పటికే నాలుగుసార్లు వాయిదా పడగా తాజాగా టీజీపీఎస్సీ ఐదోసారి పరీక్షల తేదీలను ప్రకటించింది. గతేడాది ఆగస్టులో జరగాల్సిన ఈ పరీక్షలను ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో అక్టోబర్‌కు రీ–షెడ్యూల్ చేస్తూ

మిగతా 3వ పేజీలో ▶



కార్తీక్ చౌదరి

అమెరికాలో వ్యభిచారం

ఏడుగురు భారతీయుల అరెస్ట్

వీరిలో ఐదుగురు తెలుగు యువకులు

నిందితుల్లో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ వింగ్ కో–ఆర్డినేటర్లు రాయపాటి కార్తీక్ చౌదరి, గల్లా మోనిష్‌చౌదరి!



గల్లా మోనిష్ | జైకిరణ్ మేకల



నిఖిల్ కుమ్మరి | నిఖిల్ బండి

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో వ్యభిచారం కేసులో ఏడుగురు భారతీయులు పట్టుబడ్డారు. వీరిలో ఐదుగురు తెలుగు యువకులు ఉన్నట్టుగా స్థానిక అధికారులు వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. డెంటన్ కౌంటీ షెరీఫ్ అధికారులు వ్యభిచారాన్ని అరికట్టడానికి హాయ్‌ల్యాండ్ విలేజ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సహకారంతో మంగళవారం టెక్సాస్‌లోని డెంటన్‌లో స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో మొత్తం 18 మంది నిందితులు పట్టుబడ్డారు. వీరిలో ఏడుగురు భారతీయులు ఉండగా.. అందులో ఐదుగురు తెలుగువారని అధికారులు చెప్పారు. స్థానిక పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో నిఖిల్ బండి, మోనిష్ గల్లా, నిఖిల్ కుమ్మరి, జైకిరణ్ మేకల, కార్తీక్ రాయపాటి ఉన్నారు. వీరిలో పోలీసుల అరెస్ట్ నుంచి తప్పించుకునేందు యత్నించిన ఆరోపణలపై బండి నిఖిల్, కుమ్మరి నిఖిల్‌ను అరెస్ట్ చేశామని, వ్యభిచారం చేయాలని కోరిన ఆరోపణలపై గల్లా మోనిష్, అమిత్‌కుమార్, పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకోవడంతోపాటు 18 ఏళ్లలోపు మైనర్‌ను వ్యభిచారం చేయాలని కోరిన ఆరోపణలపై మేకల జైకిరణ్ రెడ్డిని, వ్యభిచారం చేయాలని అభ్యర్థించిన ఆరోపణలపై రాయపాటి కార్తీక్, నబిన్ శ్రేష్ఠలను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. 18 మందిలో ఇద్దరి వద్ద అక్రమ ఆయుధాలున్నట్టు గుర్తించామన్నారు. ఈ వ్యభిచార ముఠాతో సంబంధాలున్న ఇతర వ్యక్తుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్టు పేర్కొన్నారు. కాగా, పట్టుబడిన తెలుగు యువకులు రాయపాటి కార్తీక్ చౌదరి, గల్లా మోనిష్‌చౌదరి టెక్సాస్ ఎన్‌ఆర్‌ఐ టీడీపీ వింగ్ కో–ఆర్డినేటర్లు అని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

క్రైం సీన్‌నే మార్చేశారు

వైద్యురాలిపై హత్యాచారాన్ని కప్పిపెట్టజూశారు

- కోల్‌కతా ఉదంతం వెనక విస్తుపోయే నిజాలు
- సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో సీబీఐ
- గ్యాంగ్ రేప్‌కు ఆధారాల్లేవన్న దర్యాప్తు సంస్థ
- పోస్టుమార్టం, అంత్యక్రియలయ్యాక ఎఫ్‌ఐఆరా?
- గత 30 ఏళ్లలో ఎన్నడూ చూడలేదు: ధర్మాసనం



కోల్‌కతా ఆర్‌జీ కర్ ప్రభుత్వాసుపత్రి, వైద్య కళాశాలలో వైద్యురాలి హత్యాచారోదంతంపై తమ దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నట్టు సీబీఐ గురువారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ''ఈ పాశవిక చర్యను కప్పిపుచ్చి ఆత్మహత్యగా చిత్రించేందుకు స్థానిక పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. అందులో భాగంగా మేం దర్యాప్తు బాధ్యతలు స్వీకరించే నాటికి ఏకంగా క్రైం సీన్‌నే సమూలంగా మార్చేశారు'' అంటూ నివేదించింది.

6లో

''సాయంత్రం 6.10 నుంచి 7.10 మధ్య పోస్టుమార్టం జరిపారు. అంటే అది అసహజ మరణమని అప్పటికే రూఢీ అయినట్టే. కానీ అర్ధరాత్రి కనీసం కేసు కూడా నమోదు చేయకపోవడం చాలా ఆశ్చర్యకరం. 30 ఏళ్లలో ఇలాంటిది ఎన్నడూ చూడలేదు'' – **జస్టిస్ పార్దీవాలా**

జాతి సంపద దోచి పెడుతున్న మోదీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

- అదానీతో సెబీ చైర్‌పర్సన్ కుమ్మక్కై రూ.లక్షల కోట్లు దోచుకున్నట్లు హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడించింది
- దీనిపై జేపీసీ వేయమంటే ప్రధాని పార్లమెంటు వాయిదా వేసి పారిపోయారన్న సీఎం
- ఈడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ భారీ ధర్నా
- సెబీ చైర్‌పర్సన్ అక్రమాలపై జేపీసీ వేయాలని, అదానీ కుంభకోణంపై విచారణ జరపాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: లక్షల కోట్ల అప్పులతో దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన ప్రధాని మోదీ పేదలకు దక్కాల్సిన జాతి సంపదను తన వాళ్లకు దోచిపెడుతున్నారని ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అదానీతో సెబీ చైర్‌పర్సన్ కుమ్మక్కై రూ.లక్షల కోట్లు దోచుకున్నట్లు హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడించిందని చెప్పారు. ఈ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయమంటే పార్లమెంటును నాలుగు రోజుల ముందే వాయిదా వేసి ప్రధాని పారిపోయారని మండిపడ్డారు. 'హమ్ దో.. హమారే దో' అన్నట్టుగా మోదీ, అమిత్ షా-అదానీ, అంబానీ వ్యవహారం తయారయ్యిందని తీవ్రంగా విమర్శించారు. సెబీ చైర్‌పర్సన్ అక్రమాలపై జేపీసీ వేయాలని, అదానీ కుంభకోణంపై విచారణ జరపాలనే డిమాండ్‌తో, ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా జరిగింది. అంతకుముందు గన్‌పార్క్ వద్ద గల అమరవీరుల స్తూపం నుంచి మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీగా ఈడీ కార్యాలయం వరకు వచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి.. ప్రధానితో పాటు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్‌పై నిప్పులు చెరిగారు.

ఇద్దరి చేతుల్లోకి జాతి సంపద

'అదానీని కాపాడేందుకే ప్రధాని సెబీ కుంభకోణంపై జేపీసీ వేయడం లేదు. దేశానికి రూ.183 లక్షల కోట్ల అప్పులున్నాయి. అయితే దేశాన్ని 67 ఏళ్లు పాలించిన 16 మంది ప్రధానులు చేసిన అప్పులతో పోల్చుకుంటే మోదీ ప్రధాని అయిన తరువాత చేసినవి రెండింతలు ఉన్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు వంటి ప్రధానులు దేశాన్ని వివిధ రంగాల్లో అభివృద్ధి చేశారు. కానీ మోదీ తెచ్చిన గొప్ప ప్రాజెక్టులు ఏమీలేవు. పైగా పేదలకు చెందాల్సిన జాతి సంపద ఇద్దరు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. సెబీ చైర్‌పర్సన్ తక్షణమే రాజీనామా చేయాలి. లేకపోతే కేంద్రమే ఆమెను తొలగించాలి.

కేసీఆర్, కేటీఆర్ ఎందుకు ప్రశ్నించడం లేదు?: సెబీ కుంభకోణంపై బీజేపీని కేసీఆర్, కేటీఆర్ ఎందుకు ప్రశ్నించడం లేదు? వాళ్ల విలీనమైతరో మలినమైతరో మాకు సంబంధం లేదు. కానీ బీజేపీకి బీఆర్‌ఎస్ అనుకూలం అనడానికి ఇది నిదర్శనం. మోదీని సంతృప్తిపరిచేందుకు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని బీఆర్‌ఎస్ నేతలు అంటున్నారు. డిసెంబర్ 9న సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసి తెలంగాణ తల్లికి నిజమైన వారసులమని నిరూపించుకుంటాం..' అని రేవంత్ అన్నారు.



ఈడీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీ, ఖుర్షీద్, భట్టి, మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నం, శ్రీధర్‌బాబు

ఈ సన్నాసులను నమ్ముకొని రైతులు రోడ్డెక్కొద్దు

'రైతు రుణమాఫీపై బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. ఈ సన్నాసులను నమ్ముకుని రైతులు రోడ్డెక్కొద్దు. రుణమాఫీ కానివాళ్లు కలెక్టరేట్‌లకు వెళ్లి పిటిషన్లు ఇవ్వాలి. ధర్నాలు అవసరం లేదు. పదేళ్లు మిమ్మల్ని దోచుకుతిన్న ఈ బీఆర్‌ఎస్ దోపిడీ దొంగలను నమ్మొద్దు. మొన్ననే తరిమికొట్టిన దొంగలను మళ్లీ ఊళ్లకు ఎందుకు రానిస్తున్నారు? రాజీనామా చేయాల్సి వస్తుందని హరీశ్ డ్రామాలు చేస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 39లో 9 కూడా మిగలవు..' అని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ ఆస్తులు నిలబెడితే.. మోదీ దోచిపెడుతున్నారు: భట్టి

కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలోని ఆస్తులు, సంపద, వనరులను నిలబెడితే వాటిని ప్రధాని మోదీ.. అదానీ వంటి క్రోని కాపిటలిస్టులకు (స్నేహితులైన పెట్టుబడిదారులకు) దోచిపెడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ తీరును రాహుల్‌గాంధీ చెప్పినప్పుడు మొదట స్పందించకపోయినా ఇప్పుడు ఒక్కొక్క అవినీతి వెలుగులోకి వస్తుంటే ప్రజలకు అర్థమవుతోందని చెప్పారు. దేశ సంపదను కాపాడాల్సిన సెబీ చైర్మన్ ఈ దోపిడీలో భాగస్వామిగా ఉన్నారని హిండెన్‌బర్గ్ సంస్థ పరిశోధించి బయట పెట్టడంతో ప్రపంచమే ఆశ్చర్యపోయిందని భట్టి వ్యాఖ్యానించారు. ధర్నా అనంతరం రేవంత్, భట్టి, ఏఐసీసీ నేతలు దీపాదాస్ మున్షీ, సల్మాన్ ఖుర్షీద్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఈడీ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, జూపల్లి కృష్ణారావు, పార్టీ నేతలు జగ్గారెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'చెప్పు'కోలేని బాధలు



ఎస్‌బీఐ ఎదుట క్యూలో చెప్పులు పెట్టిన రైతులు

నెల్లికుదురు: కొత్త రుణాల కోసం రైతులు యాతన పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎస్‌బీఐకి ఉదయం 7 గంటల నుంచే బారులు తీరుతున్నారు. గురువారం మండలంలోని 36 గ్రామాల రైతులు ఒకేసారి బ్యాంకుకు వచ్చారు. బ్యాంక్ మెయిన్ రోడ్డు వెంబడి ఉండడం, ఎండలో గంటల తరబడి నిల్చోలేక చెప్పులను క్యూలో పెట్టి నిరీక్షించారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల వారీగా రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ ధర్నాల్లో రైతులు లేరు

మంత్రి పొన్నం



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ జరగలేదంటూ బీఆర్‌ఎస్ చే పట్టిన ధర్నాలు ఫెయి లయ్యాయని రవా ణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభా కర్ ఎద్దేవా చేశారు. ఆ ధర్నాల్లో రైతులెవరూ పాల్గొనలేదని, బీఆర్‌ఎస్ ధర్నాల్లో పాల్గొనకపోగా బీఆర్‌ఎస్ హయాంలో ఏం చేశారంటూ రైతులు తిరిగి ప్రశ్నించారని చెప్పారు. రైతుల స్పందన లేకుండానే ఉనికి కోసం బీఆర్‌ఎస్ చేపట్టిన ధర్నాల డ్రామా విఫల మైందని పొన్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'బీఆర్‌ఎస్‌ను రైతులు నమ్మే పరిస్థితి లేదు. రైతులెవరూ బీఆర్‌ఎస్ ట్రాప్‌లో పడబోరు. వారి ధర్నాలకు రైతుల స్పందన లేకపోవడం వల్లనే బీఆర్‌ఎస్ ముఖ్యులు వెంటనే ఢిల్లీకి వెళ్లిపోతున్నారు. అసలు బీఆర్‌ఎస్ ధర్నాలు చేయాల్సింది తెలంగాణలో కాదు. దేశ ఆర్థిక వ్యవస్థను కొల్లగొడుతున్న మోదీ, అదానీలకు వ్యతిరే కంగా చేయాలి. కానీ, బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఒకే ట్యూన్ కాబట్టి అలాంటి ధర్నాలు చేయ డం లేదు. అధికారం లేకుండా బీఆర్‌ఎస్ నేతలు ఉండలేకపోతున్నారన్న విషయాన్ని తెలంగాణ ప్రజానీకం గమనిస్తున్నారు' అని పొన్నం పేర్కొన్నారు.

హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులపై కేసు

'యాదాద్రి'లో రాజకీయ పూజలు చేయడంపై ఈవో ఫిర్యాదు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని గురువారం సందర్శించి ఆలయంలో పూజలు చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కేసు నమోదైంది. ఆలయ మాఢ వీధిలో రాజకీయ సంబంధ పూజలు చేశారని ఆలయ ఈఓ భాస్కర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతతో పాటు పలువురిపై పోలీ సులు కేసు నమోదు చేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం రాజకీయ పూజలకు అనుమతి లేదని భాస్క ర్‌రావు యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయ నిబంధనలను ఉల్లంఘించి, భక్తుల మనోభావాలను దెబ్బ తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీఐ రమేశ్‌ను వివరణ కోరగా.. హరీశ్‌రావు, దేశపతి శ్రీనివాస్, గొంగిడి సునీత, దేవాలయానికి సంబంధం లేని పూజారులు దేవాలయ మాఢ వీధిలో ఆలయ సంప్రదాయాలకు విరుద్ధంగా రాజ కీయ పరమైన ఉద్దేశంతో పూజలు నిర్వహించారని ఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

100% మాఫీ నిరూపిస్తే రాజీనామా

ఏ గ్రామానికైనా ఇద్దరం కలిసి వెళ్దాం

- నీ స్వగ్రామమైనా సరే, కొడంగల్ అయినా సరే
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్

చేవెళ్ల: 'రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా నీవు, నేను ఇద్దరం కలిసి వెళ్దాం.. నీ స్వగ్రామం కొండారెడ్డిపల్లి అయినా, కొడంగల్ అయినా.. సరే. రుణమాఫీ వంద శాతం జరిగిందని నిరూపిస్తే నేను అక్కడికక్కడే రాజీనామా చేసి వెళ్లిపోతా..' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డికి సవాలు విసిరారు. సంపూర్ణ రుణమాఫీ డిమాండ్‌తో పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో మాజీ మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రూ.49 వేల కోట్ల నుంచి రూ.7,500 కోట్లకు తెచ్చారు

'ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ఎలాంటి షరతులు లేకుండా డిసెంబర్ 9 నాడే మొదటి సంతకం చేసి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని సోనియాగాంధీ మీద ఒట్టేసి చెప్పిన రేవంత్ అధికారంలోకి రాగానే తప్పించుకునే లెక్కలు చెబుతున్నాడు. మొదట రూ.49 వేల కోట్లు అని బ్యాంకర్ల సమావేశంలో గుర్తించిన తర్వాత.. ఏడాది కడుపు కట్టుకుని అయినా రూ.40 వేల కోట్లు బ్యాంకులకు చెల్లిస్తామని చెప్పాడు. ఆ తర్వాత కేబినెట్‌లో దానిని రూ.31 వేల కోట్లకు తగ్గించాడు. అనంతరం బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే పెట్టాడు. తర్వాత కనీసం రూ.17 వేల కోట్లయినా మాఫీ అయ్యాయని అనుకుంటుండగా.. రైతుల ఖాతాల్లో రూ.7,500 కోట్లే జమయ్యాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు..' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.



చేవెళ్లలో బీఆర్‌ఎస్ రైతు నిరసన దీక్ష ర్యాలీలో పాల్గొన్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి సబితారెడ్డి తదితరులు

సంపూర్ణ రుణమాఫీ కాకపోతే అదే జరుగుతుంది

'రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు.. ఎలాంటి కొర్రీలు, కోతలు లేకుండా రూ.2 లక్షల రుణ మాఫీ వర్తింపజేసే వరకూ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదు. ఎన్నికలకు ముందు చెప్పిన ఆరు గ్యారంటీలతో పాటు అదనంగా చెప్పిన 420 హామీలను సైతం అమలు చేయాలి. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకుడిగా రేవంత్‌రెడ్డి పదేపదే చెప్పిన మాటలు.. 'చెట్టుకు కట్టేసి కొడతాం'.. లాగుల్లో తొండలు వదిలిపెడతాం'. సంపూర్ణ రుణమాఫీ కాకపోతే అదే జరుగుతుంది. కేసీఆర్ ఉన్నప్పుడు లేని ఆధార్ నంబర్ల తప్పులు, రేషన్ కార్డుల తప్పులు ఇప్పుడు ఎక్కడినుంచి వచ్చాయి? రుణమాఫీ ఏమైందని, రైతుబంధు డబ్బులు ఎప్పుడు ఇస్తారని.. గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలను నిలదీయాలి..' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

100% రుణమాఫీ నిజమైతే జర్నలిస్టులపై దాడి ఎందుకు?

రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా కొండారెడ్డిపల్లిలో సర్వే చేసేందుకు వెళ్లిన ఇద్దరు మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు రక్షణ ఇదేనా? అని ప్రశ్నించారు. వందశాతం రుణమాఫీ నిజమైతే సర్వేకు వచ్చిన జర్నలి స్టులు విజయారెడ్డి, సరితపై రేవంత్ తొత్తులు ఎందుకు దాడి చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్య మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ద్రోహికి విగ్రహం పెట్టే అర్హత ఉందా?

మహాత్మాగాంధీ విగ్రహాన్ని గాడ్సే పెట్టినట్టుగా ఉంటుంది

- అనేక అంశాల్లో రాహుల్‌తో సీఎం రేవంత్‌కు భిన్నాభిప్రాయాలు
- తెలంగాణ నుంచి ప్రాంతేతరులకు పదవుల అప్పగింత
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ఎదుట ప్రతిష్ఠించాలన్నది ప్రజల కోరిక. రాహుల్‌గాంధీ దగ్గర మార్కులు కొట్టేసేందుకు రేవంత్ తెలంగాణ జాతి మొత్తాన్ని అవమానిస్తున్నాడు. గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెడితే ఎంత దరిద్రంగా ఉంటుందో.. తెలంగాణతల్లి విగ్రహాన్ని రేవంత్‌రెడ్డి లాంటి తెలంగాణ ద్రోహి పెడితే అంతే దారుణంగా ఉంటుంది' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. చేవెళ్లలో రైతుధర్నాలో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

'ప్రధాని మోదీతో మొదలుకొని అనేక అంశాలపై రాహుల్‌గాంధీకి సీఎం రేవంత్‌కు నడుమ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రేవంత్, రాహుల్ చర్చించుకొని అదానీ మంచివాడో.. చెడ్డవాడో చెప్పాలి. పదేళ్ల పాటు మా మెడ మీద కేంద్రం కత్తిపెట్టినా రాష్ట్రంలో అదానీని అడుగుపెట్టనివ్వ లేదు. కానీ ప్రస్తుతం ఆయనతో రేవంత్ ప్రభుత్వం రూ.12,400 కోట్ల మేర ఒప్పందం కుదుర్చుకుంది.

కాంగ్రెస్ డిక్లరేషన్లపై బీఆర్‌ఎస్ పోరు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు డిక్లరేషన్ల అమలు కోసం బీఆర్‌ఎస్ పోరాడుతుంది. గతంలో డిక్లరేషన్‌ల పేరిట కాంగ్రెస్ సమావేశాలు పెట్టినచోటే సెప్టెంబర్‌లో బీఆర్‌ఎస్ తరఫున కార్యక్రమాలు నిర్వహిస్తాం. రైతు రుణమాఫీ సంపూర్ణంగా అమలయ్యేదాకా గ్రామస్థాయి వరకు తెలంగాణ ఉద్యమకాలం నాటి నిరసన రూపాలన్నీ కొనసాగిస్తాం. ఓవైపు రుణ మాఫీ పూర్తి చేయకుండా, మరోవైపు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళుతుందని అనుకోవడం లేదు. ప్రజా అంశాల నుంచి దృష్టి మరల్చేందుకే రేవంత్ బజారుభాష మాట్లాడుతున్నాడు.

తెలంగాణ పేరును కూడా మారుస్తారా

అధికార పార్టీ నాయకులు అహంకారంతో మాట్లాడితే మేము తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకుల పేర్లతో ఉన్న ప్రతీ పథకం పేరును మార్చడం ఖాయం. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అహంకారంగా అర్థం చేసుకుంటే నేనేమీ చేయలేను. తొమ్మిది నెలల్లో సీఎం రేవంత్ 20 సార్లు ఢిల్లీకి వెళ్లి రావడం ద్వారా కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి బానిసలు అని రుజువు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం లేకుండా చేసేందుకు రేవంత్ కుట్రలు పన్నుతున్నాడు. తెలంగాణ అనే పేరును ఏమైనా మారుస్తాడేమో చూడాలి. తెలంగాణ నుంచి అభిషేక్ సింఘ్వీని రాజ్యసభకు పంపడం మొదలుకొని అన్ని పదవులను ప్రాంతేతరులకు కాంగ్రెస్ అప్పజెప్తోంది. సింఘ్వీ తెలంగాణ కోసం కొట్లాడుతాడు అని సీఎం చెబుతున్నాడు. మరి రాష్ట్రం నుంచి ఎన్నికై న ఎనిమిది మంది ఎంపీలు గాడిదలు కాస్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు.

యాదాద్రి ఆలయ పరిసరాలను శుద్ధి చేసిన కాంగ్రెస్ నేతలు



ఆలయ పరిసరాలను నీటితో శుద్ధి చేస్తున్న విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: బీఆర్‌ఎస్ నాయకులు దేవుడి సన్నిధిలో రాజకీయాలు మాట్లాడి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అపవిత్రం చేశారని ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఆలయానికి వచ్చి పూజలు చేయగా.. సాయంత్రం ఐలయ్య స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఆలయ పరిసరాలు, మాడవీధులను శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ కేసీఆర్‌ను ఫాంహౌస్‌కు పరిమితం చేసినా బుద్ధి రాలేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి రైతులను పట్టించుకోని బీఆర్‌ఎస్.. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుంటే ఓర్వలేకపోతుందన్నారు.

ప్రజలు బాగుండాలని పూజలు చేస్తే కేసులు పెడతారా?

యాదగిరిగుట్ట: దేవుడిపై ఒట్టు వేసి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డిని శిక్షించకుండా కాపాడాలని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని కోరుతూ పూజలు చేస్తే బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరైంది కాదని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. అనుమతులు లేకుండా, భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా యాదాద్రి ఆలయాన్ని శుద్ధి చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు కాంగ్రెస్ నేతలపై దేవాదాయశాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని గురువారం రాత్రి యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సంపూర్ణ రుణమాఫీ జరిగే వరకు పోరాటం

సాక్షి, హైదరాబాద్: రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని పేర్కొంటూ, ఇందుకు నిరసనగా భారత్ రాష్ట్ర సమితి గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా నిర్వహించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపు మేరకు రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నేతలు, పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మండల, నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన రైతు ధర్నాలో పాల్గొన్నారు. రుణమాఫీపై ప్రభుత్వం తీరును ఎండగట్టారు. రేవంత్ ప్రభుత్వం మెడలు వంచి సంపూర్ణ రైతు రుణమాఫీ జరిగేంతవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కేటీఆర్ చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు రైతు ధర్నాలో పాల్గొన్నారు. రైతులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో కేటీఆర్ పాల్గొన్నారు. ఆలేరు, జనగామ నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన ధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో దేవుళ్ల మీద ఒట్లు వేసి సీఎం రేవంత్ రైతులను మోసగించారంటూ, ఆయన చేసిన పాపం తెలంగాణ ప్రజలకు శాపం కాకుండా రక్షించాలని యాదాద్రి ఆలయం తూర్పు రాజగోపురం వద్ద హరీశ్‌రావు పాప పరిహార పూజలు చేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ కార్యక్రమాలు, పరస్పర దాడులతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా గాయపడిన బీఆర్‌ఎస్ కార్యకర్తలను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్‌కుమార్ పరామర్శించారు. కొన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై బీఆర్‌ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ధర్నా శిబిరాల్లో రైతులు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట ఎమ్మెల్సీలు, ఇతర నేతలు ధర్నాకు నేతృత్వం వహించారు.

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ రైతు ధర్నా.. తిరుమలగిరిలో ఉద్రిక్తత



తిరుమలగిరి ఎక్స్‌రోడ్డులో గుమికూడిన ఇరుపార్టీల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

తిరుమలగిరిలో రాళ్లు, కోడిగుడ్లతో పరస్పరం దాడులు

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు గురువారం పోటాపోటీగా చేపట్టిన కార్యక్రమాలు ఉద్రిక్తతకు దారితీశాయి. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నేతలు పట్టణ చౌరస్తాలో ధర్నాకు దిగారు. ఇందుకు పోటీగా అదే ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని హర్షం వ్యక్తం చేస్తూ ర్యాలీ చేపట్టారు. బీఆర్‌ఎస్ శిబిరం వద్ద పలువురు నాయకులు మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ పార్టీ నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రికి అనుకూలంగా నినాదాలు చేస్తూ బీఆర్‌ఎస్ శిబిరం వైపు వెళ్లడానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకున్నప్పటికీ కొంతమంది నాయకులు బారికేడ్లను తోసుకొని శిబిరం వద్దకు వెళ్లడంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు కోడిగుడ్లు, రాళ్లు, టమాటాలు విసురుకున్నారు. దీంతో ప్రజలు, ఆర్టీసీ ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. రాళ్లు రువ్విన సంఘటనలో రెండు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇరు పార్టీల నాయకులకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు స్వల్పంగా లాఠీచార్జీ చేసి అందరినీ చెదరగొట్టారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. సూర్యాపేట డీఎస్పీ రవి ఆధ్వర్యంలో సాయంత్రం వరకు పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

సీఎం డైరెక్షన్‌లోనే బీఆర్‌ఎస్‌పై దాడులు: జగదీశ్‌రెడ్డి

సంపూర్ణ రైతురుణ మాఫీ కోసం తిరుమలగిరిలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే బీఆర్‌ఎస్‌పై దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేవంత్ దైవద్రోహానికి పాల్పడ్డారు

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పుకుంటున్న ప్రజాపాలనలో ధర్నాలు నిషేధం అని రైతులకు పోలీసులు నోటీసులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ స్వగ్రామంలో జర్నలిస్టులపై దాడి చేశారన్నారు. 42 లక్షల్లో 20 లక్షల మంది రైతులకే రుణమాఫీ జరిగిందని మంత్రులే చెబుతు న్నారన్నారు. మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల ఇంకా రుణమాఫీ పూర్తిగా కాలేదని చెప్పిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి మాటతప్పి చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం కోసం లక్ష్మీనరసింహస్వామి దగ్గరికి వచ్చామని, ఇందుకోసం ప్రత్యేక పూజలు చేశామని చెప్పారు. డిసెంబర్ 9 నుంచి రుణాల వడ్డీ కూడా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టు పెట్టి ప్రమాణం చేసిన అన్ని దేవాలయాలకు వెళ్లి పాప ప్రక్షాళనకు ఆలయాలను శుభ్రం చేస్తామని వెల్లడించారు.

రైతుల పక్షాన త్వరలో కేసీఆర్ పోరు

రైతుల పక్షాన పోరాడేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో రాష్ట్రంలో యాత్ర చేపడతారని హరీశ్‌రావు వెల్లడించారు. ఆలేరులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కొందరికే రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఏ ఊరికైనా పోదాం..రుణమాఫీ పూర్తిగా అయ్యిందా అంటే కాలేదన్నారు. రుణమాఫీ విషయంలో ప్రజలు మంత్రులను అడ్డుకునే పరిస్థితి వచ్చిందని చెప్పారు. రైతుల కోసం అసెంబ్లీలో కొట్లాడినం. బయట కొట్లాడుతున్నామన్నారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని చెప్పారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ధర్నాను విజయవంతం చేసిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, వివేకానంద, కాలేరు వెంకటేష్, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, నాయకులు గొంగిడి మహేందర్‌రెడ్డి, క్యామ మల్లేశం, కల్లూరి రామచంద్రారెడ్డి, గడ్డమీది రవీందర్, కర్రె వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై చర్చకు సిద్ధమా?

రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్



జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన రైతు ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

జనగామ: కాంగ్రెస్ తొలుత రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంట రుణమాఫీ చేసినట్టు భావిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి తనతో చర్చకు సిద్ధమా? అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సవాల్ విసిరారు. సంపూర్ణ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా పోలీస్ కంట్రోల్ రూం ఏరియాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఎక్కడైనా తేదీ ఖరారు చేసి కబురు పంపిస్తే జనగామ ఎమ్మెల్యే పల్లాను వెంట బెట్టుకుని వస్తామని.. ఆ దమ్ము, ధైర్యం సీఎంకు ఉందా? అని హరీశ్ అన్నారు. జనగామకు వచ్చి కొమురవెల్లి మల్లన్న, వరంగల్‌కు వెళ్లి భద్రకాళి, ములుగు సభలో సమ్మక్క, సారలక్క, భువనగిరికి వెళ్లి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి, భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామిపై.. ఇలా ఏ ఊరికి వెళితే ఆ ఊరిలో పంట రుణమాఫీపై ఒట్టు వేసిన రేవంత్.. ఎలక్షన్లు ముగియగానే దైవ ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, దేవీప్రసాద్, క్యామ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై బీఆర్‌ఎస్‌ది అనవసర రాద్ధాంతం



పదేళ్లు ఏమీ చేయని ఆ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తోంది.. ఎమ్మెల్సీ కోదండరాం ధ్వజం

సాక్షి, హైదరాబాద్: పదేళ్లు ఏమీ చేయలేని బీఆర్‌ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. అప్పులు చేసి అభివృద్ధి ఎలా చేస్తారో చూస్తామన్నట్లుగా బీఆర్‌ఎస్ తీరు ఉందని ధ్వజమెత్తారు. గురు వారం కోదండరాం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లా డారు. రుణమాఫీ, కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై బీఆర్‌ఎస్ లేనిపోని రాద్ధాంతం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడం గొప్ప నిర్ణయమని కొనియాడారు. అయితే ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అందరూ కట్టారు.. నేను ఫాంహౌస్ కట్టుకున్నానని ఒకసారి, అది నాది కాదంటూ మరోసారి.. కేటీఆర్ రెండు విధాలుగా మాట్లాడడం ఏమిటని కోదండరాం ప్రశ్నించారు. పదేళ్ల పాటు మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌కు నిబంధనలు తెలియవా? అని నిలదీశారు. కులగణన జరిగితే బీసీ వర్గాలకు అన్ని విధాలుగా మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాలపై ప్రభుత్వానికి సూచనలు ఇస్తామన్నారు. ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తానని, ప్రజలకు మంచి జరిగేదానిలో ముందు ఉంటామని అన్నారు. విద్యాశాఖ మంత్రి అవుతారా? అన్న ప్రశ్నకు అలాంటి చర్చే ఏమీ రాలేదని తేల్చి చెప్పారు. తెలంగాణ తల్లి, రాజీవ్ గాంధీ విగ్రహాలపై రాద్ధాంతం చేయాల్సిన పనిలేదని అన్నారు.

ప్రభుత్వంలో చేరాలని బీఆర్‌ఎస్ ఆహ్వానించింది

ప్రభుత్వంలో చేరాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తనను ఆహ్వానించిందని కోదండరాం తెలిపారు. బయట నుంచి సూచనలు చేద్దామని అనుకున్నామని, అయితే తాము చేసిన సూచనలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో తనలాంటి వాళ్లు నిలబడటం కష్టమని, రాజకీయాల్లో ఉండాలంటే డబ్బు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

డిసెంబర్ 15, 16న గ్రూప్–2 పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

టీజీపీఎస్సీ తేదీలను ప్రకటించింది. ఆ తర్వాత ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో నిర్వహించనున్నట్లు కమిషన్ మరో ప్రకటన చేసింది. అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పడటం, టీజీపీఎస్సీ ప్రక్షాళనతో ఏర్పాటైన కమిషన్... గ్రూప్–2 పరీక్షలను ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించనున్నట్లు షెడ్యూల్ విడుదల చేసింది. కానీ డీఎస్సీ పరీక్షల నేపథ్యంలో గ్రూప్–2 పరీక్షల తేదీలను మార్చాలంటూ క్షేత్రస్థాయి నుంచి అభ్యర్థులు తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తం చేయడంతో ప్రభుత్వం... పరీక్షల తేదీలను మార్చాలని కమిషన్‌కు సూచించింది. ఈ క్రమంలో డిసెంబర్‌లో ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు ప్రకటించిన కమిషన్ తాజాగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. గ్రూప్–2 ఉద్యోగాల కోసం 5.45 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

గ్రూప్–2 పరీక్షల షెడ్యూల్ ఇలా..

తేదీ	పేపర్	సబ్జెక్టు	సమయం
15.12.2024	పేపర్–1	జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ	ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు
15.12.2024	పేపర్–2	హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ	మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు
16.12.2024	పేపర్–3	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్	ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు,
16.12.2024	పేపర్–4	తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్	మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు

బస్సులో పురుడు పోసిన మంగమ్మకు మంత్రి దామోదర అభినందన

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సులో గర్భిణికి పురుడు పోసిన వనపర్తి జిల్లా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ అలివేలు మంగమ్మను మంత్రి దామోదర రాజనర్సింహ తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కొండపల్లి గ్రామానికి చెందిన గర్భిణి సంధ్య భర్త రామాంజితో కలసి ఆర్టీసీ బస్సులో వనపర్తి మండలం నాచహళ్లి గ్రామ శివారులోకి రాగానే పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో కండక్టర్ భారతి 108కు ఫోన్ చేయగా..అదే బస్సులో ప్రయాణం చేస్తున్న మంగమ్మ తక్షణం స్పందించి సంధ్యకు సాధారణ ప్రసవం చేసి తల్లీ బిడ్డలను సురక్షితంగా కాపాడింది. సమాచారాన్ని తెలుసుకున్న మంత్రి దామోదర మంగమ్మను నగదు బహుమతితో పాటు శాలువాతో సత్కరించారు.

జేపీసీ ఏర్పాటు చేయాల్సిందే: ఖుర్షీద్

సాక్షి, హైదరాబాద్: సెబీ చైర్‌పర్సన్ అదానీ కంపెనీలో భారీగా పెట్టుబడులు పెట్టిన అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేయాలన్నదే తమ డిమాండ్ అని సీడబ్ల్యూసీ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అదానీ కంపెనీలో షేర్లు కొనుగోలు చేయడం ద్వారా రూ.3.71 కోట్లు సంపాదించారని, దీనిపై విచారణ జరపాలన్నారు. అదానీతో ప్రస్తుతం సంబంధాలేవీ లేవని సెబీ చైర్‌పర్సన్ చెబుతున్నారని, జేపీసీ నియమిస్తే నిజానిజాలు తేలుతాయన్నారు. సెబీ చైర్‌పర్సన్ పదవికి మాధవి పూరి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ధర్నా సిగ్గుచేటు

● అదానీతో ఒప్పందం కుదుర్చుకుంది కాంగ్రెస్సే: బండి



సాక్షి, హైదరాబాద్: అదానీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ధర్నా చేయడం సిగ్గుచేటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'తెలంగాణలో అదానీతో దందా చేస్తోంది మీరు కాదా? రూ.12,400 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్నది మర్చిపోయారా' అంటూ ధ్వజమెత్తారు. బీజేపీని బదనాం చేసేందుకు అదానీ, సెబీ అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు తెరపైకి తీసుకురావడం విస్మయం కలిగిస్తోందని ఆయన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల దావోస్ వెళ్లిన రేవంత్ అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీతో సమావేశమై ఒప్పందాలు చేసుకున్నారని గుర్తుచేశారు. అదానీతో బీజేపీ కుమ్మక్కైందని చెబుతున్న కాంగ్రెస్ నేతలు దీనికేం సమాధానం చెబుతారని నిలదీశారు. అధికారం కోల్పోయాక బీఆర్‌ఎస్ నేతలపై కేసుల రూపంలో కత్తి వేలాడుతుండటంతో అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు అధికార పార్టీతో బీఆర్‌ఎస్ కుమ్మక్కైందని బండి ఆరోపించారు. కాగా, రైతులందరికీ రుణమాఫీ చేశామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. క్షేత్ర స్థాయిలో అమలైన తీరుకు పొంతనే లేదని విమర్శించారు. నూటికి 70 శాతం మంది రైతులు రుణమాఫీ అందక ఆందోళన చెందుతున్నారని సంజయ్ పేర్కొన్నారు.

రాహుల్‌కు సెబీ, సుప్రీంకోర్టుపై నమ్మకం లేదు

● ఎంపీ రఘునందన్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సెబీ, సుప్రీంకోర్టు, ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ధ్వజమెత్తారు. కానీ విదేశీ సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికలపై మాత్రం రాహుల్‌కు నమ్మకముందని ఎద్దేవా చేశారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విదేశీ శక్తులతో చేతులు కలిపి ప్రధానమంత్రి కావాలని రాహుల్ కలలు కన్నారని, అవి నెరవేరకపోవడంతో భారత వ్యవస్థలను అప్రతిష్టపాలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి.. 'నా తమ్ముడు అయితే దందా చేయవద్దా!' అన్నారని గుర్తుచేశారు. తమ్ముడు దందా చేస్తే తప్పు లేదు కానీ సెబీ చైర్మన్ షేర్లు కొంటే తప్పా అని ప్రశ్నించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు సెబీని తప్పు పట్టిందా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి హిండెన్‌బర్గ్ రాసిందే నిజమని నమ్మకముంటే, ఆయనకు వివాహమై, పిల్లలున్నారని బ్లిట్జ్ పేపర్‌లో వచ్చిన వార్తలపై నమ్మకం లేదా? అని నిలదీశారు. బ్లిట్జ్ పేపర్ రాసింది తప్పు అయితే నోటీసులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీ వెళ్లి రాహుల్‌ను కలిసి బ్లిట్జ్ పేపర్ అందజేస్తానని రఘునందన్‌రావు తెలిపారు. జన్వాడ ఫామ్‌హౌస్ తనది కాదని కేటీఆర్ చెబుతున్నారని, అలాంటపుడు గతంలో డ్రోన్ కెమెరా ఎగరేసినందుకు రేవంత్‌కు ఎందుకు నోటీసులు పంపారని ప్రశ్నించారు.

'హిండెన్‌బర్గ్'ను కాంగ్రెస్ సమర్థించడం దేశద్రోహమే

● ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విదేశీ సంస్థ హిండెన్‌బర్గ్ నివేదికను కాంగ్రెస్ పార్టీ సమర్థించడం ముమ్మాటికీ దేశద్రోహమేనని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. పార్లమెంటులో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఆ సంస్థకు మౌత్ పీస్‌గా మారడం, ఆ పార్టీ దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమని విరుచుకుపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికన్ షార్ట్ సెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సెబీ వ్యవహారంపై జేపీసీ వేయాలని సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఇతర మంత్రులు డిమాండ్ చేయడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమని ధ్వజమెత్తారు. గతేడాది కూడా హిండెన్‌బర్గ్ ఓ నివేదికను విడుదల చేసిందని ఒక ప్రకటనలో ఏలేటి గుర్తుచేశారు. తాజాగా ఆ కంపెనీ సెబీపై ఇచ్చిన నివేదిక ఆధారంగా మళ్లీ రాజకీయం చేయడం విదేశీ శక్తుల కుట్రలకు వత్తాసు పలకడమేనని ఆరోపించారు. ఓ అమెరికా కంపెనీ ఇచ్చిన నివేదికకు కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చి దేశవ్యాప్తంగా రాజకీయం చేస్తోందంటే ఆ నివేదిక రూపకల్పనకు ఆ పార్టీ సహకరించిందనే అనుమానాలున్నాయని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ కొత్త లోగో ఆవిష్కరణ



శివసేనారెడ్డి, జితేందర్‌రెడ్డితో కలిసి కొత్త లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కొత్త లోగోను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సోనిబాలాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోగో విశేషాలను స్పోర్ట్స్ అథారిటీ తెలియజేసింది. క్రీడాకారులను ఉన్నతమైన శక్తిమంతులుగా చేయడమే స్పోర్ట్స్ అథారిటీ లక్ష్యమని పేర్కొంది. క్రీడాకారుల ఉన్నతమైన ఆకాంక్షలను సఫలీకృతం చేసే క్రీడా విజేతల స్ఫూర్తికి గుర్తుగా ఈ లోగోను తీర్చిదిద్దినట్లు పేర్కొంది. ఎరుపు, పసుపు, నీలం, ఆకుపచ్చ, స్కైబ్లూ రంగులు క్రీడలకు సంబంధించిన భావోద్వేగాలను ప్రతిబింబిస్తాయని, లోగోలోని కాగడా హ్యాండిల్ తెలంగాణను సూచించే 'టీ' అక్షరంలో రూపొందించినట్లు తెలిపింది.

అధిక దిగుబడి వంగడాలపై పరిశోధనలు

వివిధ రకాల పంటలకు సంబంధించి అధిక దిగుబడిని అందించే కొత్త వంగడాలపై పరిశోధనలు చేయాలని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్వెలిన్ హ్యూకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. సచి వాలయంలో గురువారం ముఖ్య మంత్రితో డాక్టర్ జాక్వెలిన్ హ్యూ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, తెలంగాణ వ్యవసాయ రంగాభివృద్ధికి ఉప యోగపడేలా పరిశోధనలు ఉండాలని స్పష్టం చేశా రు. ఇక్రిశాట్‌ను సందర్శించాలని జాక్వెలిన్ సూచించగా, తప్పకుండా వస్తానని సీఎం పేర్కొన్నారు.

అక్టోబర్ 29 నుంచి కొత్త ఓటర్ల నమోదు

● ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం(ఎస్ఎస్ఆర్) 2025లో భాగంగా ఈ ఏడాది అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులతో పాటు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ మేరకు కార్యక్రమం షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) సి.సుదర్శన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025 జనవరి 1 నాటికి కనీసం 18 ఏళ్లు కలిగి ఉండేవారు ఓటరుగా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వచ్చే ఏడాది జనవరి 6న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.

కార్యక్రమం	సమయం
బీఎల్ఓల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి పరిశీలన	ఆగస్టు 20–అక్టోబర్ 18
ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన	అక్టోబర్ 29
కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ	అక్టోబర్ 29–నవంబర్ 28
దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం	డిసెంబర్ 24లోగా
తుది ఓటర్ల జాబితా ప్రచురణ	జనవరి 6, 2025

డిస్కంలకు రూ.3,175 కోట్ల సాయం

ఇంధన శాఖ కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు రూ.3,175 కోట్ల సాయాన్ని విడుదల చేసింది. ఉదయ్ పథకం ప్రకారం 2015–16 నుంచి 2019–20 దాకా డిస్కంల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం సహాయ సహకారం అందించాల్సి ఉంది. డిస్కంల నష్టాల్లో 50 శాతాన్ని భరిస్తామని ప్రభుత్వం ఒప్పందంపై సంతకం చేయడం తెలిసిందే. ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరంలో డిస్కంల నష్టాలను పరిగణనలోకి తీసుకొని ఈ నిధులను విడుదల చేసింది. 2023–24లో దక్షిణ డిస్కం (ఎస్పీడీసీఎల్) రూ.4,909.53 కోట్లు, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్) రూ.1,441.18 కోట్లు మొత్తం రూ.6,350.71 కోట్ల నష్టాలతో ఉన్నట్టు గుర్తించింది. ఇందులో 50% రూ.3,175.36 కోట్లను విడుదల చేస్తూ ఇంధనశాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

అల్లాహ్ ఎవరికీ రవ్వంత అన్యాయం చేయడనేది నిశ్చయం. సత్కార్యం ఉంటే ఆయన దాన్ని రెట్టింపు చేస్తాడు. అంతేకాదు. తన వద్దనున్న దానిలో నుంచి గొప్ప ప్రతిఫలాన్ని ఒసగుతాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 23 ఆగస్టు 2024

మనిషితనం మాయమైందా?

సమాజం సహించలేని కొన్ని ఘటనలు ఆవేదన కలిగిస్తాయి. ఆగ్రహం రప్పిస్తాయి. చట్టాలెన్ని ఉన్నా ఆగకుండా సాగుతున్న అకృత్యాలపై ఏమీ చేయలేమా అన్న ఆక్రోశం రగిలిస్తాయి. కోల్‌కతా వైద్యశిక్షణార్థి 'అభయ' ఘటన నుంచి దేశం ఇంకా తేరుకోక ముందే, మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్‌లో పసిపిల్లల పాఠశాలలో నాలుగేళ్ళ వయసు చిన్నారులు ఇద్దరిపై పాఠశాల పనివాడి అమానుష కృత్యం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ ఘటన వివరాలు వింటుంటేనే మనసు వికలమవుతుంది. ప్రజా నిరసనల రీత్యా మహారాష్ట్ర సర్కార్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది సరే, పిల్లలకు బడిలోనే భద్రత లేకపోతే ప్రతి ఒక్కరికీ విద్యాహక్కు గురించి చర్చిస్తే ఏమి లాభమన్న బొంబాయి హైకోర్ట్ తాజా వ్యాఖ్యలు నిష్ఠురమైనా నిజమే. ఇప్పుడిక ప్రతి స్కూలులో నెలరోజుల్లోగా సీసీ టీవీ కెమెరాలు పెట్టాలి, వారంలో మూడుసార్లైనా ఆ ఫుటేజ్‌ను పరిశీలించాలి లాంటి సర్కారీ ఆదేశాలు షరా మామూలే. కానీ, కోల్‌కతా నుంచి బద్లాపూర్ దాకా అన్నిచోట్లా రాజ్యవ్యవస్థ చేతిలో ప్రజావిశ్వాసం కుప్పకూలడం సమకాలీన భారత విషాదం.

పసిపిల్లలపై అకృత్యం జరిగితే, ఆ తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సహకరించడానికి బదులు సదరు 'ఆదర్శ విద్యాలయం' ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం విషాదం. విద్యాబుద్ధుల కోసం బడికి పిల్లల్ని పంపి, వారు అక్కడ భద్రంగా ఉంటారని భావించే కన్నవారికి ఇది భరించలేని కష్టం. పైగా, ఫిర్యాదు దాఖలుకు వారిని 11 గంటల పైగా వేచి ఉండేలా చేయడం దేనికి సంకేతం? ఇలాంటి ఘటనల్లో పాఠశాల వారినీ బాధ్యుల్ని చేస్తూ, 'పోక్సో' చట్టం కింద కేసు కట్టాలి. ఆ కనీస బాధ్యతను సైతం పోలీసులు విస్మరించడం క్షమించరాని దుర్మార్గం. చివరకు బొంబాయి హైకోర్ట్ ఆ లోపాన్ని ఎత్తిచూపాల్సి వచ్చింది. 'అభయ' ఘటనలోనూ అచ్చంగా ఇలాంటివే జరిగాయి. ఇలాంటి ఆటవిక చర్యలు ఎక్కడ జరిగినా జెండాలకు అతీతంగా రాజకీయ పక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాల్సి ఉండగా, స్వీయ రాజకీయలబ్ధికై ప్రయత్నించడం సిగ్గుచేటు. కోల్‌కతా ఘటనపై రచ్చ చేసే పార్టీ బద్లాపూర్‌పై నోరు మెదపదు. త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలోని బద్లాపూర్‌పై హంగామా చేసేవారు కోల్‌కతా ఘటనపై కంటితుడుపుకే పరిమితమవుతారు. రాజ్యాంగబద్ధ హోదాలోని బెంగాల్ గవర్నర్ టీవీ డిబేట్లలో కూర్చొని రాష్ట్ర సర్కార్‌ను దూషిస్తూ ఇంటర్వ్యూలిస్తుంటే ఏమనుకోవాలి? సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటనలపైనా నిజాయతీ వదిలేసి నీచ రాజకీయాలు చేస్తే దేశం ఏటు పోతుంది?

ఉవ్వెత్తున ఎగసిపడ్డ భారీ నిరసనల నేపథ్యంలో కోల్‌కతా అంశంపై సుప్రీమ్ కోర్ట్, బద్లాపూర్ ఘటనపై బొంబాయి హైకోర్ట్ తమకు తాము స్వచ్ఛందంగా విచారణ చేపట్టడమే ఒకింత ఊరట. న్యాయవ్యవస్థ పట్ల సామాన్యుల్లో మినుకు మినుకుమంటున్న ఆశాదీపానికి కోర్టు చొరవ ఒక చిన్న కాపుదల. ఇవాళ దేశంలో రోజూ 90 అత్యాచారాలు జరుగుతున్నాయి. ఆనక హత్య చేసి, అడ్డు తొలగించడాలూ పెరిగిపోతున్నాయి. నోరు విప్పి చెప్పుకోలేని వారి పట్ల నీచప్రవర్తనలూ పెచ్చరిల్లుతున్నాయి. మన మధ్యే మామూలు వ్యక్తుల్లా తిరుగుతున్న మానవ మృగాలను నిరోధించడం కఠిన సమస్యే. అయితే, మనసుంటే మార్గాలుంటాయి. మహిళలు, పిల్లల కోసం 'మినీ – పోలీస్ స్టేషన్ల'ను ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం లాంటివి సిఫార్సు చేస్తున్నాయి. సుప్రీమ్ కోర్ట్ గురువారం బెంగాల్ సర్కార్‌కు ముక్కచీవాట్లు పెట్టిన నేపథ్యంలో సీఎం మమత సైతం తీవ్రతను అంగీకరించారు. అత్యాచార నేరాలపై అత్యంత కఠిన చట్టాలు చేయాలనీ, ఇలాంటి కేసుల్ని 15 రోజుల్లో పరిష్కరించేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెట్టాలనీ ప్రధానిని కోరారు.

అంతకన్నా ముందు సమాజంగా మనం ఆత్మశోధన చేసుకోవాలి. 2012 నాటి 'నిర్భయ' ఘటన తర్వాత కఠినచట్టాలు చేసినా పరిస్థితులు మారలేదంటే లోపం ఎక్కడున్నట్టు? వావివరుసలు లేవు, వయసులో చిన్నాపెద్దా విచక్షణ లేదు, చట్టం పట్ల భయభక్తులు అసలే లేవు. ఇలా ఉచ్చం నీచం మరిచి, చివరకు చిన్నారులపైనా మనుషులు మృగాలుగా మారడానికి దారి తీస్తున్న సాంఘిక, మానసిక పరిస్థితుల్ని లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. మన వెనకాలే ఊడలు దిగుతున్న ఈ వికృత ధోరణిని పెంచి పోషిస్తున్న మన వినోద, వినిమయ సంస్కృతులు, వైయక్తిక ప్రవర్తనల్ని సమీక్షించుకోవాల్సి ఉంది. ఈ భూతాన్ని ఆపేదెలా అని సత్వరమే ఆలోచించాల్సి ఉంది.

ఇప్పటికీ ఆడవాళ్ళను ఆటవస్తువులుగా చూసే సామాజిక వైఖరి, మగవాళ్ళు ఏం చేసినా చెల్లుతుందనే ఆధిపత్య భావజాలం లాంటి అనేక అంశాల్లో మనం మారాల్సి ఉంది. కోర్టుల చొరవ, ఆదేశాలతో రానున్న రోజుల్లో కోల్‌కతా కేసు, బద్లాపూర్ కేసులు త్వరితగతినే తేలితే తేలవచ్చు. నిందితులకు కఠిన శిక్షలూ ఖాయం కావచ్చు. కానీ, దేశవ్యాప్తంగా సంచలనమైన ఈ ఒకటి రెండు కేసుల్లోనే కాదు... వెలుగులోకి రాని వందల ఘటనలకు మూలకారణమైన మౌలిక అంశాలపై మనం ఎప్పటికి కళ్ళు తెరుస్తాం? సాక్షాత్తూ శిష్యులపై రేప్‌తో 20 ఏళ్ళ జైలుశిక్ష అనుభవిస్తున్న డేరా బాబాకు హర్యానాలో ఎన్నికల వేళ పదేపదే పెరోల్ ఇస్తూ పోతుంటాం. గత నాలుగేళ్ళలో 234 రోజులు ఆయన జైలు బయటే ఉన్నారు. మైనర్ బాలిక రేప్ కేసులో జీవిత ఖైదులో ఉన్న మరో బాబా ఆశారామ్ బాపూను ఆయుర్వేద చికిత్సకై తాజాగా బయటకు వదులుతాం. అన్ని వ్యవస్థలనూ నీరుగార్చి, అధికారం సహా అనేక బలహీనతలతో పాలకులు చేసే ఈ పాపాలన్నీ శాపాలు కాక మరేమవుతాయి? జనం మూడోకన్ను తెరవాల్సిన సమయం వచ్చింది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు.
శ్రావణ మాసం, తిథి: బ.చవితి ప.3.24 వరకు, తదుపరి పంచమి.
నక్షత్రం: రేవతి రా.1.31 వరకు, తదుపరి అశ్విని, వర్జ్యం: ప.2.24 నుండి 3.52 వరకు, తదుపరి రా.7.57 నుండి 9.29 వరకు,
దుర్ముహూర్తం: ఉ.8.18 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.29 నుండి 1.17 వరకు, అమృతఘడియలు: రా.11.21 నుండి 12.50 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.19
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

విధాన పాపం... ప్రజలకు శాపం...

విశ్లేషణ



డి. పాపారావు

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ప్రపంచంలోని 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని మోదీ ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటోంది. వాస్తవంలో పేరు గొప్ప... ఊరు దిబ్బ లాగా దేశ ప్రజల స్థితిగతులున్నాయి. ఒక పక్కన నిరుద్యోగం తీవ్ర స్థాయిలో పెరిగిపోతోంది. మరో పక్కన నింగినంటే ద్రవ్యోల్బణం, అంతంత మాత్రపు ప్రజల కొనుగోలు శక్తిని మరింతగా దిగజారుస్తోంది. మోదీ ప్రభుత్వం దేశం మీద వరుసగా రుద్దిన పెద్ద నోట్ల రద్దు, అశాస్త్రీయమైన జీఎస్టీ అమలు, కోవిడ్ మహమ్మారి కాలంలో అనుసరించిన అవకతవక ఆర్థిక విధానాలే ఈ దుఃస్థితికి కారణం. ఫలితంగా లక్షలాది మంది చిన్న ఉత్పత్తిదారులు, వ్యాపారులు చితికిపోయి ఆర్థిక వ్యవస్థ మీద ప్రతికూల ప్రభావం పడింది.

నేడు వెలువడుతోన్న అనేక ఆర్థిక సంబంధిత గణాంకాలు చితికిపోతోన్న ప్రజల వాస్తవ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఉదాహరణకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో కుటుంబాల రుణభారం, వారి మిగులు ఆదాయంలో (కనీస అవసరాల తాలూకు ఖర్చుల అనంతరం మిగిలే ఆదాయం) 52 శాతానికి చేరుకుంది. ఇది 2022–23లో 48 శాతంగా ఉంది. కాగా, 2019–20 ప్రాంతంలో ఇది 40 శాతమే. ఇక 2012–13లో అయితే ఈ మిగులు ఆదాయంలో, కుటుంబాల రుణభారం కేవలం 32 శాతం. అంటే, గడిచిన సుమారు దశాబ్ద కాలంలో ప్రజల రుణభారం విపరీతంగా పెరిగిపోయింది. ఫలితంగా, కుటుంబాలు తమ ఆదాయాలలో అధిక భాగాన్ని అప్పులు తీర్చేందుకు వినియోగించవలసి వస్తోంది.

ఈ కారణం వలన, కనీస అవసరాలకు పోను... ఆ పైన ఖర్చులు పెట్టగల స్థోమత దిగజారిపోయింది. ఈ స్థితిలోనే 2023–24 కాలంలో, బ్యాంకుల రిటైల్ రుణాలు 27.5 శాతం మేరకు పెరగగా, ఈ రుణాలు తీసుకున్నవారు, ఆ రుణంలో వినియోగ ఖర్చులకు వాడే మొత్తం కేవలం 8.5 శాతం పెరిగింది. అంటే, కుటుంబీకులు తాము తీసుకున్న రుణం తాలూకు పూర్తి మొత్తాన్ని వినియోగానికి వాడు కోలేకపోతున్నారు. దీనికి కారణం, వారు ఇందులోంచి కొంత భాగాన్ని పాత అప్పులు తీర్చేందుకు వాడటం.

ప్రజల ఈ ఆర్థిక దుఃస్థితి వలన 50 వేల రూపాయల లోపు రిటైల్ రుణ గ్రహీతలు వాటిని సరైన సమయంలో చెల్లించలేని పరిస్థితి పెరుగుతోంది. ఫలితంగానే క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాల తాలూకు బకాయిల మొత్తం 2018–19 లోని జీడీపీలో 3.6 శాతం నుంచి 2023–24 నాటికి 5.6 శాతానికి పెరిగిపోయింది. ఈ విధంగా రిటైల్ రుణాలలో మొండి బకాయిగా మారుతున్నవి 8.2 శాతానికి పెరిగాయి. ఈ క్రమంలోనే వ్యవసాయ రుణాలు మొండి బకాయిలుగా మారడం కూడా పెరిగిపోతోంది. ఈ పరిస్థితి తాలూకు ప్రభావం ఏమిటంటే, 2024–25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) భారత కార్పొరేట్ల లాభాల పెరుగుదల, దాని ముందరి ఏడాది త్రైమాసికాల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. మార్కెట్‌లో డిమాండ్ లేక ఈ కార్పొరేట్ల అమ్మకాల స్థాయి కూడా పడిపోయింది.

మొత్తంగా ప్రస్తుతం మన దేశీయ మార్కెట్‌లో డిమాండ్ పతనం కావడం వల్ల, ప్రైవేట్ పెట్టుబడిదారులు కొత్త ప్రాజెక్టుల కోసం పెట్టే పెట్టుబడులు భారీగా తగ్గిపోతున్నాయి. ఈ పెట్టుబడుల స్థాయి 2009 సెప్టెంబర్ త్రైమాసికం నాటి అనంతరం కనిష్ఠ స్థాయిలో ఉంది. గణాంకాలను పరిశీలిస్తే, కొత్త ప్రాజెక్టులలో ప్రైవేట్ రంగం తాలూకు వాటా 2023–24 లోని చివరి త్రైమాసికం లోని 85.4 శాతం నుంచి, 2024–25 మొదటి త్రైమాసికంలోని 66.7 శాతానికి పడిపోయింది.



మరి, ఈ ఆర్థిక పతనానికి కారణం ఏమిటి? ఇతరత్రా కారణాలు ఏవైనా... మోదీ ప్రభుత్వ విధానాల తాలూకు ప్రభావమే ప్రధానంగా ఈ దుఃస్థితికి కారణం. వరుస పరంపరగా మోదీ ప్రభుత్వం దేశం మీద రుద్దిన 1) పెద్ద నోట్ల రద్దు 2) అశాస్త్రీయమైన జీఎస్టీ అమలు 3) కోవిడ్ మహమ్మారి కాలంలో అనుసరించిన అవకతవక ఆర్థిక విధానాల వంటివి దీనికి కారణం. ఉదాహరణకు, పెద్ద నోట్ల రద్దు ప్రభావం వలన దేశంలోని లక్షలాది మంది చిన్న ఉత్పత్తిదారులు, వ్యాపారులు చితికిపోయారు. అసంఘటిత రంగంగా ఉండే వీరు తమ వ్యాపారాలను క్రెడిట్, డెబిట్ కార్డులు, ఆన్‌లైన్‌లో నిర్వహించుకోగల అవకాశం లేక వ్యాపారాల నుంచి వైదొలగిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే, తమ అమ్మకాలకు డెబిట్, క్రెడిట్ కార్డులను అంగీకరించగల పెద్ద రిటైల్ మార్టులు, మాల్స్ వ్యాపారాలు పెరిగాయి. చితికిపోయిన ఈ చిన్న ఉత్పత్తిదారుల వ్యాపారం పెద్ద కార్పొరేట్ సంస్థలకు బదలాయించబడింది. అదీ కథ. పెద్ద నోట్ల రద్దు అనేది అంతిమంగా కాకులను కొట్టి గద్దలకు వేసేదిగా పరిణమించింది.

ఇక, జీఎస్టీ అమలు క్రమంలో కూడా లక్షలాది మంది చిన్న వ్యాపారస్థులు, ఉత్పత్తిదారులు చితికిపోయారు. అసంఘటిత రంగంలోని వీరంతా, బలవంతంగా జీఎస్టీ పరిధిలోకి లాగబడి, పెరిగిపోయిన ఖర్చులతో (అదనపు పన్నుల భారం వచ్చి పడింది కనుక) వ్యాపారాలు, ఉత్పత్తి చేయలేక చేతులు ఎత్తేశారు. ఈ విధంగా జీఎస్టీ అమలు దేశంలోని అసంఘటిత రంగానికి చావు దెబ్బ అయ్యింది. కోవిడ్ కాలంలో ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా, మరెన్నో లక్షల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు చితికిపోయాయి. స్థూలంగా ఈ విధానాల అన్నిటి ఫలితంగా 2022–23 నాటికి దేశంలోని సరుకు ఉత్పత్తి రంగంలో ఉన్న, అసంఘటిత రంగ పరిశ్రమల సంఖ్య 9.3 శాతం తగ్గి, 17.82 మిలియన్లకు పరిమితమయ్యింది. దాంతో, ఈ పరిశ్రమలలో 15 శాతం మేర కార్మికులు ఉపాధిని కోల్పోయారు. సాధారణ స్థితిలో, ఈ అసంఘటిత సరుకు ఉత్పత్తి రంగ పరిశ్రమల సంఖ్య దేశంలో సాలీనా 2 మిలియన్ల చొప్పున పెరుగుతూ వచ్చింది. అవకతవక విధానాలు లేకుంటే ఈ అసంఘటిత రంగ సరుకు ఉత్పత్తి పరిశ్రమల సంఖ్య మరింతగా పెరిగి ఉండాలి. స్థూలంగా, మోదీ విధానాల ఫలితంగా సుమారు 10 మిలియన్ల మేర కొత్త సంస్థల ఆవిర్భావానికి ఆస్కారం లేకుండా పోయింది. దీనికిమించి, ఈ సంస్థలు ఒకొక్క దానిలో 2.5 నుంచి 3 ఉపాధి అవకాశాల కల్పనను మనం కోల్పోయాము. ఫలితంగా సుమారు 25–30 మిలియన్ల ఉపాధి అవకాశాల కల్పనకు మార్గం మూసుకుపోయింది.

అంటే, ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత రంగాన్ని... సంఘటిత రంగం దిశగా మళ్ళించే పేరిట, మోదీ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. నిరుద్యోగం పెరిగింది. ఈ విధానాలు తొలుత కొంత పెద్ద కార్పొరేట్లకు అనుకూలించినా, అంతిమంగా నేడు అవి కూర్చున్న కొమ్మను నరుక్కున్న తీరుగా, కార్పొరేట్ల లాభాలకు కూడా గండి కొడుతున్నాయి. ఈ క్రమంలోనే, మార్కెట్‌లో డిమాండ్ దిగజారిపోయి నేడు రిటైల్ రంగంలోని రిలయన్స్, టైటాన్, రేమాండ్ వంటి సంస్థలు పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరం కాలంలోనే సుమారుగా 26 వేల మందిని ఈ సంస్థలు ఇంటికి పంపాయి.

మోదీ ప్రభుత్వ విధానాల ప్రతికూల ప్రభావాన్ని అర్థం చేసుకొనేందుకు ఒక చిన్న ఉదాహరణను చూద్దాం. నోట్ల రద్దు, జీఎస్టీ వంటి విధానాలకు ముందర ఎయిర్ కూలర్ల తయారీలో బ్రాండెడ్ సంస్థలతో పాటుగా, స్థానికంగా చవకగా తయారయ్యే కూలర్లు కూడా ఉండేవి. ధర తక్కువ ఉన్న ఈ కూలర్లకు భారీ మార్కెట్టే ఉండేది. కానీ, ఇవి తమ ఉత్పత్తికి అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ కొరతలు, పెరిగిన పన్ను భారాల వల్ల మూసివేత బాట పట్టాయి. మార్కెట్ నుంచి వైదొలగిన ఈ లోకల్ సంస్థల అమ్మకాలు బ్రాండెడ్ కంపెనీలకు బదలాయించబడ్డాయి. ఫలితంగా తొలుత ఈ పెద్ద సంస్థల లాభాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. కానీ, చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బ తినడంతో దేశంలో భారీగా పెరిగిన నిరుద్యోగం వలన ప్రజల కొనుగోలు శక్తి, డిమాండ్ పతనమై అంతిమంగా అది పెద్ద సంస్థల అమ్మకాలూ... లాభాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. బంగారు గుడ్లు పెట్టే బాతును చంపుకు తిన్న విధానాల కథ ఇది. లాభాల దురాపేక్ష తప్ప, దూరదృష్టి లేని కార్పొరేట్ల గుడ్డితనం నేడు మోదీ విధానాల రూపంలో దేశ ప్రజలకు అశనిపాతంగా మారుతోంది!

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొత్త సవాలు



విదేశీ సామాజిక మాధ్యమం, టిక్ కంపెనీల నుంచి ఇండియాకు తర్వాతి సవాళ్లు ఎదురుకానున్నాయి. అది కొత్త ఈస్ట్ ఇండియా కంపెనీ అవుతుంది.

– సేవియో రోడ్రిగ్స్, సంపాదకుడు

ప్రపంచ సమస్య?



మొత్తం ప్రపంచాన్నే తమ కాలనీలుగా మార్చుకున్నవారు ఈ ప్రపంచానికి సమస్య రష్యాయే అని చెబుతున్నారు. వాళ్లు కాదట!.

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

సురక్షిత ఎమిరేట్స్



ఒక మహిళ రాత్రిపూట ఒంటరిగా ఏ భయం లేకుండా తిరుగుతున్నదంటే, ఆమె యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)లో ఉందని అర్థం అని వ్యాఖ్యానించారు ఆ దేశ ప్రధాని షేక్ మహమ్మద్. దీన్ని పూర్తిగా అంగీకరిస్తాను. అది నా అనుభవం కూడా!

– అనితా జాకబ్, ట్రావెల్ డిజైనర్

చైనా బుద్ధి

నేననుకోవడం ఇండియా నుంచి జీడిపప్పును చైనా తీసుకెళ్లి ఉంటుంది, ముఖ్యంగా ప్రసిద్ధమైన దక్షిణ భారత రకం. వాటిని వాస్తవంలో తమ కాలనీ దేశం అయిన కంబోడియాలోని అన్ని వ్యవసాయ క్షేత్రాల్లో నాటింది. త్వరలోనే భారత రైతుల జీడిపప్పు ఎగుమతుల్లో తగ్గుదల ఉండొచ్చు. వాణిజ్య పంటలకు సంబంధించి మనకు ఇదో రకం పెద్ద దెబ్బ.

– అరవింద్, వ్యాఖ్యాత

ఎందుకు నిషిద్ధం?



భవిష్యత్తులో అత్యాచారాలు, లైంగిక దాడులను తగ్గించడానికి ఒక మార్గం ఏమిటంటే, సెక్స్ అనే దాన్ని ఒక పెద్ద కళంకంగా చూడకుండా ఉండటం! పరస్పర అంగీకారం ఉన్న యువజనులు సమాజపు నిందలను ఎదుర్కోకుండా సురక్షితమైన శృంగార సంబంధాన్ని ఏర్పరుచుకోగలగాలి. మనం 140 కోట్ల మంది జనాలం ఉన్నాం. ఇప్పటికీ సెక్స్ అనేది ఎందుకు నిషిద్ధం?

– అలీషా అఖానీ, విశ్లేషకురాలు

తాజా వ్యతిరేకత



బంగ్లాదేశ్‌లో తాజా భారత వ్యతిరేక ప్రచారం ఏమిటంటే, త్రిపురలోని ఒక చోటు నుంచి భారత్ ఉన్నట్టుండి నీటిని విడుదల చేయడమే బంగ్లాదేశ్ దక్షిణ ప్రాంతంలో వరదలకు కారణమయ్యిందని! అసలు కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల త్రిపుర రాష్ట్రమే స్వయంగా వరదలతో పోరాడుతోంది.

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

కృత్రిమ ఇబ్బందులు



వాట్సాప్ సెర్చ్ బార్‌లో ఏఐ ప్రాంప్ట్ (మాట అందించడం)ను ఆపేసే అవకాశం ఏమైనా ఉందా? ప్రైవసీ సమస్యలు ఒకటైతే, అది చాలా చిరాగ్గా ఉంది. ఒక మెసేజ్ పంపుదామని ఓ బ్యూరోక్రాట్ పేరును టైప్ చేస్తే, ఆ పేరుకు అర్థం ఏమిటో ఒక పెద్ద వ్యాసం వచ్చింది.

– సిద్ధార్థ్ వరదరాజన్, సంపాదకుడు

జీవితం గెలవడం కోసం!

సామాన్యుణ్ణి కేంద్రంగా చేసుకుని కొన్ని దశాబ్దాలుగా సాహిత్య సృష్టి చేస్తున్న రచయిత బీఎస్ రాములు. పదిహేనేళ్ల ప్రాయంలోనే రాయడం ప్రారంభించారు. 1968లో 'బాలమిత్ర'లో తొలి కథ వచ్చింది. విరసంలో చేరి ఎక్కువగా కథలపైనే దృష్టి పెట్టారు కానీ నవలలూ రాశారు. 1982లో 'బతుకు పోరు' తొలి నవల వెలువడింది. బీడీ కార్మికుల జీవితాల్లోని వేదనలను, దోపిడీని ఉన్నదున్నట్లుగా, వారి భాషలోనే అద్భుతంగా చిత్రించిన నవల అది. 'చూపు', 'జీవనయానం' ఇతర నవలలు. ఇప్పటివరకూ 200 దాకా కథలు రాశారు.



బి.ఎస్. రాములు

తెలంగాణ దృష్టితో, బీసీ దృష్టితో తెలంగాణ సాహిత్య చరిత్రను పునర్మూల్యాంకనం చేయాలనే కొత్త చూపుతో బీఎస్ రచనా వ్యాసంగం సాగుతోంది. అట్లాగే సి. నారాయణ రెడ్డి కోరిక మేరకు 'తెలంగాణ కథల్లో, నవలల్లో తెలంగాణ అస్తిత్వం' అనే పుస్తకం రాశారు. ఒక టీవీ ఛానల్‌లో గొల్లపూడి మారుతీరావు నిర్వహించిన 'నూరేళ్ళ కథ' శీర్షికలో బీఎస్ రాములు 'బతుకు పయనం' కథ పరిచయమైంది. ఒక బట్టలు నేసే పద్మశాలీ సామాజిక వర్గం నుండి ఒక యువకుడు బీటెక్ చేసి, అమెరికాకు ఎట్లా పోగలిగాడో చెప్పే ఒక పరిణామాన్ని ఆవిష్కరించిన కథ అది. విశాలాంధ్ర వారి 'నూరేళ్ళ తెలంగాణ కథ' పుస్తకంలో ఆయన కథ 'దక్షయజ్ఞం' చోటు పొందింది. ఈ కథలో బీఎస్ విప్లవ విమర్శను లేవనెత్తారు. పైన పేర్కొన్న రెండు కథలూ భిన్న ధ్రువాల వంటివి. మొదట్లో తన జీవితంలో అనుభవించిన కష్టాలు, కన్నీళ్ళ గురించి రాశారు. ఆ తర్వాతి కథలన్నీ విప్లవానికి సంబంధించినవి. చివరగా 'ఉద్యమం ఉద్యమం కోసం కాదు. జీవితం గెలవడం కోసం' అనే మాటకు బలమిచ్చే కథలు రాశారు. విద్య ప్రాధాన్యం, విద్యావ్యవస్థ తీరు, కుటుంబ వ్యవస్థ పరిణామాలు, ప్రాజెక్టులు తెచ్చిన పరిణామాలు, అభివృద్ధి తెచ్చిన పరిణా మాలు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వంటివి ఆయన కథా వస్తువులయ్యాయి. కమ్యూని జాన్ని భారతీయ సమాజ కోణంలో విశ్లేషించి, దేశ అవసరాలకు సరిపడే ప్రత్యా మ్నాయ మార్గాలను సూచించినవిగా బీఎస్ రాములు కథలు నిలుస్తాయి.

– బి. నర్సన్; రచయిత, సాహితీ విశ్లేషకులు | 94401 28169

(నేడు బి.ఎస్. రాములు 75వ జన్మదినం)

అతడు అడవియై రోదించాడు... హెచ్చరించాడు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ప్రకృతిలో ఒక భాగమైన మనిషి అత్యాశకు పోయి దాని సహజ సూత్రాలను అతిక్రమిస్తున్నాడు. ఫలితంగా ఎన్నో దుష్పరిణామాలకు కారకుడవుతున్నాడు. ఈ విషయాన్ని చెప్పడం కోసం కవి సుద్దాల అశోక్ తేజ అడవి రూపమెత్తి 'నేను అడవిని మాట్లాడుతున్నా'నని దండోరా వేశాడు.

''అఖిల సృష్టికి ప్రాణముద్ర ప్రకృతి
ప్రకృతికి వేలిముద్ర అడవి
అడవి నిలువెత్తు సంతకం చెట్టు''

అనేది సుద్దాల భావన. మానవ సమాజం ప్రగతి పేరుతో ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతోంది. అయితే ఈ కవి ఉత్తమోత్తమ ప్రగతిని – ''ఆసుపత్రులు లేని భూగోళం నా చిరకాలపు కల/ న్యాయస్థానాలకు పని కల్పించని దృశ్యం/ నేనూహించే సుందర ప్రపంచం'' అని స్వప్నిస్తున్నాడు. ఇది సాధ్యమా? కాదు, కాదని చెబుతూనే ఆ 'సుందర ప్రపంచం' ఎలా సాధ్యమో 'నీళ్లు నమలకుండా' ఇలా ప్రకటించాడు:

''హద్దు మీరిన వ్యాపారమే / చేసింది రాజ్యాంగేతర శక్తిగా / అధికార పదవీస్వీకారం /అధికార పదవుల్లో తిరిగే బొమ్మలకు / అసలు సిసలు సూత్రధారి/ తెరవెనుక బడా వ్యాపారి/ అడవి ధ్వంసం, కడలి ధ్వంసం/ వెరసి ప్రకృతి విధ్వంసం/ ఈ త్రిసూత్ర పథ కాలంలో/ ఎదుగుతున్నది కుటిల/ వ్యాపార త్రివిక్రమావతారం/ భయానికీ భయానికీ మధ్య / బతుకు నలుగుతున్నది/ ప్రకృతికీ మనిషికీ మధ్య / ఇనుపగోడ పెరుగుతున్నది/ ప్రకృతి సమాధిపైన ప్రగతి సౌధాలు / ఏ ఆర్థిక ప్రవక్త చెప్పాడిది/ ఏ పురోగమన సూక్తం ఇది?!

అంతేగాదు–''జీవనంలో ఓడినవాడు, ఆధ్యాత్మిక జీవనం కోరినవాడు, సాయుధ రణ జీవనంలో చేరినవాడు, అరణ్యానికే వస్తాడు – రావాలి!'' ఎందుకంటారా?

ప్రకృతి మోహినీ రూపంలో రాదు గాక రాదు/ మోహరించిన ప్రళయ రూపంలో/ ఎదురెత్తులేస్తూ ఉంటుంది/ హిమాలయాలను కరిగిస్తుంది/ జలాశయాలను మరిగిస్తుంది/ అరణ్యాలను చెరిపేస్తుంది/ 'లావా'లను కురిపిస్తుంది.

కనుకనే – ''చర్యకు ప్రతిచర్య/ హింసకు ప్రతిహింస/ అనివార్యం – అది / ప్రకృతి ప్రాణ సూత్రం/ మీ చేతలవల్ల/ జరుగుతున్న పాతకాలకు, / ఘాతుకాలకు/ ప్రతీఘాత తీవ్రత/ ఏ స్థాయిలో ఉంటుందంటే/ మీ ఊహకు అందనంత/ అందినప్పుడు మీరుండరు!/ పెడమార్గం పట్టిన / చెడుమార్గం తొక్కిన మీ/ చేష్టలవల్ల/ ధరమేధం, గిరిమేధం/ తరుమేధం, చివరికి సమస్త/ నరమేధం జరిగి తీరుతుంది/ నరవరా! మళ్ళీ మళ్లీ చెబుతున్నా/ హంతకులూ మీరే/ హతులూ మీరే!''

రెండో మాట



అందుకనే, సుద్దాల తీర్మానం – ''ఏ పరిశోధనైనా/ ఏ పురోగమనమైనా/ అరణ్యం అంగీకరించే/ పర్యావరణం పరవశించే విధంగా'' నేటి తరాలకు అభయంగా, రేపటి తరా లకు భరోసాగా ఉండాలన్నది సుద్దాల డిక్టేషన్! కనుకనే ''వేల ఏళ్లు దాటొచ్చిన మానవ జాతి, ఇక వెనక్కెళ్లడం సాధ్యం కాదు గనుకనే, కుదరని వ్యవహారం కనుకనే – ఆ ప్రకృతినే ఆశ్రయించి, పిలిపించమని సుద్దాల అరణ్య రోదన, ఆయన సమస్త వేదన! కనుకనే 'శ్రమ కావ్యం' ద్వారా శ్రమ జీవుల ఈతిబాధల్ని కావ్యగతం చేసి ధన్యుడైన నేల తల్లి బిడ్డ సుద్దాల... తన అరణ్య కావ్యం ద్వారా ఈ చరాచర ప్రకృతిలో అసలు ముద్దాయి ఎవరో తేల్చినవాడు! మనిషే ఈనాడు ప్రకృతికి ప్రతి నాయకుడై వాతావరణ విధ్వంసానికి కారకుడని సుద్దాల మనోవేదనతో తీర్చిదిద్దినదే ఈ గొప్ప కావ్యం. నిరుపేదల బతుకులు చట్టుబండలవుతున్న పరిస్థితిని చూస్తూ తట్టుకోలేని సుద్దాల–

''అడివమ్మ మాయమ్మ అతి పేద ధీర
ఆ అమ్మకున్నది ఒక్కటే చీర'' అన్న పాట నిరుపేద కుటుంబాల ఆర్థిక దైన్యాన్ని, గుండె కోతను ప్రపంచానికి వెల్లడించాడు. ఆ స్పందించగల హృదయాలను ఆకట్టుకుని అక్కున చేర్చుకున్న సుద్దాల సదా ధన్యుడు!

abkprasad2006@yahoo.co.in

మంగళా శాసనం

'శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయే అర్థినామ్...' అనే మంగళ శ్లోకం, వైష్ణవాలయాల్లో, వైష్ణవుల నిత్య పూజల్లో దేశ విదేశాలలో ప్రతిరోజూ కొన్ని లక్షలసార్లు వినబడుతుంది. శ్రియః కాంతాయ (శ్రీదేవి వల్లభుడైన స్వామికి), కల్యాణ నిధయే (సమస్త కల్యాణ గుణాలకూ నెలవైన స్వామికి), నిధయే అర్థినామ్ (ప్రార్థనలు చేసే అర్థి జనానికి పెన్నిధి అయిన స్వామికి), శ్రీ వేంకట నివాసాయ (శ్రీ వేంకటాద్రి నివాసుడికి), శ్రీనివాసాయ (లక్ష్మీ నివాసుడైన స్వామికి) మంగళమ్ (మంగళమగుగాక)! వేంకటేశ్వర సుప్రభాతంతో పాటు రోజూ వినిపించే మంగళ ఆశాసన శ్లోకాల్లో ప్రప్రథమ శ్లోకం ఇది. ఈ మంగళాశాసన శ్లోకాలు రచించిన ధన్యుడు 14వ శతాబ్దంలో జీవించిన ప్రతివాది భయంకర అన్నంగరాచార్యులవారు అనే విద్వన్మణి. మనోహరమైన భావాలను, మధురమైన పదాలతో పొదిగి చెప్పే ఈ శ్లోకాలు ఆస్తికులకు సుపరిచితాలు.



జ్యోతిర్మయం

ఒక శ్లోకం... లక్ష్మీ– సవిభ్రమ – ఆలోక – సుభ్రూ విభ్రమ – చక్షుషే (లక్ష్మీదేవిని సంభ్రమంతో కుతూహలోత్సాహాలతో రెప్పలారుస్తూ చూస్తున్నప్పుడు ముచ్చట గొలిపే కనుబొమల కదలికలు కలిగినవాడినిగా వేంకటేశ్వరుడిని వర్ణిస్తే; మరొక శ్లోకం... సర్వావయవ సౌందర్య/ సంపదా, సర్వచేతసామ్/ సదా సమ్మోహనాయ (సకల అవయవ సౌందర్య సంపద చేత, సర్వ ప్రాణులకూ సదా సమ్మోహనకారుడు)గా ఆయనను అభివర్ణిస్తుంది. శ్రీ వేంకటాద్రి శృంగ అగ్రానికి మంగళకరమైన శిరోభూషణంగా నిలిచిన స్వామిని మరొక శ్లోకం కొనియాడింది.

వైకుంఠం మీద విరక్తి కలిగి, తిరుమల క్షేత్రంలో స్వామి పుష్కరిణి తీరంలో స్వామి, లక్ష్మీదేవితో విహరిస్తున్నాడని ఒక శ్లోకం చమత్కరిస్తే, భక్త పురుషులకు తన పాదాల శరణ్యత్వాన్ని, స్వామి స్వయంగా తన దక్షిణ హస్తం ద్వారా చూపుతున్నాడని మరొక శ్లోకం ఉత్ప్రేక్షిస్తుంది. ఈ మంగళాశాసన శ్లోకాల విశేష ప్రాచుర్యానికి వాటి అసాధారణ సౌందర్యమే కారణం.

– ఎం. మారుతి శాస్త్రి

జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం

- పీడీఎస్ బియ్యం దారి మళ్లిస్తే కఠినచర్యలు
- రేషన్ డీలర్ల ఆదాయం పెంపునకు ప్రణాళికలు
- విజిలెన్స్ సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వచ్చే జనవరి నుంచి రాష్ట్రంలోని రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి విజిలెన్స్ సమావేశం జరిగింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి చవాన్‌లతో పాటు వైద్య, ఆరోగ్య, ఉన్నత విద్య, వివిధ సంక్షేమ శాఖలు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చౌక ధరల దుకాణాల ద్వారా ఆహార భద్రత కార్డు కలిగిన వారందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు. పీడీఎస్ బియ్యం దారి తప్పితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. రేషన్ బియ్యం పట్టుబడితే తక్షణమే డీలర్ షిప్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. కాగా, రేషన్ షాప్ డీలర్ల ఆదాయం పెంపు దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీలర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. అంతే గాకుండా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,629 చౌక ధరల దుకాణాల డీలర్లను వెంటనే భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వసతి గృహాలతో పాటు అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా లబ్ధిదారులకు వంటగ్యాస్‌పై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ కవితకు వైద్య పరీక్షలు

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు గురువారం ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. గత నెలలో మూడు పర్యాయాలు అస్వస్థతకు గురైన కవితకు దీన్‌దయాళ్ ఆసుపత్రి, ఎయిమ్స్‌లో పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. జూలై 19న ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించిన సమయంలో ప్రతి పది రోజులకు ఓసారి వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించాలంటూ న్యాయస్థానం తిహార్ జైలు అధికారులకు సూచించింది. ఈ క్రమంలో రెండు పర్యాయాలు సాధారణ చెకప్ కోసం తీసుకెళ్లిన అధికారులు.. ఇటీవల కాలంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో కవిత కొద్దిరోజులుగా అస్వస్థతతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కవితను హుటాహుటిన గురువారం మధ్యాహ్నం సమయంలో మరోసారి ఎయిమ్స్‌కు తరలించారు. దాదాపు 5 గంటలపాటు గైనిక్, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి టెస్టులను చేసినట్లు తెలిసింది.

ఢిల్లీకి రేవంత్, ఉత్తమ్, మున్షీ

- ప్రత్యేక విమానంలో హస్తినకు..
- నేడు వెళ్లనున్న డిప్యూటీ సీఎం భట్టి
- అధిష్టానం పెద్దలతో భేటీ కోసమే అంటున్న గాంధీ భవన్ వర్గాలు
- పీసీసీ చీఫ్ ఎంపిక, నామినేటెడ్ పోస్టుల వ్యవహారం ఓ కొలిక్కి వచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హస్తిన బాటపట్టారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి గురువారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీ వెళ్లారు. అలాగే ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఉదయం ఢిల్లీ వెళ్లనున్నారు. వారంతా శుక్రవారం ఉదయం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో సమావేశం అవుతారని గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి. ఏఐసీసీ సంస్థాగత మార్పుల్లో భాగంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మార్పు, పీసీసీ అధ్యక్ష నియామకం, నామినేటెడ్ పోస్టుల భర్తీతోపాటు మంత్రివర్గ విస్తరణపై వారు చర్చిస్తారని చెబుతున్నాయి.

ఈసారైనా లెక్క తేలుతుందా?

పీసీసీ అధ్యక్ష వ్యవహారం ఈసారైనా కొలిక్కి వస్తుందా అనే చర్చ గాంధీ భవన్ వర్గాల్లో జరుగుతోంది. సీఎం హోదాతోపాటు పీసీసీ చీఫ్‌గా గత 8 నెలలుగా రేవంత్‌రెడ్డి కొనసాగు తున్నారు. ఆయన స్థానంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ నేతల్లో ఒకరిని నియమించాలని అధిష్టానం భావిస్తోంది. గత నాలుగైదు దఫాలుగా అధిష్టానం పెద్దలతో జరిగిన చర్చల్లోనూ ఇదే కోణంలో చర్చ జరిగింది. బీసీ కోటాలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఎస్సీ కోటాలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఎస్టీ కోటాలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌ల పేర్లు వినిపించాయి. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు తర్వాత మాదిగ సామాజిక వర్గానికి పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తారనే చర్చ ఊపందుకుంది. ఈ కోణంలో మానకొండూరు ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేరు ప్రముఖంగా వినిపించింది. ఆయన పేరును మంత్రి శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి ప్రతిపాదిస్తున్నారని, దక్షిణ తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి ఉన్న నేపథ్యంలో ఉత్తర తెలంగాణ నుంచి పీసీసీ అధ్యక్ష హోదా ఇవ్వాలని... అదే సమయంలో ఎస్సీ మాదిగ సామాజికవర్గం కూడా కలిసి వస్తుందనే కోణంలో ఈ ప్రతిపాదన చేశారు. అయితే ఇటీవల మరో పేరు తెరపైకి వచ్చింది. ఉత్తర తెలంగాణ నుంచి కేబినెట్‌లో కీలకపాత్ర పోషిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబును పీసీసీ చీఫ్‌గా నియమిస్తున్నారనే చర్చ ఊపందుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఢిల్లీలో అధిష్టానం పెద్దలతో టీ కాంగ్రెస్ నేతల భేటీలో అయినా పీసీసీ అధ్యక్ష వ్యవహారం ఓ కొలిక్కి వస్తుందా లేదా అనేది వేచి చూడాల్సిందే.

సీఎం సోదరుని కుమార్తె నిశ్చితార్థానికి ప్రముఖులు

హైదరాబాద్ నార్సింగ్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు అయిన జగదీశ్‌రెడ్డి కుమార్తె రుత్విక – అభిజిత్‌రెడ్డిల నిశ్చితార్థం జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రముఖులంతా హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.

చెక్‌లిస్టుపై సంతకం కోసం ఒత్తిడి చేశారు

- కాళేశ్వరం సీఈ లేఖ ఇచ్చాకే సంతకం చేశా
- సీడీఓ రిటైర్డ్ సీఈ నరేందర్‌రెడ్డి వెల్లడి
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నలకు సమాధానం


బీఆర్‌కేఆర్ భవన్ వద్ద జస్టిస్ పీసీ ఘోష్

సాక్షి, హైదరాబాద్: 'కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాల ప్రకారం సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ)కు అధిపతిగా ఈఎన్‌సీ ఉండాలి. సీడీఓ కింద హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్స్, డిజైన్స్ విభాగాలకు వేర్వేరు సీఈలు పనిచేయాలి. డిజైన్లు, డ్రాయింగ్స్‌ను సీడబ్ల్యూసీకి పంపించడానికి ముందు హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్స్, డిజైన్స్‌కి సంబంధించిన నిబంధనలన్నీ అమలు చేసినట్టు ధ్రువీకరిస్తూ చెక్‌లిస్టుపై సీడీఓ ఈఎన్‌సీ సంతకం చేయాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రంలో సీడీఓ ఈఎన్‌సీ లేరు. చెక్‌లిస్టుపై సంతకం చేయాలని కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ (హైదరాబాద్) హరిరామ్.. నన్ను కోరగా..హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్స్ విభాగాలు నా పరిధిలోకి రానందున సంతకం చేసేందుకు నిరాకరించా. బరాజ్‌ల డిజైన్లన్నీ సిద్ధమయ్యాక సంతకం ఎందుకు పెట్టడం లేదు? సమస్యేమిటి? అని నాటి సీఎం (కేసీఆర్), ఇరిగేషన్ మంత్రి (హరీశ్‌రావు) ఫోన్లు చేసి ఒత్తిడి చేశారు..' అని రాష్ట్ర నీటిపారుదల శాఖలోని సీడీఓ విభాగం రిటైర్డ్ సీఈ డి.నరేందర్‌రెడ్డి.. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు తెలిపారు. హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్లకు సంబంధించిన అంశాలకు పూర్తిగా తనదే బాధ్యత అని అంగీకరిస్తూ హరిరామ్ లేఖ ఇచ్చాకే తాను చెక్‌లిస్టుపై సంతకం చేశానని చెప్పారు. అయితే డిజైన్లు సీడబ్ల్యూసీకి సమర్పించడానికి ముందు ఈ లేఖను తొలగించారని ఇటీవల తనకు తెలిసిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా కమిషన్ గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో నరేందర్‌రెడ్డికి క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం కింద సంపాదించిన హరిరామ్ లేఖను నరేందర్‌రెడ్డి కమిషన్‌కు ఆధారంగా అందజేశారు. ఎల్ అండ్ టీ ఇచ్చిన డిజైన్లను మక్కికి మక్కీగా కాపీ ఎందుకు చేశారు? మెదడును ఎందుకు వినియోగించలేదు? అని కమిషన్ నిలదీయగా, ఆయన పైవిధంగా స్పందించారు. కమిషన్ సంధించిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

మేడిగడ్డ డిజైన్ల రూపకల్పనలో ఎల్ అండ్ టీ పాత్ర

'మేడిగడ్డ బరాజ్ డిజైన్ల రూపకల్పనతో తమకు సంబంధం లేదని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ పేర్కొనడం పూర్తిగా అవాస్తవం. డిజైన్ల ప్రతిదశలో ఎల్ అండ్ టీ పాలుపంచుకుంది. నాటి సీఎం (కేసీఆర్) సమక్షంలో జరిగిన ఓ సమావేశంలో పనిభారం తీవ్రంగా ఉందనే చర్చ జరగగా, మేడిగడ్డ బరాజ్ డిజైన్లు, డ్రాయింగ్స్‌కు రూపకల్పన చేస్తామని ఎల్ అండ్ టీ సీఎండీ స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఆ సంస్థతో కలిసి సీడీఓ ఇంజనీర్లు డిజైన్లు, డ్రాయింగ్స్‌ను రూపొందించారు. ఎల్ అండ్ టీ, సీడీఓ మధ్య ఈ-మెయిల్ ద్వారా జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలతో రూపొందించిన 600 పేజీల బుక్‌లెట్ సీడీఓ వద్ద ఆధారంగా ఉంది. (రుజువుగా కొన్ని మెయిల్స్‌తో కూడిన పత్రాలను కమిషన్‌కు అందజేశారు).

కాళేశ్వరం నిర్మించాలన్న నిర్ణయం ఎవరిదో తెలియదు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలన్న ఆలోచన ఎవరిదో నాకు తెలియదు. సీఎం వద్ద జరిగిన సమావేశాలకు ఎన్నడూ సీడీఓ ఇంజనీర్లను పిలవలేదు. డిజైన్లు, డ్రాయింగ్స్ రూపకల్పనకే సీడీఓ పాత్ర పరిమితం. బరాజ్‌ల 3డీ మోడల్ స్టడీస్‌ను సీడీఓ డిజైన్లు ఇచ్చిన తర్వాతే చేయాలి. నాటి ప్రభుత్వం, సీఎం, మంత్రి వెంటబడడంతో సీడీఓ డిజైన్లు ఇవ్వడానికి ముందే 3డీ మోడల్ స్టడీస్‌ను తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబొరేటరీస్ (టీఎస్ఈఆర్ఎల్) నిర్వహించింది. 2డీ మోడల్ స్టడీస్ ఫలితాలు మాత్రమే డిజైన్ల తయారీకి ముందు మాకు అందాయి. బరాజ్ నుంచి వరద సెకనుకు 6 మీటర్ల వేగం (షూటింగ్ వెలాసిటీ)తో బయటికి దూసుకొస్తుందనే అంచనాలతో డిజైన్లను రూపొందించాం. కానీ సెకనుకు 15–16 మీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్టు నిర్ధారణ జరిగింది.

నిర్మాణ, నిర్వహణ లోపంతోనే బరాజ్‌లు విఫలం

నిర్మాణంలో నాణ్యతా లోపం, నిర్మాణం పూర్తైన తర్వాత వర్షాలకు ముందు, తర్వాత నిర్వహణ, పర్యవేక్షణ చేపట్టకపోవడం, గేట్ల నిర్వహణలో కోడ్ పాటించకపోవడం, మేడిగడ్డ బరాజ్‌లో బుంగలు ఏర్పడితే నాలుగేళ్ల పాటు పూడ్చివేయకపోవడం వంటి కారణాలతోనే బరాజ్‌లు విఫలమయ్యాయి..' అని నరేందర్‌రెడ్డి చెప్పారు.

బరాజ్‌ల డిజైన్లలో మార్పులు నిజమే

మాజీ ఈఎన్‌సీ మురళీధర్

అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల డిజైన్లకు సాంకేతిక అనుమతులిచ్చిన తర్వాత నిర్మాణ దశలో మార్పులు చేసింది వాస్తవమేనని నీటి పారుదల శాఖ మాజీ ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్ రావు అంగీకరించారు. అన్నారం బరాజ్‌కు 58 గేట్లు ఏర్పాటు చేయాలని తొలుత డిజైన్లు రూపొందించగా, తర్వాత 66 గేట్లకు పెంచినట్టు గురువారం పీసీ ఘోష్ కమిషన్‌కు తెలిపారు. బుధవారం క్రాస్ ఎగ్జామినేషన్‌లో సమాధానం ఇవ్వలేకపోయిన ప్రశ్నలకు గురువారం మళ్లీ కమిషన్ ముందు హాజరై ఆయన సమాధానాలిచ్చారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో రెండు వైపులా ఫ్లడ్ బ్యాంకులు, డైవర్షన్ చానల్స్ వంటి అదనపు పనులు జరిగాయని చెప్పారు.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళితే రాష్ట్రం అగ్నిగుండమే
- అఖిలపక్ష సమావేశంలో హెచ్చరిక
- ఆమరణ దీక్షకు సిద్ధం: బీఆర్ఎస్ నేతలు మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ నేతలు


లక్డీకాపూల్: కులగణన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, కాదని పాలకులు మొండిగా వ్యవహరిస్తే రాష్ట్రం అగ్ని గుండమవుతుందని అఖిలపక్ష పార్టీలు, బీసీ కుల సంఘాలు హెచ్చరించాయి. గురువారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో బీసీ రిజర్వేషన్లను పెంచాలనే ప్రధాన డిమాండ్‌పై నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, టీజేఎస్ పార్టీల నేతలతో పాటు 80 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, అఖిలపక్ష బీసీ సంఘాల నేతలు, మేధావులు పాల్గొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తక్షణమే కులగణన ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంఎల్‌సీ మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. కులగణన చేపట్టకుండా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తే తాము సామూహిక ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడానికి కూడా వెనుకాడబోమని బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ కులగణనను చేసి బీసీ రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు.

26న జిల్లాల కలెక్టరేట్ల ముట్టడి: జాజుల

బీసీ రిజర్వేషన్లు పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 26న అన్ని జిల్లాల కలెక్టరేట్లను ముట్టడించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ బీసీ సంఘాలు చేసే పోరాటంలో బీజేపీ ప్రత్యక్షంగా పాల్గొంటుందని తెలిపారు. వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీజేఎస్ అధికార ప్రతినిధి పల్లె వినయ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటేశ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సొంతూరులో మహిళా జర్నలిస్టులపై దాడి

రైతు రుణమాఫీ వివరాలు సేకరిస్తుండగా ఘటన


కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ కార్యకర్తలు

సాక్షి, నాగర్‌కర్నూల్: సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి దిగాయి. హైదరాబాద్‌కు చెందిన యూట్యూబ్ చానల్ జర్నలిస్టులు విజయారెడ్డి, సరిత గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కొండారెడ్డిపల్లికి చేరుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న రుణమాఫీ పథకంలో భాగంగా గ్రామంలోని అర్హులందరికీ మాఫీ అయ్యిందా అన్న కోణంలో వివరాలు సేకరించారు. ఈ క్రమంలో పలువురు రేవంత్‌రెడ్డి అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడకు చేరుకుని.. రుణమాఫీ పొందిన లబ్ధిదారుల నుంచి మాత్రమే అభిప్రాయాలు తీసుకోవాలని జర్నలిస్టులతో వాగ్వాదానికి దిగి, ఎందుకు వచ్చారంటూ ప్రశ్నించారు. ఈ క్రమంలోనే పలువురు యువకులు జర్నలిస్టు సరిత చేతి నుంచి సెల్‌ఫోన్ లాక్కొని దాడికి యత్నించారు. దీంతో కొద్దిసేపు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జర్నలిస్టులు వంగూరు పీఎస్ లో ఫిర్యాదు చేశారు. కొండారెడ్డిపల్లికి చెందిన అనిల్, చందుయాదవ్, శేఖర్, కృష్ణ, వంశీపై కేసు నమోదైంది. మరోవైపు తమను కులం పేరుతో దూషించారంటూ గ్రామస్తుడు అనిల్ జర్నలిస్టు విజయారెడ్డితో పాటు ఆమె వెంట వచ్చిన మరో నలుగురిపై ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని ఎస్ఐ మహేందర్ తెలిపారు. హైదరాబాద్‌కు తిరుగుపయనమైన జర్నలిస్టులను కొత్త చౌరస్తా సమీపంలో కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు వెంబడించగా, పోలీసులు జోక్యం చేసుకొని ఎస్కార్ట్ వాహనం సహాయంతో హైదరాబాద్‌కు పంపించారు.

బీఆర్ఎస్ ఖండన

మహిళా జర్నలిస్టులపై సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడం మళ్లీ ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు తెస్తోందని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. కొండారెడ్డిపల్లి ఘటన వెనుక సీఎం సోదరుల హస్తం ఉందని ఆరోపించారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలు దాడిని ఖండించారు. దాడి చేసిన కాంగ్రెస్ కార్య కర్తలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రకటనలు విడుదల చేశారు. కాగా, మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డికి కేటీఆర్, హరీశ్ రావు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు.



పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోండి

ముఖ్యమంత్రికి పౌల్ట్రీ రంగ ప్రముఖుల వినతి

సాక్షి, హైదరాబాద్: మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లను వారానికి 3 నుంచి 5 రోజులకి పెంచడంతోపాటు పౌల్ట్రీకి విద్యుత్ రాయితీ, వడ్డీ రాయితీ కల్పించాలని, స్కిల్ యూనివర్సిటీలో పౌల్ట్రీ కోర్సులు చేర్చాలని పలువురు పౌల్ట్రీ ప్రముఖులు గురువారం ముఖ్యమంత్రిని కలిసి కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. పౌల్ట్రీ ఇండియా నుంచి ఉదయ్‌సింగ్ బయాస్, పొట్లూరి చక్రధరరావు, శ్రీకాంత్ మంచాల, తెల్కాణ పౌల్ట్రీ ఫెడరేషన్ కాసర్ల మోహన్‌రెడ్డి, వుప్పల నర్సింహారెడ్డి, తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ రాఘవరావు, కేజీ ఆనంద్, జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ గుర్రం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. అలాగే నవంబర్‌లో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగే పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్‌కు హాజరవుతానని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.

బీసీ యువ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక కార్పొరేషన్

ఏర్పాటుకు 'బిక్కి' ప్రతినిధుల వినతి

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని యువకులు, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బిక్కి) కోరింది. ఈమేరకు గురువారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను 'బిక్కి' అధ్యక్షుడు చీరాల నారాయణ, కార్యదర్శి దాసరి కిరణ్, సమన్వయకర్త పరికిపండ్ల సుమంత్ తదితరులు కలుసుకున్నారు. బీసీల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరుతూ పది రకాల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు 'బిక్కి' ప్రతినిధులు తెలిపారు.

క్రైం సీన్‌నే మార్చేశారు

కోల్‌కతా దారుణం వెనక విస్తుపోయే నిజాలు ● సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో సీబీఐ


కోల్‌కతా ఉదంతంపై గురువారం విచారణ జరుపుతున్న సీజేఐ ధర్మాసనం

- వైద్యురాలిపై హత్యాచారాన్ని కప్పిపెట్టజూశారు
- గ్యాంగ్ రేప్‌కు ఆధారాల్లేవన్న దర్యాప్తు సంస్థ
- పోస్టుమార్టం, అంత్యక్రియలయ్యాక ఎఫ్ఐఆరా?
- పోలీసుల దర్యాప్తు ఆద్యంతం లోపభూయిష్టం
- 30 ఏళ్లలో ఎన్నడూ చూడలేదు: ధర్మాసనం
- వైద్యుల భద్రతకు వారం రోజుల్లోగా చర్యలు
- కేంద్ర, రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం ఆదేశం

న్యూఢిల్లీ: కోల్‌కతా ఆర్‌జీ కర్ ప్రభుత్వాసుపత్రి, వైద్య కళాశాలలో వైద్యురాలి హత్యాచారోదంతంపై తమ దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నట్టు సీబీఐ గురువారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ''ఈ పాశవిక చర్యను కప్పిపుచ్చి ఆత్మహత్యగా చిత్రించేందుకు స్థానిక పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. అందులో భాగంగా మేం దర్యాప్తు బాధ్యతలు స్వీకరించే నాటికి ఏకంగా క్రైం సీన్‌నే సమూలంగా మార్చేశారు. ఈ కారణంగా దర్యాప్తు తమకో పెను సవాలుగా మారింది'' అంటూ నివేదించింది. ''తొలుత వైద్యురాలి ఆరోగ్యం బాగా లేదంటూ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వాళ్లు ఆస్పత్రికి చేరుకున్నాక ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. హతురాలి అంత్యక్రియలు పూర్తయ్యాక తీరుబడిగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు'' అని పేర్కొంది. 'అంతేకాదు, ఆగస్టు 9న ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఆస్పత్రి వైద్యులు ఫోన్ చేసి వైద్యురాలు అపస్మారక స్థితిలో ఉందని సమాచారమిచ్చారు. నిజానికి ఆమె అప్పటికే చనిపోయింది'' అని తెలిపింది.

ప్రిన్సిపల్ వెనక ఎవరున్నట్టు: సీజేఐ

కోల్‌కతా దారుణాన్ని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సుమోటోగా విచారణకు స్వీకరించడం తెలిసిందే. ధర్మాసనం ఆదేశం మేరకు ఇప్పటిదాకా వెలుగులోకి వచ్చిన అంశాలతో దర్యాప్తు పురోగతిపై గురువారం సీబీఐ స్థాయీ నివేదిక సమర్పించింది. బెంగాల్ సర్కారు కూడా ఓ నివేదిక సమర్పించింది. ఈ కేసులో కోల్‌కతా పోలీసుల దర్యాప్తు అత్యంత లోపభూయిష్టమంటూ జస్టిస్ పార్డీవాలా ఈ సందర్భంగా మండిపడ్డారు. ''సాయంత్రం 6.10 నుంచి 7.10 మధ్య పోస్టుమార్టం జరిపారు. అంటే అది అసహజ మరణమని అప్పటికే రూఢీ అయినట్టే. కానీ అర్ధరాత్రి కనీసం కేసు కూడా నమోదు చేయకపోవడం చాలా ఆశ్చర్యకరం. గత 30 ఏళ్లలో ఇలాంటిది ఎన్నడూ చూడలేదు'' అంటూ ఆయన తూర్పారబట్టారు. అర్ధరాత్రి పోస్టుమార్టం తర్వాత గానీ క్రైం సీన్‌ను పోలీసులు అధీనంలోకి తీసుకోలేదంటూ సీజేఐ ఆక్షేపించారు. అసహజ మరణమని పొద్దున్నే తేలినా ఎందుకంత ఆలస్యం చేయాల్సి వచ్చిందంటూ ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్ దాఖలులో కోల్‌కతా పోలీసుల అసాధారణ జాప్యం అత్యంత తీవ్రమైన అంశమంటూ దుయ్యబట్టారు. ''14 గంటలు ఆలస్యంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడమా?! ఘోరం గురించి ఉదయమే తెలిసినా, సాయంత్రానికల్లా పోస్టుమార్టం చేసినా రాత్రి 11.30 దాకా పోలీసులకు సమాచారమే ఇవ్వలేదు. నిజానికి విషయం తెలియగానే నేరుగా ఆస్పత్రికి వచ్చి ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చూడటం ప్రిన్సిపల్ కనీస బాధ్యత. ఈ విషయంలో ఆయన ఎందుకు జాప్యం చేసినట్టు? అసలాయన ఎవరెవరితో టచ్‌లో ఉన్నారు? దాని వెనక కారణాలేమిటి? విమర్శల తీవ్రతకు ఎట్టకేలకు ప్రిన్సిపల్ రాజీనామా చేస్తే రాష్ట్ర ప్రభుత్వం దాన్ని ఆమోదించకపోగా ఆయన్ను సింపుల్‌గా మరో వైద్య కాలేజీకి బదిలీ చేసింది'' అంటూ సీజేఐ ఆక్షేపించారు. దీనంతటినీ ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. ఈ ఘటనకు సంబంధించి తొలి ఎంట్రీ నమోదు చేసిన పోలీసు అధికారి తదుపరి విచారణకు తమ ఎదుట హాజరై ఎంట్రీ నమోదు సమయం తదితర వివరాలన్నింటినీ నేరుగా వెల్లడించాలని ఆదేశించారు. ఈ ఉదంతాన్ని రాజకీయం చేయొద్దని పార్టీలకు సీజేఐ సూచించారు. హతురాలి జననాంగంలో 150 జీఎం పరిమాణంలో వీర్యం ఉందన్న సీబీఐ తరఫు న్యాయవాది వాదనను తప్పుబట్టారు. సోషల్ మీడియా వార్తల ఆధారంగా వాదనలు విన్పించొద్దంటూ మందలించారు. గ్యాంగ్ రేప్ జరగలేదని, ఇది కేవలం ఒక్కరి పనేనని ఇప్పటిదాకా జరిగిన దర్యాప్తులో తేలిందని, డీఎస్ఏ నివేదిక కూడా దీన్నే ధ్రువీకరిస్తోందని సీబీఐ పేర్కొన్నట్టు సమాచారం!

మెహతా వర్సెస్ సిబల్

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. ఆయనకు, సీబీఐ తరఫున వాదనలు విన్పించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు మధ్య సాగిన వాడీవేడి వాదనలు కోర్టు హాలును వేడెక్కించాయి. ఎఫ్ఐఆర్ దాఖలులో చోటుచేసుకున్న లోటుపాట్లను తాను వివరిస్తుంటే సిబల్ హేళనగా నవ్వుతున్నారంటూ ఒక దశలో మెహతా తీవ్రంగా ఆక్షేపించారు. ''ఒక అమాయకురాలు అత్యంత హృదయ విదారక పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోయింది. కనీసం నవ్వకుండా ఉండటం సంస్కారం'' అంటూ తీవ్ర స్వరంతో వ్యాఖ్యలు చేశారు.

వైద్యులు పట్టుబట్టినందుకే వీడియో

జరిగిన దారుణం గురించి తెలిసినా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఘోష్ వెంటనే ఎలాంటి చర్యలూ తీసుకోలేదంటూ సొలిసిటర్ జనరల్ మెహతా తప్పుబట్టారు. హతురాలి తండ్రి ఎంతగా డిమాండ్ చేసినా అంత్యక్రియల అనంతరం రాత్రి 11.45 గంటలకు గానీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం చాలా దారుణమని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ''పోస్టుమార్టాన్ని వీడియో తీయాల్సిందేనని వైద్యురాలి సహచరులు, సీనియర్ డాక్టర్లు పట్టుబట్టారు. లేదంటే ఆ ఆధారాలు కూడా మిగిలేవి కాదు'' అన్నారు. వీటిని సిబల్ ఖండించారు. సీబీఐ నివేదికను బురదజల్లే యత్నంగా అభివర్ణించగా మెహతా తీవ్ర అభ్యంతరం తెలిపారు. నిజాలను కప్పిపెట్టేందుకు చల్లిన బురదను తొలగించేందుకే సీబీఐ ప్రయత్నిస్తోందన్నారు.

నేనూ ధర్మాసుపత్రిలో నేలపై పడుకున్నా: సీజేఐ

వైద్యుల సమస్యల గురించి ప్రస్తావిస్తూ సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకసారి తన కుటుంబీకుల్లో ఒకరికి చికిత్స సందర్భంగా స్వయంగా ధర్మాసుపత్రిలో నేలపై పడుకున్నానని చెప్పారు. వైద్యులు దారుణమైన పరిస్థితుల నడుమ పని చేస్తున్నారంటూ ఆవేదన వెలిబుచ్చారు. ''వాళ్లకు కనీస మౌలిక వసతులు కూడా అందుబాటులో లేవు. 36 గంటలు, అంతకుమించి నిరంతరాయంగా పని చేయాల్సి వస్తోంది. ఇది అత్యంత అమానవీయం. అంతసేపు పని చేసి పూర్తిగా అలసిపోయిన స్థితిలో ఎవరన్నా వేధించినా అడ్డుకుని స్వీయరక్షణ చేసుకునే స్థితిలో కూడా ఉండరు! ఇవన్నీ మా దృష్టిలో ఉన్నాయని వైద్యులు దయ చేసి అర్థం చేసుకోవాలి'' అని పేర్కొన్నారు. న్యాయం, ఔషధాలు అందడంలో జాప్యం జరగరాదన్నారు. సమ్మె విరమించి విధులకు వెళ్లాల్సిందిగా వైద్యులను మరోసారి అభ్యర్థించారు. ఆందోళనల్లో పాల్గొన్నందుకు ఆస్పత్రి వర్గాలు తమను వేధిస్తున్నాయని నాగ్‌పూర్ ఎయిమ్స్ వైద్యులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాంతో వైద్యుల శాంతియుత నిరసనలపై బలప్రయోగానికి దిగొద్దని, విధుల్లో చేరాక ప్రతీకార చర్యలేవీ తీసుకోవద్దని సీజేఐ ఆదేశించారు.

సలహాల కోసం పోర్టల్

''దేశవ్యాప్తంగా వైద్యుల భద్రత కోసం కేంద్ర, రాష్ట్రాలు వారం లోపు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులతో, డీజీపీలతో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి సంప్రదింపులు జరపాలి'' అంటూ సీజేఐ ఆదేశాలు జారీ చేశారు. ''వైద్యుల భద్రత తదితరాలపై సలహాల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ ఓ పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలి. సలహాలు, సూచనలను నేషనల్ టాస్క్ ఫోర్స్ పరిగణనలోకి తీసుకుని వైద్యుల భద్రతపై నేషనల్ ప్రొటోకాల్‌ను రూపొందించాలి'' అంటూ పలు నిర్దేశాలు జారీ చేశారు. విచారణను సెప్టెంబర్ 5కు వాయిదా వేశారు.



మాజీ ప్రిన్సిపల్‌కు లై డిటెక్టర్ టెస్టు

మరో నలుగురు వైద్యులకు కూడా

వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరిగిన ఆర్‌జీ కర్ ప్రభుత్వాసుపత్రి, మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌తో పాటు మరో హతురాలి సహచరులైన నలుగురు వైద్యులకు కూడా లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించేందుకు సీబీఐకి ప్రత్యేక కోర్టు గురువారం అనుమతి జారీ చేసింది. మరోవైపు అమానుషంగా ప్రవర్తించడం ఘోష్‌కు అలవాటని ఆయన ఇరుగుపొరుగు చెబుతున్నారు. సిజేరియన్ అయిన రెండు వారాలకే భార్యను ఆయన దారుణంగా కొట్టారంటూ 12 ఏళ్ల నాటి ఉదంతాన్ని గుర్తు చేస్తూ వారు చెప్పుకొచ్చారు.

రేప్‌కు కఠిన చట్టాలు తెండి

మోదీకి మమతా బెనర్జీ లేఖ

కోల్‌కతా: మానభంగానికి పాల్పడేవారికి అతి తీవ్రమైన శిక్షలను విధించేలా కేంద్రం కఠిన చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఆర్.జి.కర్ ఆసుపత్రిలో పీటీ ట్రైనీ డాక్టర్ పాశవిక హత్యాచారంపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్న నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి ఈ లేఖను సంధించారు. 'దేవవ్యాప్తంగా ప్రతిరోజూ రేప్‌లు జరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న గణాంకాలను బట్టి ప్రతిరోజూ భారత్‌లో 90 రేప్‌లు జరుగుతున్నాయి. వీటిలో చాలాకేసుల్లో బాధితులు హత్యకు గురవుతున్నారు. ఈ పరంపర భీతి గొల్పుతోంది. దేశం, సమాజం విశ్వాసాన్ని, అంతరాత్మను కుదిపేస్తోంది. ఈ ఘోరాలకు ముగింపు పలకడం మన విధి. అప్పుడే మహిళలు సురక్షితంగా, భద్రంగా ఉన్నామని భావిస్తారు. ఇలాంటి ఆందోళకరమైన, సున్నితమైన అంశాన్ని సమగ్రంగా పరిశీలించాలి. అత్యంత కఠినమైన కేంద్ర చట్టాన్ని తేవాలి. రేపిస్టులకు అతి తీవ్రమైన శిక్షలు విధించాలి' అని మమత లేఖలో కోరారు. రేప్ కేసుల విచారణ వేగంగా జరగాలంటే ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరగాలంటే కేసు విచారణ 15 రోజుల్లోగా పూర్తి కావాలని మమత అన్నారు. వైద్యురాలి హత్యాచారం కేసులో మమత సర్కారు వ్యవహరించిన శైలిని సుప్రీంకోర్టు కూడా ఆక్షేపించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మమత తీవ్ర విమర్శలను, ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

డాక్టర్ల సమ్మె విరమణ

ప్రకటించిన ఫైమా

న్యూఢిల్లీ: కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచారంపై ఆందోళనకు దిగిన డాక్టర్లు 11 రోజులుగా తాము చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. సుప్రీంకోర్టు నుంచి సానుకూల ఆదేశాలు రావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) వెల్లడించింది. డాక్టర్లు సమ్మె విరమించాలని, తిరిగి విధులకు హాజరయ్యే వారిపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలుండవి సుప్రీంకోర్టు గురువారం హామీ ఇచ్చింది. 'భారత ప్రధాన న్యాయమూర్తి నుంచి సానుకూల స్పందన రావడంతో సమ్మె విరమించాలని నిర్ణయించాం. ఆసుపత్రుల్లో భద్రత పెంచడం, డాక్టర్లకు రక్షణపై మా వినతులను సుప్రీంకోర్టు అంగీకరించడాన్ని స్వాగతిస్తున్నాం. ఐక్యతతో చట్టపరంగా మా పోరాటాన్ని కొనసాగిస్తాం' అని ఫైమా 'ఎక్స్'లో వెల్లడించింది. సుప్రీంకోర్టు సూచన మేరకు ఎయిమ్స్ ఢిల్లీ, ఆర్ఎంఎల్ హాస్పిటల్, లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీ, ఇందిరాగాంధీ హాస్పిటల్ రెసిడెంట్ డాక్టర్స్ సమ్మెను విరమిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. బెంగాల్‌లో మాత్రం సమ్మె విరమించేది లేదని వైద్యులు, వైద్య సిబ్బంది ప్రకటించారు.

జనం రోడ్డెక్కనిదే స్పందించరా?

- బద్లాపూర్ ఘోరంపై బాంబే హైకోర్టు
- చిన్నారులపై లైంగిక వేధింపులు దారుణం
- స్కూళ్లలోనే భద్రత లేకుంటే చట్టమెందుకు?
- వ్యవస్థపై నమ్మకం కోల్పోయే స్థితి రావద్దు
- నిర్లక్ష్యం రుజువైతే అధికారులపై కఠిన చర్యలు

ముంబై: మహారాష్ట్రలో థానే జిల్లాలోని బద్లాపూర్ పాఠశాలలో బాలికలపై లైంగిక వేధింపులు దిగ్భ్రాంతికరమని బాంబే హైకోర్టు ఆవేదన వెలిబుచ్చింది. దారుణం జరిగిన నాలుగైదు రోజులకు ప్రజలు మూకుమ్మడిగా ఆందోళనకు దిగితే గానీ పోలీసులు స్పందించలేదంటూ మండిపడింది. ''పసిబిడ్డలపై అఘాయిత్యం జరిగితే తేలిగ్గా తీసుకోవడమేమిటి? జనం ఆగ్రహంతో వీధుల్లోకి వస్తే తప్ప ప్రభుత్వ యంత్రాంగం ముందుకు కదలదా? అంటూ ఆగ్రహించింది. ఈ కేసులో బద్లాపూర్ పోలీసుల దర్యాప్తు సక్రమంగా లేదంటూ ఆక్షేపించింది. ''బాధితులు ఫిర్యాదు చేశారు గనుక ఈ వ్యవహారం బయటకొచ్చింది. బయటకు రాని కేసులు ఎన్నో ఉండొచ్చు'' అని అభిప్రాయపడింది. ''పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోయే పరిస్థితి రాకూడదు. వారు న్యాయం కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేసే పరిస్థితి ఉండకూడదు'' అని పేర్కొంది. ''పిల్లలకు స్కూళ్లలో కూడా భద్రత లేకపోతే ఏం చేయాలి? ఇక విద్యా హక్కు చట్టానికి అర్థమేమిటి?'' అంటూ నిలదీసింది. ఎఫ్ఐఆర్ నమోదులో ఎందుకు జాప్యం జరిగిందని పోలీసులను ప్రశ్నించింది. ''బాలికల భద్రతపై రాజీపడడానికి వీల్లేదు. వేధింపుల గురించి తెలిసినా పోలీసులకు ఫిర్యాదు చేయని స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి'' అని ఆదేశించింది.

27లోగా నివేదిక సమర్పించండి

బద్లాపూర్ పాఠశాలలో నాలుగేళ్ల వయసున్న ఇద్దరు బాలికలపై జరిగిన అఘాయిత్యం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడం తెలిసిందే. స్కూల్ వాష్ రూమ్‌లో అటెండర్ వారిని లైంగికంగా వేధించినట్లు వెల్లడైంది. ఈ నెల 12, 13న దారుణం జరిగితే పోలీసులు 16న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 17న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై జస్టిస్ రేవతి మొహితే, జస్టిస్ పృథ్వీరాజ్ చవాన్‌తో కూడిన బాంబే హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం సుమోటోగా విచారణ చేపట్టింది. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని గుర్తుచేసింది. బాలికలకు, వారి కుటుంబాలకు అండగా నిలవాలని, మరింత బాధకు గురిచేయొద్దని ఆదేశించింది. ఈ కేసులో 27వ తేదీలోగా నివేదిక సమర్పించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది.

ఉక్రెయిన్‌లో శాంతికి సహకారం

ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటన

- పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో సమావేశం
- ద్వైపాక్షిక అంశాలపై చర్చ.. పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయం
- భారత్–పోలండ్ మధ్య కుదిరిన సామాజిక భద్రతా ఒప్పందం


గురువారం పోలండ్ ప్రధాని టస్క్‌తో మోదీ చర్చలు

వార్సా: ఏ సమస్యకైనా సరే యుద్ధక్షేత్రంలో పరిష్కారం దొరకదని తాము బలంగా నమ్ముతున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. సంఘర్షణలు, వివాదాలను శాంతియుతంగా దౌత్యమార్గాల్లో పరిష్కరించుకోవడమే ఉత్తమమైన విధానమని ఉద్ఘాటించారు. ఉక్రెయిన్‌లో స్థిరత్వం, శాంతిని పునరుద్ధరించడానికి తాము చేయగలిగే పూర్తిసాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. పోలండ్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ రెండో రోజు గురువారం పోలండ్ ప్రధానమంత్రి డొనాల్డ్ టస్క్‌తో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. భారత్–పోలండ్ మధ్య సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చడమే లక్ష్యంగా ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఒకదేశానికి చెందిన నైపుణ్యం కలిగిన కార్మికులు మరో దేశంలో సులువుగా ఉద్యోగాలు పొందడానికి వీలు కల్పించే సామాజిక భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రక్షణ, వాణిజ్యం, పునరుత్పాదక ఇంధనాలు, ఫార్మాస్యూటికల్స్, పట్టణ మౌలిక సదుపాయాలు, ఆహార శుద్ధి, కృత్రిమ మేధ(ఏఐ), అంతరిక్షం తదితర కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని ఇరుదేశాలు తీర్మానించాయి. డొనాల్డ్ టస్క్‌తో భేటీ అనంతరం ప్రధాని మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో చర్చించిన కీలక అంశాలను ప్రస్తావించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభాలపై ఆందోళన వ్యక్తంచేశారు.

ఆ సంస్థలను సంస్కరించాలి

భారత్–పోలండ్ మధ్య దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు నిండుతున్నాయని, ఈ సందర్భంగా ఇరు దేశాల నడుమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని నిర్ణయించామని ప్రధానమంత్రి మోదీ తెలిపారు. సామాజిక భద్రతా ఒప్పందంతో నైపుణ్యం కలిగిన కార్మికులకు, ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. వారి సంక్షేమం కోసం ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. 2022లో ఉక్రెయిన్–రష్యా ప్రారంభమైనప్పుడు ఉక్రెయిన్ నుంచి భారతీయ విద్యార్థులను క్షేమంగా వెనక్కి రప్పించడానికి సహకరించినందుకు పోలండ్‌కు మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో ఐక్యరాజ్యసమితితోపాటు ఇతర అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనిపై పోలండ్ సైతం తనతో ఏకీభవించిందని తెలిపారు.

భారత్‌కు అభినందనలు: డొనాల్డ్ టస్క్

ప్రపంచానికి ఆందోళన కలిగిస్తున్న యుద్ధాలపై మోదీ, తాను చర్చించామని టస్క్ వివరించారు. వాటిపై స్పష్టతకు వచ్చామన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలికి, శాంతిని నెలకొల్పేందుకు వ్యక్తిగతంగా కృషి చేయడానికి మోదీ సంసిద్ధత వ్యక్తం చేయడం తనకు చాలా సంతోషం కలిగిస్తోందన్నారు. భారత్‌తో రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నట్లు వివరించారు.


అయోధ్యలో బాలికపై గ్యాంగ్‌రేప్.. నిందితుడి దుకాణాల కూల్చివేత



అయోధ్య: అయోధ్యలో 12 ఏళ్ల బాలికపై గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మొయిద్ ఖాన్ అనే వ్యక్తి దుకాణ సముదాయాన్ని జిల్లా అధికా రులు గురువారం కూల్చివేశారు. పురాకలందర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భదర్సానగర్‌లో మొయిద్ ఖాన్ బేకరీ నడుపుతున్నాడు. మొయిద్‌తోపాటు అతడి పనిమనిషి రాజు ఖాన్ ఓ బాలికపై రెండునెలల క్రితం అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దురాగతాన్ని వారు వీడియో తీశారు. బాలిక గర్భం దాల్చినట్లు తేలడంతో జూలై 30న పోలీసులు మొయిద్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు. ఆగస్టు 3న అతడు నడిపే బేకరీని నేలమట్టం చేశారు. చెరువు స్థలం కబ్జా చేసి దానిని నిర్మించినట్లు అధికారులు అంటున్నారు. తాజాగా, గురువారం మొయిద్ ఖాన్‌కు చెందిన దుకాణ సముదాయాన్ని కూల్చి వేశారు. దానిని ప్రభుత్వ స్థలంలో నిర్మించాడన్నారు. ఆ సమయంలో భవనం ఖాళీగానే ఉందని చెప్పారు. కూల్చివేత సందర్భంగా ఆ ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించారు. మొయిద్ ఖాన్ సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు, ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ ప్రసాద్ అనుచరుడని బీజేపీ నేతలతోపాటు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరోపిస్తున్నారు.

ఆర్టికల్ 370పై మీ వైఖరేంటి?

కాంగ్రెస్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్న



జమ్మూ: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370పై కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్, సోనియాలు తమ వైఖరిని స్పష్టం చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370ను పునరుద్ధరిస్తామంటూ కాంగ్రెస్ మిత్ర పక్షం నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ)ఇచ్చిన హామీ విషయం తేల్చాలని కూడా నిలదీశారు. కేంద్ర పాలిత ప్రాంతంలోని మహిళలు, వాల్మీకి సమాజ్, గిరిజనులు తదితర కొన్ని వర్గాల ప్రజలకు దఖలు పడిన హక్కులను తిరిగి లాగేసుకుంటామన్న ఎన్‌సీ ఎన్నికల మేనిఫెస్టోపైనా వివరణ ఇవ్వాలన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధతపై గురువారం కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులతో సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

న్యూస్‌ప్రింట్‌పై కస్టమ్స్ డ్యూటీ తొలగించండి

మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఐఎన్ఎస్

న్యూఢిల్లీ: పత్రికల ప్రచురణకు ఉపయోగిస్తున్న న్యూస్ ప్రింట్‌పై ఐదు శాతం కస్టమ్స్ డ్యూటీని ఉపసంహరించాలని ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరింది. అధ్యక్షుడు రాకేశ్ శర్మ నేతృత్వంలో ఐఎన్ఎస్ ప్రతినిధి బృందం బుధవారం కేంద్రమంత్రితో సమావేశమై.. పత్రికారంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చింది. సానుకూల, నిర్మాణాత్మక చర్చలు జరిగాయని, అశ్వినీ వైష్ణవ్ ఓపికగా తమ సమస్యలను విన్నారని ఐఎన్ఎస్ సెక్రటరీ జనరల్ మేరీ పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ న్యూస్ చందాదారులపై జీఎస్టీని ఎత్తివేయాలని, ఈ–పేపర్లకు ప్రత్యేక ధరలను నిర్ణయించే అంశం పరిశీలన, ఆడిట్ సర్క్యులేషన్ సర్టిఫికెట్లను సమర్పించేందుకు గడువు పెంపు, సీబీసీ నుంచి రావాల్సిన బకాయిలు.. తదితర తొమ్మిది అంశాలను ఐఎన్ఎస్ ప్రతినిధి బృందం మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. వీటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని వైష్ణవ్ హామీ ఇచ్చారని తెలిపింది.

కాంగ్రెస్‌తో పొత్తు కుదిరింది

ఎన్‌సీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా వెల్లడి



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్‌తో నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తు పెట్టుకుంది. మొత్తం 90 సీట్లకు పొత్తు ఖరారైందని ఎన్‌సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీతో గురువారం తన నివాసంలో భేటీ అనంతరం ఈ మేరకు ప్రకటించారు. ''చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయి. సీపీఎం నేత తరిగామీ కూడా మాతో ఉన్నారు'' అని మీడియాకు చెప్పారు. రాష్ట్ర హోదాను తిరిగి సాధించేందుకే ఇండియా కూటమితో కలిసి ఉన్నామన్నారు. విభజన శక్తులపై పోరాటమే తమ ఉమ్మడి కార్యక్రమమన్న ఆయన..వేరుగా కనీస ఉమ్మడి కార్యక్రమం అనే ప్రశ్నే లేదని కుండబద్దలు కొట్టారు. మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీతోనూ పొత్తు కుదుర్చుకునేందుకు అవకాశముందని చెప్పారు. మొదటి దశ పోలింగ్ నాటికి సీట్ల పంపిణీ సహా అన్ని అంశాలపైనా స్పష్టత వస్తుందని చెప్పారు.

పొత్తులకు మేం సిద్ధం

కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే




శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలతో పొత్తు కుదుర్చుకునేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడించారు. పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీతోపాటు ఆయన గురువారం శ్రీనగర్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా సాధించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందని మీడియాతో ఖర్గే అన్నారు. ''ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఇతర పార్టీలతో కలిసి పోటీ చేశాం. మంచి ఫలితాలను సాధించాం. నియంతృత్వ బీజేపీ ప్రభుత్వం మెజారిటీకి గణనీయంగా గండికొట్టాం. ఇండియా కూటమి అతిపెద్ద విజయమిది'అని ఖర్గే తెలిపారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కొన్ని బిల్లులను జేపీసీకి పంపడమో లేక వెనక్కి తీసుకోవడమో చేయాల్సి రావడంతో బీజేపీకి భయం పట్టుకుందన్నారు.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా మా ప్రాథమ్యం: రాహుల్



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు కాంగ్రెస్‌తోపాటు విపక్ష ఇండియా కూటమి అత్యంత ప్రాధాన్యమిస్తాయని రాహుల్ గాంధీ చెప్పారు. ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంత స్థాయికి తగ్గించడం కశ్మీర్ విషయంలోనే జరిగిందన్నారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రజల న్యాయమైన హక్కులను కట్టబెట్టేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌కు సాధ్యమైనంత త్వరగా రాష్ట్ర హోదాను, ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరిస్తామని గురువారం శ్రీనగర్‌లో మీడియాతో అన్నారు. ''జమ్మూకశ్మీర్ ప్రజలతో నాకు అత్యంత బలమైన సంబంధముంది. ఇక్కడికి రావడం నాకెప్పుడూ ఆనందకరమైన విషయమే. కశ్మీరీలకు సాధ్యమైనంత సాయం అందించేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుంది'' అన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజలకిది చాలా క్లిష్టమైన, పరీక్షా సమయమన్నారు. ఇక్కడ హింసను రూపుమాపాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు.

వక్ఫ్ బిల్లును చంద్రబాబు, నితీశ్ వ్యతిరేకిస్తామన్నారు: రహమానీ



న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లును వ్యతిరేకిస్తామని ఎన్డీయే కీలక భాగస్వామ్యపక్షాలైన తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యునైటెడ్) హామీ ఇచ్చాయని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహమానీ వెల్లడించారు. చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్‌లు వక్ఫ్ బిల్లు–2024ను వ్యతిరేకిస్తామని తమకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఆగస్టు 8న లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టినపుడు బీజేపీ మిత్రపక్షాలు జేడీయూ, టీడీపీ దీన్ని బలపర్చడం గమనార్హం. ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమైత్ ఉలేమా–ఇ–హింద్, ఇతర ముస్లిం సంస్థలు గురువారం ఇక్కడ ఉమ్మడిగా విలేకరుల సమావేశం నిర్వహించాయి. వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోకపోతే దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని, అన్ని మార్గాలను వాడుకుంటామని హెచ్చరించారు. ''పలు విపోఆలను చంద్రబాబునూ కలిశాం. వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బుధవారం నితీశ్‌కుమార్‌తో భేటీ అయ్యాం. ఆయన కూడా బిల్లును వ్యతిరేకిస్తామన్నారు. ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే మాకు మద్దతిచ్చారు. తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్ కూడా బిల్లును వ్యతిరేకిస్తామన్నారు' అని రహమానీ తెలిపారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం। 23। ఆగస్టు। 2024



విప్లవం కోసం అడవిబాట పట్టి..

విప్లవం కోసం ఉద్యమంలోకి వెళ్లిన మహిళా మావోయిస్టు పల్లెపాటి రాధ జీవితం విషాదాంతంగా ముగిసింది. అడవిబాట పట్టిన రాధ విగతజీవిగా ఇంటికి చేరింది. -8లో



మాన్గార్ బస్తీని మార్చలేరా?

జేబుదొంగతనాల నుంచి దోపిడీ నేరగాళ్ల వరకూ కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న మాన్గార్ బస్తీపై ఎవరూ సరైన దృష్టి పెట్టడంలేదు. ఇప్పటికైనా వీరిని మార్చేందుకు చర్యలు చేపట్టాలి. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/23.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి లేదా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ డీఈ



లంచం తీసుకుంటూ పట్టుబడిన రామ్మోహన్

మన్సూరాబాద్: విద్యుత్ తీగలు తొలగించేందుకు సరూర్‌నగర్ సర్కిల్ ఎలక్ట్రికల్ డీఈ (టెక్నికల్) రూ.18 వేలు లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం ఆగపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో ఓ వ్యక్తి వెంచర్ ఏర్పాటు చేసి లేవుట్ చేశారు. ఈ స్థలంలో 11కేవీ, 33 కేవీ విద్యుత్ తీగలున్నాయి. వీటిని తొలగించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు సదరు వెంచర్ నిర్వాహకులు బాలనర్సింహ అనే విద్యుత్ కాంట్రాక్టర్‌ను సంప్రదించారు. విద్యుత్ కాంట్రాక్టర్, వెంచర్ నిర్వాహకులు విద్యుత్ తీగలను తొలగించడంతో పాటు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సదరు దరఖాస్తు సరూర్‌నగర్ సర్కిల్ ఎలక్ట్రికల్ (టెక్నికల్) డివిజనల్ ఇంజినీర్ (డీఈ) టి.రామ్మోహన్ వద్దకు చేరింది. విద్యుత్ తీగలను తొలగించేందుకు రూ.10 వేలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.8వేలు లంచం ఇవ్వాలని డీఈ డిమాండ్ చేశాడు. వెంచర్ నిర్వాహకులు, విద్యుత్ కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. ఆటోనగర్‌లోని సరూర్‌నగర్ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలోని తన చాంబర్‌లో డీఈ రామ్మోహన్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు డీఈ రామ్మోహన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని, సంబంధిత విద్యుత్ ఏడీ పాత్రపైనా విచారణ చేపట్టనున్నట్టు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

కళలకు మరింత ప్రోత్సాహం: మంత్రి సీతక్క



ఆర్ట్ గ్యాలరీని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క తదితరులు

శ్రీనగర్‌కాలనీ: చిత్ర లేఖనం కళలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తోందని మంత్రి సీతక్క అన్నారు. ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని గురువారం ఆమె ప్రారంభించారు. అత్యద్భుతమైన చిత్ర కళల్లో ప్రావీణ్యమున్న వాసు భాస్కరాల మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మాజీ విప్ ఓదేలు, భాగ్యలక్ష్మి, మాజీ టీఎఫ్‌సీసీ చైర్మన్ పుష్కర్ రామ్‌మోహన్‌రావు, నటుడు శివారెడ్డి పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా శ్రీవత్స



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రోపాలిటన్ అథారిటీ (హెచ్ఎండీఏ) జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా కోట శ్రీవత్స గురువారం బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్న ఆయన హెచ్ఎండీఏకు బదిలీ అయిన సంగతి తెలిసిందే. మరోవైపు హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఆమ్రపాలి ప్రస్తుతం జీహెచ్ఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్‌గా బదిలీ కావడంతో జాయింట్ కమిషనర్‌గా ప్రభుత్వం శ్రీవత్సకు బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ కొత్తగా విధుల్లో చేరిన శ్రీవత్సను సాదరంగా ఆహ్వానించారు.

'గాంధీ' కోవిడ్ సేవల్ని గుర్తించిన ఐసీఎంఆర్

గాంధీ ఆస్పత్రి: కరోనా విజృంభణ వేళ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలు అందించిన వైద్య సేవలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) గుర్తించింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో గురువారం జరిగిన నేషనల్ క్లినికల్ రిజిస్ట్రీ ఫర్ కోవిడ్–19 రిపోర్ట్ రిలీజ్ అండ్ డిస్సెమినేషన్ సమ్మిట్‌లో గాంధీ మాజీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ త్రిలోక్‌చందర్‌లను సత్కరించి ప్రశంస పత్రాలు అందించారు.

కోవిడ్ విజృంభిస్తున్న తరుణంలో ప్రాణాలకు తెగించి వేలాది మందికి వైద్యసేవలు అందించడంతో పాటు కరోనా వైరస్‌కు సంబంధించిన పలు అంశాలపై రిసెర్చ్ చేసి నివేదికలను అందించారు. కరోనా నియంత్రణ, నివారణ, రూపాంతరం చెందుతున్న వైనం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రొఫెసర్ రాజారావు, త్రిలోక్‌చందర్ రీసెర్చ్ చేసి రూపొందించిన 15 ఆర్టికల్స్ ఐసీఎంఆర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. వీరి రీసెర్చ్ నివేదికలను ప్రపంచ దేశాలు ప్రామాణికంగా తీసుకుని వైద్యసేవలు అందించి లక్షలాది మంది ప్రాణాల కాపాడారు. ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌భల్, నీతి ఆయోగ్ ప్రతినిధి వినోద్ పాల్, నేషనల్ హెల్త్ మాజీ సెక్రటరీ రాజేష్ భూషణ్‌లు ప్రొఫెసర్ రాజారావు, త్రిలోక్‌చందర్‌లు అందించిన సేవలను అభినందించి ప్రశంస పత్రాలు అందించారు. అలాగే కోవిడ్ సమయంలో మెరుగైన వైద్యసేవలు అందించిన గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలకు సర్టిఫికెట్లు జారీ చేశారు. తమ సేవలను గుర్తించడం పట్ల ప్రొఫెసర్ రాజారావు, త్రిలోక్‌చందర్‌లు హర్షం వ్యక్తం చేశారు.



ఐసీఎంఆర్ డైరెక్టర్ నుంచి ప్రశంస పత్రాలు అందుకుంటున్న ప్రొఫెసర్ రాజారావు, త్రిలోక్ చందర్





హత్యాచార నేరగాళ్లను శిక్షించాల్సిందే..

కోల్‌కతాలో యువ వైద్యురాలిపై పాశవిక హత్యాచార ఘటనను నిరసిస్తూ గురువారం ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆస్పత్రుల వైద్యులు, జూడాలు, నర్సింగ్ విద్యార్థినులు నెక్లెస్ రోడ్డు నుంచి జలవిహార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వెంటనే కామన్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలన్నారు. నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నో 'స్మార్ట్'..

- కార్పొరేటర్ల అధ్యయన యాత్రలు.. 'ప్రైవేటు' మోడల్ మార్కెట్ ముద్దు
- మరికొన్ని ఇతర అంశాలకు పచ్చజెండా
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆమోదం

కేబీఆర్ పార్క్ వద్ద మల్టీలెవల్ స్మార్ట్ పార్కింగ్ వద్దు

సాక్షి, సిటీబ్యూరో: కేబీఆర్ పార్క్ వద్ద మల్టీ లెవల్ స్మార్ట్ కార్, మోటార్ సైకిల్ పార్కింగ్ పనులు ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించేందుకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ నో చెప్పింది. స్మార్ట్ పార్కింగ్ పైలట్ ప్రాజెక్ట్‌గా కేబీఆర్ పార్క్ ఎంట్రీ గేటు–1 వద్ద డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) పద్ధతిలో టెండర్లు ఆహ్వానించగా, ఎక్కువ ధరకు బిడ్ కోట్ చేసిన నవనిర్మాణ్ అసోసియేట్స్‌కు పనులు అప్పగించేందుకు అనుమతి కోసం అధికారులు స్టాండింగ్ కమిటీ ముందుంచారు. పదేళ్ల కాలపరిమితి.. అనంతరం ఐదేళ్ల పొడిగింపునకు అవకాశం ఉన్న ఈ పనుల్ని అప్పగించేందుకు నిరాకరించిన స్టాండింగ్ కమిటీ సభ్యులు.. సదరు స్థలాన్ని, అక్కడి పరిస్థితుల్ని తాము స్వయంగా పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామంటూ గురువారం జరిగిన సమావేశంలో నో చెప్పారు. మూడు విడతలుగా 150 మంది కార్పొరేటర్ల అధ్యయన యాత్రలకు, మరి కొన్ని అంశాలకు పచ్చజెండా ఊపారు.



స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందిన ముఖ్యాంశాలు..

- ఇందిరాపార్కు– వీఎస్‌టీ వరకు, రామ్‌నగర్– బాగ్‌లింగంపల్లి వరకు ఫ్లై ఓవర్ల పనులకు అంచనా వ్యయం రూ.426 కోట్ల నుంచి రూ.565 కోట్లకు పెంపునకు ఇప్పటికే ప్రభుత్వం అనుమతించడంతో కమిటీ ఆమోదం
- స్లమ్‌ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత, మహిళలకు నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పించేందుకు బొల్లారం మోడల్ మార్కెట్ భవనాన్ని ఏడాది కాలానికి డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్‌కు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకునేందుకు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు అనుమతి.
- 2024 మార్చి నుంచి మే వరకు జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆదాయ, వ్యయాలకు కమిటీ ఆమోదం.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) ఆన్‌లైన్ పోర్టల్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేసిన మెస్సర్స్ కోన ఇ–డేటా సొల్యూషన్స్ ఏజెన్సీకి రూ.12,38,534 చెల్లింపులకు ఆమోదం.
- సీఎస్సార్ కింద మియాపూర్ గుర్నాథ్ చెరువు పునరుద్ధరణ పనులు చేసేందుకు మల్లిగా వద్ సంస్థకు అర్నెల్ల కాలానికి దత్తత ఇచ్చే ఒప్పందానికి కమిషనర్‌కు అధికారం.
- సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీల మధ్య విడతకు 50 మంది వంతున కార్పొరేటర్లను మూడు విడతల్లో ఆయా నగరాలకు స్టడీ టూర్లకు తీసుకెళ్లేందుకు ట్రావెల్ ఏజెన్సీల నుంచి కొటేషన్ల స్వీకరణకు ఆమోదం.
- సమావేశానికి మేయర్ విజయలక్ష్మి అధ్యక్షత వహించగా.. కమిషనర్ ఆమ్రపాలి, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'హైడ్రా'పై ప్రభుత్వ నిర్ణయం మేరకు..

హైడ్రా ఏర్పాటు చట్ట విరుద్ధమని, ఏర్పాటు జీఓను వెనక్కు తీసుకోవాలంటూ ఎంఐఎం స్టాండింగ్ కమిటీ సభ్యులు సమావేశంలో మరోసారి మేయర్, కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఇదివరకు ఇచ్చిన లేఖను ప్రభుత్వానికి పంపించామని, ప్రభుత్వ నిర్ణయం మేరకు తాము వ్యవహరిస్తామని కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు.

వినూత్నం.. వియత్నాం కాఫీ..



నగరంలో వియత్నాం కాఫీ మరింత ఫేమస్ అయిపోతోంది. నగర యువత ఈ కాఫీని లొట్టలేసుకుంటూ తాగేస్తోంది. ఒకప్పుడు ఇరానీ చాయ్.. ఇప్పుడు ఇది పర్‌ఫెక్ట్ టేస్టీ చాయిస్ అని చెప్పొచ్చు.

- సిటీ ప్లస్‌లో

హీరో 'గ్లామర్'

వ్యక్తిగానో, వ్యవస్థగానో నమ్మకాన్ని పొందాలంటే సంవత్సరాల తరబడి నిరంతరం శ్రమిస్తూనే ఉండాలని, ఆ నమ్మకమే విజయానికి గీటురాయి అని గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తేజ్ అన్నారు.



స్నేహితుడే చంపేశాడు

ఇంజినీరింగ్ విద్యార్థి దారుణ హత్య

- ఛాతి, కడుపు భాగాల్లో కత్తిపోట్లు
- రక్తపు మడుగులో బాధితుడి విలవిల
- బైక్‌పై పరారైన నిందితులు
- బాలాపూర్ ఠాణా పరిధిలో ఘటన



బైక్‌పై పారిపోతున్న నిందితులు



ప్రశాంత్ (ఫైల్)

పహాడీషరీఫ్: తోటి స్నేహితుడే ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని దారుణంగా హత్య చేశాడు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన శాంతయ్య, అనిత దంపతులు నగరంలోని బాలాపూర్‌లో నివసిస్తున్నారు. వీరి కుమారుడు మొండ్రు ప్రశాంత్ (21) నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం కళాశాలలో పరీక్ష ముగిసిన అనంతరం సాయంత్రం 4:30 గంటలకు ప్రశాంత్ తన స్నేహితులైన (బీటెక్ క్లాస్‌మేట్స్ కాదు) ముగ్గురితో కలిసి బాలాపూర్ గణేశ్ చౌక్ సమీపంలోని '37 మండీ హౌజ్'కు చేరుకున్నారు. హోటల్ ఆవరణలో ఉన్న పాన్‌షాప్‌లో సిగరెట్లు కొనుగోలు చేశారు. ఈ సమయంలో మాటామంతీ కొనసాగిస్తున్న క్రమంలో వీరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహానికి లోనైన ఓ స్నేహితుడు అప్పటికే తనవెంట తెచ్చుకున్న కత్తితో ప్రశాంత్ కడుపు, ఛాతీ భాగాల్లో పొడిచాడు. తీవ్ర గాయాలతో బాధితుడు కుప్పకూలిపోగా.. మిగిలిన ముగ్గురూ ఒకే బైక్‌పై పరారయ్యారు. సమాచారం అందుకున్న బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి ఘటనా స్థలానికి చేరుకొని రక్తపు మడుగులో పడి ఉన్న ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ పి.లక్ష్మీకాంతరెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఐటీ, ఎస్ఓటీ పోలీసులతో నిందితుల కోసం గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు.

గంజాయి, సిగరెట్లకు బానిసలై..

ప్రశాంత్‌ను కత్తితో పొడిచిన యువకుడు సైతం బాలాపూర్‌లోనే నివాసం ఉంటున్నట్లు తెలిసింది. ఓ పార్టీ నాయకుడికి అనుచరుడిగా కొనసాగుతున్నట్లు సమాచారం. కాగా.. ఈ నలుగురు స్నేహితులు గంజాయి, సిగరెట్లకు బానిసలైనట్లు ప్రాథమిక సమాచారం. కొద్ది రోజులుగా మూతపడి మరమ్మతుల అనంతరం మూడు రోజుల క్రితమే తెరుచుకున్న ఇదే హోటల్ వద్ద తరచూ కలుసుకునేవారు. కాగా.. ఈ హత్యకు ప్రేమ వ్యవహారం ఏమైనా కారణమా? ఫేమస్ కావాలంటే మర్డర్ చేయాలంటూ నిందితుడు తరచూ స్థానికంగా పేర్కొనేవాడని, దీన్ని బట్టి.. ఫేమస్ కావాలనే హత్య చేశాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 8న రౌడీషీటర్ రియాజుద్దీన్ ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఉదంతం మరువక ముందే మరో హత్య చోటు చేసుకోవడంపై స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ పరిధిలో పోలీసులు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని కోరుతున్నారు.

బల్దియా ఆఫీసులోనే డ్రగ్‌మార్ట్!

మేయర్ పేరిట ట్రేడ్‌లైసెన్స్ జారీ?

సాక్షి, సిటీబ్యూరో: బల్దియా పరిధిలోని ఐటీ పని తీరు గుట్టును మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ (బీజేపీ) మరోసారి రట్టు చేశారు. గతంలో మల్కాజిగిరి జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని తన పేరిట, మేయర్ విజయలక్ష్మి పేరిట అసెస్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నా పీటీఐఎన్‌లు జనరేట్ కావడాన్ని ఆయన వెల్లడించిన విషయం తెలిసిందే. దాదాపు లక్ష ఇళ్ల ఆస్తిపన్ను అసెస్‌మెంట్లకు ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా తెల్ల కాగితాలను అప్‌లోడ్ చేసినా పీటీఐఎన్ జనరేట్ కావడాన్ని అప్పట్లో గుర్తించారు. ఆ తర్వాతైనా ఐటీని లోపాల్లేకుండా తీర్చిదిద్దలేకపోయారు. తాజాగా మళ్లీ మేయర్ విజయలక్ష్మి గద్వాల్ పేరిటే మల్కాజిగిరి కార్యాలయంలోనే 'డ్రగ్ మార్ట్ ఇన్ కాంగ్రెస్' పేరిట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. జనరేట్ అయిన రూ.350 ఫీజు చెల్లించగానే ప్రొవిజనల్ ట్రేడ్ లైసెన్స్ (టిన్ నంబర్‌తో) జనరేట్ కావడం ఐటీ పనితీరు ఎంత లోపభూయిష్టంగా ఉందో నిదర్శనమంటూ ఆయన పేర్కొన్నారు.

- అయితే.. ఈసారి తన ప్రయత్నం జీహెచ్ఎంసీని లోపాలు సరిదిద్దుకోమని చెప్పేందుకేనని, ఈ పని చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తనను జైలుకు పంపవద్దని అభ్యర్థిస్తూ 'డిస్‌క్లెయిమర్'గా పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులో దుకాణానికి లీజ్ అగ్రిమెంట్ లేనట్లు పేర్కొనడంతోపాటు ఐడీ ప్రూఫ్‌గా సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను జత చేసినా ట్రేడ్ లైసెన్స్ జారీ అయిందని కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. దరఖాస్తు ప్రక్రియను వీడియోగా కూడా విడుదల చేశారు. మిగతా వారి పేరిట దరఖాస్తు చేస్తే ఊరుకోరని, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తన అక్క అయినందున తనను కొట్టదనే నమ్మకంతోనే ఆమె పేరిట దరఖాస్తు చేశానని వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసీ ఈ తీరు వల్ల సంస్థ ఖజానాకు ఎంతో నష్టం వాటిల్లుతోందని శ్రవణ్ పేర్కొన్నారు.

బల్దియా బాగు కోసమే..

ప్రొవిజనల్ ట్రేడ్ లైసెన్స్ అనేది పర్మనెంట్ కాకపోయినా, తప్పుడు వివరాలని తేలితే ఆటోమేటిక్‌గా రద్దవుతుందని లైసెన్సులోనే ఉన్నా.. ప్రొవిజనల్‌ది జనరేట్ అయ్యాక క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, నమోదు చేసిన వివరాల్లో తేడాలుంటే తగిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ పని చేయడం లేదన్నారు. తద్వారా బడా ట్రేడర్ల నుంచి జీహెచ్ఎంసీకి ఆశించినంత ఫీజు రావడం లేదని కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. ట్రేడర్లు చేసుకున్న దరఖాస్తు కనుగుణంగా ఫీజు తప్ప అధికారులు తనిఖీలు చేసి తప్పులు చూసి, ఫీజులు పెంచింది లేదని ఆయన ఆరోపించారు. జీహెచ్ఎంసీలోని లోపాల్ని సరిదిద్దుకోవడానికే తానీ పని చేశానని పేర్కొన్నారు. మల్కాజిగిరి కార్యాలయంలో 10 గీ 10 గదికి ట్రేడ్ లైసెన్సు జారీ అయిందన్నారు. నడుస్తున్న డ్రగ్‌మార్ట్ వ్యాపారానికి ఈ సంవత్సరం ఫీజుగా రూ.300 ట్రేడ్‌లైసెన్సుకు, రూ. 50 గ్రీన్‌ఫండ్‌గా పేర్కొన్నారని వివరించారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం: జూపల్లి

గన్‌ఫౌండ్రీ: డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం–సమాజాన్ని మేల్కొలుపుదాం' పేరుతో చేపట్టిన కళాయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. సమాజానికి హానికరమైన మాదక ద్రవ్యాలను నిర్మూలించాలన్నారు. సమాజం మార్పులో, నవ సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం చాపకింద నీరులా వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 21 వరకు నగరంతో పాటు నగర శివారులలోని హైస్కూళ్లు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కళాశాలల్లో డ్రగ్స్‌తో కలిగే దుష్ప్రభావాలను తెలుపుతూ.. కళాప్రదర్శన ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి ఆహ్వాన సంఘం సలహాదారు డీజీ నర్సింహారావు, కార్యదర్శి మారన్న తదితరులు పాల్గొన్నారు.



కళాయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

జలమండలిలో కొత్తనీరు!

ఎండీ నుంచి జీఎంల దాకా కొత్తవాళ్లే



- ఇద్దరు డైరెక్టర్ల పదవీ విరమణ
- స్వచ్ఛందంగా వైదొలగిన మరొకరు
- సుదీర్ఘ కాలం తర్వాత ఈడీగా ఐఏఎస్ అధికారి
- ఇకనైనా పాలన గాడిలో పడేనా?

సాక్షి, సిటీబ్యూరో: సుదీర్ఘకాలం తర్వాత జలమండలి యంత్రాంగంలో కొత్త నీరు వచ్చి చేరింది. ప్రధాన కార్యాలయంలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన కీలక ఉన్నతాధికారుల పదవీ విరమణ, బదిలీలతో కొత్తవారికి అవకాశం లభించింది. మేనేజింగ్ డైరెక్టర్ నుంచి జనరల్ మేనేజర్ల వరకు కొత్తవారు బాధ్యతలు స్వీకరించారు. గత నెలలో ఐఏఎస్ అధికారి అశోక్ రెడ్డి బాధ్యతలు చేపట్టగా, రెండు రోజులు క్రితం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మరో ఐఏఎస్ అధికారి మయాంక్ మిట్టల్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే కీలక విభాగాల ఇద్దరు డైరెక్టర్లు పదవీ విరమణ చేయగా, మరో డైరెక్టర్ స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. సుంకిశాల ఘటనలో మరో ప్రాజెక్టు డైరెక్టర్లపై బదిలీ వేటు పడింది. వారి స్థానంలో కొత్తవారికి బాధ్యతలు అప్పగించారు. మరోవైపు సీజీఏ, జీఎం, డీజీఎం స్థాయి అధికారులకు సైతం స్థానచలనం కలగడంతో యంత్రాంగంలో కొత్తదనం వచ్చింది.

అంతా అస్తవ్యస్తమే..

మహా నగరంలో తాగునీరు సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధాన కార్యాలయం నుంచి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో క్షేత్ర స్థాయి పరిస్థితి అధ్వానంగా మారింది. తాగునీటి సరఫరాలో అడుగడుగునా లీకేజీలు, లోప్రెషర్, కలుషిత నీటి సరఫరా, లైన్‌మెన్‌ల చేతివాటం, నల్లా అక్రమ కనెక్షన్లు, ఎక్కడపడితే అక్కడ పొంగిపొర్లే మురుగు, పగిలిన మ్యాన్‌హోళ్ల వంటి ఘటనలు సర్వసాధారణంగా మారాయి. ఫిర్యాదు చేస్తే కానీ స్పందించని పరిస్థితి నెలకొంది. అడుగడుగు చేతివాటంతో బోర్డుకు ఆదాయం కూడా తగ్గుముఖం పట్టింది. తాగునీటి సరఫరా, సీవరేజ్ చార్జీల బకాయిలు కూడా పెద్దఎత్తున పేరుకుపోయాయి.

అంతా ఇష్టానుసారమే..

జలమండలిలో ఉన్నత స్థాయి అధికారుల నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు పనితీరు ఇష్టానుసారంగా మారింది. ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్, డివిజన్, సబ్‌డివిజన్, సెక్షన్‌లలో సైతం కనీస సమయపాలన లేకుండా పోయింది. అంతా ఫీల్డ్ విజిట్ అంటూ మధ్యాహ్నం వరకు ఆఫీస్‌లలో అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. తాజాగా సాధారణ బదిలీలు జరగడంతో సర్కిల్, డివిజన్, సబ్‌డివిజన్లలో సైతం కొత్త ముఖాలు వచ్చి చేరాయి. ఇప్పటికైనా బోర్డు పాలన యంత్రాంగంతోపాటు సిబ్బంది పనితీరులో మార్పు వచ్చేనా అనే చర్చ సాగుతోంది.

పెంచిన పాపానికి...

- తల్లిని హత్య చేసిన పెంపుడు కొడుకు
- మద్యం మత్తులో దారుణం


జయమ్మ (ఫైల్)


నిందితుడు వేణు

జీడిమెట్ల: పసిగుడ్డును తీసుకువచ్చి పెంచి పెద్ద చేసిన పాపానికి తల్లినే ఓ పెంపుడు కొడుకు అతి దారుణంగా హత్య చేసిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మల్లేష్, ఎస్సై నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ గ్రామం, హరిజన బస్తీకి చెందిన పెద్ది స్వామి, జయమ్మ(64) దంపతులకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు లేకపోవడంతో 34 ఏళ్ల క్రితం మూడు నెలల పసికందు తీసుకువచ్చి వేణు అనే పేరు పెట్టి పెంచుకున్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకే వారికి కుమారుడు జన్మించాడు. అయినా వేణుపై ఎలాంటి వివక్ష లేకుండా సొంత కుమారుడిగానే చూస్తూ పెళ్లి చేశారు. అయితే మద్యానికి బానిసైన వేణు రోజూ తాగి వచ్చి గొడవ పడేవాడు. దీంతో అతడి భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా బుధవారం వేణు, అతని భార్యల మధ్య గొడవను పరిష్కరించేందుకు పెద్దల సమక్షంలో పంచాయతీ ఉండగా వేణు ఉదయం నుంచి కనిపించక పోవడంతో పంచాయతీ జరగలేదు. సాయంత్రం అతను మద్యం మత్తులో ఇంటికి రావడంతో తల్లి జయమ్మ అతడిని తిట్టింది. దీంతో ఆగ్రహానికి లోనైన పదునైన ఇనుప రాడ్డుతో తల్లి తలపై పొడవడంతో తీవ్రంగా గాయపడిన జయమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. జీడిమెట్ల పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు వేణును అదుపులోకి తీసుకున్నారు.

విదేశీ యువతులతో వ్యభిచారం

సెక్స్ రాకెట్ గుట్టురట్టు

- 17 మంది విదేశీ యువతులు హోమ్‌కు తరలింపు
- ఆర్గనైజర్‌తో పాటు ఇద్దరు విటుల అరెస్ట్

గచ్చిబౌలి: విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న సెక్స్ రాకెట్‌ను ఏహెచ్‌టీయూ, గచ్చిబౌలి పోలీసులు గుట్టురట్టు చేశారు. ఆర్గనైజర్ సహా ఇద్దరు విటులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధిత యువతులను కోర్టు ఆదేశాలతో సేఫ్ హోంకు తరలించారు. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కైత్లాపూర్‌కు చెందిన శివకుమార్ కొండాపూర్‌లోని ప్రొఫెసర్స్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌ను అద్దెకు తీసుకుని సర్వీస్ అపార్ట్‌మెంట్‌గా మార్చాడు. విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఏహెచ్‌టీయూ, గచ్చిబౌలి పోలీసులు బుధవారం రాత్రి సర్వీస్ అపార్ట్‌మెంట్‌పై దాడి చేశారు. కెన్యాకు చెందిన 14 మంది, ఉగాండాకు ఇద్దరు, టాంజానియాకు చెందిన ఒక యువతిని అదుపులోకి తీసుకున్నారు.


నిందితుడు శివ కుమార్

ఆర్గనైజర్ శికుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు విటులు నాగ రాకేష్, అహ్మద్‌లకు నోటీసులు జారీ చేశారు. ఘటనా స్థలంలో రూ.20 వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. బాధిత యువతులను కోర్టు ఆదేశాలతో సేఫ్ హోంకు తరలించారు.

నెల రోజులుగా దందా

విజిటింగ్ వీసాపై కెన్యా, ఉగాండా, టాంజానియా నుంచి వచ్చిన యువతులకు విలాసవంతమైన సౌకర్యాలు కల్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. లొకాంటో వెబ్‌సైట్‌లో యువతుల ఫొటోలు పెట్టి విటులను ఆకర్శిస్తున్నారు. ఒక్కో విటుని నుంచి రూ.10 నుంచి 15 వేలు వసూలు చేస్తున్నారు. బాధిత యువతుల్లో ఇద్దరు గతంలోనూ బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో పీటా కేసుల్లో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. వీరు ఢిల్లీ, ముంబై, బెంగళూర్ నగరాల్లోనూ సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విప్లవం కోసం అడవిబాట పట్టి.. విగతజీవిగా ఇంటికి..

- అన్యాయంగా చంపేశారంటున్న కుటుంబ సభ్యులు
- అంతర్గత విషయాలు బయటకొస్తాయనే హత్య చేశారని ఆరోపణ
- న్యూఇందిరానగర్‌లో విషాద ఛాయలు
- సాయిబాబానగర్ స్మశానవాటికలో ముగిసిన అంత్యక్రియలు


రాధ అలియాస్ నీల్సో పార్థివదేహం

కాప్రా: విప్లవం కోసం ఉద్యమంలోకి వెళ్లిన మహిళా మావోయిస్టు పల్లెపాటి రాధ అలియాస్ బంటి రాధ అలియాస్ నీల్సో జీవితం విషాదాంతంగా ముగిసింది. కాప్రా సర్కిల్, న్యూ ఇందిరానగర్‌కు చెందిన రాధ డిప్లొమో ఇన్ ల్యాబొరేటరీ టెక్నాలజీ పూర్తి చేసింది. అనంతరం విప్లవంపై ఆకర్షితురాలై అడవిబాట పట్టిన రాధ తిరిగి విగతజీవిగా ఇంటికి చేరింది. ఇన్‌ఫార్మర్ నెపంతో సహచర మావోయిస్టులే ఆమెను హత్య చేశారు. ఓ మహిళా మావోయిస్టును తోటి మావోయిస్టులే హతమార్చడం గమనార్హం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, చెన్నాపురం అటవీప్రాంతంలో వెలుగు చూసిన ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. రాధ మరణవార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గురువారం ఉదయం రాధ భౌతికకాయాన్ని ఇందిరానగర్‌లోని ఇంటికి తీసుకొచ్చారు. ఆరేళ్ల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిన కుమార్తె విగత జీవిగా తిరిగి ఇంటికి చేరడంతో తల్లిదండ్రుల రోధనలతో స్థానికంగా విషాదచాయలు అలుముకున్నాయి. సాయిబాబానగర్‌లోని శ్మశానవాటికలో రాధ అలియాస్ నీల్సో దహన సంస్కరాలు పూర్తి చేశారు.

అన్యాయంగా చంపేశారు

మావోయిస్టుల అంతర్గత విషయాలు బయటకొస్తాయనే రాధను అన్యాయంగా చంపేశారని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. విప్లవ బాటపట్టిన మావోయిస్టుల్లోనూ అగ్రవర్ణాలు, అణగారిన వర్గాలు అనే తారతమ్యం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళిత కుటుంబానికి చెందని ఆడబిడ్డనే రాధను సహచర మావోయిస్టులు చంపేశారని ఆరోపిస్తున్నారు. మావోయిస్టుల్లో కొందరు చేసిన తప్పులను రాధ ప్రశ్నించిందని, వారి గుట్టు బయటపడుతుందనే భయంతోనే చంపేశారని చెబుతున్నారు. రాధ ఇన్‌ఫార్మర్‌గా మారిందనడానికి ఆధారాలు ఏమున్నాయని ప్రశ్నిస్తున్నారు. ఆరేళ్లుగా లేని అనుమానం ఇప్పుడే ఎందుకు వచ్చింది, మూడు నెలల క్రితం కమాండర్ బాధ్యతల నుంచి తప్పిస్తే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎందుకు ఆగారు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు జరిగిన అన్యాయంపై స్పందించాలని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రాధ కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దళిత మహిళ అనే వివక్ష



ఒక దళిత కుటుంబానికి చెందిన ఆడబిడ్డనే మా చెల్లెను అన్యాయంగా చంపేశారు. ఇన్‌ఫార్మర్ నేపంతో సహచర మావోయిస్టులే చంపి రోడ్డుపై పడేశారు. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్తే మృతదేహం కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అక్కడ ఏరియా ఆస్పత్రికి మేం వెళ్లేసరికే రాధ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. అసలు తల్లిదండ్రులు లేకుండా వారికి సమాచారం అందించకుండా, తల్లిదండ్రుల అనుమతి లేకుండా రాధ మృతదేహానికి పోస్టుమార్టం ఎలా చేస్తారు.

-లింగం, రాధ అన్నయ్య.

నా బిడ్డను చూస్తా అనుకున్నా



మూడు రోజుల్లో నా బిడ్డ ఇంటికొస్తుందని తెలిసింది. చాలా ఏళ్ల తర్వాత నా బిడ్డను చూస్తా అనుకున్నా. అంతలోనే రెండు రోజుల తర్వాత చనిపోయిందని చెప్పారు. బిడ్డ ఇక లేదని తెలియడంతో చివరి చూపు కోసం బుధవారం మధ్యాహ్నం అక్కడికి బయలుదేరాం. మేం వెళ్లేసరికే పోస్టుమార్టం పూర్తి చేశామని చెప్పి, మృతదేహాన్ని అప్పగించేశారు. ఇన్‌ఫార్మర్ పేరుతో నా బిడ్డను అన్యాయంగా చంపేశారు. నా కొడుకుపై కూడా ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

-పోచమ్మ(బాలమ్మ), రాధ తల్లి


విలపిస్తున్న రాధ తండ్రి బాలయ్య

ఇన్‌ఫార్మర్ అనడం అబద్ధం



మా అక్క రాధను ఇన్‌ఫార్మర్ అని చెప్పడం పచ్చి అబద్ధం. ఆరేళ్ల క్రితం మావోయిస్టుల పార్టీలో చేరిన అక్క ఫ్యామిలీ గుర్తుకు వచ్చినప్పుడు కేవలం మెసేజ్ మాత్రం చేసేది. అది కూడా ఆమె వెళ్లిన తర్వాత రెండేళ్ల క్రితం ఒక్క మెసేజ్ చేసింది. ఎలా ఉన్నారు, అమ్మ, నాన్న ఎలా ఉన్నారు అని ఆరా తీసింది. మేం బాగానే ఉన్నాం, నువ్వు ఇంటికి రావొచ్చు కదా అంటే నన్ను మర్చిపోండి, నేను మావోయిస్టుల్లోనే ఉంటానని చెప్పింది. అలాంటి మా అక్క ఇన్‌ఫార్మర్ అని ముద్ర వేసి అన్యాయంగా చంపేశారు. ఆ తర్వాత ఈ నెల 18న నాకు మెసేజ్ వచ్చింది. కానీ ఆ మెసేజ్ చేసింది మా అక్క కాదని గుర్తించా. అక్కకు ఏం జరిగిందోననే భయంతో మాకు తెలిసిన వ్యక్తి ద్వారా ఆరా తీశా. ఆ తర్వాతి రోజునే చనిపోయిందని తెలిసింది. ఈ నెల 21న చనిపోయిందని ఫొటో వాట్సాప్ చేశారు. కానీ ఆ ఫొటోలో 19వ తేదీ కనిపించింది. అంటే మా అక్క చనిపోయిన తర్వాత రెండు రోజులకు మాకు సమాచారం అందింది. నాకు డబ్బులు పంపేదని ఆరోపిస్తున్నారు. అలా అయితే నేను క్యాబ్ డ్రైవర్‌గా ఎందుకు పని చేస్తాను.

-సూర్యప్రకాష్, రాధ తమ్ముడు

రాజాబహద్దూర్ జీవితం నవతరానికి ఆదర్శం

నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి


రాజా బహదూర్ వెంకటరామారెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

కాచిగూడ: ఈ తరం పోలీసులకే కాకుండా.. రోబోయే తరాలకూ కొత్వాల్ రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి జీవితం ఆదర్శనీయమని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో నగర తొలి కొత్వాల్ రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి 155వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ వెంకటరామారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం కాలంలో 14వ కొత్వాల్‌గా పనిచేసిన రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి విశేష సేవలు అందించారన్నారు. తన 14 ఏళ్ల సేవలో పౌర, పోలీసింగ్ విభాగాలను నిర్వహిస్తూ అనేక సాంఘిక దురాచారాలను నిర్మూలనకు నిర్విరామంగా కృషి చేశారన్నారు. బాలికల సంక్షేమం కోసం విద్యాసంస్థలను స్థాపించినట్లు తెలిపారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చేస్తున్న సేవలను కొనియాడారు. ఇటీవలి కాలంలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు మీర్‌పేట పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజశేఖర్‌రెడ్డిలకు ఆర్‌బివిఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ తరఫున బంగారు పతకాలు, రూ. 5వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బి.బాలస్వామి, సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షుడు రంగారెడ్డి, కార్యదర్శి తీగల మోహన్ రెడ్డి, సుకన్యరెడ్డి, వాసుదేవా రెడ్డి, జి.కృష్ణారెడ్డి, వెంకట్ రాంరెడ్డి, సొసైటీ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

7 రోజులు.. 91 శిబిరాలు!

నగర వ్యాప్తంగా షీ-టీమ్స్ నిర్వహణ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేస్తున్న షీ-టీమ్స్ దీనిపై పెద్ద ఎత్తున అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో ఏకంగా 91 శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీసీపీ దార కవిత గురువారం తెలిపారు. వివిధ స్కూళ్లు, కాలేజీలతో పాటు ఇతర ప్రాంతాల్లో వీటిని నిర్వహించారు. ఆయా శిబిరాల్లో చట్ట పరంగా ఉన్న హక్కులు, షీ-టీమ్స్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసే విధానం, స్వీయ రక్షణ మెళకువలు తదితరాలను బోధించారు. ఓ స్కూల్‌లో శిబిరం నిర్వహిస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుదీర్ఘకాలంగా వేధింపులకు గురవుతున్న బాలిక షీ-టీమ్స్ కార్యక్రమంతో స్ఫూర్తి పొంది, ముందుకు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈమె నిత్యం పాఠశాలకు వెళ్లి వస్తున్న సమయాల్లో ఓ వ్యక్తి వేధింపులకు గురి చేసేవాడు. అతడికి భయపడిన ఆమె ఇన్నాళ్లు మిన్నకుండిపోయింది. అయితే షీ-టీమ్స్ అవగాహన శిబిరంతో స్ఫూర్తి పొంది అధికారుల దృష్టికి విషయం తీసుకువచ్చింది. తక్షణం స్పందించిన షీ-టీమ్స్ బృందాలు అతడు మాట వేసే ప్రాంతానికి వెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. సోషల్‌మీడియా పట్ల అప్రమత్తంగా ఉండటం, వ్యక్తిగత వివరాల గోప్యత పాటించడం తదితర అంశాల పైనా షీ-టీమ్స్ అవగాహన కల్పిస్తున్నాయి. నగరంలోని మహిళలు, చిన్నారులకు ఎలాంటి సహాయసహకారాలు కావాల్సి వచ్చినా 100కు ఫోన్ లేదా 9490616555కు వాట్సాప్ చేయాలని డీసీపీ కవిత కోరారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురికి జైలు శిక్ష

గౌలిపురా: అనుమానాస్పదంగా తిరుగుతూ గంజాయి తాగుతున్న ముగ్గురిని పోలీసులు గురువారం నాంపల్లిలోని స్పెషల్ జ్యూడీషియల్ కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ డి.సి.ఉమాపతిరావు 14 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం... తలాబ్‌కట్టా నషేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన డ్రైవర్ మహ్మద్ మజ్హరుద్దీన్(25), తలాబ్‌కట్ట రైల్వే బ్రిడ్జి ప్రాంతానికి చెందిన డ్రైవర్ షేక్ గఫార్(23), తలాబ్‌కట్ట సమద్ హోటల్ ప్రాంతానికి చెందిన సమీ అలీ(30) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీంతో పెట్రోలింగ్ పోలీసులు ముగ్గురిని తనిఖీలు చేయగా వారి వద్ద గంజాయి లభించింది. దీంతో మజ్హరుద్దీన్, గఫార్, సమీ అలీలను అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరు పరిచారు.

నేను చనిపోతున్నానంటూ..

స్నేహితులకు ఫోన్ చేసి యువకుడి ఆత్మహత్య


జగదీష్‌రెడ్డి (ఫైల్)

జీడిమెట్ల: వ్యక్తిగత కారణాలతో నేను చనిపోతున్నానంటూ ఓ యువకుడు స్నేహితులు, సోదరుడికి ఫోన్ చేసి చెప్పి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా, శివ్వంపేట్ మండలం, ఏదులాపూర్ గ్రామానికి చెందిన కొమురవెళ్లి చంద్రారెడ్డి కుటుంబంతో సహా నగరానికి వలసవచ్చి షాపూర్‌నగర్‌లో ఉంటున్నాడు. చంద్రారెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి(24) గత కొన్ని నెలలుగా ఓ సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటి నుండి బయటకు వెళ్లిన అతను రాత్రి తన సోదరుడు సందీప్‌రెడ్డికి ఫోన్ చేసి తనకు వ్యక్తిగత సమస్యలు ఉన్నాయని తాను చనిపోతానని చెప్పాడు. దీంతో సందీప్ సోదరుడిని ఇంటికి రావాలని కోరగా వెంటనే ఇంటికి వెళ్లిన జగదీష్ బైక్ తీసుకుని రాత్రి 11.30గంటలకు బయటికి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే అతను తన స్నేహితుడికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో అతను జగదీష్ సోదరుడు సందీప్‌కు సమాచారం అందించడంతో వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులతో కలిసి హెచ్‌ఎంటీ పరిధిలో గాలించినా జగదీష్ ఆచూకీ కనిపించలేదు. గురువారం ఉదయం ఓ వ్యక్తి హెచ్‌ఎంటీలోని సబ్‌స్టేషన్ వెనక చెట్టుకు ఓ యువకుడు ఉరి వేసుకుని ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడిని జగదీష్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి చంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైక్స్ కోసం రోడ్లపై నగదు ఎగురవేత

నిందితుడిపై కేసు నమోదు

మూసాపేట: లైక్స్ కోసం రోడ్ల పై డబ్బులు ఎగురవేసి వీడియో తీసిన యువకుడిపై కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బొరబండ పర్వత్ నగర్‌కు చెందిన వంశీ (24) రెండు నెలల క్రితం కూకట్‌పల్లి, కేపీహెచ్‌పీ కాలనీలోని రోడ్ల పై డబ్బులు ఎగురవేసి వీడియోలు తీసి 'ఇట్స్ మీ పవర్' పేరుతో యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నాడు. ఈ వీడియో నెట్టింట హల్ చల్ చేయడం, బెట్టింగ్ మనీ యాప్ ప్రచారం కోసం ఇలా చేస్తున్నానని పోస్ట్‌లో పేర్కొన్నాడు. రద్దీ రోడ్లపై జనాలు ఒక్కసారిగా డబ్బుల కోసం రోడ్డు పైకి వస్తే వెనక నుంచి వచ్చే వాహనాలు ఢీ కొట్టి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని భావించిన పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. యువత ఇలాంటి వికృత చేష్టలతో జనాలకు ఇబ్బందులు కలుగజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆ ప్రకటన వాస్తవం కాదు

'మహిళలు-పోలీసు హెల్ప్‌లైన్'పై స్పష్టత



సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియాలో రెండు రోజులుగా చెక్కర్లు కొడుతున్న 'మహిళలు–పోలీసు హెల్ప్‌లైన్' ప్రకటన వాస్తవం కాదని పోలీసు విభాగం గురువారం ప్రకటించింది. 'రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య ఒంటరిగా ఉన్న మహిళ ఇంటికి వెళ్లేందుకు వాహనం దొరకని పక్షంలో పోలీసు హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించి వాహనం కోసం అభ్యర్థించవచ్చు' అన్నది దాని సారాంశం. అయితే ఆ ప్రకటన వాస్తవం కాదని, అందులో ఉన్న సెల్ నెంబర్ సైతం పంజాబ్‌లోని లుథియానాకు చెందినదని అధికారులు పేర్కొన్నారు. ఆ ప్రకటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని, రాష్ట్రంలో మహిళలకు ఎలాంటి ఆపద వచ్చినా, ఏ అవసరం ఉన్నా, పోలీసుల నుంచి సహాయం పొందాలన్నా '100'కు ఫోన్ చేయాలని కోరారు. ఈ మేరకు వివిధ కమిషనరేట్లు, జిల్లాల పోలీసులు తమ వాట్సాప్ స్టేటస్‌లను అప్‌లోడ్ చేశారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణకు యత్నం.. వ్యక్తిపై కేసు నమోదు

ఫిలింనగర్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, అందులో హెచ్చరిక బోర్డును తొలగించి నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... షేక్‌పేట వినోభానగర్‌లో 200 గజాల ప్రభుత్వ స్థలంలో జీపీఎల్ రాజేశ్వర్ ప్రభుత్వ బోర్డును తొలగించి ఆక్రమణకు యత్నిస్తున్నారని, ఇది రెవెన్యూ ల్యాండ్‌బ్యాంక్‌లో ఉందని, అక్రమంగా ప్రభుత్వ స్థలంలోకి ప్రవేశించిన ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి ఇటీవల ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 327లో ఉన్న ఈ ప్లాట్‌ను జీఓ 59 కింద క్రమబద్ధీకరించాలంటూ పుష్ప అనే పేరుతో దరఖాస్తు రాగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ దరఖాస్తు అనర్హమైనదిగా తిరస్కరించడమే కాకుండా ఆమె చెల్లించిన లక్ష రూపాయల ఫీజు కూడా తిరిగి ఇవ్వడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ఈ ప్లాట్ ప్రభుత్వ ఆధీనంలో ఉందన్నారు. ఇటీవలే రాజేశ్వర్ ప్లాట్‌లోకి ప్రవేశించి అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించగా తాము తొలగించామన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు మూడురోజుల జైలు

విజయనగర్‌కాలనీ: మద్యం సేవించి న్యూసెన్స్‌కు పాల్పడిన ఇద్దరు యువకులకు మూడు రోజుల జైలుశిక్ష పడిన సంఘటన గురువారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎస్.శ్రీకాంత్ (25), గుడిమల్కాపూర్‌కు చెందిన పి.హరిశ్చంద్రప్రసాద్ (24) పూటుగా మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై అటుగా వచ్చారు. తనిఖీలకు వీరు సహకరించకపోవడంతోపాటు న్యూసెన్స్ సృష్టించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా 4వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మూడురోజుల జైలు శిక్ష విధించారు.

'స్వదేశ్' హస్తకళా ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్: భారతీయ హస్త కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు స్వదేశ్ సంస్థ అంతర్జాతీయ వస్త్ర తయారీదారులు ఫాల్గుణి షేన్ పీకాక్‌తో కలిసి గురువారం ప్రత్యేక ప్రదర్శనను ప్రారంభించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–36లోని స్వదేశ్ ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో జరిగిన ఈ ప్రదర్శనలో అత్యాధునిక ఫ్యాషన్ డిజైన్‌తో కూడిన కాంజీవరం సిల్క్స్, చికంకారీ ఎంబ్రాయిడరీ, బనారసి బ్రోకేడ్స్ వంటి ఐకానిక్ భారతీయ హస్త కళా ఉత్పత్తులు కొలువుదీరాయని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఫాల్గుణి షేన్ పీకాక్ సహ వ్యవస్థాపకుడు షేన్ పీకాక్ మాట్లాడుతూ ఫ్యాషన్‌లో కొత్త కోణాలను అన్వేషించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. స్వదేశ్‌తో కలిసి భారతీయ హస్తకళా ఉత్పత్తులను ప్రోత్సహించడంలో ముందుంటామన్నారు.

ముమ్మరంగా సుందరీకరణ పనులు



ఫుట్‌పాత్ సుందరీకరణ పనులు చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: ప్రధాన జంక్షన్లు, సెంట్రల్ మీడియన్లు సుందరీకరణ పనులను అధికారులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గత నాలుగైదు నెలలుగా ఈ సుందరీకరణ పనులు నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో పరిధిలోని సోమాజిగూడ రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో ఇప్పటికే పనులు పూర్తి చేశారు. పంజగుట్ట ఫ్లై ఓవర్ కింద ఉన్న స్థలంతో పాటు నాగార్జున సర్కిల్‌లోని ఫ్రీ లెఫ్టులు, ఫుట్‌పాత్‌లను రంగురంగుల టైల్స్‌తో తీర్చిదిద్దుతున్నారు. రోడ్లకు రెండువైపులా మొక్కలను నాటుతున్నారు. కేబీఆర్ పార్కు జంక్షన్‌లో ఇప్పటికే శబ్దాలయ స్టూడియో మలుపు వద్ద ఆకర్షణీయంగా ఉన్న బొమ్మలను అధికారులు ఏర్పాటు చేశారు. కేబీఆర్ పార్కు చుట్టూ కూడా అవకాశం ఉన్న ప్రతీచోట విభిన్న రకాల వస్తువులను ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు.

ఆత్మవిశ్వాసంతో సమస్యలను ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న కె. విజయ్ అయ్యంగార్

ఫిలింనగర్: బాలికలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని, ఎప్పుడూ అధైర్యపడవద్దని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు కె. విజయ్ అయ్యంగార్ సూచించారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్ నిర్వహించిన 'ఎంపవర్ నిర్మాణ్' కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం విద్యార్థినులకు ఈ మూడు ఎంతో ముఖ్యమైనవన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ధైర్యంగా నిలబడితే ఆ సమస్యలు వాటంతట అవే దూరమవుతాయన్నారు. వ్యక్తిత్వ వికాసంతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ ధైర్యంగా పోరాడి ఎదురొడ్డి నిలబడతామని వెల్లడించారు.

రెండు నెలల జీతాలను తక్షణమే చెల్లించాలి

వెంగళరావునగర్: ఆయాలకు వచ్చేది అరకొర జీతా లు అవి కూడా ప్రతి నెల ఆలస్యంగా ఇస్తే ఎలా బతకాలని సీపీఎం జూబ్లీహిల్స్ నాయకులు, శిశువిహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు రాపర్తి అశోక్ ప్రశ్నించారు. శిశువిహార్‌లో విధులు నిర్వహించే ఆయాలకు జీతాలు చెల్లించాలని కోరుతూ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడతూ రెండు నెలల నుంచి ఆయాలకు జీతాలు రావడం లేదని, దాంతో వారి పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. అరకొర జీతాలతో ఇంటి అద్దెలు కూడా చెల్లించలేకపోతున్నారని అన్నారు. తక్షణమే విడుదల చేయడమే కాకుండా సెప్టెంబరు నెల నుంచి ప్రతినెల 1, 2 తేదీల్లో జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా శిశుసంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి. సుశీల, తార, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఎండోస్కోపిక్ 'స్పైన్' సర్జరీతో సులువుగా పరిష్కారాలు

లక్డీకాపూల్: కష్టతరమైన వెన్నెముక సమస్యలకు అత్యాధునిక ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీతో సులువుగా పరిష్కారాలు చూపించొచ్చని స్టార్ హాస్పిటల్స్‌లో ప్రముఖ వెన్నెముక శస్త్ర చికిత్స వైద్యుడు విశ్వక్‌సేన రెడ్డి అన్నారు. బంజారాహిల్స్ స్టార్ హాస్పిటల్‌లో గురువారం ఎండోస్కోపిక్ స్పైన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామందికి శస్త్ర చికిత్స తర్వాత వెంటనే నడవగలరని నమ్మకం ఉండదని, ఎండోస్కోపిక్ విధానంలో చికిత్సలు చేయించుకుంటే అది సాధ్యమవుతుందన్నారు. స్టార్ హాస్పిటల్స్ అధునాతన ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీని అందుబాటులోకి తీసుకురావడం వల్ల మినిమల్లీ ఇన్వాసివ్ ప్రక్రియ ద్వారా ఇది శరీరానికి తక్కువ గాయంతో పాటు వేగంగా ఉపశమనాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అనంతపురానికి చెందిన 83 ఏళ్ల వృద్ధుడు వేమారెడ్డి మాట్లాడుతూ బతికున్నంత కాలంలో వెన్నునొప్పితో బాధపడాల్సి వస్తుందని భయపడ్డానని.. స్టార్ హాస్పిటల్ వైద్యులను సంప్రదించిన తర్వాత ఆశ కలిగిందన్నారు. ఆపరేషన్ జరిగిన తర్వాత నా నొప్పి నెమ్మదిగా తగ్గిపోవడంతో ఆశ్చర్యపోయానన్నారు. ఈ సమావేశంలో భాస్కర రెడ్డి, షణ్ముక రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడికి విదేశీ సాయం



- స్థానిక కృతి ఫౌండేషన్‌తో కలిసి సేవా కార్యక్రమాలు
- టీచర్లతో పాటు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు
- పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్
- వివిధ అంశాల్లో క్రీడా పోటీలు.. బహుమతుల అందజేతలు
- పెరుగుతున్న ఆత్మ విశ్వాసం

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి మెరుగైన బోధన అందించి చదువుల్లో వారిని ప్రోత్సహించేందుకు విదేశీయులు 'మేము సైతం' అంటూ ముందుకువస్తున్నారు. నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థల సహకారంతో కొందరు విదేశీయులు ఒక ఫౌండేషన్‌కు అండగా నిలిచి సర్కార్ బడిలో టీచర్ల నియామకంతో పాటు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలకు అందుతున్న 'విదేశీ సేవ' విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. 2018 నుంచి ఓ విదేశీ సంస్థ స్థానిక కృతి ఫౌండేషన్‌తో కలిసి ఈ పాఠశాలలో టీచర్లను ఏర్పాటు చేస్తుంది. కంప్యూటర్, పీఈటీ, తెలుగు టీచర్లను ఈ సంవత్సరం నియమించింది. ఇక్కడ కంప్యూటర్ ల్యాబ్ కూడా ఏర్పాటు చేసి బెంచీలను అందుబాటులో ఉంచింది. ప్రతియేటా సమ్మర్ క్యాంపులను కూడా నిర్వహిస్తుంది. ఇక్కడ చదువుతున్న 575 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లను ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కూడా నిర్వహిస్తున్నారు. దీనికి తోడు మ్యాజిక్ బాక్స్, డిజిటల్ ఎడ్యుకేషన్ టీచర్, లైఫ్ స్కిల్ టీచర్లను కూడా అందుబాటులో ఉంచారు. ప్రతియేటా వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు కూడా అందజేస్తున్నారు. హెచ్‌సీఎల్ స్వచ్ఛంద సంస్థకు చెందిన మ్యారీ, నిర్మాణ్ తదితరులు శుభ్రత విషయంలో విద్యార్థులకు క్లాస్‌లు కూడా తీసుకుంటున్నారు. అంతటితో ఊరుకోకుండా సొంత డబ్బులతో పది బాత్‌రూమ్‌లను కూడా నిర్మించారు. విదేశీ అండతో ఇక్కడి విద్యార్థులు చదువుల్లోనూ చక్కగా రాణిస్తున్నారు. మొన్నటి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం బాగా మెరుగుపడింది. చాలామంది విద్యార్థులు 9కి పైగా జీపీఏ సాధించారు.



బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు చెబుతున్న టీచర్

ప్రతియేటా టీచర్లను ఇస్తున్నారు



మా పాఠశాలకు టీచర్ల కొరత లేకుండా కృతి ఫౌండేషన్ 2018 నుంచి అండగా నిలుస్తున్నది. ముఖ్యంగా కంప్యూటర్ టీచర్‌ను ఇవ్వడం వల్ల విద్యార్థులు సాంకేతికతలో మంచి ప్రావీణ్యం సాధిస్తున్నారు. ఈ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తున్నారు.

రవీందర్‌రెడ్డి, హెచ్ఎం, ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల

ఎంతో ఆసక్తిగా నేర్చుకుంటున్నారు



నేను కృతి ఫౌండేషన్ ద్వారా ఇక్కడ నియమించబడ్డాను. ఇక్కడి విద్యార్థులకు కంప్యూటర్ నేర్చుకోవడంపై ఎంతో ఆసక్తి ఉంది. ఉత్సాహంగా ఈ క్లాస్‌లకు హాజరవుతుంటారు. కంప్యూటర్ ల్యాబ్‌లో అన్ని సౌకర్యాలు సమకూర్చారు. దీని వల్ల విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయి.

శ్యామల, కంప్యూటర్ టీచర్

శుభ్రత విషయంలో పాఠాలు



శుభ్రంగా ఉండడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉంటాయో మాకు ప్రత్యేక పాఠాల ద్వారా తెలియజేస్తున్నారు. చేతులు ఎలా కడుక్కోవాలి.. దాని ద్వారా ఉపయోగాలు ఏమిటి..అని సూచిస్తున్నారు. అంతేకాదు వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించడం వల్ల మేము ఎంతగానో ప్రయోజనం పొందుతున్నాం. సంస్థ మా కోసం చేస్తున్న కృషి కొనియాడదగింది.

ఆదిలక్ష్మి, పదో తరగతి విద్యార్థిని

ఇక్కడ పాఠాలు చెప్పడం ఎంతో ఆనందంగా ఉంది



నేను కృతి ఫౌండేషన్ ద్వారానే ఇక్కడ నియమించబడ్డాను. ఇక్కడ విద్యార్థులు చదువుల్లో ఎప్పుడూ ముందుంటారు. ప్రతిరోజూ తరగతులకు హాజరవుతారు. వీరిలో చదువుకోవాలనే ఉత్సాహం ఎంతో ఉంది. ఇక్కడ పాఠాలు చెప్పడానికి నేను గర్వపడుతున్నాను. పదో తరగతిలో కూడా బాగా ఉత్తీర్ణులయ్యారు.

సువర్ణ, తెలుగు టీచర్

కమిషనర్‌కు వినతి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని మోర్ మెడికల్స్ వెనుక జీహెచ్ఎంసీ పార్కు స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని, ఇక్కడ మొక్కలు నాటి ఉద్యానవనంగా తీర్చిదిద్దితే స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఫార్చునా రెసిడెన్సీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ధనుంజయరెడ్డి గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సుమారుగా 1800 గజాల ఈ ఖాళీ ప్రభుత్వ స్థలం గత ఐదు దశాబ్దాలుగా ఖాళీగా ఉందని, ఇక్కడి లేఅవుట్‌లో జీహెచ్ఎంసీ ఓపెన్ స్పేస్‌గా గుర్తించబడిందని, ఇటీవల కొందరు కబ్జాదారులు ఈ స్థలంపై కన్నేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. స్థలం ఖాళీగా ఉండడంతో కబ్జాదారుల కన్ను పడిందని, బోగస్ డాక్యుమెంట్లతో ఈ స్థలాన్ని కాజేసేందుకు యత్నిస్తున్నారని తాము బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామని, కబ్జాదారులపై కేసు కూడా నమోదైందని ఆ వివరాలను అందజేశారు. దీనికి స్పందించిన కమిషనర్ ఈ స్థలంపై నివేదిక కోరతానని, తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

పోలీసులకు సహకరించాలి



బంజారాహిల్స్: వినాయక నవరాత్రి మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో గురువారం సవేరా ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించి వారికి ఆయన పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు నడుచుకోవాలన్నారు. అసాంఘిక శక్తులపై ఎప్పటికప్పుడు పోలీసు నిఘా ఉంటుందన్నారు. అలజడులు సృష్టించే వారిపై చర్యలు తప్పవన్నారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. నిర్దిష్ట వేళల్లోనే లౌడ్‌స్పీకర్లు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ లైన్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఫైర్ ఫీసర్ సాయిరెడ్డి, డీఐ మధుసూదన్, ఎస్ఐ హరీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొంగుతున్న మురుగు.. కుంగుతున్న మ్యాన్‌హోళ్లు!



బీఎస్ మక్తా బస్తీలో పొంగుతున్న మురుగు



బస్తీలో రోడ్డులోకి కుంగిపోయిన మ్యాన్‌హోల్

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

బంజారాహిల్స్: సోమాజిగూడ డివిజన్‌లోని బీఎస్ మక్తాలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గడిచిన 15 రోజులుగా బస్తీలో మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు మురుగు ప్రవాహంతో బస్తీలోని రోడ్లు దెబ్బతింటుండగా, మరో వైపు అనారోగ్యకర వాతావరణంతో స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. ఇంకోవైపు జీహెచ్ఎంసీకి చెందిన వరద నీటి కాల్వల మ్యాన్‌హోళ్లు కీర్తిలాల్ జ్యువెలర్స్ పక్కవీధిలో నాలుగు, మలబార్ గోల్డ్ వీధిలో ఆరుకు పైగా రోడ్డు లోపలికి కుంగిపోయాయి. ఈ సమస్యలను పలుమార్లు స్థానికులు జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

సెల్లార్లలో నీటిని రోడ్లపైకి పంపింగ్ చేస్తే చర్యలు

జలమండలి తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబు

బంజారాహిల్స్: వర్షాలు వచ్చినప్పుడు భారీ భవనాల సెల్లార్లలో చేరే నీటిని, నిర్మాణ సెల్లార్లలో ఉన్న వరద నీటిని రోడ్ల మీదకు, మురుగు నీటి కాల్వల్లోకి పంపింగ్ చేయొద్దని జలమండలి తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబు సూచించారు. ఆ వరద నీటిని తరలించేందుకు ప్రైవేట్ ట్యాకర్లు అందుబాటులో ఉంటాయని వాటిని వినియోగించుకోవాలని అన్నారు. వరద నీటి కాల్వలు, మురుగు నీటి కాల్వల్లో భారీ మోటార్లు పెట్టి పంపింగ్ చేయడం వల్ల మ్యాన్‌హోళ్ళు ఓవర్ ఫ్లో అయి కాలనీల్లో, బస్తీల్లో మురుగు సమస్య తీవ్రమవుతున్నదని అన్నారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఓ ప్రముఖ ఆస్పత్రితో పాటు రెండు భారీ భవంతుల వారు వరద నీటిని మురుగు నీటి కాల్వల్లోకి పంపింగ్ చేస్తున్న విషయాన్ని తెలుసుకొని వాటిని నిలుపుదల చేయించి వారికి నోటీసులు ఇచ్చారు. మరోసారి వరద నీటిని పంపింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని, సీవరేజీ లైన్‌తో పాటు మంచినీటి లైన్‌ను నిలిపివేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా తట్టికాన సెక్షన్ పరిధిలో ఇప్పటి వరకు ఆరుమంది భవనాల యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌కు అభినందనలు



ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రహమత్‌నగర్: మధురానగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్ నేతృత్వంలో గురువారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భగా భవానిశంకర్ మాట్లాడుతూ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ప్రధానంగా రాత్రి వేళల్లో మరింత గస్తీని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు, సుందర్, రవీందర్ రెడ్డి, అరుణ్‌గౌడ్, మేఘన పద్మ, సువర్ణ, బెన్నార్, శివ,సాయి, నటరాజ్ యాదవ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు, ల్యాప్‌టాప్ చోరీ

వెంగళరావునగర్: గదిలో ఉంచిన ల్యాప్‌టాప్, బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... శ్రీకాళహస్తికి చెందిన సోమశంకర్ వెంగళరావునగర్ హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నాడు. ఈనెల 20 రాత్రి తన ల్యాప్‌టాప్‌ను ఉపయోగించుకున్న తర్వాత బ్యాగ్‌లో పెట్టి నిద్రపోయాడు. ఉదయం లేచి చూడగా బ్యాగ్‌లో ఉండాల్సిన ల్యాప్‌టాప్‌తో పాటుగా బంగారు గొలుసు కూడా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ పెళ్లి చేసుకుంటా...

మహిళకు యువకుడి బెదిరింపు

వెంగళరావునగర్: విడాకులు తీసుకున్న మహిళను మరోసారి పెళ్లి చేసుకోకపోతే చంపేస్తానని యువకుడు బెదిరించిన సంఘటన మధురానగర్ పీఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... ఎల్లారెడ్డిగూడకు చెందిన యువతికి అదే ప్రాంతానికి చెందిన వై.శివకుమార్‌తో వివాహం జరిగింది. రెండేళ్ల తర్వాత ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆమె తన తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. అయితే ఏడాది నుంచి శివకుమార్ తిరిగి తనను మళ్లీ పెళ్ళి చేసుకోవాలని లేకపోతే చంపేస్తానని యువతిని బెదిరిస్తున్నాడు. దీంతో బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

రహమత్‌నగర్: భార్య మృతితో మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధి కార్మికనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కార్మికనగర్‌లో వెంకటస్వామి (75) ఆయన భార్యతో నివాసముండేవాడు. ఆయన భార్య నెలరోజుల క్రితం మృతిచెందింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటస్వామి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాధవ సేవ ఫౌండేషన్ నాయకులు

పంజగుట్ట: మాధవసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు కాకర్ల రాధ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వేడుకల పోస్టర్‌ను రుద్రమ దేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకురాలు నర్ర లక్ష్మి, అనీల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవులను కాపాడేందుకు మొక్కలను పెంచే పవిత్ర కార్యక్రమం, కనుమరుగవుతున్న మన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించేందుకు, హిందుత్వం ఒక మతం కాదు జీవన విధానం అని చాటి చెప్పేందుకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా కార్యక్రమం కొనసాగుతుందని, భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, మోహన్, రోహన్, స్నేహ పాల్గొన్నారు.

గుంతల చుట్టూ రక్షణ ఏర్పాట్లు

సాక్షి ఎఫెక్ట్



కేబీఆర్ ఫుట్‌పాత్‌పై గుంతల చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేసిన దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ఇష్టానుసారంగా గుంతల తవ్వడంతో ప్రమాదం పొంచి ఉందని గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన సమస్య పట్ల జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి స్పందించారు. వెంటనే గుంతల చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత ఇంజినీర్లను ఆదేశించడంతో ఇక్కడ గుంత ఉందని హెచ్చరికగా చుట్టూ రక్షణ చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా పార్కు ప్రధాన గేటుకు రెండువైపులా అలంకరణ విద్యుత్ దీపాలు నిర్మిస్తున్నామని, స్తంభాల ఏర్పాటు కోసమే ఈ తవ్వకాలు చేపట్టినట్లు జెడ్సీ తెలిపారు.

కటకటాల్లోకి మందుబాబులు

29 మందికి జరిమానాలు విధించిన మేజిస్ట్రేట్

బంజారాహిల్స్: అతిగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 29 మంది వాహనదారులను జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు గురువారం నాంపల్లిలోని ఎనిమిదవ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. మద్యం సేవించి రెండోసారి పట్టుబడ్డ ఒకరికి రూ.3300 జరిమానా, నాలుగు రోజుల జైలు, మూడుసార్లు పట్టుబడ్డ మరొకరికి రూ.3300 జరిమానా ఆరు రోజుల జైలు, మొదటిసారి పట్టుబడ్డ వ్యక్తికి రూ.2100 జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష, మరో వాహనదారుడికి జరిమానాతో పాటు ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అలాగే 25 మందికి ఒక్కొక్కరికి రూ.2100 మంది చొప్పున జరిమానా విధించారు. జరిమానాల రూపంలో మొత్తం రూ.64,500 వసూలైనట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బిర్లా ప్లానిటోరియాన్ని సందర్శించిన స్కూల్ విద్యార్థులు



బిర్లా ప్లానిటోరియం సందర్శనలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

ఫిలింనగర్: తరగతి గదులకే విద్యార్థులను పరిమితం చేయకుండా వారు నేర్చుకున్న విషయాలను నేరుగా తిలకించి మరిన్ని విజ్ఞాన విశేషాలను తెలుసుకునేందుకు జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ 4, 6 తరగతి విద్యార్థులను గురువారం బిర్లా ప్లానిటోరియం అండ్ సైన్స్ మ్యూజియం సందర్శనకు తీసుకువెళ్లారు. పిల్లలకు ప్రయోగాత్మక అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఈ విజ్ఞానయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభవాలను తెలియజేశారు. 'జర్నీ థ్రూ ద యూనివర్స్' పేరుతో జరిగిన ప్లానిటోరియం షో సందర్శనలో కీలకంగా నిలిచిందన్నారు. ఖగోళ సందర్శనశాలలోని దృశ్యాలు చూస్తున్నప్పుడు నిజంగా ఆకాశంలో విహరిస్తున్నట్లు అనిపించిందని మురిసిపోయారు. విశ్వ ప్రతిరూపాన్ని చూసి ఆశ్చర్యచకితులమైనట్లు తెలిపారు. అలాగే సౌర వ్యవస్థ, నక్షత్ర రాశులు, విశ్వ దృగ్విషయం వంటి అంశాలను తెలుసుకున్నామన్నారు. బిర్లా సైన్స్ మ్యూజియంలో పురావస్తుత శాస్త్రం మరో ముఖ్యమైన విభాగం కాగా, ఇందులో ప్రత్యేకమైన పురావస్తు వస్తువుల సేకరణను చిన్నారులు తిలకించారు. డైనోసర్లు కేవలం ఊహాత్మకమైనవిగా భావించే తమకు డైనోసారియంలో పెద్ద డైనోసర్ ప్రదర్శన అద్భుతం అనిపించిందని చిన్నారులు తమ మనోభావాలను వెల్లడించారు. అలాగే మ్యూజియం లోపల రాతియుగం నుంచి మానవ జాతి ఆధునిక యుగం వరకు వివిధ రకాల సావనీర్లను విద్యార్థులు తిలకించారు. ఇంటరాక్టివ్ ఎగ్జిబిట్‌లు, ఇన్ఫర్మేటివ్ డిస్‌ప్లేలు, ప్లానిటోరియం షోల కలయిక తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు.

నిరసనలోనూ సామాజిక బాధ్యత



నెక్లెస్ రోడ్డులో గురువారం ఉదయం వందలాది మంది వైద్యులు, వైద్య విద్యార్థులు కోల్‌కతాలో జూనియన్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనపై నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఇదే దారిలో ఓ అంబులెన్స్ సైరన్ వేసుకుంటూ వస్తుండటంతో ర్యాలీలో ఉన్న వైద్యులు, విద్యార్థులు ఒక్కసారిగా అంబులెన్స్ ముందుకెళ్లేందుకు దారిని క్లియర్ చేశారు. నిరసనలోనూ సామాజిక బాధ్యత ప్రదర్శించిన వైద్యులను అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అభినందించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, బంజారాహిల్స్

ఆర్టీసీ మెట్రో డీలక్స్ బస్‌పాస్

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో డీలక్స్ బస్సుల్లో ఆర్టీసీ కొత్తగా బస్‌పాస్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. నెలకు రూ.1,450ల విలువైన ఈ పాస్‌లతో ప్రయాణికులు సిటీ మెట్రో డీలక్స్ బస్సులతో పాటు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, ఎలక్ట్రిక్ మెట్రో నాన్ ఏసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఆర్డినరీ, సిటీ, సబర్బన్ బస్సుల్లో ప్రయాణం చేయవచ్చని అధికారులు తెలిపారు. అలాగే పుష్పక్ బస్సుల్లో రూ.5 వేలతో నెలవారి బస్‌పాస్ సదుపాయం ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు గ్రీన్ మెట్రో లగ్జరీ పాస్ రూ.1,900, మెట్రో ఎక్స్‌ప్రెస్ రూ.1,300, ఆర్డినరీ రూ.1,150 చొప్పున నెలవారీ పాస్‌లు ఉన్నాయి. పుష్పక్ బస్సుల్లో 8 కిలోమీటర్ల వరకు రూట్ పాస్‌లు కూడా అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. నగరంలోని అన్ని బస్‌పాస్ కౌంటర్లలో ఉదయం 6.30 నుంచి రాత్రి 8.15 గంటల వరకు ఈ పాస్‌లను పొందవచ్చు.

కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి సేవలో ఏపీ మాజీ మంత్రి రోజా



చంపాపేట: కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారిని ఏపీ మాజీ మంత్రి, ప్రముఖ సినీ నటి రోజా గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెను వేద మంత్రోచ్చరణలతో ఆశీర్వదించి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ పాలకమండలి సభ్యులు మధుసాగర్, సురేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అర్చకులు అంబ ప్రసాద్, ప్రవీణ్‌శర్మ, సంతోష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ఫుల్ డిమాండ్



సాక్షి, సిటీబ్యూరో: విదేశీ విద్యకు సంబంధించిన దేశీయ మార్కెట్‌లో తెలుగు రాష్ట్రాల వాటా 12–14శాతం ఉండగా అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన నగరాల్లో హైదరాబాద్ తొలిస్థానంలో ఉందని అంతర్జాతీయ స్టూడెంట్ రిక్రూట్‌మెంట్ కంపెనీ కెరీర్ మొజాయిక్ ప్రతినిధులు తెలిపారు. విదేశీ విద్యకు సంబంధించి తాజా ధోరణులపై బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో గురువారం ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్ తర్వాత వరుసగా విజయవాడ, విశాఖపట్టణం, గుంటూరు నుంచి దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఎంచుకుంటున్న దేశాల్లో ఇప్పటికీ అమెరికా అగ్రగామిగా ఉండగా, యూరోపియన్ విశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసం పట్ల కూడా విద్యార్థుల్లో ఆసక్తి బాగా పెరిగిందని, తెలుగు రాష్ట్రాల్లో ద్వితీయశ్రేణి, తృతీయ శ్రేణి నగరాల నుంచి పెరుగుతున్న ఆసక్తి విదేశీ చదువుల డిమాండ్‌ను శాసిస్తోందన్నారు. కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ వంటి స్టెమ్ కోర్సులకు డిమాండ్ కొనసాగుతుండగా, సైకాలజీ 41శాతం, హెల్త్ సైన్సెస్ 39 శాతం వృద్ధి కనబరుస్తున్నాయన్నారు. తమకు 2023 నుంచి 2024 దాకా అందిన దరఖాస్తుల్లో తెలుగు రాష్ట్రాల నుంచే 1.6 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. తమ సంస్థతో చేతులు కలిపిన అమెరికాకు చెందిన 25 వర్సిటీలు నగరంలో విద్యార్థుల విదేశీ విద్య కలను సాకారం చేసేందుకు విభిన్న రకాలుగా సహకరిస్తున్నాయన్నారు. సమావేశంలో సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ అభిజిత్ జవేరి, సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న అమెరికా వర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీ విజేతలు వర్షిత్, పూర్వీ




సాక్షి, హైదరాబాద్: ఇంటర్ స్కూల్ చెస్ టోర్నమెంట్‌లో జూనియర్ బాలుర విభాగంలో ఎ.వర్షిత్ (4 పాయింట్లు), బాలికల విభాగంలో పూర్వీ (2.5 పాయింట్లు) విజేతలుగా నిలిచారు. స్లాన్, తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో మేడ్చల్‌లోని టైమ్స్ స్కూల్‌లో ఈ టోర్నీని నిర్వహించారు. జూనియర్ బాలుర విభాగంలో ఎం.వర్షిత్ (3 పాయింట్లు) రెండో స్థానాన్ని పొందగా.. సుమధ్వాకు మూడో స్థానం లభించింది. సీనియర్ బాలుర విభాగంలో అహద్ నాలుగు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. ఆరుష్, ధనుష్ వరుసగా రెండు, మూడు స్థానాలను దక్కించుకున్నారు. సీనియర్ బాలికల విభాగంలో షేక్ అఫ్షీన్ విజేతగా నిలిచింది.

25న రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం(టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 25న రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నీ జరగనుంది. ఎల్బీ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ టోర్నీ నిర్వహిస్తారు. అండర్–7, 9, 11, 13, 15 వయో పరిమితి విభాగాల్లో బాలబాలికలకు ప్రత్యేకంగా గేమ్‌లు జరుగుతాయి. 1–1–2009న లేదా ఆ తర్వాత జన్మించిన వారే ఈ టోర్నీలో ఆడేందుకు అర్హులు. ప్రతి విభాగంలో టాప్–10లో నిలిచిన బాలబాలికలకు బహుమతులు అందజేస్తారు. ఆసక్తిగలవారు తమ పేర్లను 73375 78899, 73373 99299 ఫోన్ నంబర్లలో నమోదు చేసుకోవాలని టీఎస్‌సీఏ అధ్యక్షుడు టీఎస్ ప్రసాద్ తెలిపారు.

విధుల్లో ఉండగా గుండెపోటు

– కడ్తాల్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య మృతి



ఆమనగల్లు: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి విధులు నిర్వహిస్తూ గుండెపోటుకు గురైన హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య(51) గురువారం ఉదయం మృతిచెందాడు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో తోటి సిబ్బంది మల్లయ్యను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని డీఆర్‌డీఏ అపోలోకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్మాస్‌గూడకు చెందిన మల్లయ్య 2016 నుంచి కడ్తాల్ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, కడ్తాల్ సీఐ శివప్రసాద్ ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం పోలీసు అధికారిక లాంఛనాలతో అల్మాస్‌గూడలో అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎల్ ఎన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కంబాల పరమేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు వీరయ్య, లచ్చిరాంనాయక్, బొప్పిడి గోపాల్, చంద్రమౌళి, హరిచంద్‌నాయక్, రామకృష్ణ, లాయక్‌అలీ, వెంకటేశ్, శ్రీకాంత్, బిక్యానాయక్, యాదయ్యతదితరులు కడ్తాల్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

మాన్గార్‌బస్తీని మార్చలేరా?

గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ధూల్‌పేటను ప్రక్షాళన చేసేందుకు ఎక్సైజ్–పోలీసు విభాగాలు సంయుక్తంగా 'ఆపరేషన్ ధూల్‌పేట' చేపట్టాయి. జేబు దొంగతనాల నుంచి బెదిరించి దోపిడీల వరకు వివిధ నేరాలు చేసే నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న మాన్గార్‌బస్తీపై మాత్రం ఎవరూ సరైన దృష్టి పెట్టడంలేదు.
–సాక్షి, సిటీబ్యూరో

నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఈ ప్రాంతం

- దీనికి వడ్డీ వ్యాపారుల మాఫియా ఓ కారణం
- గత్యంతరం లేకే అక్కడి వాళ్లు ఇంకా నేర ప్రవృత్తిలో
- సంస్కరించడానికి గతంలో కొన్ని ప్రయత్నాలు

కాలక్రమంలో మూలనపడిన అన్ని విధానాలు





నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద కాల్పులు జరగడానికి కారణమైన ఇద్దరు నిందితులు, సెల్‌ఫోన్లు చోరీ చేస్తూ హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు చిక్కిన ముగ్గురిలో ఇద్దరు ఈ ప్రాంతానికి చెందిన వాళ్లే. కేవలం వీళ్లే కాదు.. రాజధానిలో ఉన్న మూడు కమిషనరేట్లలో ఈ బస్తీ వారిపై అనేక కేసులు ఉన్నాయి. ఇలా చిన్నా–పెద్దా నేరాలు చేస్తూ శాంతిభద్రతలపై ప్రభావం చూపిస్తున్న మాన్గార్‌బస్తీ వాసులను మార్చడానికి గతంలో చేసిన ప్రయత్నాలు పూర్తి ఫలితాలు ఇవ్వలేదు. ఈ ప్రాంతం కేంద్రంగా భారీ స్థాయిలో ఉన్న వడ్డీ మాఫియాను కట్టడి చేయడంపై ఇటు పోలీసులు–అటు రెవెన్యూ అధికారులు సైతం దృష్టి సారించడంలేదు.

రాజ్యమేలుతున్న వడ్డీ మాఫియా..

ఏళ్ల క్రితం కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన వారితో మాన్గార్‌బస్తీ ఏర్పడింది. వీరిలో కొందరికి ఏళ్లుగా దొంగనాలు చేయడమే వృత్తి. రాజధానిలోని మూడు కమిషనరేట్లతో పాటు ఇతర జిల్లాల్లోనూ పిక్ పాకెటింగ్, దృష్టి మళ్లించే నేరాలు, గొలుసు చోరీలకు సంబంధించిన కేసులు ఎన్నో ఉన్నాయి. గతంలో నేరగాళ్లుగా ఉన్న వారిలో అనేక మంది ఆర్థికంగా స్థిరపడిన తర్వాత ఫైనాన్సియర్ల అవతారం ఎత్తారు. వీరికి తోడు మరికొందరు స్థానికులూ వడ్డీ వ్యాపారులుగా మారిపోయారు. ఈ బస్తీ వాసులకు నేరగాళ్లనే పేరు పడటంతో బయట ఎక్కడా అప్పు పుట్టే పరిస్థితి లేదు. దీంతో నెలకు నూటికి రూ.20 వరకు వడ్డీ వసూలు చేసే ఫైనాన్స్ మాఫియా అక్కడ రాజ్యమేలుతోంది. ఈ వడ్డీ చెల్లించకపోతే ప్రతి ఆరు నెలలకు ఆ వడ్డీ మొత్తాన్ని అసలులో కలిపేస్తూ తడిసి మోపెడు చేస్తుంటారు.

చోరులు అరెస్టు అయితే వీరికి పండగే..

మాన్గార్‌బస్తీకి చెందిన కొందరు నేరగాళ్ల కుటుంబాలు పూటగడవని స్థితిలో ఉంటాయి. దీంతో వాళ్లు అరెస్టు అయినప్పుడు దాన్ని క్యాష్ చేసుకోవడానికి వడ్డీ మాఫియా రంగంలోకి దిగుతుంది. బెయిల్ సహా 'ఇతర ఖర్చులు' ష్యూరిటీలకు అవసరమైన మొత్తం ఖర్చు చేస్తుంది. దీంతో సదరు నేరగాడు బయటకు వచ్చిన తర్వాత ఫైనాన్షియర్ తమ కోసం ఖర్చు పెట్టిన మొత్తాన్ని వడ్డీతో సహా కట్టడానికి మళ్లీ నేరాలు చేయాల్సి వస్తోంది. అలా చేయడానికి వీరికి మనస్కరించకపోయినా.. నేరగాళ్లుగా ముద్రపడిన వీరికి మరో పని దొరక్కపోవడంతో అప్పులు తీర్చడానికి తప్పక నేరాలు చేయాల్సిన పరిస్థితిలో అనేక మంది ఉంటున్నారు. ఏళ్లుగా ఆ ప్రాంతంలో ఇదే పరిస్థితి ఉండటంతో కొందరు నేరగాళ్లు పూర్తిగా ఈజీ మనీకి అలవాటుపడిపోయారు.

పత్తాలేని 'పరివర్తన్ సదస్సు'లు..

ఈ ప్రాంతవాసులను మార్చాలని 2017లో అప్పటి హబీబ్‌నగర్ పోలీసులు నిర్ణయించారు. పరివర్తన్ పేరుతో ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. కుటుంబీకులకు కౌన్సిలింగ్ ఇచ్చి ప్రధాన నేరగాళ్లు, వారి అనుచరులు స్వచ్ఛందంగా లొంగిపోయేలా చేశారు. ఒకేసారి 8 గ్యాంగులకు చెందిన 25 మంది నేరగాళ్లు స్వచ్ఛందంగా లొంగిపోయారు. వీరిపై ఉన్న నాన్–బెయిలబుల్ వారెంట్లు రీకాల్ చేయించడానికి, వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల్ని సామరస్యంగా, చట్టపరంగా మూసేయించడానికి ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో వారి పునరావాసం కోసమూ అనేక ప్రణాళికలు సిద్ధం చేశారు. కొందరు మాన్గార్‌బస్తీ వాసులకు చేతిపనుల్లో శిక్షణ సైతం ఇప్పించారు. అప్పట్లో హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన పరవస్తు మధుకర్ స్వామి కృషితో ఇవి జరిగాయి. ఆయన బదిలీ కావడంతో, తర్వాత వచ్చిన వాళ్లు పట్టించుకోకపోవడంతో పరివర్తన కనిపించకుండా పోయింది.

దీనమైన బతుకుచిత్రం కొందరిది..

మాన్గార్‌బస్తీకి చెందిన కొందరు నేరగాళ్ల వ్యక్తిగత జీవితంలో అత్యంత దీనమైన పరిస్థితులు ఉంటున్నాయి. ఉదయం లేవడంతోనే గంజాయి, మద్యంతోనే వీరి జీవితం ప్రారంభమవుతుంది. ఇక్కడి వారిని ఏ పోలీసులు, ఎప్పుడు, ఎక్కడ అరెస్టు చేస్తారో ఎవరికీ తెలియని దుస్థితి. అలా జైలుకు వెళ్లిన నిందితుడు ఎన్నాళ్లకు బయటకు వస్తాడో చెప్పలేని పరిస్థితి. ఇక్కడి చిన్నారులు కూడా అపరిశుభ్రమైన వాతావరణంలో బతుకుతుంటారు. శిథిలమైన ఇళ్లలో సరైన మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఆహారం, పోషణ, అజమాయిషీ లేకుండా పెరుగుతారు. దీంతో వీళ్లు కూడా నేరల బాటే పట్టి ఆ పరంపర కొనసాగిస్తున్నారు. ఇక్కడ నివసించే వారిలో షెడ్యూల్డ్ కులాలు, తరగతులకు చెందిన వాళ్లా అనేక మంది ఉంటున్నారు. అయినప్పటికీ వీరికి ఎలాంటి ప్రోత్సాహకాలు అందట్లేదు. కొందరికైతే సరైన కుల ధ్రువీకరణ పత్రాల జారీ అవడం లేదు.



మాన్గార్‌బస్తీలో కార్డ్ ఆన్ సెర్చ్

నేరగాళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన మల్లెపల్లి సమీపంలోని మాన్గార్‌బస్తీలో గురువారం స్పెషల్ జోనల్ క్రైం టీం పోలీసులు కార్డ్ ఆన్ సెర్చ్ నిర్వహించారు. రెండు ఇళ్లలోని ముగ్గురు అనుమానితుల నుంచి 3,200 ఇంటాక్సియేషన్ టాబ్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్న రామ్‌లాల్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న మాన్గార్‌బస్తీకి చెందిన గిరిధారి, ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్న తిరుమలేష్‌లపై హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ కేసు నమోదు చేశారు.



కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి



– ప్రొఫెసర్ హరగోపాల్

కవాడిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రుణమాఫీని అర్హులైన రైతులందరికీ వర్తింపజేసి ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ కళాభవన్, వీఎస్‌టీ, ఆర్టీసీ క్రాస్‌రోడ్, అశోక్‌నగర్, ఇందిరా పార్కు చౌరస్తా మీదుగా ధర్నాచౌక్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాకు ప్రొఫెసర్ హరగోపాల్, సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, పార్టీ సభ్యులు కేజీ రాంచందర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కె.రమ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. దేశంలో ఉన్న పాలకులు సంపదను ధనికవర్గాల కోసమే సృష్టిస్తున్నారని ఆరోపించారు. సంపద సృష్టించడం అంటే రాష్ట్రంలో ఉన్న నిరుపేదలందరికీ కనీస సౌకర్యాలు విద్యా, వైద్యం అందరికీ అందించినప్పుడే నిజమైన అభివృద్ధి అన్నారు. ఆ దిశగా నేటి పాలకులు పని చేయాలని ఆయన సూచించారు. దేశంలో, రాష్ట్రంలో మానవత్వం లేకుండా ఎక్కడికక్కడ చిన్నారులపై లైంగికదాడులు, హత్యలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామిక విలువలు ఉండాలని, ప్రజల కోరికలను ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులను కాలరాసిందని, ప్రశ్నించే హక్కులను నిరోధించిందన్నారు. పార్టీ నేతలు జి.వెంకటేశ్వర్‌రావు, వి.కృష్ణ, పి.ప్రభాకర్, చిన్నా, చంద్రన్న, కె.సూర్యం, చంద్ర అరుణ, కృష్ణ, ఎం.హనుమేష్, సదానందం తదితరులతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'ఎస్కీ'లో పీజీడీఎం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఈనెల 31
- రిజిస్ట్రేషన్‌కు గడువు 30వ తేదీ
- 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లోని స్కూల్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ స్టడీస్‌లో పీజీ డిప్లొమో కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు గురువారం తెలిపారు. పీజీడీఎం ఇన్ జనరల్ మేనేజ్‌మెంట్ రెండు ఏళ్ల కాల పరిమితి ఉంటుందని, గ్రాడ్యుయేషన్‌ను 50 శాతం మార్కులతో పూర్తి చేసినవారు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా పీజీడీఎం ఇన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ రెండేళ్ల కాలపరిమితితో ఉండే ఈ కోర్సులో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ 50 శాతం మార్కులతో పూర్తి చేసినవారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆగస్టు 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. ఆగస్టు 31న ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పీజీడీఎం అడ్మిషన్లు పొందేవారిలో రూ.లక్ష స్కాలర్‌షిప్‌ను పొందే అవకాశం కూడా ఉంటుందన్నారు. 100 శాతం ప్లేస్‌మెంట్లు ఉండే కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7337319017లో సంప్రదించాలన్నారు. తమ పేర్లను వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

అదనపు అంతస్తుల కూల్చివేత



పాష కాలనీలో అదనపు అంతస్తులను కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి

మణికొండ: అనుమతులు తీసుకొని, వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా అంతస్తులను పెంచి నిర్మించిన భవనాన్ని మణికొండ మున్సిపాలిటీ అధికారులు కూల్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పాష కాలనీలో ఓ వ్యక్తి జీ ప్లస్–2 అంతస్తులకు అనుమతి తీసుకుని ఏకంగా ఐదు అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ నిర్మించాడు. ఆ విషయంపై పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఎలాంటి సమాధానం రాకపోవడంతో గురువారం సదరు భవనంలోని 3, 4, 5 అంతస్తుల స్లాబ్‌లతో పాటు పెంట్‌హౌస్‌ను కూల్చివేశారు. మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ, అదనపు నిర్మాణాలను ఉపేక్షించేది లేదని అన్నారు. అలాంటి భవనాలను గుర్తించి ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. అలాంటి వాటిని రోజువారీగా కూల్చివేసే పనులను చేపట్టామన్నారు. అనుమతులను పట్టించుకోకుండా అధికంగా నిర్మాణాలు చేసి బిల్డర్లు, నిర్మాణదారులు, కొనుగోలుదారులు నష్టపోవద్దని వారు సూచించారు. అలాంటి భవనాలను కూల్చడం తప్పదన్నారు. కూల్చివేతలకు నార్సింగి పోలీసులు భారీ భద్రతను కల్పించారు.

ప్లేట్‌లెట్స్ దానానికి యువత స్వచ్ఛందంగా కదలాలి

హైదరాబాద్ జిల్లా యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ మణిదీప్



మాట్లాడుతున్న మణిదీప్, చిత్రంలో చైర్మన్ మామిడి భీంరెడ్డి

సనత్‌నగర్: డెంగ్యూ బాధితుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ప్లేట్‌లెట్స్ సమస్య తలెత్తకుండా యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి ప్లేట్‌లెట్స్‌ను డొనేట్ చేయాల్సిందిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా యూత్ కన్వీనర్ మణిదీప్ పిలుపునిచ్చారు. డెంగ్యూ బాధితులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆ సొసైటీ జిల్లా చైర్మన్ మామిడి భీంరెడ్డితో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మణిదీప్ యువతను అప్రమత్తం చేశారు. ఆస్పత్రుల్లో డెంగ్యూతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, ప్లేట్‌లెట్స్ కోసం ఎంతోమంది తమను ఆశ్రయిస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని యువత కదిలివచ్చి ప్లేట్‌లెట్స్‌ను దానం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోవడం ద్వారా ఏర్పడే సమస్యలు ఎలాంటివో అందరికీ తెలుసునని, ఈ నేపథ్యంలో ప్రాణాపాయస్థితి నుంచి బాధితులను రక్షించేందుకు ముఖ్యంగా యువత కదం తొక్కాలన్నారు. అందుకోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా విభాగం పూర్తి సహకారం అందిస్తుందన్నారు.

వంద రోబో సర్జరీలు

- స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎస్ఎస్ఐ మంత్రతో అద్భుతం
- కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యుల ఘనత



సాక్షి, సిటీబ్యూరో: మేడిన్ ఇండియాలో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి పరిచిన రోబోతో కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా 100 శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ రూపొందించిన ఎస్ఎస్ఐ మంత్ర రోబో సాయంతో పూర్తి కచ్చితత్వంతో ఈ శస్త్రచికిత్సలు జరిపారు. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కీలకమైన మైలురాయిని అందుకున్న సందర్భాన్ని కాంటినెంటల్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ గురునాథ్‌రెడ్డి పంచుకున్నారు. వంద రోబో శస్త్రచికిత్సలను తమ ఆస్పత్రిలో చేయడం చాలా గర్వకారణంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ చైర్మన్, సీఈవో డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. పేషెంట్‌కు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తాము అంకితభావంతో పనిచేస్తున్నామని వివరించారు. నిపుణులైన డాక్టర్లు తమ రోబోలతో అద్భుతంగా సర్జరీలు నిర్వహిస్తున్నారని, లేటెస్టు టెక్నాలజీ, నాలెడ్జ్‌తో తమ రోబోలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ బీసీ న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బత్తుల కృష్ణ

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బత్తుల కృష్ణ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బత్తుల కృష్ణకు గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. హైకోర్టు అడ్వకేట్‌గా పనిచేస్తున్న కృష్ణ అనేక సంవత్సరాలుగా బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని, ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో నాగుల శ్రీనివాస్ యాదవ్, వేద ప్రకాష్ యాదవ్, జి.శ్రీకాంత్ యాదవ్, నీలా వెంకటేష్, అనంతయ్య, వేముల రామకృష్ణ, రాజేందర్, రాందేవ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు..

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రపంచ ఫొటోగ్రఫీ డే ఎగ్జిబిషన్ ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరుగుతుంది.
- జూబ్లీహిల్స్ రోడ్ నంబర్–36లోని రుద్ర జెమ్స్ ఎన్ డైమండ్స్ మధ్యాహ్నం 3 గంటల నుంచి జ్యువెలరీ ఫ్యాషన్ షో నిర్వహిస్తోంది.
- వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రజానటి డాక్టర్ జమున రమణారావు 88వ జయంతి సందర్భంగా చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయ గాన సభలో సాయంత్రం 4.30గంటలకు పద్మశ్రీ ఉమా మహేశ్వరికి జమున– వంశీ జాతీయ పురస్కారం –2024 ప్రదానం జరుగుతుంది. అనంతరం శ్రీకృష్ణ స్వర రాగ స్రవంతి సమర్పణలో సినీ సంగీత విభావరి జరుగుతుంది.
- తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టియుడబ్ల్యుజే) ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ప్రొఫెసర్ జి.ఎస్.సాయిబాబు మీట్ ది ప్రెస్ కార్యక్రమం జరుగుతుంది.

డీఆర్‌డీఓ చీఫ్ ఇంజినీర్ అండ్ ఎస్టేట్ మేనేజర్‌గా వినోద్ కుమార్



సంతోష్‌నగర్: డీఆర్‌డీఓ చీఫ్ ఇంజినీర్ అండ్ ఎస్టేట్ మేనేజర్‌గా వినోద్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ చీఫ్ ఇంజినీర్ అండ్ ఎస్టేట్ మేనేజర్‌గా పనిచేసిన షేక్ గౌస్ మోహినుద్దీన్‌ను సోలార్ పవర్ ప్రాజెక్టుల కోసం ఆఫీసర్–ఆన్–స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ)గా బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో డీఆర్‌డీఓ చీఫ్ ఇంజినీర్ అండ్ ఎస్టేట్ మేనేజర్‌గా వినోద్ కుమార్ షేక్ గౌస్ మోహినుద్దీన్ చేతులమీదుగా బాధ్యతలు స్వీకరించారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్


సాక్షి, సిటీబ్యూరో: నేషనల్ మీన్స్ –కమ్ – మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం పరీక్ష కోసం సెప్టెంబర్ 11 వరకు పరీక్ష రుసుము చెల్లించవచ్చని జిల్లా విద్యా శాఖాధికారి రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల ఉపకార వేతనానికి అర్హులన్నారు. ఇతర వివరాలకు కోసం అధికారిక వెబ్‌సైట్ http://bse. telangana. gov.in ని వినియోగించుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 23, ఆగస్టు, 2024



ఆషా.. షో 24న..

సాక్షి, సిటీబ్యూరో: టాలీవుడ్ నేపథ్య గాయని ఆషా కిరణ్ తన గీతాలతో శ్రోతలను ప్రత్యక్షంగా అలరించనున్నారు. మాదాపూర్‌లోని నాలెడ్జ్ సిటీ రోడ్‌లో ఉన్న డిస్ట్రిక్ట్ 150 రెస్టారెంట్‌లో ఈ లైవ్ మ్యూజిక్ కార్యక్రమం ఈ నెల 24న రాత్రి 8గంటల నుంచి జరగనుంది. విభిన్న రకాల తెలుగు, హిందీ తదితర భాషా గీతాలను ఆషా ఆలపించనున్నారు.



25న పోటరీ వర్క్‌షాప్

సాక్షి, సిటీబ్యూరో: ఆర్ట్ లవర్స్ కోసం నగరంలోని హౌస్ ఆఫ్ గార్నెట్ వేదికగా పోటరీలో ప్రత్యేకంగా శిక్షణ అందించనున్నారు. మట్టితో అందమైన కళాకృతులను తయారు చేయడానికి ఏర్పాటు చేస్తున్న ఈ వర్క్‌షాప్ ఈ నెల 25న నిర్వహించనున్నారు. వర్క్‌షాప్‌కు సంబంధించిన అన్ని మెటీరియల్స్ తామే అందిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. శిక్షణ పొందడానికి ముందస్తుగా బుక్ మై షోలో నమోదు చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. వినూత్న ఆలోచనా విధానం, కళాత్మక హృదయం ఉన్న ఎవరైనా పాల్గొనవచ్చని వారు పేర్కొన్నారు.



కరాటే మాన్సూన్ క్యాంప్‌లో

గోవింద్ ప్రతిభ

పోచారం: జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 18 వరకూ 16వ జాతీయ మాన్సూన్ క్యాంప్‌ను చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్ నగరంలో నిర్వహించారు. క్యాంపులో ముఖ్య అతిథిగా జపాన్ హెడ్ క్వార్టర్స్ నుండి మాస్టర్ షిహాన్ తుకుయ తనియమ, ఇండియన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ షహాన్ ఆనంద రత్న, తెలంగాణ రాష్ట్ర చీఫ్ రాపోలు సుదర్శన్ పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్పోర్ట్స్ కరాటే అకాడమీ తరపున పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడకు చెందిన గుగులోత్ గోవింద్ నాయక్ హాజరయ్యారు. ఈ శిబిరంలో తకుయ తనియమ చేతులమీదుగా ఇంటర్నేషనల్ టెక్నికల్ లైసెన్స్‌డ్ ఎగ్జామినర్ సర్టిఫికెట్‌ను గోవింద్ నాయక్ అందుకున్నారు. కోర్సు సిలబస్‌ను పూర్తిచేయడంతో పాటు అద్భుతమైన కరాటే నైపుణ్యాలను గోవింద్ ప్రదర్శించి అతిథుల ప్రశంసలు పొందారు. సమాజంలో చోటుచేసుకునే అరాచకాల నుండి రక్షించుకోవడానికి కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గోవింద్ అన్నారు. తల్లిదండ్రులు ఆడబిడ్డలకు ఆత్మరక్షణ కోసం కరాటే వంటి యుద్ధ విద్యలు నేర్పించాలన్నారు.

పొద్దున లేవగానే కాఫీ తాగనిదే చాలామందికి తెల్లారదు. కప్పులో అలా వేడి వేడి కాఫీ మన ముందుంటే ఆ పొగలతో వచ్చే ఆ వాసన చూస్తుంటే మనల్ని మనమే మైమరిచి పోతాం. పొట్టలో ఓ కప్పు కాఫీ పడితే ఉంటుంది గురూ.. ఆ లెవలే వేరు. మెదడు కూడా అంత వేగంగా పనిచేస్తుంది. చకచకా పనులు అయిపోతాయంతే.. ఇంక వేరే మాటే ఉండదు. కొందరికేమో ఇన్‌స్టంట్ కాఫీ అంటే ప్రాణం. మరికొందరు ఫిల్టర్ కాఫీ అంటే పడి చచ్చిపోతారు. ఇంకొందరికేమో కోల్డ్ కాఫీ అంటే పిచ్చి. ఇలా జిహ్వకో రుచి అన్నట్టు.. ఒక్కొక్కరిదీ ఒక్కో రకమైన టేస్ట్.

– సాక్షి, సిటీబ్యూరో

కాఫీల్లో ఈ కాఫీ వేరయా..!
నగర యువతలో మారుతున్న అభిరుచి
వియత్నాం కాఫీపై పెరుగుతున్న మక్కువ
కోల్డ్ కాఫీతో ఆరోగ్యానికీ మేలంటున్న నిపుణులు

హైదరాబాద్ వైబ్స్



వినూత్నం..

వియత్నాం కాఫీ

డిఫరెంట్ ఫ్లేవర్స్‌లో ఆకట్టుకుంటున్న కాఫీ

భాగ్యనగరం అంటేనే పలు రుచులకు కేరాఫ్ అడ్రస్. ప్రపంచ దేశాల్లో దొరికే అనేక రుచులు మన నగరవాసులకు దొరుకుతాయనడంలో అతిశయోక్తి లేదు. అలాగే ఇటీవల మన నగరంలో ఓ కొత్త రుచి క్రేజ్‌ను సంతరించుకుంటోంది.. దీంతో పాటు నగర ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంటోంది.. దాని గురించి తెలుసుకుందాం..

వరల్డ్ ఫేమస్ హైదరాబాద్..

కోల్డ్ కాఫీ నగరంలో ఇటీవల ప్రాచుర్యం పొందుతోంది. అందులోనూ వియత్నాం కాఫీ నగరంలో మరింత ఫేమస్ అయిపోతోంది. నగర యువత ఈ కాఫీని లొట్టలేసుకుంటూ తాగేస్తోంది. ఒకప్పుడు ఇరానీ చాయ్.. ఇప్పుడు కోల్డ్ కాఫీ.. అప్పటికీ.. ఇప్పటికీ ప్రియమైన పానీయం టీ, కాఫీలే అయినా.. వైవిధ్యమైన రుచి ఆస్వాదించాలి అనుకునే వారికి మాత్రం ఇది పర్‌ఫెక్ట్ టేస్టీ చాయిస్ అని చెప్పొచ్చు.

విభిన్న రుచులు..

వియత్నాం కాఫీలో కూడా అనేక రకాలు ఉన్నాయి. ఎగ్ కాఫీ, యోగర్ట్ కాఫీ, కోకోనట్ వియత్నమీస్ కాఫీ, వైట్ కాఫీ, కాఫెసురా, ఐస్‌డ్ బ్లాక్ కాఫీ, వియెట్ కాఫీ, లైబేరికా కాఫీ, కులీ కాఫీ, చెర్రీ కాఫీ ఇలా రకరకాల ఫ్లేవర్స్ ఉంటాయి. కోల్డ్ కాఫీల్లో కూడా కుకుంబర్ టానిక్, యాపిల్ కాఫీ యేల్, కివీ టానిక్ కాఫీ, స్పానిష్ లాటే ఇలా విభిన్నమైన రుచులు అందుబాటులోకి తెచ్చారు. ఫ్రెండ్స్‌తో కలిసి చిల్ అవ్వాలనుకున్నా.. గర్ల్ ఫ్రెండ్‌తో జాలీగా గడపాలనుకున్నా ఎంచక్కా మాంచి కాఫీ షాప్‌కి వెళ్లి రెండు వియత్నాం కాఫీలు ఆర్డర్ చేసి లాగించేయండి.

అథ్లెట్స్‌కు బూస్టర్

అథ్లెట్స్, జిమ్ చేసే వారికి తక్షణ శక్తిని అందిస్తుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు పని ఒత్తిడి నుంచి చిటికెలో ఉపశమనం కలిగిస్తుంది. అయితే ఏదైనా సరే రోజుకు ఓ మోతాదులో తీసుకుంటేనే మంచిదని, అతి ఏదైనా ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.





లాభాలు అనేకం..

వియత్నాం కాఫీ తాగడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో లాభాలు ఉన్నాయి. శక్తిని పెంచడమే కాకుండా రన్నింగ్, జాగింగ్, వ్యాయామాలు మరింత ఎక్కువగా చేసేందుకు దోహదపడుతుంది. గుండెకు మేలు చేస్తుంది. యాంగ్జయిటీని తగ్గిస్తుంది. మానసిక ప్రశాంతతతో పాటు మెదడుకు మంచి చేస్తుంది. కాలేయం పనితీరును మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాఫీ తాగితే సెరటోనిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఈ హార్మోన్ జ్ఞాపక శక్తి పెంచుతుంది. దీంతోపాటు ఎక్కువ విషయాలు నేర్చుకునేలా చేయడం, మానసిక సంతోషాన్ని ఇవ్వడంతో పాటు డిప్రెషన్ తగ్గించడం, శారీరక ఉష్ణోగ్రతను నియంత్రించడంతో, నిద్ర సరిగ్గా పట్టడంలో తోడ్పడుతుంది.

నా సోల్‌మేట్..



కాఫీ అంటేనే అద్భుతం. ఇక కోల్డ్ కాఫీ అంటే మహా అద్భుతం. ఒంటరిగా ఉన్నప్పుడు కాఫీ తాగితే నన్ను నేనే మైమరిచిపోతాను. కాఫీ తాగిన తర్వాత అరగంట వరకూ ఏమీ తినను. ఎందుకంటే ఆ ఫ్లేవర్ ఆస్వాదించాలనేది నా భావన. చల్లచల్లటి కాఫీ తాగుతుంటే మస్తు మజా వస్తుంది. మంచి లొకేషన్‌లో కాఫీ తాగుతుంటే ఆ ఫీలింగే వేరు. స్నేహితులు తోడైతే అనుభూతి వేరే లెవల్ ఉంటుంది. ఇంకా చెప్పాలంటే కాఫీ నా సోల్‌మేట్. బేగంపేటలోని పంచతంత్ర కాఫీ షాప్‌కి వారానికోసారి వెళ్లి కాసేపు కూర్చుని కాఫీ తాగుతుంటే భలే సరదాగా ఉంటుంది.

– మంజీర ఆరెట్టి, ప్రకాశ్‌నగర్, బేగంపేట

స్వచ్ఛమైన కాఫీ అందించాలని..



కాఫీ ప్రియులకు అచ్చమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వచ్ఛమైన కాఫీ అందించాలనే ఆలోచనతో పంచతంత్ర కేఫ్ ఏర్పాటు చేశాం. కాఫీతో పాటు యాంబియెన్స్ కూడా బాగా ఉండేలా ప్రయత్నించాం. కస్టమర్లకు అద్భుతమైన అనుభూతి ఇవ్వడమే మా ప్రాధాన్యం.

– విక్రమ్, పంచతంత్ర కేఫ్



హీరో గ్లామర్

నిరంతర కృషి, నమ్మకమే విజయానికి గీటురాయి..
గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్

సాక్షి, సిటీబ్యూరో: వ్యక్తిగానో, వ్యవస్థగానో నమ్మకాన్ని పొందాలంటే సంవత్సరాల తరబడి నిరంతరం శ్రమిస్తూనే ఉండాలని, ఆ నమ్మకమే విజయానికి గీటురాయి అని గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తేజ్ అన్నారు. 40 ఏళ్లకు పైగా హీరోగా ప్రజాదరణ పొందుతున్న తన తండ్రి చిరంజీవి, ప్రముఖ టూవీలర్ 'హీరో' బ్రాండ్స్ ఈ నమ్మకానికి నిదర్శనమన్నారు. హీరో మోటో కార్ప్ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ నోవోటెల్ వేదికగా గురువారం న్యూ ఒరిజినల్ గ్లామర్ బైక్ ఆవిష్కరించారు. సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రంజీవ్ జీత్ సింగ్‌తో పాటు హీరో బ్రాండ్ అంబాసిడర్ రామ్‌చరణ్ ముఖ్య అతిథిగా గ్లామర్ బైక్‌ను ఆవిష్కరించారు. 1984లో ప్రారంభమైన హీరో సంస్థ 40 ఏళ్ల పాటు కస్టమర్ల మన్ననలు పొందుతుందని, ఆ కస్టమర్లే తమ సంస్థకు హీరోలని రంజీవ్ జీత్ సింగ్ అన్నారు. ముఖ్యంగా 19 ఏళ్ల పాటుగా గ్లామర్ బైక్ అందరికీ ఫేవరెట్ బైక్‌గా 80 లక్షల కస్టమర్ల మనసులను చూరగొందని అన్నారు. అనంతరం రామ్ చరణ్ మాట్లాడుతూ పలు ఆసక్తికర అంశాలను పంచుకున్నారు.

ఆమె అభిమానం నా బాధ్యతను పెంచింది

ఆర్ఆర్ఆర్ ప్రమోషన్‌లో భాగంగా జపాన్ వెళ్లిన సమయంలో దాదాపు 70 ఏళ్ల మహిళ 180 పేజీల ఆర్ట్ వర్క్ బుక్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు. అది తెరచి చూస్తే నా గత సినిమాల్లోని కొన్ని స్టిల్స్‌ని ఆర్ట్‌గా వేశారు. ఇలాంటి అభిమానం నా బాధ్యతను మరింతగా పెంచింది. ఆర్ఆర్ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డ్ రావడం అందులో ఒకటి. నాటు నాటు పాటలోని కొన్ని నిమిషాల స్టెప్ కోసం తారక్, నేను దాదాపు 30 రోజులకు పైగా కష్టపడ్డాం. ఈ కష్టం ఆస్కార్‌తో పాటు ప్రపంచ వ్యాప్త అభిమానులను అందించింది.

బైక్స్ అంటే ఇష్టం..

చిన్నప్పటి నుంచీ బైక్ అంటే ఇష్టం. కానీ నాన్న బైక్‌లకు అంతగా ప్రోత్సహించేవారు కాదు. అందుకే నాన్నకు తెలియకుండా ఫ్రెండ్స్ హీరో బైక్స్ నడిపేవాడిని. ఇప్పుడు అదే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారడం గొప్ప అనుభూతినిస్తుంది. ప్రస్తుతం గుర్రాలన్నా, హార్స్ రైడింగ్ అన్నా చాలా ఇష్టం. ఎంతలా అంటే మగధీర సినిమాలో షూట్ చేసిన గుర్రం విపరీతంగా నచ్చి, షూట్ తరువాత దర్శకులు రాజమౌళితో మాట్లాడి ఆ గుర్రాన్ని నేనే తీసుకున్నా. ఈ మధ్యనే ఆ గుర్రం మరో గుర్రానికి జన్మనిచ్చింది. దానిని నా కూతురు క్లీంకారాకు గిఫ్ట్‌గా ఇచ్చాను. ప్రస్తుతం నా దగ్గర 15 గుర్రాలు ఉన్నాయి.

తన కోసమే పక్షులు కొన్నా..

జంతువులంటే నాకు చాలా ఇష్టం. నా కూతరు ఇష్టంగా ఆహారం తినడం కోసమే కొన్ని రకాల పక్షులను కొన్నాను. వాటిని చూపిస్తూ రోజూ ఆహారం తినిపిస్తాం. క్లీంకారా అనే నా కూతురు పేరును సంస్కృత భాషలోని లలిత సహస్ర నామం నుంచి ఎంచుకున్నాం. ఇక సినిమాలు ఎన్నో మరచిపోలేని అనుభూతులతో పాటు బాధ్యతను పెంచాయి.

నేనో నిత్య విద్యార్థిని..

నా సినిమాల్లో రంగస్థలం, ఆరెంజ్, మగధీర సినిమాలు చాలా ఇష్టం. యాక్షన్ సినిమాలు చేయడం ఇష్టం, త్వరలో బుచ్చిబాబు దర్శకత్వంలో మంచి కామెడీ సినిమాను చేస్తున్నాను. ఆర్ఆర్ఆర్ ప్రయాణంలో రాజమౌళి కీలకం. తనతో షూటింగ్ అంటే స్కూల్‌కు వెళ్లే విద్యార్థిలా నేర్చుకోవడానికి వెళతాను. నాన్న నుంచి నేర్చుకున్న జీవిత సూత్రాలు తప్పకుండా పాటిస్తాను. మన ప్రయాణంలో భాగమైన ఆత్మీయులను, సిబ్బందినీ మర్చిపోవద్దని చెప్పేవారు. అందుకే 15 ఏళ్లకు పైగా నా సిబ్బందిని మార్చకుండా నా దగ్గరే ఉండేలా చూసుకుంటున్నా..

మోస్ట్ మెమొరబుల్ మూమెంట్..

స్పోర్ట్స్‌తో ఎంగేజ్ అవ్వడం కన్నా పుస్తకాలు చదవడం ఇష్టం. నటన పరంగా తమిళహీరో సూర్య, సమంతాలను బాగా ఇష్టపడతాను. క్లీంకారా జన్మించిన సందర్భం జీవితంలో అత్యంత అనుభూతికి లోనయ్యాను. మోస్ట్ మెమొరబుల్ మూమెంట్..!! నార్త్ ఇండియా అన్నా.. ముఖ్యంగా రాజస్థాన్, హిమాలయాలు ఫేవరెట్ స్పాట్స్. నా గురించి సింపుల్‌గా ఒక్కమాటలో చెప్పాలంటే.. రామ్ చరణ్ అంటే మిత భాషి కుడు, స్నేహితులకు దగ్గరగా ఉండేవాడు, ముఖ్యంగా హోమ్ బాయ్.

యువ ప్రతిభకు వేదికగా 'అలీ క్లబ్ మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా'..
దేశవ్యాప్తంగా పాల్గొంటున్న యువ ఔత్సాహికులు..
గ్రాండ్ ఫినాలేకు చేరుకున్న నగరానికి చెందిన 17 ఏళ్ల ఐశ్వర్య..

దేశవ్యాప్తంగా యువ ప్రతిభను కనిపెట్టి, వారిని ప్రోత్సహించే ప్రతిష్టాత్మక పోటీ 'అలీ క్లబ్ మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా'. ఈ పోటీలో పాల్గొనడానికి, విజేతగా నిలవడానికి దేశవ్యాప్తంగా యువత ఆసక్తి చూపిస్తుంది. అయితే 'అలీ క్లబ్ మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా-2024' పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల కాటేపల్లి ఐశ్వర్య ఫైనలిస్ట్‌గా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించింది. - సాక్షి, సిటీబ్యూరో

అలీ క్లబ్ మిస్ ఫినాలేలో

ఐశ్వర్య

ఫ్యాషన్, జీవనశైలి, వినోద రంగాల్లో యువ ప్రతిభతో వారి కలలను నెరవేర్చుకోవడానికి అద్భుత వేదికగా ఫ్యాషన్ పోటీలు నిలుస్తాయి. ముఖ్యంగా నగరంలో 'అలీ క్లబ్ మిస్, మిస్టర్ టీన్ ఇండియా'.. 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్' ద్వారా గుర్తింపు పొందింది. ఇలాంటి వేదికపై తన అభిరుచులు, ఫ్యాషన్‌పై ఆమె అంకితభావంతో విజేతగా నిలవడానికి గ్రాండ్ ఫినాలేకి చేరుకుంది.





సెమీ ఫైనల్స్ ఆత్మస్థైర్యాన్ని పెంచింది...

ప్రస్తుతం షాఫ్ట్ మల్టీమీడియాలో కంప్యూటర్ సైన్స్‌పై దృష్టి సారిస్తూ 12వ తరగతి చదువుతోంది ఐశ్వర్య. ఆమె చదువులతో పాటు మల్టీమీడియా, ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లొమా కోసం కృషి చేస్తుంది. నగరంలోని డిజిటల్ మార్కెటింగ్ ఏజెన్సీలో పనిచేస్తూ వాస్తవ ప్రపంచ అనుభవాన్ని పొందుతోంది. ఈ ప్రయాణం వ్యక్తిగతంగానే కాకుండా వృత్తిపరమైన వృద్ధికి ఆమె నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ నెల 31న ఢిల్లీ వేదికగా జరగనున్న గ్రాండ్ ఫినాలేలో విజేతగా నిలవడానికి ఇప్పటికే అక్కడికి చేరుకున్నానని ఐశ్వర్య తెలిపింది. గత నెలలో జరిగిన సెమీ–ఫైనల్ రౌండ్‌లో దేశవ్యాప్తంగా పాల్గొన్న ఫ్యాషన్ ఔత్సాహికులను దాటుకుని గ్రాండ్ ఫినాలేలో అడుగుపెట్టడం మరింత ఆత్మస్థైర్యాన్ని పెంచిందని ఆమె అన్నారు. దేశవ్యాప్తంగా యువ ప్రతిభావంతులకు గుర్తింపునిచ్చే ఈ వారసత్వంలో ప్రాతినిధ్యం వహిస్తూ హైదరాబాద్ నగరాన్ని మరోసారి జాతీయ వేదికపై నిలపడం సంతోషంగా ఉందన్నారు. తన తోటి పార్టిసిపెంట్స్‌తో కలిసి జడ్జిల ప్యానెల్ ముందు తమ సామర్థ్యాలను ప్రదర్శించే ఫినాలే కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని ఐశ్వర్య తెలిపింది.

క్లుప్తంగా...

కల్యాణలక్ష్మి బకాయిలు క్లియర్

రూ.1,225.43 కోట్లు విడుదల చేయడం శుభపరిణామం: పొన్నం



సాక్షి, హైదరాబాద్: కల్యాణలక్ష్మి పథకం కింద పెండింగ్ బకాయిలన్నీ పూర్తిస్థాయిలో చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా బీసీలు, ఈబీసీలకు రూ.1,225.43 కోట్లు విడుదల చేయడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్కలకు పొన్నం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఒకేరోజు 185 రిట్ పిటిషన్ల పరిష్కారం

జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ రికార్డు



సాక్షి, హైదరాబాద్: ఒకేరోజు 185 రిట్ పిటిషన్లను పరిష్కరించి జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ రికార్డు సృష్టించారు. గురువారం ఆయన పరిష్కరించిన ఈ పిటిషన్లలో 179 దాదాపుగా ఒకే అంశానికి సంబంధించినవి కావడం గమనార్హం. కాగా వీటిలో ఆస్తి రిజిస్ట్రేషన్, ఇతర వివాదాలకు సంబంధించిన పలు పిటిషన్లు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఒకేరోజు పెద్ద మొత్తంలో కేసుల పరిష్కారంతో కక్షిదారులకు ఊరట లభించింది.

మంద కృష్ణకు మతిభ్రమించింది

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండిపాటు



చెన్నయ్య

పంజగుట్ట (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా మాలలు తలపెట్టిన భారత్‌బంద్ విజయవంతం కావడంతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ మతిభ్రమించి మాలలు మనువాదులు అంటూ పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు మండిపడ్డారు. 30 ఏళ్లుగా మను వాదులతో సహజీవనం చేస్తున్న మందకృష్ణ అంబేడ్కర్ వాదం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో సమితి ప్రతినిధులు చెన్నయ్య, చెరుకు రాంచందర్, బత్తుల రాంప్రసాద్, జి.వినోద్, పిల్లి సుధాకర్ మాట్లాడారు. మాలలు మనువాదులు కారని, అసలైన అంబేడ్కరిస్టులు మాలలే అన్న విషయం మందకృష్ణ తెలుసుకోవాలన్నారు. జస్టిస్ రామచంద్రరాజు కమిషన్, ఉషామెహ్రా కమిషన్ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సూచనలు చేశాయని మందకృష్ణ వాస్తవాలు వక్రీకరిస్తూ మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్ మాదిగ జాతిని మనువాద బీజేపీకి, మోదీకి తాకట్టు పెడుతున్న మనువాద చక్రవర్తిగా మందకృష్ణను అభివర్ణించారు. భారత్‌బంద్ ఆరంభం మాత్రమే అని ముందు ముందు మాలలు ఐక్యంగా పోరాటం ఉధృతం చేస్తారని హెచ్చరించారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేస్తామన్నారు.

'విజ్ఞాన్ యువ' అందుకున్న డా. ఎస్.ఎల్.కృష్ణమూర్తి



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్‌లో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డా. ఎస్.ఎల్.కృష్ణమూర్తి విజ్ఞాన్ యువ శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు అందుకున్నారు. ఆరు రకాల ఉప్పులను, లవణీయత, క్షారతను తట్టుకోగల బియ్యం, నాలుగు జన్యు నిల్వలపై డా.కృష్ణమూర్తి అభివృద్ధి చేసిన పరిశోధనకు రాష్ట్రీయ విజ్ఞాన్ యువ అవార్డు పొందారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 2024 సంవత్సరానికిగాను 'రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్'లను అందించారు.

జన్వాడ ఆస్తులను అమరవీరుల కుటుంబాలకు ఇవ్వాలి

బండ్రు శోభారాణి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: జన్వాడ ఫాంహౌస్ తనది కాదని, తన మిత్రుడి దగ్గర నుంచి లీజుకు తీసుకున్నట్లు చెప్పిన మాటలకు కేటీఆర్ కట్టుబడి ఉండాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, 2018, 2023 ఎన్నికల అఫిడవిట్‌లో తన సతీమణి పేరుతో ఆస్తి ఉన్నట్లు జన్వాడ ఫాంహౌస్ వివరాలను తెలిపిన కేటీఆర్, ఇప్పుడు అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. జన్వాడలో ఉన్న కేటీఆర్ ఆస్తులను అమరవీరుల కుటుంబాలకు రాయాలని డిమాండ్ చేశారు.

111.. అడ్రస్ తెలుసా హైడ్రా?

అక్రమ నిర్మాణాలకు కేరాఫ్‌గా ట్రిపుల్ వన్ జీవో ప్రాంతం

- గండిపేట ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలను కూల్చేస్తున్న హైడ్రా అధికారులు
- ఆ బుల్డోజర్లు అన్ని అక్రమ నిర్మాణాలపైకి వెళతాయా?
- 'ఎంపిక' చేసిన వాటికే పరిమితమా? అనే ప్రశ్నలు



సాక్షి, హైదరాబాద్: వందేళ్లుగా భాగ్యనగరవాసుల దాహార్తిని తీరుస్తున్న ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరిధిలోని అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం బుల్డోజర్లతో విరుచుకుపడుతోంది. అక్రమ భవనాలను తొలగించి, జలాశయాలను పరిరక్షించాలన్న ప్రభుత్వ ఉద్దేశం మంచిదేనన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. కానీ 'ఈ కూల్చివేతలను కేవలం 'ఎంపిక' చేసిన భవనాలు, నిర్మాణాలకే పరిమితం చేస్తారా? లేక అక్రమ నిర్మాణాలు అన్నింటిపైకీ బుల్డోజర్లు వెళతాయా? విచ్చలవిడి అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన 111 జీవో పరిధిలోని ప్రాంతాలపై 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా)' దృష్టిపెడుతుందా?' అన్న ప్రశ్నలు వస్తున్నాయి. గండిపేట జలాశయం ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని అక్రమ నిర్మాణాలపైకి 'హైడ్రా' బుల్డోజర్లను నడిపిస్తున్న నేపథ్యంలో.. ట్రిపుల్ వన్ జీవో వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.

'ట్రిపుల్ వన్'పై తీవ్ర గందరగోళం

జంట జలాశయాలను కాపాడేందుకు, వాటి పరీవాహక ప్రాంతాలను పరిరక్షించేందుకు 40 ఏళ్ల క్రితం ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 84 గ్రామాలను జీవ పరిరక్షణ ప్రాంతం (బయో కన్జర్వేషన్ జోన్) పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ జలాశయాల చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో కాలుష్య కారక పరిశ్రమలు, భారీ హోటళ్లు, నివాస కాలనీలు, ఇతర కాలుష్య కారక నిర్మాణాలపై నిషేధం విధిస్తూ 1994లో తొలుత జీవో–192ను తీసుకొచ్చారు. దీనికి కొన్ని సవరణలు చేస్తూ 1996 మార్చి 8న అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీవో–111ను తెచ్చింది. ఇటీవలి వరకు అది కొనసాగింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో గ్రేటర్ హైదరాబాద్ దాహార్తిని తీర్చేందుకు జంట జలాశయాల మీద ఆధారపడాల్సిన అవసరం లేదని గత ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 2022 ఏప్రిల్‌లో ట్రిపుల్ వన్ జీవోను రద్దు చేసి, దాని స్థానంలో జీవో నంబర్ 69ను తీసుకొస్తున్నట్టు ప్రకటించింది. ఇక్కడి 84 గ్రామాలకు ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపకల్పన, ఇతర అంశాలపై అప్పటి ప్రభుత్వ సీఎస్ సోమేశ్‌కుమార్ నేతృత్వంలో కమిటీని కూడా నియమించింది. కానీ ఆ కమిటీ ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. ఈలోపు ఎన్నికలు సమీపించడం, ప్రభుత్వం మారడంతో జీవో–111పై గందరగోళం నెలకొంది.

'ఎంపిక' చేసిన భవనాలపైనేనా?

గ్రేటర్ హైదరాబాద్ సిటీకి చేరువలో 84 గ్రామాలు, 1.32 లక్షల ఎకరాల భూములు, 584 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం.. క్లుప్తంగా జీవో–111 పరిధి ఇది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) నుంచి 10 కిలోమీటర్ల వరకు ఎలాంటి శాశ్వత నిర్మాణాలు, లే–అవుట్లకు అనుమతి లేదు. ఈ ప్రాంతంలోని ఏ స్థలంలో అయినా దాని విస్తీర్ణంలో కేవలం 10శాతం మాత్రమే నిర్మాణాలు చేపట్టవచ్చు. అదీ శాశ్వత నిర్మాణం అయి ఉండకూడదు. నీటి సహజ ప్రవాహానికి ఏమాత్రం అడ్డుగా ఉండకూడదు. కానీ ఈ నిబంధనలు కాగితాలకే పరిమితయ్యాయి. అక్రమార్కులు అధికారులతో కుమ్మక్కై అడ్డగోలుగా నిర్మాణాలను చేపట్టారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైడ్రా, మున్సిపల్ శాఖల అధికారులు జలాశయాల పరీవాహక ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. ఇది ఈ జలాశయాల పరిధిలోని అన్ని అక్రమ నిర్మాణాలపై ఉంటుందా? లేదా కేవలం 'ఎంపిక' చేసిన నిర్మాణాల కూల్చివేతతోనే ఆగిపోతుందా? అని పర్యావరణవేత్తలు ప్రశ్నిస్తున్నారు. జలాశయాల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోకపోతే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు కూడా భవిష్యత్తులో హుస్సేన్‌సాగర్‌లా మురికికూపమైపోయే మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

111 జీవో పరిధిలోకి వచ్చే ప్రాంతాలివీ..

మండలం	గ్రామాలు
మొయినాబాద్	27
శంషాబాద్	40
షాబాద్	2
కొత్తూరు	1
రాజేంద్రనగర్	5
శంకర్‌పల్లి	3
చేవెళ్ల	6

అనుమతి లేకున్నా లక్షల్లో నిర్మాణాలు

40 ఏళ్ల కిందటే జంట జలాశయాల పరీవాహక ప్రాంతాన్ని బయో కన్జర్వేషన్ జోన్ పరిధిలోకి తీసుకువచ్చినా.. అక్రమ నిర్మాణాలు కొనసాగుతూ వచ్చాయి. గత పది, పదిహేనేళ్లలో విపరీతంగా పెరిగాయి. అధికారులు కాసులకు కక్కుర్తిపడి ఇష్టారీతిగా నిర్మాణాలు సాగుతున్నా చూసీచూడనట్టు వదిలేశారు. ప్రధానంగా మొయినాబాద్, శంషాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, రాజేంద్రనగర్ మండలాల్లోని ట్రిపుల్ వన్ జీవో ప్రాంతంలో నివాస, వాణిజ్య సముదాయాలు, కర్మాగారాలు, హోటళ్లు, ఇతర భవన నిర్మాణాలు వెలిశాయి. జీవో–111 పరిధిలో 7 మండలాల్లోని 84 గ్రామాల పరిధిలో మొత్తం 426 అక్రమ లే–అవుట్లు, 10,907 గృహాలు, 1,363 వాణిజ్య నిర్మాణాలు, 190 పారిశ్రామిక, ప్రభుత్వ నిర్మాణాలు వెలిశాయని 2016లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హైకోర్టుకు నివేదించారు. ఇప్పుడు వీటి సంఖ్య లక్షల్లోనే ఉంటుందని అంచనా.

ఏ మండలంలో ఎన్ని అక్రమ నిర్మాణాలంటే? (2016 నాటికి)

మండలం	లే అవుట్లు	నివాస భవనాలు	వాణిజ్య భవనాలు	పారిశ్రామిక భవనాలు
మొయినాబాద్	112	1,717	361	37
శంషాబాద్	270	6,630	809	130
షాబాద్	2	161	17	0
రాజేంద్రనగర్	17	777	49	12
శంకర్‌పల్లి	5	693	64	2
చేవెళ్ల	20	929	63	9

అటు అభివృద్ధి.. ఇటు మనుగడ..



అభివృద్ధిలో వెనుకబడుతున్నామని, జీవో–111 ఎత్తేయాలని ఆ ప్రాంతంలోని వారు మొదట్నుంచీ కోరుతున్నారు. అలా చేస్తే జంట జలాశయాల మనుగడకు విఘాతం కలుగుతుందని పర్యావరణవేత్తలు స్పష్టం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వాలు స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోతున్నాయి. ఇటీవల కాంగ్రెస్ సర్కారు జీవో–111పై కోదండరెడ్డి నాయకత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదిక ఆధారంగా త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నాం.

– చింపుల సత్యనారాయణరెడ్డి, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్స్ ప్రెసిడెంట్

ఫిఫ్త్ సిటీగా జీవో–111



జీవో–111 పరిధిలోని 84 గ్రామాలను ఫిఫ్త్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పూనుకోవాలి. జీవో పరిధిలోని 84 గ్రామాలకు నెట్ జీరో పాలసీని అవలంబించేలా ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. పర్యావరణానికి హాని కలిగించని, తక్కువ సాంద్రత కలిగిన నివాస, సంస్థాగత, వినోదాత్మక కేంద్రాల నిర్మాణాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలి. వాన నీరు, జలచరాల అధ్యయన నివేదికను పరిగణనలోకి తీసుకోవాలి.

– జీవీ రావు, తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

రేవంత్‌తో మంద కృష్ణ భేటీ



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వేగవంతంగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి సీఎంతో ఆయన భేటీ అయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైన ఉందని మంద కృష్ణ సీఎంకు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, వేగంగా వర్గీకరణ చేపట్టి రిజర్వేషన్ ఫలాలను అందరికీ అందిస్తామని హామీ ఇచ్చినట్లు మంత్రి దామోదర తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి మోత్కుపల్లి, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ తదితరులున్నారు.

కోవర్టు అంటూ తొలిసారి చంపింది మహిళనే

- 1992లో తూము సరళను చంపిన మావోయిస్టులు
- ఆ సంఘటన ఆధారంగానే విరాటపర్వం సినిమా
- ఇప్పటివరకు రాధతో సహా ముగ్గురు మహిళలు హతం



సరళ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కోవర్టు ఆరోపణలతో పల్లెపాటి రాధ అలియాస్ నీల్సోను మావోయిస్టులు హతమార్చడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అయితే మావోయిస్టు పార్టీకి కోవర్టులు కొత్త కాదు.. కోవర్టు అంటూ తొలిసారిగా మావోయిస్టులు చంపింది కూడా ఒక మహిళనే. విప్లవ భావాల పట్ల ఆకర్షితురాలైన పదహారేళ్ల తూము సరళ మావోయిస్టు పార్టీలో చేరింది. అయితే కోవర్టు అనే అనుమానంతో 1992 జూలైలో కరీంనగర్–నిజామాబాద్ జిల్లాల కార్యదర్శి శంకరన్న ఆమెను చంపాడు. ఈ సంఘటన ఆధారంగానే 'విరాటపర్వం' సినిమా తెరకెక్కింది. ఆ తర్వాత ఇదే ఏరియాలో చోటు చేసుకున్న మరో పెద్ద ఎన్‌కౌంటర్‌లో 9 మంది చనిపోయారు. ఈ ఘటనకు దళ సభ్యురాలైన పద్మ కారణమని పేర్కొంటూ ఆమెపై కోవర్టు ముద్ర వేసి 2005లో మరిమడ్ల గ్రామం దగ్గర మావోయిస్టులు కాల్చి చంపారు. ఈనెల 21న పారా మెడికల్ విద్యార్థిగా విప్లవ బాట పట్టిన రాధ అలియాస్ నీల్సోను ఇదే ఆరోపణలపై హతం చేశారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత తిరిగి కోవర్టుల పేరుతో తమ పార్టీలోని సభ్యులనే మావోయిస్టులు హతమార్చడం మొదలైంది.

లేటరల్ ఎంట్రీ నియామకాలకు మేం వ్యతిరేకం: డి. రాజా

- రాష్ట్రంలో కాంగ్రెస్ పొత్తు ధర్మాన్ని పాటించాలి
- రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇవ్వాలి



విలేకరులతో మాట్లాడుతున్న డి.రాజా, పక్కన చాడ వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట(వరంగల్): యూపీఎస్సీ ద్వారా జరగాల్సిన నియామకాల్లో కేంద్ర ప్రభుత్వం లేటరల్ విధానం తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. వరంగల్ నగరంలో గురువారం మొదలైన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. లేటరల్ నియామకాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో వైద్యుల మాన ప్రాణాల రక్షణ కోసం జాతీయస్థాయిలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ పాలన రాజ్యాంగవిరుద్ధంగా సాగుతోందని విమర్శించిన రాజా... అదానీ కుంభకోణంపై దర్యాప్తు కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని ప్రతిపక్షాలు కోరినా ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగం, నిత్యావసర ధరలు బాగా పెరిగిపోయినా.. బడ్జెట్ సమావేశాల్లో వీటిపై అసలు చర్చనే జరగకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదలపై వచ్చే నెల మొదటి వారంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తు చర్చల్లో భాగంగా రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ తెలిపిందని, ఆ దిశగా పొత్తు ధర్మాన్ని పాటించాలని రాజా గుర్తు చేశారు.

రుణ మాఫీ విషయంలో కాంగ్రెస్‌పై నిరాసక్తత: కూనంనేని

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రుణ మాఫీ విషయంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో కొంత నిరాసక్తత చోటు చేసుకుందన్నారు. నూటికి నూరు శాతం అమలు కాకపోవడానికి కారణాలను అన్వేషించి పరిష్కార మార్గం చూపాలని కోరారు. సమావేశంలో నాయకులు డాక్టర్ నారాయణ, అజీజ్ పాషా, చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి. టి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

గద్దర్ అవార్డుల కమిటీ చైర్మన్‌గా బి.నర్సింగరావు

అవార్డుల నియమ, నిబంధనలకు కమిటీ వేసిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరిట సినీ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో.. నియమ, నిబంధనలు, లోగో, నామకరణం, ఎలాంటి పద్ధతులు అనుసరించాలన్న అంశంపై సినీ ప్రముఖులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీ చైర్మన్‌గా బి.నర్సింగరావు, వైస్‌చైర్మన్‌గా వి.వెంకటరమణారెడ్డి (దిల్‌రాజు), సలహా సభ్యులుగా కె.రాఘవేందర్‌రావు, అందెశ్రీ, తమ్మారెడ్డి భరద్వాజ, అల్లు అరవింద్, గుమ్మడి వెన్నెల, తనికెళ్ల భరణి, దగ్గుబాటి సురేశ్‌బాబు, కె.చంద్రబోస్, ఆర్.నారాయణమూర్తి, వందేమాతరం శ్రీనివాస్, అల్లాణి శ్రీధర్, సన యాదిరెడ్డి, హరీశ్ శంకర్, ఎల్దండి వేణు (బలగం)లు ఉంటారు. ఈ కమిటీ మెంబర్ కన్వీనర్‌గా తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారని సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో ప్రత్యేక కార్యదర్శి హనుమంతరావు గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

నష్టపరిహారం చెల్లించే బాధ్యత కంపెనీదే

- అనకాపల్లి సెజ్‌లో ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన ఏపీ సీఎం చంద్రబాబు
- మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున నష్ట పరిహారం



సాక్షి, అనకాపల్లి: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు చెల్లించే నష్ట పరిహారం మొత్తం కంపెనీయే భరిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ. 25 లక్షలు పరిహారం అందించనున్నట్లు వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం 2.34 గంటలకు హెలికాప్టర్ ద్వారా ప్రమాదం జరిగిన ఫార్మా కంపెనీ వద్దకు చేరుకుని, పేలుడు జరిగిన బ్లాకులను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అచ్యుతాపురం సెజ్‌లో ఎసైన్షియా ఫార్మా రెడ్ కేటగిరీ పరిశ్రమ అని, అలాంటి పరిశ్రమల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సెజ్‌లో ప్రమాదంపై హైలెవల్ విచారణ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఆ కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులందరిపైనా కఠిన చర్యలు ఉంటాయన్నారు

నిలువెల్లా నిర్లక్ష్యం..

- ప్రమాదం నుంచి పరిహారం దాకా సర్కారు తీవ్ర అలసత్వం
- బాధిత కుటుంబాలకు కనీస సమాచారం ఇవ్వలేని అసమర్థత
- మీడియాలో చూసి తమవారి కోసం తల్లడిల్లిన దైన్యం

వివరాలకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులుగా మరో ముగ్గురికి స్థానం లభించింది. మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వేంపల్లి సతీష్‌రెడ్డిలు (సమన్వయం), మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (అనుబంధ విభాగాలు) ఈ పదవిలో నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీకి సంబంధించిన పలు అనుబంధ విభాగాలకు నియామకాలు చేపట్టారని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, చేనేత విభాగం అధ్యక్షుడిగా గంజి చిరంజీవి, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పానుగంటి చైతన్యలను నియమించారు. ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకు అప్పగించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్థానంలో పేరాడ తిలక్ నియమితులయ్యారు. ఇకపై నియోజకవర్గ పార్టీ వ్యవహారాలను తిలక్ సమన్వయ పరుస్తారు.

ఆ భూములకు యూఎల్‌సీ వర్తించదు

హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: న్యాయస్థానం ఆదేశాల మేరకు వేలం వేసిన భూములకు అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) వర్తించదని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. వివాదం ఉంటే ముందే నోటీసులివ్వాలి తప్ప.. వేలం ముగిసిన తర్వాత కాదని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోలేమని చెప్పింది. ఈ విషయంలో ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్‌లోని రెండు ఎకరాల భూమిని రాజేంద్ర అగర్వాల్.. కోర్టు ఆదేశాల మేరకు బ్యాంక్ వేలంలో కొనుగోలు చేశారు. 2010లో బిల్డింగ్ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఆ భూమి యూఎల్‌సీ పరిధిలో ఉందని ఎన్‌వోసీ తీసుకురావాలని చీఫ్ సిటీ ప్లానర్ ఆదేశించారు. ఆ తర్వాత ఆ భూమిని క్రమబద్ధీకరణ చేసుకోవాలని 2013లో అర్బన్ ల్యాండ్ సీలింగ్ ప్రత్యేక అథారిటీ పేర్కొన్నారు. యూఎల్‌సీ, చీఫ్ సిటీ ప్లానర్ మెమోలను సవాల్ చేస్తూ రాజేంద్ర అగర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. 2013లో అర్బన్ ల్యాండ్ సీలింగ్ ప్రత్యేక అథారిటీ, 2010లో చీఫ్ సిటీ ప్లానర్ జారీ చేసి మెమోలను కొట్టివేశారు. యూఎల్‌సీ నుంచి ఎన్‌వోసీ కోసం పట్టుబట్టకుండా, చట్టం ప్రకారం 2010లో పిటిషనర్లు పెట్టుకున్న బిల్డింగ్ దరఖాస్తు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సింగిల్ జడ్జి ఆదేశాలను సవాల్ చేస్తూ రెవెన్యూ శాఖ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు వేలం జరిగే ముందు స్పందించని అధికారులు తర్వాత అభ్యంతరం తెలపడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. ఆ భూమి యూఎల్‌సీ పరిధిలోకి వస్తే.. రహదారి నిర్మాణం కోసం పిటిషనర్ల వద్ద నుంచి ఎలా సేకరించారని ప్రశ్నించింది. సింగిల్ జడ్జి ఆదేశాలను అమలు చేయాలని ఆదేశించింది.

ఆ పంచాయతీలన్నీ పట్టణ ప్రాంతాలుగా..

- ఓఆర్ఆర్ లోపల, ఆవల, మున్సిపాలిటీల అంచున ఉన్న గ్రామాలను అభివృద్ధి చేయాలనే..
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



సమావేశంలో దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం, ఒవైసీ

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్ లోపల, ఆవలి వైపున, మున్సిపాలిటీల అంచున ఉన్న గ్రామ పంచాయతీలన్నింటినీ పట్టణ ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్ లోపల ఉన్న ప్రాంతాలను తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌గా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. సిటీ, శివారు మున్సిపాలిటీ నుంచి రీజినల్ రింగ్ రోడ్ లోపల ఉన్న 23 గ్రామ పంచాయతీల విలీనం, పునర్వ్యవస్థీకరణపై మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చైర్మన్ హోదాలో శ్రీధర్‌బాబు గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో తొలి సమావేశం నిర్వహించారు. సబ్ కమిటీ సభ్యులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, గూడెం మహిపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. గ్రామపంచాయతీలను పునర్వ్యవస్థీకరించడం వల్ల గ్రామీణ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని శ్రీధర్‌బాబు తెలిపారు. పారిశ్రామిక క్లస్టర్లు వస్తాయని, మౌలిక వసతుల పరంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డుల మధ్య లింక్ రహదారులు నిర్మిస్తామని చెప్పారు. దీనివల్ల కనెక్టివిటీ పెరిగి గ్రామాల రూపురేఖలు మారిపోతాయని తెలిపారు.

తీర్మానాలు చేయాలని సూచన...

జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల్లో విలీనంచేయబోతున్న గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించి ఈ మేరకు తీర్మానాలు ఆమోదించాలని సూచించినట్టు సమాచారం. మున్సిపాలిటీల్లో విలీనానికి పంచాయతీల్లో ఏకగ్రీవ తీర్మానాలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు సబ్ కమిటీ ఆదేశించినట్టు తెలుస్తోంది. గతంలో ఈ విలీన ప్రతిపాదిత గ్రామాల్లో ప్రత్యేక అధికారులు తీర్మానాలు చేసినా... కేబినెట్ సబ్‌కమిటీని ఆ తర్వాత ఏర్పాటు చేయడంతో అవి చెల్లకుండాపోయాయి.



తంగలాన్‌లో పార్వతి తిరువోత్తు

'తంగలాన్' సినిమాలో దళిత స్త్రీలకు మొదటిసారి రవికెలు ఇచ్చినప్పుడు
వారు వెలిబుచ్చే ఆనందం, సంబరం ప్రేక్షకులకు కన్నీరు తెప్పించింది.
స్త్రీలపై పీడన చరిత్రలో అనేక విధాలైతే దళిత స్త్రీలకు
పై వస్త్రం ధరించే హక్కు లేకుండా చేయడం మరో పీడన.
రవికె ధరించాలంటే దళిత స్త్రీలు 'ములక్కారం' పేరుతో సుంకం కట్టాల్సి వచ్చేది.
దీనిని ఎదిరించడానికి తన రొమ్ముల్ని కోసుకుంది నాంజెలి అనే స్త్రీ.
కన్యాకుమారిలో దళిత స్త్రీలు 'రవికె కట్టు ఉద్యమాన్ని' నిర్వహించారు.
ఈ తరం విద్యార్థులు తెలుసుకోవాల్సిన చరిత్ర ఇది.

● 'ములక్కారం'పై ధిక్కారం

గుండెను కోసే రవిక సుంకం

'**తంగలాన్**' సినిమాలో ఉత్తర ఆర్కాట్ జిల్లాలోని దళితులకు భూమి ఉండదు. ఊరిలో భాగం ఉండదు. అలాగే బట్ట కూడా ఉండదు. ఒంటి నిండా బట్ట లేకుండా ఉంచడం వారిని 'గుర్తించడానికి' ఒక సంకేతం. పురుషులు 'మోకాళ్లకు దిగని' అంగవస్త్రాన్ని మాత్రమే కట్టుకోవాలి. స్త్రీలు రవిక లేకుండా మోకాళ్ల పైకి చీర చుట్టుకోవాలి. వారి భూమిని వారి నుంచి లాక్కుని వారినే కూలి వాళ్లుగా మార్చి పని చేయిస్తుంటాడు జమీందారు. ఒకవేళ ఎవరికైనా భూమి ఉంటే అందులో పంట పండితే అది ఇల్లు చేరదు. నిప్పుకు ఆహుతి అవుతుంది. ఈ బాధలు పడలేక బ్రిటిష్ వారి కింద ఊడిగం చేసి బంగారు గని కార్మికులుగా పని చేసి బాగుపడదామనుకుంటారు దళితులు. అందులో భాగంగా తంగలాన్ (విక్రమ్) నాయకత్వంలో దళితులను కోలార్‌కు వలస తీసుకెళతారు. అక్కడ విక్రమ్ కష్టం చూసి, నాయకత్వ లక్షణాలు చూసి ముందు అతన్ని దుస్తులతో గౌరవిస్తాడు. ప్యాంట్ షర్ట్ ఇస్తాడు. కూలి డబ్బు తీసుకొని గుర్రమెక్కి వచ్చిన విక్రమ్ తన వాడ మహిళల కోసం తెచ్చే ఒకే ఒక కానుక రవికలు. వాటిని చూసి మహిళలు తమ జీవితాల్లో ఇలాంటి రోజొకటి వస్తుందా అన్నట్టు చూస్తారు. రవిక తొడుక్కునే స్వేచ్ఛను మొదటిసారి అనుభవిస్తూ పులకించిపోతారు. ఒంటి నిండా బట్ట కట్టుకుంటే వచ్చే గౌరవాన్ని పొందుతారు. 1850 కాలం నాటి కథగా దీనిని దర్శకుడు పా.రంజిత్ చూపుతాడు. అయితే ఆ కాలం దాటి



తంగలాన్ సినిమాలో ఒక సన్నివేశం

ఇన్నేళ్లు గడిచినా ఇంకా కొన్ని తెగలలో స్త్రీలకు ఎద పై వస్త్రం దొరకడం, తొడిగే ఆర్థిక స్థితి రాకపోవడం విషాదం. అదే సమయంలో తమ హక్కును గుర్తెరిగి వక్షాన్ని కప్పుకునే హక్కు కోసం నినదించే స్త్రీలనూ మనం గుర్తు చేసుకోవాలి.

అరిటాకుల్లో వక్షోజాలు

కేరళ, తమిళనాడుల్లోని ట్రావెన్‌కోర్ రాజ్యాన్ని పరిపాలించిన శ్రీమూలమ్ తిరుమాళ్ (1885–1924) కాలంలో జరిగిన ఘటన ఇది. ఆ రోజుల్లో ట్రావెన్‌కోర్ రాజ్యంలో దళితుల మీద 110 రకాల పన్నులుండేవి. మగవాళ్లు శిరోజాలు పెంచుకుంటే 'తలక్కారం' అనే పన్ను కట్టాలి. స్త్రీలు వక్షోజాలు కప్పుకుంటే 'ములక్కారం' అనే పన్ను కట్టాలి. అసలే పేదరికంలో ఉన్న దళితులు ఈ పన్నులు కట్టలేక బాధలు అనుభవించేవారు. నాంజెలి అనే మహిళ తన ఇంటి ముందుకు వచ్చిన పన్ను వసూలు వ్యక్తికీ, అలాగే రాజుకు జీవితకాల పాఠం నేర్పాలని అనుకుంది. అరిటాకుల్లో బియ్యం పెట్టి కట్టాల్సిన పన్నుకు బదులు పదునైన కొడవలితో కోసుకున్న తన వక్షోజాలను పెట్టి ఇచ్చింది. అరిటాకుల్లో కోసిన వక్షోజాలు కేరళలో పెనుకంపనం కలిగించాయి. ఆ విధంగా ప్రాణ త్యాగం చేసిన నాంజెలి వల్ల వెంటనే రాజు వక్షోజ పన్నును తొలగించాడు. తొలగించింది పన్నే తప్ప దళిత స్త్రీలకు, నాడార్ స్త్రీలకు రవిక తొడుక్కునే హక్కు ఇవ్వలేదు. దాని కోసం పోరాటం సాగిస్తే ముడివేసుకునే రవికలు ధరించేందుకు అనుమతి లభించింది. ఆ తర్వాత చాలా కాలానికి అందరి లాంటి రవికలు ధరించారు. 1990ల వరకూ కూడా తమిళనాడు, కేరళలోని దళితులలో వృద్ధ మహిళలు రవిక ధరించేవారు కాదు. వారికి ఆ అలవాటు మెదడులో నిక్షిప్తమైపోవడమే కారణం.

యూనిట్‌లో అందరూ ఏడ్చారు

'ఈ సన్నివేశం మాకు చెప్పేటప్పుడు ఆ కాలంలో ఆ స్త్రీల అనుభూతిని వివరించడానికి దర్శకుడు ప్రయత్నించాడు. కాని సన్నివేశంలో నటిస్తున్న స్త్రీలందరం ఒకే రకమైన ఉద్వేగంతో ఉన్నాం. రవిక తొడక్కుండా ఉండటం అంటే ఏమిటో తెలియని మేము ఆనాటి స్త్రీల వేదనను అర్థం చేసుకుని మొదటిసారి తొడుక్కున్నట్టు నటించాం. మొదటి, రెండవ టేకే ఓకే అయింది. మా నటన చూసి యూనిట్‌లో సభ్యులు సంతోషంతో కన్నీరు కార్చారు' అంది నటి పార్వతి. ఆమె ఈ సినిమాలో విక్రమ్ భార్య గంగమ్మగా నటించింది.

రవిక కట్టే ఉద్యమం

ఆ సమయంలోనే కన్యాకుమారి జిల్లాలో దళిత స్త్రీలు 'రవిక కట్టే ఉద్యమాన్ని' భారీ ఎత్తున లేవదీశారు. దీనిని 'మారు మరక్కమ్ సమరం' అని పిలిచారు. దీనికే 'చన్నార్ తిరుగుబాటు' అని పేరు. పై కులాల వాళ్ల ముందు స్త్రీలైనా, పురుషులైనా నగ్నమైన ఛాతీతో ఉండటమే మర్యాదగా నాటి సమాజం నిశ్చయిస్తే రేగిన తిరుగుబాటు అది. పరిశోధకులు ఈ విషయమై సాగించిన అధ్యయనంలో 'దళిత మహిళలకు చనిపోయిన మహిళల ఒంటిపైన ఉండే దుస్తులు ఇచ్చేవారు. కాన్పు సమయంలోని దుస్తులు ఇచ్చేవారు. వాటినే దళిత మహిళలు ధరించేవారు. శుభ్రమైన కొత్త బట్టలు ఇస్తే దళితులు కట్టుకోవడానికి సంశయించి పక్కన పడేసేవారు. వాటిని ఎప్పటికీ తొడుక్కునేవారు కాదు. అంతగా వారిని బట్టలకు దూరం ఉంచారు' అని తెలియజేశారు.



మై వార్డ్‌రోబ్

కలర్ & కంఫర్ట్

'మనసుకు నచ్చిన రంగులు ఉండాలి. ట్రెండ్‌కు తగినట్టు ఉండాలి. స్పెషల్ లుక్ అనిపించాలి. అన్నింటికి మించి సౌకర్యంగా ఉండాలి' అంటూ ఎంచుకునే డ్రెస్సింగ్ విషయంలో తీసుకునే జాగ్రత్తల గురించి హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో ఉంటున్న నిఖితారెడ్డి తన వార్డ్‌రోబ్ ముచ్చట్లను ఈ విధంగా పంచుకున్నారు.

కలర్ కాంబినేషన్స్

నా ఫేవరెట్ కలర్స్ ఆరెంజ్, పింక్. దీంతో నా వార్డ్‌రోబ్‌లో ఈ కలర్ కాంబినేషన్ డ్రెస్సులు ఎక్కువ చేరుతుంటాయి. అయితే, ఒకే విధంగా కాకుండా డిఫరెంట్ కాంబినేషన్స్‌లో ఉండేలా ప్లాన్ చేసుకుంటాను. చుడీదార్ ఎంపిక చేసుకున్నా ఒక చిన్న ఆరెంజ్ ఎలిమెంట్ అయినా ఉండాలి. ఇదే కాంబినేషన్‌లో బేబీ షవర్ సమయంలో మా ఫ్యామిలీ షూట్‌కి పట్టుచీర, కుర్తా పైజామా సెట్ ఆరెంజ్ కాంబినేషన్ ఉండేలా ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాం.



ఐదేళ్ల లోపు పిల్లలకు ఎంబ్రాయిడరీ డ్రెస్సులు ఆన్‌లైన్‌లో చాలా డిజైన్స్ వస్తున్నాయి. నా శారీ కలర్ లేదా పార్టీ థీమ్ కలర్‌ని బట్టి వాటిని ఎంపిక చేసుకుంటాను. పాప వేసుకున్న పింక్ కలర్ లెహంగా, దుపట్టా అలా ప్లాన్ చేసిందే. పట్టు డ్రెస్సులు మాత్రం మెటీరియల్ తీసుకొని, స్టిచింగ్ చేయిస్తాను.

సెలబ్రిటీ స్టయిల్

ఆరెంజ్ శారీ స్టైల్‌లో నటి అదితీరావు హైదరీ ఫొటో సోషల్ మీడియా లో చూశాను. నాకు బాగా నచ్చింది. ఆ విధంగా ఉండాలని ఆరెంజ్ శారీ, బ్లౌజ్ మెటీరియల్ అన్నీ సొంతంగా ఎంపిక చేసుకుని, డిజైన్ చేయించుకున్నాను. ముత్యాలు, పచ్చలు, కుందన్స్ కాంబినేషన్ జ్యువెలరీని దానికి సెట్ చేశాను.

మిక్స్ అండ్ మ్యాచ్

పెళ్లి సమయంలో తీసుకున్న చీరలు, అమ్మ వాళ్లు కానుకగా ఇచ్చినవి.. ప్రత్యేక సందర్భాలలో వేసుకోవడానికి బ్లౌజ్ డిజైన్స్ ద్వారా మార్పులు చేస్తుంటాను. కానీ, చాలా వరకు ఏ డ్రెస్ సెట్ ఎలా ఉంటే అలాగే వేసుకోవాలనుకుంటాను. పెద్దగా మిక్స్ అండ్ మ్యాచ్ చేయను.

థీమ్ పార్టీలు

ముందుగా కంఫర్ట్‌గా ఉండే డ్రెస్సులకే ప్రాధాన్యత ఇస్తాను. ఇప్పుడు మదర్ డాటర్ కాంబినేషన్ సెట్స్ వస్తున్నాయి. వాటిని ప్లాన్ చేస్తాను. అలాగే, పాపకు నాకు బర్త్ డే గిఫ్ట్స్ డ్రెస్సులు వస్తుంటాయి. వాటిని చిన్న మార్పులతో థీమ్డ్ పార్టీలకు ప్లాన్ చేస్తాను.

ఎంబ్రాయిడరీ.. క్వాలిటీ ఫస్ట్

ఫ్లోరల్ ప్రింట్స్ స్టోర్స్‌లోనూ ఆన్‌లైన్‌లోనూ మార్కెట్‌లో ఎంపిక చేసుకుంటాను. కానీ, ఎంబ్రాయిడరీ అయితే కొన్ని ప్రత్యేకమైన చోట్లనే బాగుంటాయి. డిజైన్ పరంగానూ, క్వాలిటీ పరంగానూ బాగున్నవి అయితేనే ఎంబ్రాయిడరీ డ్రెస్సులను ఎంపిక చేసుకుంటాను.

ఫ్లోరల్స్

దగ్గరి బంధువుల పెళ్లిలో ప్రతిదీ వేడుకగా ఉండాల్సిందే. ముఖ్యంగా సంగీత్, హల్దీ, రిసెప్షన్.. వంటి వేడుకలకు వైవిధ్యంగా ఉండాలి. హల్దీ ఫంక్షన్ కోసం రెడీ అవ్వడానికి ఫ్లోరల్ డిజైన్స్, ఫ్లోరల్ జ్యువెలరీ బాగుంటుంది. ఇందుకు ఆన్‌లైన్ మార్కెట్‌లోనూ మంచి మంచి మోడల్స్ లభిస్తున్నాయి. ఫ్లోరల్ డిజైన్స్ అలా ఎంపిక చేసుకుని తీసుకున్నవే. మా కజిన్ హల్దీ ఫంక్షన్‌కి డ్రెస్ ప్రత్యేకంగా డిజైన్ చేయించారు.



ప్రయాణాలకు ఒక స్టయిల్

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఎగ్జిబిషన్స్ స్టాల్స్ పెడుతుంటారు. వాటిలో లాంగ్ ఆరెంజ్ ఫ్రాక్ ఎంపిక చేసుకున్నాను. ఇలాంటివి టూర్స్‌కి వెళ్లినప్పుడు వేసుకుంటాను. వాటిల్లో ఫొటోస్ కూడా బ్రైట్‌గా వస్తాయి. అలాగే, లాంగ్ ఫ్రాక్స్‌లోనే డిఫరెంట్ మోడల్స్ ఉండేలా చూసుకుంటాను.

వెస్టర్న్ స్టయిల్

బ్లాక్ థీమ్డ్ డ్రెస్‌ను న్యూ ఇయర్ సందర్భంగా, కజిన్స్‌తో బర్త్‌డేస్‌కు వెళ్లాలంటే మోడర్న్‌గా ఉండేవి ప్లాన్ చేసుకుంటాను.

ఇంటిప్

లంచ్ బాక్స్‌లో శాండ్‌విచ్ ఉంటే కొద్దిగా వేయించిన ఉల్లిపాయలను బాక్స్‌లో ఉంచండి. తినే సమయానికి అవి కరకరలాడతాయి. రుచిగా ఉంటాయి.





నేటి 'సాక్షి' ఈపేపర్‌లో ప్రత్యేక 'సినిమా' పేజీ

'సాక్షి' ఈపేపర్‌లో ప్రతిరోజూ ఓ స్పెషల్ ఫ్యామిలీ పేజీ

నేడు నేషనల్ స్పేస్ డే

నక్షత్ర విజ్ఞాన సిరి



'పరిశోధన'కు కామానే తప్ప ఫుల్‌స్టాప్ ఉండదు. అన్నపూరణి ఇప్పటికీ నక్షత్రమండలాలకు సంబంధించి ఏదో ఒక అంశంపై పరిశోధన చేస్తూనే ఉంది. అది ఆమె హాబీ. అది ఆమె వృత్తి. ఆమె జీవనాసక్తి... జీవిక కూడా!

అంతరిక్షం అంటేనే అనేకానేక అద్భుతాలకు నెలవు.

అన్నపూరణిలో అంతరిక్షంపై ఆసక్తి చిన్న వయసులోనే మొదలైంది.

ఆరు బయట రాత్రి పూట ఆకాశంలో చుక్కలు చూస్తున్నప్పుడు 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అనే ఆలోచన మొదలైంది. ఆ ఆలోచన తనను కుదురుగా ఉండనివ్వలేదు. నక్షత్రమండలాల గురించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకునేలా చేసింది. నక్షత్రాలపై ఆసక్తి తనను విషయ జ్ఞానానికి మాత్రమే పరిమితం చేయలేదు. సైంటిస్ట్‌ను చేసింది.

'విజ్ఞాన శ్రీ' అవార్డ్ అందుకున్న ఏకైక మహిళా శాస్త్రవేత్తగా ఉన్నతస్థానంలో నిలిచింది.

అన్నపూరణి సుబ్రమణ్యం ప్రస్తుతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐఐఏ) డైరెక్టర్‌గా పనిచేస్తోంది. ఈ సంస్థ భవిష్యత్ అంతరిక్ష యాత్రల కోసం అత్యాధునిక టెలిస్కోప్‌లు, పరికరాలను తయారు చేస్తుంటుంది. ఆస్ట్రోశాట్, ఆదిత్య–ఎల్1ల ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో అన్నపూరణి పాలు పంచుకుంది.

కేరళలోని పాలక్కాడ్ విక్టోరియా కాలేజీలో చదువుకున్న అన్నపూరణి 'స్టడీస్ ఆఫ్ స్టార్ క్లస్టర్స్ అండ్ స్టెల్లార్ ఎవల్యూషన్' అంశంపై పీహెచ్‌డీ చేసింది. పీహెచ్‌డీ చేస్తున్న రోజులలో కవలూర్ అబ్జర్వేటరీ (తమిళనాడు) ఆమె ప్రపంచంగా మారింది. ఏ పరికరాన్ని ఎలా వినియోగించుకోవాలో లోతుగా తెలుసుకుంది. నక్షత్ర సమూహాలకు సంబంధించి ఎన్నో పరిశోధనలు చేసింది.

'పరిశోధన'కు కామా నే తప్ప ఫుల్‌స్టాప్ ఉండదు. అన్నపూరణి ఇప్పటికీ నక్షత్రమండలాలకు సంబంధించి ఏదో ఒక అంశంపై పరిశోధన చేస్తూనే ఉంటుంది. అది ఆమె హాబీ. అది ఆమె వృత్తి. ఆమె జీవనాసక్తి... జీవిక కూడా!

ప్రస్తుత కాలంలో 'స్పేస్–బేస్డ్ అస్ట్రోనమీపై యువతరం అమితమైన ఆసక్తి ప్రదర్శిస్తోంది. ఇది శుభసూచకం. స్పేస్ సైన్స్ ఎంతోమందికి అత్యంత ఆసక్తిగా మారింది. ఈ ఆసక్తే భవిష్యత్ పరిశోధనలకు పునాదిగా మారుతుంది' అంటుంది అన్నపూరణి సుబ్రమణ్యమ్.

అలర్ట్

ఆ వివరాలు బహిర్గతం చేస్తే రెండేళ్లు జైలు

ఇటీవల కోల్‌కతాలోని ఆర్.జి. కర్ మెడికల్ కాలేజ్‌లో అత్యంత అమానుషంగా హత్యాచారానికి గురైన మహిళా డాక్టర్ ఘటన పై దేశవ్యాప్తంగా చాలామంది స్పందిస్తున్నారు. ఎంతోమంది నిరసనలు వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వాలు, న్యాయస్థానాలు మాత్రమే కాకుండా సమాజం కూడా ఇటువంటి ఘటనలపై స్పందించడం చాలా అవసరం. అయితే ఇలాంటి అంశాలపై స్పందించేటప్పుడు బాధితురాలి గుర్తింపు బయటపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సెక్షన్ 72, భారతీయ న్యాయ సంహిత (228 ఏ, ఐ.పీ.సీ) ప్రకారం అత్యాచారానికి గురైన బాధితురాలి వివరాలను బహిర్గతం చేసిన వారికి రెండు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుంది.



కోల్‌కతా హత్యాచార బాధితురాలి ఫోటోలు, పేరు, ఇతర వివరాలు అన్నీ సామాజిక మాధ్యమాలలో చాలా మంది బహిర్గతం చేస్తున్నారు. అంతేకాక రంగారెడ్డి జిల్లా కోర్టు ముందు ఇటీవల ఒక న్యాయవాదుల సంఘం నిర్వహించిన కొవ్వొత్తుల ప్రదర్శనలో సైతం బాధితురాలి పేరుని బ్యానర్లలో ముద్రించి మరీ ప్రదర్శించడం, అందులో చాలామంది మహిళా న్యాయవాదులు కూడా ఉండడం బాధాకరం. అది కోర్టు ధిక్కరణ కూడా. ఈనెల 16వ తేదీన కలకత్తా హైకోర్టు బాధితురాలి వివరాలను బహిర్గతం చేయడానికి వీలులేదు అని స్పష్టం చేసింది. 20న సుప్రీంకోర్టు చేపట్టిన విచారణలో సైతం బాధితురాలి వివరాలను బహిర్గతం చేయడంపై ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అలా ఎవరూ చేయడానికి వీల్లేదని ఆదేశించారు.

పోక్సో చట్టం సైతం బాధిత–బాలుర వివరాలను గోప్యంగా ఉంచాలి అని చెబుతుంది. సంచలనం సృష్టించిన 'కథువా గ్యాంగ్ రేప్ – హత్య' కేసులో ఆ నిబంధనను అతిక్రమించిన పలు మీడియా సంస్థల మీద కూడా గతంలో ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి, సదరు వార్తలను ఉపసంహరించుకోవాలి అని ఆదేశిస్తూ భారీ జరిమానాలు కూడా విధించింది. లైంగిక దాడికి గురైన బాధితురాలు లిఖిత పూర్వకంగా తన అంగీకారాన్ని తెలిపితే తప్ప, బాధితురాలి వివరాలను బహిర్గతం చేయకూడదు. బాధితురాలు ఒకవేళ మరణించినా లేదా ఆమెకు మతిస్థిమితం లేకున్నా కూడా ఆమె వివరాలు బహిర్గతం చేయడానికి వీలు లేదు. ప్రత్యేక కారణాలు చూపిస్తూ, కుటుంబ సభ్యులు న్యాయస్థానం ముందు దరఖాస్తు చేస్తే, కేవలం కోర్టు మాత్రమే అలాంటి అనుమతిని ఇవ్వాలి అని చట్టం చెబుతోంది.

– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

వంటిల్లు

పొరుగింటి దోసెలు

వారం మెనూలో దోసె ఉండాల్సిందే...
దోసె కూడా బోర్ కొట్టేస్తుంటే ఏం చేద్దాం?
పక్క రాష్ట్రాల వాళ్ల వంటింట్లోకి తొంగిచూద్దాం.
కేరళ వాళ్లు మనదోసెనే కొద్దిగా మార్చి ఆపం చేస్తారు.
కన్నడిగులు చిరుతీయటి నీర్‌దోసె వేస్తారు.

కన్నడ నీర్ దోసె



కావలసినవి: బియ్యం – 2 కప్పులు; కొబ్బరి తురుము – కప్పు; ఉప్పు – చిటికెడు; నూనె – టేబుల్ స్పూన్;

తయారీ: ● బియ్యాన్ని నాలుగైదు గంటల సేపు లేదా రాత్రంతా నానబెట్టాలి ● బియ్యం, కొబ్బరి తురుము, ఉప్పు కలిపి మిక్సీలో మరీ మెత్తగా ఉండాల్సిన అవసరం లేదు, కొంచెం గరుకుగా గ్రైండ్ చేయాలి. పిండిలో తగినంత నీటిని కలిపి గరిటె జారుడుగా ఉండాలి ● పెనం వేడి చేసి దోసె వేసి కొద్దిగా నూనె వేయాలి. రెండువైపులా కాల్చి వేడిగా వడ్డించాలి.

గమనిక: కన్నడ నీర్ దోసెకు పిండిని పులియబెట్టాలిన అవసరం లేదు. రాత్రి నానబెట్టి ఉదయం గ్రైండ్ చేసి వెంటనే దోసెలు వేసుకోవచ్చు. దీనికి సాంబార్, ఆవకాయ– పెరుగు కలిపిన రైతా మంచి కాంబినేషన్.

కేరళ పాలాపం



కావలసినవి: బియ్యం– పావు కేజీ; పచ్చి కొబ్బరి తురుము – యాభై గ్రాములు; చక్కెర – అర స్పూన్; ఉప్పు – అర స్పూన్; బేకింగ్ సోడా – చిటికెడు.

తయారీ: ● బియ్యాన్ని కడిగి మంచినీటిలో ఐదు గంటల సేపు నానబెట్టాలి. మిక్సీలో బియ్యం, కొబ్బరి తురుము వేసి తగినంత నీటిని చేరుస్తూ మెత్తగా గ్రైండ్ చేయాలి ● బాణలిలో నీటిని పోసి, అందులో పై మిశ్రమాన్ని ఒక కప్పు వేసి గరిటెతో కలుపుతూ మరిగించి దించేయాలి. మిశ్రమం చల్లారిన తర్వాత ఆపం పిండిలో వేసి కలపాలి. ఈ పిండిని ఎనిమిది గంటల సేపు కదిలించకుండా ఉంచాలి. ఉదయం ఇందులో చక్కెర, ఉప్పు, బేకింగ్ సోడా వేసి గరిటెతో కలపాలి. మిశ్రమం గరిటె జారుడుగా ఉండాలి ● ఆపం పెనం వేడి చేసి ఒక గరిటె పిండి వేసి పెనం అంచులు పట్టుకుని వలయాకారంగా తిప్పితే పిండి దోశ లాగ విస్తరిస్తుంది. మీడియం మంట మీద కాల్చాలి. కాలే కొద్దీ అంచులు పైకి లేస్తాయి. అట్లకాడతో తీసి ప్లేట్‌లో పెట్టాలి. దీనిని రెండవ వైపు కాల్చాల్సిన పని లేదు, కాబట్టి తిరగేయకూడదు. అంచులు ఎర్రగా కరకరలాడుతూ మధ్యలో దూదిలా మెత్తగా ఉంటుంది. ఇందులో నూనె వేయాల్సిన పని లేదు. ఆపం పెనం లేకపోతే దోశ పెనం (ఫ్లాట్‌గా కాకుండా కొంచెం గుంటగా ఉండే పెనం) మీద ప్రయత్నించవచ్చు.

ఆయ్... మన కోనసీమేనండి!



మనం ఎంచుకున్న లక్ష్యానికి నిబద్ధత, శ్రమ, తపన తోడైతే దాని ఫలితం అద్భుతంగా ఉంటుందనే నమ్మకాన్ని 'ఆయ్' సినిమా దర్శకుడు అంజిబాబు కంచిపల్లి రుజువు చేశాడు. తొలి ప్రయత్నంలోనే సినీ దర్శకుడిగా విజయాన్ని సొంతం చేసుకున్నాడు...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పట్టణ శివారు కొంకాపల్లి అంజిబాబు స్వస్థలం. పదో తరగతి చదువుతున్న రోజుల్లో ఒకరోజు ...

'నేను సినిమా డైరెక్టర్ కావాలనుకుంటున్నాను' అని తండ్రి బూరయ్య, సోదరులకు చెప్పాడు.

ఆ వయసులో పిల్లల నోటి నుంచి వినిపించే కలలకు పెద్దలు 'అలాగే' అంటారు తప్ప అంత సీరియస్‌గా తీసుకోరు.

కానీ అంజిబాబు మాత్రం యమ సీరియస్‌గా తీసుకున్నాడు.

'ముందు నువ్వు డిగ్రీ పూర్తి చేయి. తర్వాత ఆలోచిద్దాం' అని తండ్రి చెప్పాడు. తన లక్ష్యాన్ని సీరియస్‌గా తీసుకున్నప్పటికీ చదువును మాత్రం అశ్రద్ధ చేయలేదు. అమలాపురంలో డిగ్రీ పూర్తి చేసిన తరువాత ఓ మంచి రోజు తన కలల దారిని వెదుక్కుంటూ హైదరాబాద్ బస్సెక్కేశాడు. ఎంతోమంది దర్శకుల దగ్గర అసిస్టెంట్‌గా పని చేశాడు.

కోనసీమలో బాల్యం నుంచి స్నేహంగా చిగురించిన బంధాలు, అనుబంధాలు పెద్దయ్యాక కులాల కుంపటి రాజుకుని నాశనమవుతున్నాయి. కులాల బీటలతో స్నేహం, ప్రేమ విచ్ఛిన్నం అవుతున్నాయి. ఇదే తన కథలో ప్రధానాంశంగా ఎంచుకుని సినిమా కోసం ఓ స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నాడు.

తాను రాసుకున్న కథను గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్, భాగస్వామి బన్నీ వాసులకు వినిపించాడు. గీతా ఆర్ట్స్‌కు నచ్చడంతో అంజిబాబు కథా రచయితగా తొలి విజయం సాధించాడు.

> తొలి ప్రయత్నంలోనే సినీ దర్శకుడు కావాలన్న నా శ్రమ, కల ఇప్పుడు 'ఆయ్' చిత్ర రూపంలో ఫలించినందుకు సంతోషంగా ఉంది. సమాజానికి ఓ మంచి సందేశం ఇవ్వాలన్న నా కోరిక కూడా 'ఆయ్' చిత్రం ద్వారా తీరింది. కోనసీమ అందాలు, అచ్చమైన పల్లె వాతావరణం, గోదారోళ్ల యాస మాటలు, సందర్భోచిత హాస్యంతో సినిమాను తీయాలనే ఆలోచనతో 'ఆయ్' చిత్రం కథను రాశాను. నా కథను మెచ్చి చిత్రాన్ని తెరకెక్కించేలా చేసిన గీతా ఆర్ట్స్‌కు, అల్లు అరవింద్, బన్నీ వాసులకు నా ధన్యవాదాలు.
> **- అంజిబాబు కంచిపల్లి, ఆయ్ చిత్ర దర్శకుడు**


సినిమాని కోనసీమ నదీ పరీవాహక గ్రామాల్లో చిత్రీకరించడం రెండో విజయం. అమలాపురం వేదికగా రూపుదిద్దుకున్న 'కోనసీమ ఫిలిమ్ అసోసియేషన్'కు చెందిన సినీ ఆర్టిస్టులతో కొంత మందికి అంజిబాబు 'ఆయ్' సినిమాలో నటించే అవకాశాన్ని ఇచ్చి వారి నుంచి మంచి నటనను రాబట్టాడు. తన తండ్రిపై ఉన్న అభిమానంతోనే 'ఆయ్' సినిమాలోని హీరో తండ్రి క్యారెక్టర్‌కు 'బూరయ్య' అని పేరు పెట్టాడు.

చిన్నతనం నుంచి తాను పుట్టి పెరిగిన కోనసీమలోని ప్రకృతి అందాలు, గ్రామీణ సౌందర్యాలను తాను తీసే తొలి చిత్రంలో తెరకెక్కించాలనే కలను నిజం చేసుకున్నాడు. కోనసీమ యాస, నేటివిటీకి హాస్యాన్ని జోడించి 'ఆయ్' చిత్రాన్ని తెరకెక్కించి విజయాన్ని అందుకున్నాడు అంజిబాబు.

– పరసా సుబ్బారావు, సాక్షి, అమలాపురం టౌన్

● లేటెస్ట్

కస్టమ్ స్టిక్కర్ మేకర్ టూల్



వాట్సాప్ యూజర్‌లు ఫ్రెండ్స్‌తో స్టిక్కర్లను ఉపయోగించడానికి, ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకోవడానికి ఇష్టపడతారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్టిక్కర్స్ ఫన్‌గా, మరింత క్రియేటివ్‌గా ఉండేలా కొత్త టూల్స్ తీసుకువస్తోంది. దీని కోసం పాపులర్ గిఫీతో కలిసి పనిచేస్తోంది వాట్సాప్. ఇప్పుడు యూజర్‌లు గిఫీ స్టిక్కర్లను ఉపయోగించుకోవచ్చు. వోన్ స్టిక్కర్స్‌ను క్రియేట్ చేసుకోవచ్చు.

సుదీర్ఘ నిరీక్షణ తరువాత కస్టమ్ స్టిక్కర్ మేకర్ టూల్‌ను ఆండ్రాయిడ్ యూజర్‌ల కోసం తీసుకువస్తోంది. వాట్సాప్. వాట్సాప్‌లోని ఏఐ చాట్‌బాట్ ద్వారా టెక్స్ట్ ప్రాంప్ట్‌ల సహాయంతో స్టిక్కర్లను క్రియేట్ చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. 'స్టిక్కర్ ఆర్గనైజేషన్' అనే ఫీచర్‌ని కూడా తీసుకు వచ్చింది వాట్సాప్. డౌన్‌లోడ్ చేసుకున్న స్టిక్కర్ల క్రింద కనిపించే స్టిక్కర్ ట్రేలో స్టిక్కర్ ప్యాక్‌లను త్వరగా ప్రివ్యూ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

● గేమింగ్



అరణ్యంలో రణం

కాకులు దూరని కారడవి. చీమలు దూరని చిట్టడివిలో చిక్కుకుపోతే రక్షించడానికి ఎవరూ రారు. మనల్ని మనమే రక్షించుకోవాలి. బతకాలనుకుంటే ధైర్యం ఉండాలి. అలాంటి ధైర్యం ఉన్న వాళ్లకు స్వాగతం పలికే గేమ్ ఇది. సర్వైవల్ వీడియో గేమ్ 'గ్రీన్ హెల్' విడుదల అయింది. గేమ్ లోకేషన్...అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్. ఈ ఓపెన్ వరల్డ్ గేమ్‌లో ప్లేయర్స్ నిలదొక్కుకోవడానికి రా మెటీరియల్స్, ఫుడ్ ఐటమ్స్ కలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ అరణ్యంలో అడుగడుగునా ఊహించని ఘటనలు ఎదురవుతుంటాయి.

జానర్: సర్వైవల్ **ఇంజిన్:** యూనిటీ
మోడ్స్: సింగిల్–ప్లేయర్, మల్టీప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: విండోస్,నిన్‌టెండో స్విచ్, ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్

● టెక్... టాక్

యాపిల్ టేబుల్‌టాప్ రోబోట్



టెక్ ప్రియుల తాజా ఆసక్తి యాపిల్ టేబుల్ టాప్ రోబోట్ డివైజ్. ఇది 2026 లాంచ్ కానుందనే వార్తలు వినిపిస్తున్నాయి. రోబోటిక్ ఆర్మ్‌తో కూడిన ఐప్యాడ్–డిస్‌ప్లే దీని ప్రత్యేకత. ఈ టేబుల్‌ట్యాప్ స్మార్ట్ హోమ్ పరికరాలను నియంత్రించగలదు. వీడియో కాన్ఫరెన్స్‌లకు హాజరు కావడానికి ఉపయోగపడుతుంది. హోమ్ సెక్యూరిటీ మానిటర్‌గా పనిచేస్తుంది.

రెడ్‌మీ ఏ3 ఎక్స్



సైజ్: 6.71 అంగుళాలు; **రిఫ్రెష్ రేట్:** 90 హెచ్‌జడ్ **ప్రొటెక్షన్:** గొరిల్లా గ్లాస్ 3; **బరువు:** 193 గ్రా.; **రిజల్యూషన్:** 720×1650 పిక్సెల్స్; **కలర్ ఆప్షన్స్:** మిడ్‌నైట్ బ్లాక్, ఒషియన్ గ్రీన్, ఆలివ్ గ్రీన్, స్టారీ వైట్

టెక్నో ప్యాడ్



సైజ్: 10.1 అంగుళాలు
బ్యాటరీ: 7,000 ఎంఏహెచ్
రిజల్యూషన్: 800×1,280 పిక్సెల్స్; **ర్యామ్:** 4జీబి; **స్టోరేజ్:** 128/256 జీబి:
కెమెరా: 13 ఎంపీ కెమెరా

డంప్ స్క్వీబ్



ఏదైనా జరగాలని ఉత్సాహంగా ఎదురుచూసి, అది జరిగినప్పుడు నిరాశకు గురయ్యే సందర్భంలో, ఊహించింది ఒకటి జరిగింది ఒకటి అనుకునే సమయంలో ఉపయోగించే మాట...డంప్ స్క్వీబ్.

ఉదా: పీపుల్ వర్ ఎక్స్‌పెక్టింగ్ ఏ బిగ్ సెలబ్రేషన్, బట్ వాట్ దే గాట్ వాజ్ ఏ డంప్ స్క్వీబ్.

● మిస్టర్ ఇండియా

ఫిట్‌గా ఒక్కో మెట్టెక్కి...



ఆదిత్య సుబ్రమణియన్... ఆరడుగుల ఎత్తున్న 27 ఏళ్ల కుర్రాడు. చెన్నైలోని పల్లవరానికి చెందిన ఈ యువకుడు ఎస్ఆర్ఎమ్ కాలేజ్ ఇంజినీరింగ్ స్టూడెంట్. చదువు పూర్తి చేసి కార్పొరేట్ రంగంలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడితో సంతృప్తి చెందలేదతడు. సమున్నత లక్ష్యాలను నిర్దేశించుకున్నాడు. కెరీర్ దృష్టిని విస్తృతం చేసుకున్నాడు. తనకిష్టమైన ఫ్యాషన్, ఫిల్మ్ ఇండస్ట్రీ, మోడలింగ్‌లో అదృష్టాన్ని, అవకాశాలనూ పరీక్షించుకోవాలనుకున్నాడు. అందుకోసం ముందుగా ఏదైనా ఒక వేదిక మీద విజేతగా నిలవడం తొలి మెట్టు అనుకున్నాడు. ఏకకాలంలో పలువురి దృష్టిని ఆకర్షించడానికి మిస్టర్ ఇండియా పోటీలను ఎంచుకున్నాడు, విజేతగా నిలిచాడు.

కలసాధనకు కాలపరీక్ష!

సాహిత్యాభిలాషి అయిన ఆదిత్య తాను కలలు కన్న లక్ష్యాన్ని చేరడానికి ఆరేళ్లుగా కఠోరంగా శ్రమించాడు. పుస్తకాలు చదువుతూ, సినిమాలు చూస్తూ తనను తాను మలుచుకుంటూ దేహాకృతి కోసం క్రమం తప్పకుండా జిమ్‌లో ఎక్సర్‌సైజ్‌లు చేశాడు. మిస్టర్ మదరాసీ, ఐరిస్ గ్లామ్ మిస్టర్ సూపరామ్స్, ఎస్టీలో మిస్టర్ సదరన్ క్రౌన్ టైటిల్స్ గెలుచుకున్నాడు. మోడలింగ్‌లో నిరూపించుకున్నాడు. ఇదంతా చెప్పుకున్నంత సులువుగా జరగలేదు. ఒక్కో విజయాన్ని అందుకుంటూ తాను ఎంచుకున్న శిఖరం వైపు ప్రయాణం సాగిస్తున్న సమయంలో కాలం పెద్ద పరీక్ష పెట్టింది. మిస్టర్ ఇండియా పోటీల కోసం జిమ్‌లో వర్కవుట్స్ చేస్తున్నప్పుడు వెన్నెముకకు గాయమైంది. ప్రాక్టీస్ మానేయాల్సి వచ్చింది. గాయం మానే వరకు విశ్రాంతి తప్పదు. ఈ లోపు బాడీ షేపవుట్ కాకుండా, బరువు పెరగకుండా చూసుకోవడం కూడా పెద్ద చాలెంజ్ అనే చెప్పాలి. తేలికపాటి వ్యాయామాలు చేస్తూ ఫిట్‌నెస్‌ని కాపాడుకున్నాడు. ఆ సమయంలో మొదలైన అంతర్మథనం తనలో ప్రశాంతతను అలవరిచిందని, ఆత్మస్థయిర్యాన్ని పెంచి వ్యక్తిగా పరిణతి చెందడానికి దోహదం చేసిందని చెప్పాడు ఆదిత్య.

వెండితెర మీద వెలగాలి

ఆదిత్య గెలిచిన మిస్టర్ ఇండియా కిరీటం పేరు 'రుబారు మిస్టర్ ఇండియా 2024 కాబల్లెరో యూనివర్సల్'. ఈ టైటిల్ విజేతలు వెనిజులాలో అంతర్జాతీయ స్థాయిలో జరిగే కాబల్లెరో యూనివర్సల్ పోటీల్లో ప్రపంచదేశాలతో పోటీ పడతారు. ఆ పోటీల్లో మనదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు ఆదిత్య. ఫ్యాషన్, ఫిల్మ్ ఇండస్ట్రీ, మోడలింగ్, యాక్టింగ్ పట్ల తన ఇష్టాన్ని తెలియచేస్తూ నటుడిగా స్థిరపడాలనేది తన అంతిమ లక్ష్యమని చెప్పాడు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సక్సెస్‌కు దారి

> మిస్టర్ ఇండియా విజయం నేను కోరుకుంటున్న కెరీర్‌కు తొలి అడుగు మాత్రమే. నా ఈ విజయం మనదేశంలో మోడలింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి రావాలనుకునే యువతకు స్ఫూర్తినిస్తుందని నమ్ముతున్నాను. అంకితభావంతో హార్డ్‌వర్క్ చేసినప్పుడే విజయం సొంతమవుతుంది. అదే మనల్ని మన లక్ష్యాల దరి చేరుస్తుంది.
> **– ఆదిత్య సుబ్రమణియన్, మిస్టర్ ఇండియా విజేత**

సినిమా

మళ్లీ తెరపైకి శివానీ శివాజీ రాయ్



● రాణీ ముఖర్జీ

బాలీవుడ్ హీరోయిన్ రాణీ ముఖర్జీ లీడ్ రోల్‌లో నటించిన 'మర్దానీ 3' సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకి రానుంది. ఆమె లీడ్ రోల్‌లో ప్రదీప్ సర్కార్ దర్శకత్వం వహించిన చిత్రం 'మర్దానీ'. యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా 2014 ఆగస్టు 22న విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శివానీ శివాజీ రాయ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రాణీ ముఖర్జీ నటించారు. న్యాయం కోసం పోరాడే వారి కోసం ధైర్యంగా నిలబడే పాత్రలో తనదైన నటనతో ఆమె ఆకట్టుకున్నారు. అంతేకాదు.... కష్టాల్లో ఉన్న వారిని కాపాడటం కోసం ఎంతటి రిస్క్ అయినా చేసే రోల్‌లో అద్భుతంగా నటించి, మెప్పించారు. 'మర్దానీ'కి సీక్వెల్‌గా రాణీ ముఖర్జీ లీడ్ రోల్‌లోనే 'మర్దానీ 2' సినిమా రూపొందింది. గోపీ పుత్రన్ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా 2019 డిసెంబరు 13న రిలీజై, సూపర్ హిట్‌గా నిలిచింది. 'మర్దానీ' విడుదలై పదేళ్లయిన సందర్భంగా 'మర్దానీ 3'కి సంబంధించిన వీడియోను రిలీజ్ చేసింది యశ్ రాజ్ ఫిల్మ్స్. మళ్లీ శివానీ శివాజీ రాయ్‌గా రాణీ ముఖర్జీ నటన చూడ్డానికి ప్రేక్షకులు సిద్ధంగా ఉండండి అని మేకర్స్ పేర్కొన్నారు.

డబ్బింగ్ షురూ



● తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ

తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ లీడ్ రోల్స్‌లో ఓ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా ఏఆర్ సజీవ్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎస్ ఒరిజినల్స్ అండ్ మూవీ వెర్స్ స్టూడియోస్‌తో కలిసి సృజన్ యరబోలు, వివేక్ కృష్ణాని, సాధిక్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తాజాగా పూజా కార్యక్రమాలతో ఈ సినిమా డబ్బింగ్ పనులు మొదలు పెట్టారు. బ్రహ్మానందం, బ్రహ్మాజీ, శివన్నారాయణ, గోపరాజు విజయ్, సురభి ప్రభావతి కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకి సంగీతం: జయ్ క్రిష్, కెమెరా: దీపక్ ఎరగెరా.



● చిరంజీవి

పవర్‌ఫుల్ విశ్వంభర

హీరో చిరంజీవి పుట్టినరోజు (ఆగస్టు 22) సందర్భంగా అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు 'విశ్వంభర' మూవీ మేకర్స్. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లు. కునాల్ కపూర్ ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక ఫస్ట్ లుక్ చూస్తే చిరంజీవి ఒక రాతిపై కూర్చొని, ప్రత్యేక శక్తులతో కూడిన త్రిశూలాన్ని చేత పట్టుకుని పవర్‌ఫుల్‌గా కనిపించారు. చిరంజీవి లుక్, కొండ నుంచి ఉద్భవించిన ప్రకాశవంతమైన దైవిక శక్తి, ఉరుములు మెరుపులతో కూడిన ఈ ఫస్ట్ లుక్ అదుర్స్ అంటున్నారు మెగా అభిమానులు. ''క్రేజీ సోషియో ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న చిత్రం 'విశ్వంభర'. తన అభిమాన హీరో చిరంజీవితో 'విశ్వంభర'ను ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌గా తీర్చిదిద్దుతున్నారు వశిష్ఠ. ఈ సినిమా కోసం ఓ ఫ్యాంటసీ ప్రపంచాన్ని సృష్టించాం. అద్భుతమైన వీఎఫ్ఎక్స్, హై యాక్షన్, చక్కని డ్రామాతో విజువల్ వండర్‌గా ఈ మూవీ ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 2025 జనవరి 10న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, కెమెరా: ఛోటా కె. నాయుడు.

ఇండియన్ సినిమాలో ఇయాన్ గ్లెన్



● అనుపమ్ ఖేర్, ఇయాన్ గ్లెన్

ఐదు వందలకు పైగా సినిమాల్లో నటించిన బాలీవుడ్ ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'ఓం జై జగదీష్' (2002). ఇరవయ్యేళ్ల తర్వాత అనుపమ్ ఖేర్ దర్శకుడిగా మళ్లీ మెగాఫోన్ పట్టి, హిందీలో 'తన్వి: ది గ్రేట్' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. కాగా 'గేమ్ ఆఫ్ థ్రోన్స్'తో పాటు పలు హాలీవుడ్ చిత్రాలు, సిరీస్‌లలో నటించిన ఇయాన్ గ్లెన్ 'తన్వి' సినిమాలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. 'తన్వి' సెట్స్‌లో ఇయాన్ పాల్గొన్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ విషయంపై గురువారం అనుపమ్ ఖేర్ ఓ క్లారిటీ ఇచ్చారు. ''హిస్టారికల్ డ్రామా 'మిసెస్ విల్సన్' సిరీస్‌లో నేను, ఇయాన్ కలిసి నటించాం. ఇప్పుడు నా దర్శకత్వంలోని 'తన్వి' సినిమాలో ఇయాన్ నటిస్తున్నారని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. ఇండియన్ సినిమాలో నటిస్తున్న ఇయాన్‌కు స్వాగతం'' అని తెలిపారు అనుపమ్ ఖేర్. ''నమస్తే... 'తన్వి' సినిమాలో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. గౌరవంగా భావిస్తున్నాను'' అని పేర్కొన్నారు ఇయాన్. ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

ఇది వింత లోకం



● '35–చిన్న కథ కాదు' పోస్టర్

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '35–చిన్న కథ కాదు'. నంద కిశోర్ ఈమాని దర్శకత్వం వహించారు. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌పై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో త్వరలో విడుదల కానుంది. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'చిన్నా ఇది వింత లోకం..' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. భరద్వాజ్ గాలి సాహిత్యం అందించిన ఈ పాటని విజయ్ ప్రకాశ్ పాడారు. ''న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌తో సాగే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ముస్తాబవుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది.

మహిళల కోసం...



● నిహారిక, శ్రీనివాస్, దియారాజ్

శ్రీనివాస్ ఉలిశెట్టి హీరోగా, దియారాజ్, నిహారిక శాంతిప్రియ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఎంత పని చేశావ్ చంటి'. ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి 'ధమాకా' మూవీ ఫేమ్ త్రినాథరావు నక్కిన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'ఎంత పని చేశావ్ చంటి' ట్రైలర్ రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ''ఈ సినిమాని మహిళల కోసమే తీశాం'' అని ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు లడ్డే బ్రదర్స్, కెమెరామేన్ సంతోష్, నటుడు త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

● ఓటీటీ

ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'టారో' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

జాతకాన్ని నిజం చేసే దెయ్యం



బ్లాక్ అండ్ వైట్ నుండి డిజిటల్ కలర్ కాలం వరకు ప్రపంచ సినిమా చరిత్రలో ఆల్ టైమ్ ఫేవరెట్ ఎలిమెంట్ ఏదైనా ఉంది అంటే అదే 'దెయ్యం'. ఓ మనిషి భయానికి కారణం తన కన్నా బలవంతుడు ఎదురు పడినపుడు లేదా ప్రాణం లేని ఆత్మ కనపడినపుడు... నాటి నుంచి నేటి సినిమా దర్శకుల వరకు తమ సినిమాల్లో దెయ్యాన్ని వాడుకోవడంలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి. ఆ కోవలే రిలీజైన హాలీవుడ్ మూవీనే 'టారో'. ఈ సినిమాకి ఇద్దరు దర్శకులు స్పెన్సర్ కొహెన్–అన్నాహెల్ బర్గ్. **కథాంశానికొస్తే...** కాలేజ్ స్నేహితులైన ఓ గ్రూప్ హాలిడే ట్రిప్‌కని ఓ మారుమూల ఇంటికి వెళ్తారు. అక్కడ వాళ్ళకు అనుకోకుండా ఓ బాక్స్... అందులో కొన్ని టారో కార్డ్స్ కనబడతాయి. ఇక్కడ టారో కార్డ్స్ అంటే చూడటానికి పేకముక్కల్లా ఉండి, ఇంకా చెప్పాలంటే మన చిలక జోస్యంలో చిలక తీసేలాంటివన్నమాట. ఆ టారో కార్డ్స్‌తో ఓ అమ్మాయి... గ్రూప్‌లో మిగతా అందరికీ వాళ్ళ వాళ్ళ భవిష్యత్తు చెప్తుంది. కాని ట్విస్ట్ ఏంటంటే ప్రతి వాళ్ళ భవిష్యత్తు అని చెప్తూ వాళ్ళ వాళ్ళ మరణం ఎలా ఉంటుందో చెప్తుంది. ఇంకా చెప్పాలంటే అలా ఆ కార్డ్స్‌లో ఉన్న దెయ్యం ఆ అమ్మాయి చేత అలా చెప్పిస్తుంది. ఆ తరువాత వాళ్లు ఆ కార్డ్స్ వల్ల ఎటువంటి ప్రమాదాలు ఎదుర్కొన్నారు? చివరకు ఆ దెయ్యాన్ని ఏం చేశారన్నదే 'టారో' సినిమా. గొప్ప విషయం ఏమిటంటే ఈ హారర్ హాలీవుడ్ సినిమాలో తెలుగమ్మాయి అవంతిక నటించడం. హారర్ జోనర్ ఇష్టపడేవాళ్ళకి 'టారో' మంచి ఛాయిస్... ఒక్క భయపడే వాళ్ళకు తప్ప. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. గో వాచ్ ఇట్.

– ఇంటూరు హరికృష్ణ

గరుడ పురాణం నేపథ్యంలో...



● రిషి, ప్రియాంకా కుమార్

రిషి, ప్రియాంకా కుమార్ జంటగా కేఎస్ నందీష్ దర్శకత్వంలో రూపొందిన కన్నడ చిత్రం 'రుద్ర గరుడ పురాణ'. అశ్విన్ విజయ్ లోహిత్ నిర్మించిన ఈ సినిమా కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో త్వరలో విడుదల కానుంది. తెలుగులో 'రుద్ర గరుడ పురాణం' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథులుగా హాజరైన నిర్మాత 'మధుర' శ్రీధర్ అశ్విన్ ఆర్ట్స్ బ్యానర్ లోగోను లాంచ్ చేయగా, హీరో సోహైల్ తెలుగు టీజర్‌ను విడుదల చేశారు. ''గరుడ పురాణం నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. ఇందులో రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్ర చేశాను'' అని రిషి తెలిపారు. ''దర్శకుడిగా నాకు, నిర్మాతగా లోహిత్‌గారికి ఇది తొలి చిత్రం'' అని కేఎస్ నందీష్ చెప్పారు. ''మా చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అశ్విన్ విజయ్ లోహిత్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
23-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
148	41
81,053	24,812

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	దిశ	మార్పు
నాస్‌డాక్	17,739	▼	180
డోజోన్స్	40,701	▼	188
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,288	▲	5
డాక్స్	18,493	▲	44
షాంఘై	2,849	▼	8
నికాయ్	38,211	▲	259

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

	విలువ	దిశ	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	71,599	▼	120
బంగారం (99.5 స్వచ్ఛత)	71,312	▼	120
వెండి (కిలో)	84,820	▼	93

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	83.53	84.55
€	యూరో	[illegible]	92.46	94.86
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	57.18	58.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.61	57.56
£	బ్రిటన్ పౌండ్	[illegible]	107.78	112.69
S$	సింగపూర్ డాలర్	[illegible]	61.88	66.55
SAR	సౌదీ రియాల్	[illegible]	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.97	23.75
¥	చైనా యువాన్	[illegible]	10.89	12.71

అంబుజా సిమెంట్‌లో వాటా అమ్మకం

2.84 శాతానికి అదానీ గ్రూప్ రెడీ



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ బిజినెస్‌ల అదానీ గ్రూప్ తాజాగా అంబుజా సిమెంట్స్‌లో 2.84 శాతం వాటాను విక్రయించనుంది. వాటాల సాధారణ సర్దుబాటులో భాగంగా 7 కోట్ల షేర్లను అమ్మివేయనుంది. బీఎస్‌ఈలో అంబుజా షేరు గురువారం ముగింపు ధర రూ. 633తో పోలిస్తే 5 శాతం డిస్కౌంట్‌కు వాటాను ఆఫర్ చేయనుంది. షేరుకి రూ. 600 చొప్పున వీటి విలువ రూ. 4,198 కోట్లు(50 కోట్ల డాలర్లు)గా నమోదుకానుంది. బిలియనీర్ గౌతమ్ అదానీకి చెందిన గ్రూప్‌లో 10 లిస్టెడ్ కంపెనీలున్నాయి. ప్రమోటర్ గ్రూప్‌గా వీటిలో 125 బిలియన్ డాలర్ల విలువైన వాటాలను అదానీ కలిగి ఉంది. యూఎస్ దిగ్గజం బెర్క్‌షైర్ హాథవే తరహాలో ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలను అదానీ గ్రూప్ యాక్టివ్‌గా నిర్వహిస్తుంటుంది. కొనుగోళ్లు తదితరాలకు ఇది వ్యూహాత్మక తోడ్పాటునివ్వనుంది.

ల్యాంకో అమర్‌కంటక్ కొనుగోలుకు అదానీకి ఎన్‌సీఎల్‌టీ ఆమోదం

ల్యాంకో అమర్‌కంటక్ పవర్ లిమిటెడ్ (ఎల్‌ఏపీఎల్) కొనుగోలు ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్ ఆమోదించిందని అదానీ పవర్ వెల్లడించింది. ఎల్‌ఏపీఎల్‌ను దక్కించుకోవడం కోసం అదానీ పవర్ రూ.4,101 కోట్ల ముందస్తు చెల్లింపు చేయనుంది. కొనుగోలు ప్రక్రియ ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులు వెలువరించిన 2 నెలల్లో పూర్తి కానుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఈ-కామర్స్‌కు వ్యతిరేకం కాదు: గోయల్
రుతుపవనాలు అస్థిరంగా ఉన్నా, వృద్ధికి ఢోకా లేదు: కేంద్రం

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-8-2024	
విశాఖ	505-00
చిత్తూరు	508-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	450-00
వరంగల్	452-00
రిటైల్ ధర	5.10

ఐదేళ్లలో రూ.14.19 లక్షల కోట్లు

పసిడి రుణాలకు భారీ డిమాండ్

న్యూఢిల్లీ: అవసరాల్లో బంగారాన్ని తనఖా పెట్టి రుణాలు తీసుకునే ధోరణి దేశంలో గణనీయంగా పెరిగిపోతోంది. సంఘటిత రంగం బంగారం రుణాల మార్కెట్ వచ్చే ఐదేళ్లలో రెట్టింపై రూ.14.19 లక్షల కోట్లకు చేరుకుంటుందని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక అంచనా వేసింది. ''అసంఘటిత రంగంలో (వ్యక్తులు, పాన్‌బ్రోకర్ల వద్ద తనఖాలు) ఇది ఇంకా ఎక్కువే ఉండొచ్చు. 2023-24లో సంఘటిత రంగంలో బంగారం రుణాల మార్కెట్ రూ.7.1 లక్షల కోట్లకు చేరుకుంది. ఏటా 14.85 శాతం కాంపౌండెడ్ చొప్పున పెరుగుతూ 2029 మార్చి నాటికి రూ.14.19 లక్షల కోట్లకు చేరుతుంది'' అని పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది. ముఖ్యంగా బంగారం రుణాల్లో 79.1 శాతం వాటాతో దక్షిణాది మార్కెట్ అగ్రగామిగా ఉన్నట్టు పేర్కొంది. ''భారతీయ కుటుంబాల వద్ద 25,000 టన్నుల బంగారం



ఉంటుంది. దీని ప్రస్తుత విలువ రూ.126 లక్షల కోట్లు. బంగారం విలువపై ఇచ్చే రుణం (ఎల్‌టీవీ) విషయంలో ఆర్‌బీఐ కఠిన పరిశీలనల నేపథ్యంలో వచ్చే రెండేళ్లలో బంగారం రుణాల మార్కెట్ మోస్తరు వృద్ధిని చూడొచ్చని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక వివరించింది. రుణాన్ని నగదు రూపంలో రూ.20 వేలకు మించి ఇవ్వరాదంటూ ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ సూచించిన నేపథ్యంలో.. కస్టమర్లు అసంఘటిత రంగంపై ఆధారపడడం పెరగొచ్చని ఈ నివేదిక అంచనా వేసింది. ఫిన్‌టెక్ స్టార్టప్‌ల ద్వారా రుణాల జారీ ప్రక్రియపైనా ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. ఇవే ఎన్‌బీఎఫ్‌సీల షేర్ల ధరలు తగ్గడానికి దారితీశాయంటూ పీడబ్ల్యూసీ తన నివేదికలో వివరించింది.

నిబంధనల అమలుకు ప్రాధాన్యం..

వ్యయ నియంత్రణ చర్యల అమలుతో బంగారం రుణాలు ఇచ్చే ఎన్‌బీఎఫ్‌సీల లాభదాయకత పెరుగుతుందని, ఇన్వెస్టర్ల విశ్వాసం అధికమవుతుందని పీడబ్ల్యూసీ నివేదిక అంచనా వేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బంగారం ధరలు గణనీయంగా పెరగడం వీటిపై రుణ రేట్ల విషయంలో ఎన్‌బీఎఫ్‌సీలు అప్రమత్తంగా వ్యవహరించేలా చేసినట్టు వివరించింది. బంగారం ధరలు తగ్గుముఖం పడితే అది లోన్ టు వ్యాల్యూ పరిమితిని ఉల్లంఘనకు దారితీస్తుందని, నిర్వహణ పరమైన సమస్యలకు దారితీసి బంగారం వేలం వేయాల్సిన పరిస్థితులు రావొచ్చన్న ఆందోళనను పీడబ్ల్యూసీ నివేదిక ప్రస్తావించింది. బంగారం రుణ మార్కెట్ వృద్ధిని బ్యాంకులతోపాటు ఎన్‌బీఎఫ్‌సీలు నడిపిస్తాయని పేర్కొంది.

బ్యాంక్‌లకు ఎక్కువ లబ్ధి

ప్రపంచంలో రెండో అతిపెద్ద బంగారం రుణాల మార్కెట్ అయిన భారత్‌లో.. పరిశ్రమ మరింత వృద్ధి చెందడం వల్ల ఈ రంగంలోని అన్ని సంస్థలు ప్రయోజనం పొందొచ్చని ఈ నివేదిక తెలిపింది. తక్కువ వడ్డీ రేట్ల కారణంగా బ్యాంక్‌లకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అంచనా వేసింది. ''బంగారంపై రుణాలన్నవి పూర్వకాలం నుంచి ఉన్న విధానం.. వినియోగదారులతోపాటు, రుణాలిచ్చే సంస్థలకు ఇది ఆకర్షణీయమైన ఆప్షన్‌గా ఉంటోంది'' అని పేర్కొంది.



లాభాల రేసులోనే మార్కెట్లు

మూడో రోజూ సెన్సెక్స్ అప్ • 81,000 ఎగువన ముగింపు • ఆరో రోజూ నిఫ్టీ ప్లస్

ముంబై: మార్కెట్లు లాభాల రేసులో పరుగు తీస్తున్నాయి. సెన్సెక్స్ 148 పాయింట్లు బలపడి మళ్లీ 81,000 పాయింట్ల మైలురాయిని దాటింది. 81,053 వద్ద నిలిచింది. వెరసి వరుసగా మూడో రోజు లాభపడింది. ఇక ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ వరుసగా ఆరో రోజూ వృద్ధి చూపింది. 41 పాయింట్లు జమ చేసుకుని 24,812 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో మార్కెట్లు రోజంతా సానుకూలంగా కదిలాయి. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 331 పాయింట్లు, నిఫ్టీ 97 పాయింట్లు ఎగశాయి. విదేశీ మార్కెట్ల సానుకూలతలు సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు.

బ్లూచిప్స్ తీరిదీ

కన్జూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్, మెటల్, ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ రంగాలు 0.5 శాతం స్థాయిలో పుంజుకున్నాయి. అయితే చమురు, మీడియా, ఐటీ స్వల్పంగా నీరసించాయి.

ప్రీమియర్ ఎనర్జీస్ @ రూ. 427-450

ఈ నెల 27-29 మధ్య ఐపీవో

సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ హైదరాబాద్ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 27న ప్రారంభం కానుంది. 29న ముగియనున్న ఇష్యూకి రూ. 427-450 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 1,291 కోట్లకుపైగా ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 3.42 కోట్ల(రూ. 1,539 కోట్ల విలువ) షేర్లను ప్రమోటర్‌సహా ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా మొత్తం రూ. 2,830 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 26న షేర్లను ఆఫర్ చేయనుంది.



కల్యాణ్ జ్యువెలర్స్‌లో వార్‌బర్గ్ 6.45% వాటా విక్రయం

ప్రమోటర్లకు మరో 2.36 % అమ్మకానికి ఒప్పందం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ తాజాగా కల్యాణ్ జ్యుయలర్స్‌లో 6.45 శాతం వాటాను విక్రయించింది. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నిర్వహించిన ఈ ఓపెన్ మార్కెట్ లావాదేవీ విలువ సుమారు రూ. 3,584 కోట్లు. డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ హైడెల్ ఇన్వెస్ట్‌మెంట్ 6.65 కోట్ల షేర్లను సగటున ఒక్కో షేరును రూ. 539.10 రేటు చొప్పున విక్రయించింది. వీటిని ఫిడిలిటీ, నోమురా తదితర సంస్థలు కొనుగోలు చేశాయి. హైడెల్ ఇన్వెస్ట్‌మెంట్ షేరు ఒక్కింటికి రూ. 535 రేటు చొప్పున ఇంకో 2.36% వాటాను కంపెనీ ప్రమోటర్, ఎండీ టీఎస్ కల్యాణరామన్‌కి రూ. 1,300 కోట్లకు విక్రయించనుంది. ఇందుకోసం ప్రమోటరు, హైడెల్ ఇన్వెస్ట్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకున్నాయి.

భారత్‌లో ఆడి కొత్త క్యూ8

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ దిగ్గజం ఆడి తాజాగా భారత్‌లో కొత్త క్యూ8 విడుదల చేసింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.1.17 కోట్లు. 8 స్పీడ్ టిప్‌ట్రానిక్ ట్రాన్స్‌మిషన్, 48వీ మైల్డ్ హైబ్రిడ్ టెక్నాలజీతో 3.0 లీటర్ టీఎఫ్‌ఎస్‌ఐ ఇంజిన్ పొందుపరిచారు. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 5.6 సెకన్లలో అందుకుంటుంది. గరిష్ట వేగం గంటకు 250 కిలోమీటర్లు. ఎనిమిది ఎయిర్‌బ్యాగ్స్, డ్యూయల్ స్క్రీన్ సెటప్, లేజర్ టెక్నాలజీతో డైనమిక్ ఇండికేటర్స్‌తో హెచ్‌డీ మ్యాట్రిక్స్ ఎల్‌ఈడీ హెడ్‌లైట్స్, 17 స్పీకర్స్‌తో బీఅండ్‌వో ప్రీమియం 3డీ సౌండ్ సిస్టమ్, 360 డిగ్రీ సరౌండ్ వ్యూ కెమెరా, 4 జోన్ క్లైమేట్ కంట్రోల్ సిస్టమ్, ఆడి వర్చువల్ కాక్‌పిట్, రెడ్ బ్రేక్ కాలిపర్స్‌తో ఆర్21 గ్రాఫైట్ గ్రే అలాయ్ వీల్స్ వంటి హంగులు ఉన్నాయి. కాగా, ఆడి 15 ఏళ్లలో భారత్‌లో 1,00,000 యూనిట్ల అమ్మకాల మైలురాయిని అధిగమించింది.



చిన్న రియాక్టర్లకు ప్రోత్సాహకాలు

పదేళ్లలో 100 భారత్ స్మాల్ రియాక్టర్ల లక్ష్యం

అణు విద్యుత్ దిశగా అడుగులు

దేశీయంగా అణువిద్యుదుత్పత్తిని పెంచే దిశగా భారత్ స్మాల్ రియాక్టర్లను (బీఎస్‌ఆర్) పెద్ద ఎత్తున ప్రోత్సహించడంపై కేంద్రం దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా సివిల్ లయబిలిటీ ఫర్ ది న్యూక్లియర్ డ్యామేజ్ చట్టానికి సవరణలను చేయడంతో పాటు అణు విద్యుత్ ప్లాంట్ల టెక్నాలజీ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ సంస్థలను కూడా ఏర్పాటు చేసే యోచనలో ఉంది. అలాగే, భారజల తయారీ విభాగంలోకి ప్రైవేట్ పెట్టుబడులను అనుమతించడం, అణు వ్యర్థాల నిర్వహణ సంస్థ (ఎన్‌డబ్ల్యూఎంవో)ను నెలకొల్పడం వంటి ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. వచ్చే పదేళ్లలో దేశీయంగా 50 బీఎస్‌ఆర్‌లను, అంతర్జాతీయంగా మరో 50 బీఎస్‌ఆర్‌లను ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. బీఎస్‌ఆర్‌ల ఏర్పాటుకు ప్రైవేట్ రంగంతో కలిసి ప్రభుత్వం పనిచేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల బడ్జెట్‌లో తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ రంగ సంస్థలు అణువిద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు, వాటిని నిర్వహించేందుకు అటామిక్ ఎనర్జీ యాక్ట్‌నకు సవరణలు చేయనున్నట్లు సమాచారం.



–సాక్షి, బిజినెస్ డెస్క్

కొత్త ఇంధనానికి అనుగుణంగా..

అడ్వాన్స్‌డ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ఎన్‌రిచ్డ్ లైఫ్ (ఏఎన్‌ఈఈఎల్) అనే కొత్త రకం ఇంధనానికి అనుగుణంగా ఉండేలా భారత్ స్మాల్ రియాక్టర్లను తీర్చిదిద్దే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఇంధనాన్ని మెహుల్ షా అనే భారతీయుడు నెలకొల్పిన అమెరికన్ సంస్థ క్లీన్ కోర్ థోరియం ఎనర్జీ రూపొందించింది. ఇది నిర్దిష్ట రకం యురేనియం, థోరియం కలయికతో ఉంటుంది. థోరియం నిల్వలు భారత్‌లో పుష్కలంగా ఉన్నాయి. క్లీన్ కోర్ సంస్థకు ఈ ఇంధనంపై పేటెంట్ హక్కులు ఉన్నాయి. ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త అనిల్ కకోద్కర్, మాజీ జాతీయ భద్రతా సలహాదారు ఎంకే నారాయణన్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ మాజీ సీఈవో లక్ష్మి నారాయణన్ తదితరులు ఈ సంస్థకు అడ్వైజర్లుగా ఉన్నారు. భారత్ హరిత విద్యుత్ వైపు మళ్లేందుకు ఏఎన్‌ఈఈఎల్ ఇంధనం గణనీయంగా తోడ్పడగలదని అంచనాలున్నాయి.

సాక్షి స్పోర్ట్స్

పోరాడి ఓడిన సతీశ్

జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. బరిలో మిగిలిన ఏకైక ప్లేయర్ సతీశ్ కుమార్ కరుణాకరన్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాడు. యోకోహామాలో గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 47వ ర్యాంకర్ సతీశ్ 21-18, 18-21, 8-21తో ప్రపంచ 40వ ర్యాంకర్ కాంతాఫోన్ వాంగ్‌చరోయెన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సతీశ్ తొలి గేమ్‌ను దక్కించుకొని రెండో గేమ్‌లో 18-15తో ఆధిక్యంలోకి వెళ్లి విజయం దిశగా సాగాడు. అయితే థాయ్‌లాండ్ ప్లేయర్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఆరు పాయింట్లు గెలిచి రెండో గేమ్‌ను 21-18తో సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో సతీశ్ తడబడ్డాడు. సతీశ్‌కు 2,550 డాలర్ల (రూ. 2 లక్షల 14 వేలు) ప్రైజ్‌మనీ, 4,320 పాయింట్లు లభించాయి.





రోహిత్ శర్మ, బెన్ స్టోక్స్ (ఫైల్)

ఇంగ్లండ్ గడ్డపై ఐదు టెస్టులు

- వచ్చే ఏడాది భారత జట్టు పర్యటన
- జూన్ 20 నుంచి తొలి టెస్టు మ్యాచ్

లండన్: భారత క్రికెట్ జట్టు 2025లో ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ప్రస్తుత వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ముగిసిన వెంటనే 2025-2027 డబ్ల్యూటీసీ మొదలవుతుంది. ఇందులో భాగంగా ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. దీనికి సంబంధించి ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) 10 నెలల ముందుగానే షెడ్యూల్‌ను విడుదల చేయడం విశేషం. ఐదు టెస్టులు జరిగే వేదికలతో పాటు తేదీలను కూడా ఈసీబీ ప్రకటించింది. జూన్ 20-24 మధ్య లీడ్స్‌లో తొలి టెస్టు, జూలై 2-6 మధ్య బర్మింగ్‌హామ్‌లో రెండో టెస్టు జరుగుతాయి. జూలై 10-14 మధ్య జరిగే మూడో టెస్టుకు లండన్‌లోని లార్డ్స్ మైదానం వేదిక కానుండగా... మాంచెస్టర్‌లో నాలుగో టెస్టు (జూలై 23-27), లండన్‌లోని ఓవల్‌లో ఐదో టెస్టు (జూలై 31-ఆగస్టు 4) నిర్వహిస్తారు. ఇరు జట్ల మధ్య 2021-22 సీజన్‌లో ఇంగ్లండ్ గడ్డపై జరిగిన ఐదు టెస్టుల సిరీస్ 2-2తో 'డ్రా'గా ముగిసింది. ఇంగ్లండ్ గడ్డపై భారత జట్టు టెస్టు సిరీస్ గెలిచి 17 ఏళ్లయింది.

2026లో లార్డ్స్‌లో మహిళల టెస్టు...


భారత పురుషుల జట్టు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ఆడుతున్న సమయంలో భారత్, ఇంగ్లండ్ మహిళా జట్లు కూడా అక్కడే పరిమిత ఓవర్ల సిరీస్‌లో తలపడనున్నాయి. ఇరు జట్ల మధ్య వచ్చే ఏడాది 5 టి20లు, 3 వన్డేలు జరుగుతాయి. జూన్ 28, జూలై 1, 4, 9, 12 తేదీల్లో నాటింగ్‌హామ్, బ్రిస్టల్, ఓవల్, మాంచెస్టర్, ఎడ్జ్‌బాస్టన్ వేదికలుగా ఐదు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అనంతరం సౌతాంప్టన్, లార్డ్స్, డర్హమ్‌లలో జూలై 16, 19, 22 తేదీల్లో మూడు వన్డే మ్యాచ్‌లు జరుగుతాయి. దీంతో భారత మహిళల జట్టు పర్యటన ముగుస్తుంది. అయితే 2026లో మన టీమ్ మళ్లీ ఇంగ్లండ్‌కు వెళ్లి ఏకైక టెస్టు మ్యాచ్‌లో తలపడుతుంది. ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానం వేదికగా ఈ టెస్టు జరుగుతుందని ఈసీబీ ప్రకటించింది. లార్డ్స్‌లో మహిళల టెస్టు మ్యాచ్ జరగనుండటం ఇదే మొదటిసారి కావడం విశేషం.

భారత్ 'పసిడి పట్టు'

- నాలుగు స్వర్ణాలు గెలిచిన భారత అమ్మాయిలు
- అదితి, నేహా, పుల్కిత్, మాన్సీలకు పసిడి పతకాలు

అమ్మాన్ (జోర్డాన్): సీనియర్ స్థాయిలోనే కాకుండా జూనియర్ స్థాయిలోనూ అంతర్జాతీయ వేదికపై భారత రెజ్లర్లు తమ పట్టు నిరూపించుకుంటున్నారు. ప్రపంచ అండర్-17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్‌కు నాలుగు స్వర్ణ పతకాలు లభించాయి. గురువారం జరిగిన నాలుగు ఫైనల్స్‌లో బరిలోకి దిగిన భారత అమ్మాయిలు ఎదురులేని విజయాలు సాధించి బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. అదితి కుమారి (43 కేజీలు), నేహా (57 కేజీలు), పుల్కిత్ (65 కేజీలు), మాన్సీ లాథెర్ (73 కేజీలు) ప్రపంచ చాంపియన్‌లుగా అవతరించారు. శుక్రవారం భారత్ ఖాతాలో మరో రెండు స్వర్ణ పతకాలు చేరే అవకాశముంది. కాజల్ (69 కేజీలు), శ్రుతిక శివాజీ పాటిల్ (46 కేజీలు) నేడు జరిగే ఫైనల్లో స్వర్ణ-రజత పతకాల కోసం పోటీపడతారు. రాజ్‌బాలా (40 కేజీలు), ముస్కాన్ (53 కేజీలు), రజ్నీత (61 కేజీలు) కాంస్య పతకాల రేసులో ఉన్నారు. 49 కేజీల విభాగంలో భారత్ నుంచి ఎవరూ బరిలోకి దిగలేదు. ఓవరాల్‌గా భారత అమ్మాయిల జట్టుకు టీమ్ ట్రోఫీ టైటిల్ లభించే అవకాశం కూడా ఉంది.

43 కేజీల ఫైనల్లో అదితి 7-0తో మరియా లుజా జికికా (గ్రీస్)పై గెలుపొందగా... 57 కేజీల ఫైనల్లో నేహా 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో 10-0తో జపాన్ రెజ్లర్ సో సుత్సుయ్‌ను చిత్తు చేయడం విశేషం. 3 నిమిషాల 59 సెకన్లలో నేహా జపాన్ రెజ్లర్‌పై పది పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించింది. నిబంధనల ప్రకారం ప్రత్యర్థిపై పది పాయింట్ల ఆధిక్యం సాధించిన వెంటనే ఆ రెజ్లర్‌ను 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో విజేతగా ప్రకటిస్తారు. 65 కేజీల ఫైనల్లో పుల్కిత్ 6-3తో అంతర్జాతీయ తటస్థ రెజ్లర్ దరియా ఫ్రోలోవాపై నెగ్గింది. 73 కేజీల ఫైనల్లో మాన్సీ 5-0తో అంతర్జాతీయ తటస్థ రెజ్లర్ హనా పిర్స్‌కాయాపై గెలిచింది.



జపాన్ రెజ్లర్‌ను ఓడించాక నేహా గెలుపు సంబరం

సెమీస్‌లో సురేశ్ జోడీ



నార్త్ కరోలీనా: విన్‌స్టన్-సాలెమ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగిన దక్షిణేశ్వర్ సురేశ్ (భారత్)-లుకా పౌ (బ్రిటన్) జోడీ అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. తొలి రౌండ్‌లో ఆరో సీడ్ జంటను బోల్తా కొట్టించిన సురేశ్-లుకా ద్వయం క్వార్టర్ ఫైనల్లోనూ 'సూపర్ టైబ్రేక్'లో సంచలన విజయాన్ని అందుకుంది. 53వ ర్యాంకర్ గొంజాలో ఎస్కోబార్ (ఈక్వెడార్)-56వ ర్యాంకర్ నెదోవ్‌యెసోవ్ (కజకిస్తాన్)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో సురేశ్ -లుకా 6-1, 4-6, 10-8తో గెలుపొంది సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది.

రేస్ వాకర్ భావనపై వేటు



న్యూఢిల్లీ: భారత మేటి రేస్ వాకర్ భావన జాట్‌పై 16 నెలల నిషేధం విధించారు. డోప్ టెస్టులకు సంప్రదించినపుడు 'ఎప్పుడు-ఎక్కడ' అనే చిరునామాను వెల్లడించడంలో ఆమె విఫలమైంది. దీంతో డోపింగ్ నిరోధక క్రమశిక్షణ (ఏడీడీపీ) కమిటీ ఆమెపై చర్యలు తీసుకుంది. మహిళల 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో భావన జాతీయ రికార్డు నెలకొల్పింది. గతేడాది ఆగస్టులో ఆమెపై తాత్కాలిక నిషేధం విధించడంతో పాటు బుడాపెస్ట్‌లో ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వెళ్లిన ఆమెను ఉన్నపళంగా వెనక్కి పిలిచారు. అయితే ప్రస్తుతం ఖరారు చేసిన 16 నెలల నిషేధం కూడా గత ఆగస్టు నుంచి మొదలై ఈ ఏడాది డిసెంబర్‌తో ముగుస్తుంది.

మిన్ను మాయాజాలం: ఆస్ట్రేలియా 'ఎ' 212 ఆలౌట్

గోల్డ్ కోస్ట్: ఆఫ్ స్పిన్నర్ మిన్ను మణి... లెగ్ స్పిన్నర్ ప్రియా మిశ్రా మాయాజాలానికి ఆస్ట్రేలియా 'ఎ' జట్టు బ్యాటర్లు నిలబడలేకపోయారు. భారత 'ఎ' మహిళల జట్టుతో గురువారం మొదలైన ఏకైక అనధికారిక టెస్టులో ఆస్ట్రేలియా 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 65.5 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మిన్ను మణి 54 పరుగులిచ్చి 5 వికెట్లు... ప్రియా మిశ్రా 58 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టారు. మరో వికెట్ ఎడంచేతి వాటం స్పిన్నర్ మన్నత్ కశ్యప్ దక్కించుకుంది. ఆసీస్ 'ఎ' జట్టులో ఓపెనర్ జార్జియా వోల్ (71; 12 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. మైట్లాన్ బ్రౌన్ (30; 2 ఫోర్లు), గ్రేస్ పార్సన్స్ (35; 3 ఫోర్లు) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత 'ఎ' జట్టు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 100 పరుగులు సాధించింది. శ్వేత సెహ్రావత్ (40 బ్యాటింగ్; 3 ఫోర్లు), తేజల్ హసాబ్నిస్ (31 బ్యాటింగ్; 2 ఫోర్లు) మూడో వికెట్‌కు అజేయంగా 53 పరుగులు జోడించారు.



ఇంగ్లండ్ 259/6

మాంచెస్టర్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ స్వల్ప ఆధిక్యం సాధించింది. వర్షం అంతరాయం మధ్య సాగిన మ్యాచ్‌లో గురువారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. జేమీ స్మిత్ (72 బ్యాటింగ్; 5 ఫోర్లు, ఒక సిక్సర్), హ్యారీ బ్రూక్ (56; 4 ఫోర్లు) అర్ధశతకాలు సాధించారు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగులకు ఆలౌట్ కాగా... చేతిలో 4 వికెట్లు ఉన్న ఇంగ్లండ్ 23 పరుగుల ఆధిక్యంలో ఉంది. జేమీ స్మిత్‌తో పాటు అట్కిన్సన్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.



రిజ్వాన్

రిజ్వాన్, షకీల్ సెంచరీలు

పాక్ తొలి ఇన్నింగ్స్ 448/6 డిక్లేర్డ్

రావల్పిండి: వికెట్ కీపర్ మొహమ్మద్ రిజ్వాన్ (239 బంతుల్లో 171 నాటౌట్; 11 ఫోర్లు, 3 సిక్సర్లు), వైస్ కెప్టెన్ సాద్ షకీల్ (261 బంతుల్లో 141; 9 ఫోర్లు) సెంచరీలతో చెలరేగారు. దాంతో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్తాన్ భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 158/4తో గురువారం రెండో రోజు ఆట కొనసాగించిన పాకిస్తాన్ 113 ఓవర్లు ఆడి స్కోరు 448/6 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. నాలుగో వికెట్‌కు వీరిద్దరు కలిసి 240 పరుగులు జోడించడం విశేషం. బంగ్లాదేశ్ బౌలర్లలో షరీఫుల్ ఇస్లామ్, హసన్ మహమూద్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 12 ఓవర్లు ఆడి వికెట్ నష్టపోకుండా 27 పరుగులు చేసింది. షాద్‌మన్ ఇస్లామ్ (12 బ్యాటింగ్), జాకీర్ హసన్ (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

సత్తా చాటేలా సిలబస్!

వచ్చే 20 ఏళ్ల సాంకేతికతను అందిపుచ్చుకొనేలా ఇంజనీరింగ్ పాఠ్యాంశాలు

ఫస్టియర్‌లో మేథమెటికల్ కోడింగ్.. కోర్సుల్లో ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి బోధనాంశాలు

కాలం చెల్లిన సిలబస్‌ను మార్చాలని ఏఐసీటీఈ నిపుణుల కమిటీ సూచన

స్వాగతిస్తున్న అటానమస్ కాలేజీలు... వద్దంటున్న చిన్న కాలేజీలు


సాక్షి, హైదరాబాద్

ఇంజనీరింగ్ కోర్సుల్లో పాఠ్యాంశాలు వచ్చే 20 ఏళ్ల సాంకేతికతను అందిపుచ్చుకొనేలా ఉండాలని ఏఐసీటీఈ సూచిస్తోంది. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్‌లో ఈ మార్పు అనివార్యమని అంటోంది. ఆరుగురు సభ్యులతో కూడిన ఏఐసీటీఈ నిపుణుల కమిటీ గతేడాది సరికొత్త సీఎస్‌సీ బోధనాంశాలను ప్రతిపాదించింది. దిగ్గజ ఐటీ సంస్థల ప్రతినిధులతో చర్చించిన ఈ కమిటీ... సైబర్ సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి బోధనాంశాలను కోర్సుల్లో చేర్చాలని సూచించింది. ప్రస్తుతం మూడేళ్లకోసారి యూనివర్సిటీలు ఇంజనీరింగ్ సిలబస్‌లో మార్పులు చేస్తున్నప్పటికీ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ప్రస్తుత పాఠ్యాంశాలు లేవని ఏఐసీటీఈ అభిప్రాయపడుతోంది.

ఇప్పుడున్న పరిస్థితి ఏమిటి?

- కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థికి గణిత శాస్త్రంపై పట్టు ఉండాలి. ఏఐ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక దీన్ని నాలుగు రెట్లు పెంచేలా బోధనాంశాలుండాలి. కానీ ఇప్పుడున్న సిలబస్‌లో ఈ నాణ్యత కనిపించట్లేదు. ఇంటర్‌లోని సాధారణ గణితశాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన అంశాలే కోర్సుల్లో ఉంటున్నాయి.
- రాష్ట్రవ్యాప్తంగా ఏటా 75 వేల మంది కంప్యూటర్ సైన్స్, అనుబంధ కోర్సుల్లో చేరుతున్నారు. క్లిష్టమైన గణిత సంబంధ కోడింగ్‌లో 20 వేల మందే ప్రతిభ చూపుతున్నారు. సీఎస్‌ఈ పూర్తి చేసినా కంపెనీల్లో ఉపయోగించే కోడింగ్‌ను అందుకోవడం వారికి కష్టంగా ఉంటోంది.
- మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డిజైన్ థింకింగ్ వంటి సరికొత్త ప్రోగ్రామింగ్ అందుబాటులోకి వచ్చింది. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆల్జీబ్రా, అల్గోరిథమ్స్‌పై పట్టు ఉంటే తప్ప ఈ కోర్సుల్లో రాణించడం కష్టం. ఈ తరహా ప్రయత్నాలు ఇంజనీరింగ్ కాలేజీల్లో జరగట్లేదనేది ఏఐసీటీఈ పరిశీలన.
- ఇంజనీరింగ్‌లో కనీసం వివిధ రకాల మైక్రో స్పెషలైజేషన్ కోర్సులు అందిస్తే తప్ప కొత్త కంప్యూటర్ కోర్సుల్లో విద్యార్థులు పరిణతి చెందరు. ఈ మార్పును ఇంజనీరింగ్ కాలేజీలు అర్థం చేసుకోవట్లేదు. దీంతో డీప్ లెర్నింగ్, అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ వంటి వాటిలో వెనకబడుతున్నారు.

ఏఐసీటీఈ సూచించిన మార్పులేంటి?

- ఇంజనీరింగ్ ఫస్టియర్‌లో గణిత విభాగాన్ని విస్తృతం చేయాలి. పలు రకాల కంప్యూటర్ కోడింగ్‌కు సంబంధించిన అల్గోరిథమ్స్, ఆల్జీబ్రాతో కూడిన పాఠ్యాంశాలను కొత్తగా జోడించాలి.
- కంప్యూటర్స్ రంగంలో వస్తున్న నూతన అంశాల గురించి విద్యార్థులు తెలుసుకొనేలా ప్రాక్టికల్ బోధనాంశాలను తీసుకురావాలి. వాటిపై కాలేజీల్లోని కంప్యూటర్ ల్యాబ్‌లలో ప్రాక్టికల్స్ నిర్వహించాలి.
- ఎథికల్ ప్రొఫెషనల్ రెస్పాన్సిబిలిటీ, రీసెర్చ్ అండ్ అండర్‌స్టాండింగ్, హ్యూమన్ వాల్యూస్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ వంటి సబ్జెక్టులను కోర్సుల్లో చేర్చాలి. దీనివల్ల విద్యార్థులకు సామాజిక అవగాహన కూడా అలవడుతుంది.

నాణ్యత పెంచాల్సిందే

ప్రపంచవ్యాప్తంగా సాంకేతికత వేగంగా మారుతోంది. ఇంజనీరింగ్ విద్యలో మార్పులు అనివార్యం. భవిష్యత్ తరాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతికతతో బోధన ప్రణాళిక అవసరం. కొన్ని కాలేజీల కోసం ఈ మార్పును ఆపడం ఎలా సాధ్యం?


ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి

ప్రత్యేక క్లాసులు తీసుకోవాలి

కొత్త సిలబస్‌ను స్వాగతించాలి. స్థాయిని అందుకోలేని విద్యార్థులకు అదనపు అవగాహనకు తరగతులు నిర్వహించాలి. కాలేజీలే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రపంచంతో పోటీ పడేందుకు అవసరమైన బోధనాంశాలు ఉండాలని అన్ని వర్గాలు భావిస్తున్నాయి.


ప్రొఫెసర్ డి.రవీందర్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ

సమస్యేంటి?

రాష్ట్రంలో 175 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా వాటిలో 78 కాలేజీలు అటానమస్ హోదా పొందాయి. గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీ అందించే సిలబస్‌లో 80 శాతాన్ని ఈ కాలేజీల్లో అమలు చేయాలి. మిగతా 20 శాతం సిలబస్‌ను సొంతంగా తయారు చేసుకోవచ్చు. మారుతున్న సిలబస్‌ను ఈ కాలేజీలు స్వాగతిస్తున్నాయి. కానీ మిగతా కాలేజీలు మాత్రం దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. తమ కాలేజీల్లో లక్షపైన ర్యాంకు పొందిన విద్యార్థులు చేరుతున్నారని.. వాళ్లు అత్యున్నత బోధనా ప్రణాళిక స్థాయిని ఎలా అందుకుంటారని ప్రశ్నిస్తున్నాయి. అయితే నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను చదివినా ఉద్యోగాలు రాని పరిస్థితి ఏర్పడుతుందని యూనివర్సిటీలు అంటున్నాయి.



వరండాలే వార్డులు.. స్విచ్ బోర్డులకే సెలైన్లు

జనగామ జిల్లా ఆస్పత్రిలో జనరల్ వార్డులు విషజ్వరాల రోగులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో మొదటి, రెండో అంతస్తుల్లో పదిహేను నుంచి 20 వరకు పడకలు ఆరుబయట వేశారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు సెలైన్ ఎక్కించేందుకు స్టాండ్ల కొరత ఏర్పడింది. దీంతో కిటికీలు, స్విచ్ బోర్డులకు దారాలతో సెలైన్ సీసాలను వేలాడదీసి సేవలు అందిస్తున్నారు.

జనగామ

టూటౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలో బైఠాయించిన విద్యార్థులు



ప్రిన్సిపాల్ వేధింపులపై ఫిర్యాదుకు.. 7 కి.మీ. నడిచొచ్చిన విద్యార్థులు..

ఆదిలాబాద్ టౌన్: ప్రిన్సిపాల్, వార్డెన్ తమను వేధింపులకు గురి చేస్తున్నారని విద్యార్థులు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. మావల మండల కేంద్రంలో కొనసాగుతున్న జైనథ్ మహాత్మా జ్యోతిబాపూలే (ఎంజేపీ) పాఠశాల విద్యార్థులు 46 మంది వేకువజామునే ఏడు కిలోమీటర్ల దూరం కాలినడకన ఆదిలాబాద్‌లోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరారు. విద్యార్థులు మాట్లాడుతూ తెల్లవారు జామున గోడ దూకి వచ్చామని, తమ సమస్యలు చెబితే పదో తరగతి బోనఫైడ్ సర్టిఫికెట్లపై బ్యాడ్ రికార్డు ఇస్తామని ప్రిన్సిపాల్ బెదిరిస్తున్నారని వాపోయారు. పోలీసులు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారిని పోలీసు బస్సులో పాఠశాల వరకు సాగనంపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ రాజర్షిషా జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగు, ఆదిలాబాద్ ఆర్డీఓ వినోద్‌కుమార్‌ను విచారణ నిమిత్తం పాఠశాలకు పంపించారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను విచారించిన అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.



గిన్నిస్‌లోకి 'డాక్టర్ రెడ్డీస్'

సాక్షి, హైదరాబాద్: 'టైప్–2' మధుమేహంతో బాధపడే వారికి అవగాహన కల్పించేందుకు డాక్టర్ రెడ్డీస్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కింది. ఈ మేరకు డాక్టర్ రెడ్డీస్ సంస్థ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సంస్థకు చెందిన ఎండోక్రైనాలజిస్టులు, డయాబెటాలజిస్టులు సంయుక్తంగా 'గ్లైసీమిక్ హ్యాపీనెస్'అనే కాన్సెప్ట్‌తో ఒక పరికరాన్ని అభివృద్ధి చేసింది. ఈ పరికరంతో దాదాపు 30 వేలమంది రోగులు ప్రయోజనం పొందారని సంస్థ పేర్కొంది. ఈ కార్యక్రమంలో భాగంగా అతిపెద్ద మొజాయిక్ బ్రోచర్ (లోగో)ను 162 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థకు చెందిన స్వప్నిల్ దంగార్కర్ పాల్గొని, ప్రశంసాపత్రాన్ని డాక్టర్ రెడ్డీస్ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ హెడ్–ఇండియా బిజినెస్ సందీప్ ఖండేల్వాల్, ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ సంజయ్ కల్రా తదితరులు పాల్గొన్నారు.

అద్దం కనిపిస్తలేదు.. స్టీరింగ్ తిరుగుతలేదు...

పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో బస్సును నిలిపివేసిన ఆర్టీసీ డ్రైవర్



హుజూరాబాద్: 'ఫుట్‌బోర్డుపై మీరు నిలబడితే నాకు సైడ్ మిర్రర్ కనిపిస్త లేదు. అద్దం చూడకుండా బస్సు నడపలేను. ఇంతమందితో బస్సు ముందుకు పోవాలంటే కష్టమే.. కనీసం స్టీరింగ్ తిరుగుతలేదు. కొందరు దిగాల్సిందే..'అంటూ ఓ ఆర్టీసీ డ్రైవర్ బస్సును నడిరోడ్డుపై నిలిపివేశాడు. ఈ సంఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల డిపోకు చెందిన బస్సు వరంగల్‌కు వెళ్తోంది. దారిలో హుజూరాబాద్ బస్టాండ్‌లో ఆగింది. అప్పటికే బస్సునిండా ప్రయాణికులు ఉన్నారు. నిల్చునేందుకు కూడా స్థలం లేదు. అయినప్పటికీ బస్టాండులో వరంగల్ వెళ్లేవారు మరికొంతమంది ఎక్కారు. డ్రైవర్ ఓవర్ లోడ్ అవుతోందని, బస్సు నడిపే పరిస్థితి ఉండదని ప్రయాణికులను వారించినా వినిపించుకోలేదు. బస్సు బస్టాండ్ నుంచి బయటకు వచ్చిన తరువాత డ్రైవర్‌కు సైడ్ మిర్రర్ కనిపించడం లేదు. దీంతో అద్దం కనిపించడం లేదని, వెనకనుంచి వచ్చే వాహనాలను గమనించకుండా బస్సుని నడపలేనని డ్రైవర్ బస్సును రోడ్డుపై నిలిపివేశాడు. ఇంతమంది ఎక్కితే కనీసం బస్సు స్టీరింగ్ తిరగడం లేదని చెప్పాడు. ప్రయాణికులు సహకరించి కొందరు దిగిపోవాలని అభ్యర్థించాడు. దీంతో కొంతమంది దిగిపోవడంతో బస్సు వరంగల్ బయల్దేరింది.

తిండి లేక కొడుకు ఇంటి ముందే ప్రాణాలు విడిచిన తల్లి

కోడలే కొడుకై దహన సంస్కారాలు చేసిన వైనం


అంబమ్మ దహన సంస్కారాలకు సిద్ధమవుతున్న గ్రామస్తులు




అమ్రాబాద్: అమ్మ ముందు కూడా మానవ సంబంధాలు ఓడిపోయాయి. అమ్మ నుంచి వచ్చిన ఆస్తులు పంచుకున్న ఇద్దరు కొడుకులూ అమ్మను మాత్రం ఆదరించలేకపోయారు. దీంతో ఆ తల్లి తిండిలేక చిన్న కొడుకు ఇంటిముందే కన్నుమూసింది. కోడలే కొడుకై అంత్యక్రియలు నిర్వహించిన ఘటన గ్రామస్తులను కలచివేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని తిర్మలాపూర్(బీకే)లో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తిర్మలాపూర్(బీకే) గ్రామానికి చెందిన మిద్దె అంబమ్మ(75)కు ముగ్గురు కుమారులు తిరుపతయ్య, పోషప్ప, మల్లేశ్, ఒక కూతురు సంతానం. అంబమ్మకు ఆరెకరాల వ్యవసాయ పొలం, ఇల్లు ఉండగా.. ముగ్గురు అన్నదమ్ములు సమానంగా పంచుకున్నారు. అంబమ్మ భర్త, పెద్ద కొడుకు గతంలోనే మృతి చెందారు. అయితే తిరుపతయ్య మృతితో పెద్ద కోడలు వెంకటమ్మ తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కొన్నాళ్ల పాటు అత్త అంబమ్మను హైదరాబాద్ తీసుకెళ్లి పోషించింది.

3 రోజుల క్రితం చిన్న కొడుకు దగ్గరికి..: మూడు రోజుల క్రితం అంబమ్మను స్వగ్రామానికి తీసుకువచ్చి మరిది మల్లేశ్ ఇంటి వద్ద దించి వెంకటమ్మ వెళ్లిపోయింది. కొడుకులిద్దరూ అంబమ్మను పట్టించుకోకపోవడంతో తిండిలేక గురువారం ఉదయం మృతి చెందింది. తల్లి చనిపోయినా ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కొడుకులిద్దరూ ముఖం చాటేయడంతో గ్రామస్తులే వెంకటమ్మతో తలకొరివి పెట్టించారు.

లోన్‌యాప్ కేసులో రూ. 19.39 కోట్లు అటాచ్

సాక్షి, హైదరాబాద్: లోన్ యాప్ కేసులలో ఆయా కంపెనీలకు చెందిన రూ.19.39 కోట్లను ఈడీ జప్తు చేసింది. ఇందులో పలు బ్యాంకు ఖాతాల్లోని బ్యాంకు బ్యాలెన్స్‌లతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. గతంలోనూ పలుమార్లు లోన్‌యాప్ సంస్థల ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. తాజాగా మరోమారు రూ.19.39 కోట్లు జప్తు చేసినట్టు ఈడీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్టంట్ లోన్ యాప్స్ మోసాలపై మనీలాండరింగ్ కింద కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నది. ఈ యాప్స్‌పై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 118 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా తాజాగా నిమిషా ఫైనాన్స్ ఇండియా, రాజ్‌కోట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ట్రస్ట్ లిమిటెడ్, మహానంద ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్, బాస్కిన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ బ్యాంక్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో నిల్వ ఉన్న రూ.19.39 కోట్లు ఈడీ జప్తు చేసింది.



25 నుంచి ఏలూరులో వందేభారత్‌కు హాల్టింగ్



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్–విశాఖపట్నం (20707/20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 25 నుంచి ఏలూరు స్టేషన్‌లో ఆగనున్నట్టు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ నుంచి వెళ్లేటప్పుడు ఉదయం 9.49 గంటలకు, విశాఖ నుంచి వచ్చే సమయంలో సాయంత్రం 5.54 గంటలకు నిమిషం పాటు ఏలూరులో ఆగనుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సినిమా
శుక్రవారం ॥ 23-8-2024

తెలుగు సినిమా వెయ్యి కోట్ల వసూళ్లతో ముందు ముందుకెళుతోంది. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్, కల్కి' వంటి చిత్రాలు ఇందుకు నిదర్శనం. ఇలా వసూళ్ల పరంగా ముందుకు వెళుతున్న టాలీవుడ్ కథల పరంగా వెనక్కి వెళుతోంది. అవును... ఇప్పుడు పలువురు స్టార్ హీరోలు పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం తెలుగులో పదికి పైగా పీరియాడికల్ సినిమాలు తెరకెక్కుతున్నాయి. 20వ శతాబ్దపు కథలతో రూపొందుతున్న ఆ చిత్రాల్లో నటిస్తున్న హీరోల గురించి తెలుసుకుందాం.



టాలీవుడ్ ముందుకు... కథలు వెనక్కి..!

ఓ వైపు రాజాసాబ్... మరోవైపు ఫౌజీ

యుద్ధానికి సరికొత్త నిర్వచనం ఇవ్వనున్నారు ప్రభాస్. ఇందుకోసం ఈ హీరో దాదాపు 80 ఏళ్ల వెనక్కి వెళ్లనున్నారు. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటించనున్నారు. 1940 నేపథ్యంలో సాగే ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుంది. కాగా ఈ చిత్రం పోస్టర్‌పై కనిపించిన 'ఆజాద్ హింద్ ఫౌజ్', 'హైదరాబాద్ చార్మినార్', 'ఆపరేషన్ జెడ్', 'పవిత్రాణాయ సాధూనాం' వంటి అంశాలు సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తి కలిగేలా చేస్తున్నాయి. కొన్ని వాస్తవ ఘటనలకు కొంత కాల్పనికతను జోడించి ఈ సినిమా కథ తయారు చేశారట హను రాఘవపూడి. మాతృభూమి కోసం పోరాడే ఓ యోధుడి నేపథ్యంలో సాగే సినిమా అనే ప్రచారం కూడా జరుగుతోంది. 'ఆధిపత్యం కోసమే యుద్ధాలు జరుగుతున్న సమయం అది. అలాంటప్పుడు ఆ యుద్ధానికి సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చాడు ఓ యోధుడు'' అంటూ ఈ సినిమా కథ గురించి ఇటీవల పేర్కొన్నారు హను రాఘవపూడి. జయప్రద, మిథున్ చక్రవర్తి కీలక పాత్రల్లో నటించనున్న ఈ సినిమాకు విశాల్ చంద్రశేఖర్ సంగీత దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం 2026 ప్రారంభంలో రిలీజ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజాసాబ్' అనే సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం కూడా 1990 నాటి కథేనని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాలో వింటేజ్ ప్రభాస్‌ను చూపించనున్నట్లుగా చిత్రయూనిట్ చెబుతోంది. ఇందులో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధీ కుమార్ మరో హీరోయిన్‌గా నటిస్తున్నట్లు తెలిసింది. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న 'రాజా సాబ్' సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది.

ఇటు డ్రాగన్... అటు దేవర

ఎన్టీఆర్‌ను 'డ్రాగన్'గా మార్చారట ప్రశాంత్ నీల్. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఆగస్టు 8న ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విడుదలైన ఈ సినిమా పోస్టర్ ఆసక్తికరంగా మారింది. పోస్టర్‌పై 1969, గోల్డెన్ ట్రయాంగిల్, చైనా, భూటాన్, కోల్‌కతా అని పేర్కొంది చిత్రయూనిట్. దీంతో 1969 నేపథ్యంలోనే ఈ సినిమా కథనం ఉంటుందని, ఆ సమయంలో జరిగిన ఓ వాస్తవ ఘటనకు కల్పిత అంశాలను జోడించి, ఈ సినిమాను ప్రశాంత్ నీల్ తెరకెక్కించనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. అంతేకాదు... ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారట. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఇటీవల జిమ్‌లో కసరత్తులు చేస్తూ ఎన్టీఆర్ చేతికి గాయమైన సంగతి తెలిసిందే. ఈ గాయం నుంచి కోలుకున్న తర్వాత ఈ సినిమా సెట్స్‌లో ఎన్టీఆర్ జాయిన్ అయ్యే చాన్సెస్ ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, కె. హరికృష్ణ నిర్మించనున్న ఈ సినిమా 2026 జనవరి 9న రిలీజ్ కానుంది.

అలాగే ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంలో నటిస్తున్న మరో చిత్రం 'దేవర'. కొరటాల శివ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. దేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమాను కల్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపిస్తారు. రెండు భాగాలుగా 'దేవర' రిలీజ్ కానుంది. తొలి భాగం సెప్టెంబరు 27న విడుదల కానుంది.

పెద్ది!

రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్ అనుకుంటున్నారని, ఇందులో అన్నదమ్ముల్లా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేయనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా మేకోవర్ పనుల్లో బిజీగా ఉన్నారు రామ్‌చరణ్. కొంచెం బరువు పెరగాలనుకుంటున్నారు. రా అండ్ రస్టిక్‌గా ఆయన లుక్ ఉండబోతుందని తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాదిలోనే ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం విశేషం.

రాయలసీమ నేపథ్యంలో...

హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో 2018లో వచ్చిన 'టాక్సీవాలా' హిట్ మూవీగా నిలిచింది. దాదాపు ఐదేళ్ల తర్వాత విజయ్, రాహుల్‌ల కాంబినేషన్‌లో మరో సినిమా రానుంది. రాయలసీమ నేపథ్యంలో 1854–1878 మధ్య కాలంలో జరిగే కథగా ఈ చిత్రం రానుంది. ఈ పీరియాడికల్ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుంది. ఈ చిత్రంలో తండ్రీ కొడుకుగా విజయ్ దేవరకొండ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారని, ఈ ఏడాదిలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. అలాగే విజయ్ హీరోగా రవికిరణ్ దర్శకత్వంలో 'దిల్' రాజు ఓ సినిమా నిర్మించనున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడికల్ ఫిల్మ్‌గా ఈ చిత్రం ఉంటుందని తెలిసింది.

అసాధారణ ప్రయాణం

ఓ సాధారణ వ్యక్తి జీవితంలో జరిగిన అసాధారణ ఘటనల నేపథ్యంలో రూపొందిన సినిమా 'లక్కీ భాస్కర్'. 'మహానటి', 'సీతారామం' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన సినిమా ఇది. 1980 నేపథ్యంలో 'లక్కీ భాస్కర్' సినిమా ఉంటుంది. ఇందులో ఓ బ్యాంక్ క్యాషియర్‌గా దుల్కర్ సల్మాన్ కనిపిస్తారు. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా అక్టోబరు 31న రిలీజ్ కానుంది.

క.. సస్పెన్స్

కిరణ్ అబ్బవరం నటించిన పీరియాడికల్ యాక్షన్ అండ్ సస్పెన్స్ డ్రామా 'క'. దర్శకత్వ ద్వయం సుజీత్– సందీప్ తెరకెక్కిస్తున్నారు. కృష్ణగిరి పట్టణం, అక్కడ ఉన్న ఓ పోస్ట్‌మేన్, అతని జీవితంలోని మిస్టరీ ఎపిసోడ్ అంశాల నేపథ్యంలో 'క' సినిమా కథనం ఉంటుంది. చింతా గోపాల కృష్ణా రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హీరో క్యారెక్టర్‌లో నెగటివ్ షేడ్స్ కూడా ఉంటాయనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'క' సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు మేకర్స్.

ఈ చిత్రాలతో పాటు మరికొన్ని సినిమాలు కూడా పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్నాయి.

బచ్చల మల్లి

'బచ్చల మల్లి'గా మారిపోయారు 'అల్లరి' నరేశ్. ఆయన టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం 'బచ్చల మల్లి'. ఈ చిత్రంలో అమృతా అయ్యర్ కథానాయికగా నటిస్తున్నారు. సుబ్బు మంగాదేవి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 1990 నేపథ్యంలో సాగే ఈ సినిమా కథ ఓ ఊరి చుట్టూ ఉంటుందని తెలిసింది. ఇందులో ట్రాక్టర్ డ్రైవర్ మల్లి పాత్రలో కనిపిస్తారు 'అల్లరి' నరేశ్. రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

ఎదురు చూపు

ఓ ప్రాంతం ఒకతని కోసం ఎదురు చూస్తోంది. అతని పేరు సాయి దుర్గాతేజ్. 1940 నేపథ్యంలో సాగే ఓ పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్‌లో సాయి దుర్గాతేజ్ హీరోగా నటిస్తున్నారు. 'హను–మాన్' నిర్మాతలు చైతన్య, నిరంజన్‌రెడ్డి దాదాపు 100 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రోహిత్ రెడ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కష్టాలు పడుతున్న ఓ ప్రాంత వాసుల జీవితాలు ఓ వ్యక్తి రాకతో ఎలా మారతాయి? అనే కోణంలో ఈ సినిమా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

24 సంవత్సరాలు

హీరో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో నటిస్తున్న పీరియాడికల్ ఫిల్మ్ 'మట్కా'. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఓ వాస్తవ ఘటన ఆధారంగా వైజాగ్ నేపథ్యంలో గ్యాంబ్లింగ్ అంశాలతో 'మట్కా' సినిమా కథనం ఉంటుందని తెలిసింది. 1958 నుంచి 1982... అంటే ఇరవై నాలుగు సంవత్సరాల టైమ్ పీరియడ్‌లో 'మట్కా' సినిమా కథనం ఉంటుంది. 'పలాస 1978' ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వంలో విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

శివుడి సమక్షంలో తండేల్!


● నాగచైతన్య


'లవ్ స్టోరీ' చిత్రం తర్వాత నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. వాస్తవ ఘటన ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో జాలరి రాజు పాత్రలో నాగ చైతన్య కనిపిస్తారు. కాగా ఈ సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్ శివార్లలో శివాలయం సెట్‌ను రెడీ చేస్తున్నారట మేకర్స్. ఈ సెట్ పూర్తి కాగానే నాగచైతన్యతో పాటు ఇతర ముఖ్య తారాగాణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది. ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

క్రిష్ 4లో..?

'స్త్రీ 2' సినిమా సూపర్ సక్సెస్‌తో హ్యాపీగా ఉన్నారు బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్. ఆమె సంతోషం రెట్టింపు అయ్యిందని బాలీవుడ్ సమాచారం. దీనికి కారణం 'క్రిష్ 4'. హృతిక్ రోషన్ హీరోగా రూపొందుతున్న 'క్రిష్' ఫ్రాంచైజీ గురించి అందరికీ తెలిసిందే. ఈ ఫ్రాంచైజీలో రెండేళ్ల క్రితమే 'క్రిష్ 4'ను ప్రకటించారు హృతిక్ రోషన్. కానీ ఆయన తండ్రి, దర్శకుడు రాకేష్ రోషన్‌కు అనారోగ్య సమస్యలు, హృతిక్ వేరే సినిమాలతో బిజీగా ఉండటం వంటి కారణాల చేత 'క్రిష్ 4' చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాలేదు. తాజాగా 'క్రిష్ 4'పై దృష్టి పెట్టారు హృతిక్ రోషన్. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని నటీనటుల ఎంపిక జరుగుతోందట. ఇందులో భాగంగానే 'క్రిష్ 4'లోని హీరోయిన్ రోల్‌కు శ్రద్ధా కపూర్‌ని అడిగారట మేకర్స్. ప్రస్తుతం హృతిక్ రోషన్ 'వార్ 2' సినిమాతో బిజీగా ఉన్నారని, ఈ సినిమా చిత్రీకరణ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'క్రిష్ 4'ను స్టార్ట్ చేస్తారని, ఆ సమయంలో శ్రద్ధా గురించిన అధికారిక సమాచారం వస్తుందని బాలీవుడ్ భోగట్టా. ఇక 'క్రిష్' గత చిత్రాలకు రాకేష్ రోషన్ దర్శకత్వం వహించగా, 'క్రిష్ 4'కు మాత్రం కరణ్ మల్హోత్రా దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాను 2025 దీపావళికి రిలీజ్ చేస్తామని మేకర్స్ ఓ సందర్భంలో ప్రకటించారు.

నంబరు 3!

సోషల్ మీడియా మాధ్యమాల్లో శ్రద్ధాకపూర్ చాలా యాక్టివ్‌గా ఉంటారు. ఇలా ఆమెకు చాలామంది ఫాలోయర్స్ ఉన్నారు. తాజాగా 'స్త్రీ 2' సక్సెస్‌తో శ్రద్ధా ఫాలోయర్స్ సంఖ్య పెరిగినట్లుంది. గురువారం సాయంత్రానికి శ్రద్ధా కపూర్‌కు 91.7 మిలియన్ ఫాలోయర్స్ ఇన్‌స్టాలో ఉన్నారు. భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోది ఫాలోయర్స్ (91.3) కంటే శ్రద్ధాకపూర్ ఫాలోయర్స్ సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం. ఇక ఇన్‌స్టాలో అత్యధిక ఫాలోయర్స్ ఉన్న భారతీయుల్లో క్రికెటర్ విరాట్ కోహ్లి తొలి స్థానంలో (270 మిలియన్ ఫాలోయర్స్) ఉండగా, రెండో ప్లేస్‌లో టాప్ హీరోయిన్ ప్రియాంకా చోప్రా (91.7 మిలియన్ ఫాలోయర్స్) ఉన్నారు. ఆ విధంగా ప్రస్తుతానికి థర్డ్ ప్లేస్‌లో ఉన్నారు శ్రద్ధా కపూర్. ప్రస్తుతం శ్రద్ధా కపూర్ జోరు చూస్తుంటే ఆమె ప్రియాంకా చోప్రాను సులభంగానే అధిగమించేలా కనిపిస్తున్నారు. 'స్త్రీ 2' సక్సెస్, ఇన్‌స్టా ఫాలోయర్స్‌తో పాటు కొత్త సినిమాల అవకాశాలు వస్తుండటంతో శ్రద్ధా కపూర్ ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఇక ప్రభాస్ హీరోగా నటించిన 'సాహో' సినిమాలో శ్రద్ధా కపూర్ హీరోయిన్‌గా నటించిన విషయం తెలుగు ప్రేక్షకులకు గుర్తుండే ఉంటుంది.


● శ్రద్ధా కపూర్

కొత్త ప్రయాణం


● సుమంత్, కాజల్ చౌదరి

కొత్త సినిమా ప్రయాణం మొదలు పెట్టారు హీరో సుమంత్. ఆయన హీరోగా సన్నీ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో కాజల్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తారు. విహర్ష యడవల్లి ఓ కీలక పాత్రలో నటించనున్నారు. కృషి ఎంటర్‌టైన్‌మెంట్స్, ఈటీవీ విన్ కలిసి ఈ సినిమాను నిర్మించనున్నాయి. త్వరలోనే చిత్రీకరణను ప్రారంభించనున్నామని, మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడిస్తామని చిత్రబృందం పేర్కొంది.

దృశ్యం 3 క్లైమాక్స్ రెడీ

- దర్శకుడు జీతూ జోసెఫ్



మాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీలో 'దృశ్యం' ఒకటి. హీరో మోహన్ లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో వచ్చిన 'దృశ్యం' (2013), 'దృశ్యం 2' (2021) చిత్రాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఎంతలా అంటే 'దృశ్యం', 'దృశ్యం 2' సినిమాలు తెలుగు, హిందీ వంటి ఇతర భారతీయ భాషల్లో రీమేక్ అయి, విడుదలైన అన్ని భాషల్లోనూ విజయం సాధించాయి. దీంతో 'దృశ్యం' ఫ్రాంచైజీ నుంచి రాబోతున్న 'దృశ్యం 3'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా 'దృశ్యం 3' గురించి జీతూ జోసెఫ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ''2013లో 'దృశ్యం' విడుదలైనప్పుడు సీక్వెల్ గురించిన ఆలోచన నాకు లేదు. దాదాపు ఐదేళ్ల తర్వాత 'దృశ్యం 2' గురించిన ఆలోచన వచ్చింది. ప్రస్తుతానికి 'దృశ్యం 3' కథ విషయంలో చాలా అంశాల్లో బ్లాంక్‌గా ఉన్నాను. కానీ క్లైమాక్స్‌పై మాత్రం ఓ అవగాహన ఉంది. 'దృశ్యం 3'ని ఎలా ఎండ్ చేయాలో ఓ ఆలోచన ఉంది. మోహన్‌లాల్‌గారికి ఈ క్లైమాక్స్ ఐడియా చెబితే బాగుందన్నారు. కానీ 'దృశ్యం 3' సినిమాను నేను ఒకలా ప్రారంభిద్దామని అనుకున్నాను. అయితే ఇటీవల ఓ సందర్భంలో సింగర్ కేఎస్ చిత్రగారు 'దృశ్యం 3' గురించి మాట్లాడారు. ఈ కథను ఆమె మరో దృష్టి కోణంలో ఆలోచించారు. ఇప్పుడు ఆమె చెప్పినట్లు కథను మలిస్తే ఎలా ఉంటుందా? అని ఆలోచిస్తున్నాను'' అని తెలిపారు జీతూ జోసెఫ్.

బిజినెస్ రీల్

జీఎస్‌టీ స్లాబ్‌ల్లో మార్పులు..!

రేట్ల హేతుబద్దీకరణ
మంత్రివర్గకమిటీ కీలక భేటీ

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)కు సంబంధించి స్లాబ్ విధాన మార్పుసహా పలు అంశాలపై సంబంధిత రేట్ల హేతుబద్దీకరణ మంత్రివర్గ కమిటీ (జీవోఎం) కీలక భేటీ జరిగింది. ఈ సందర్భంగా కొన్ని వస్తువులపై రేట్ల తగ్గింపు అవసరంపై సమీక్ష నిర్వహించి ఆయా అంశాలను జీఎస్‌టీ కౌన్సిల్ ముందు సమర్పించాలని పన్ను అధికారుల కమిటీని కోరింది. ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్‌టీ అంశాన్ని కొన్ని రాష్ట్రాల ప్రతినిధులు సమావేశంలో లేవనెత్తడం గమనార్హం. అయితే ఈ అంశాన్ని తదుపరి డేటా విశ్లేషణ కోసం కేంద్ర, రాష్ట్ర పన్ను అధికారులతో కూడిన ఫిట్‌మెంట్ కమిటీకి సిఫార్సు చేయడం జరిగింది. సెప్టెంబరు 9న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో రాష్ట్రాల మంత్రులతో కూడిన జీఎస్‌టీ కౌన్సిల్ 54వ అత్యున్నత స్థాయి సమావేశంనేపథ్యంలో తాజా మంత్రి వర్గ కమిటీ సమావేశం జరిగింది. జీవోఎం కన్వీనర్‌గా తన మొదటి సమావేశం అనంతరం బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి విలేకరులతో మాట్లాడుతూ, ''జీఎస్‌టీ పన్ను స్లాబ్‌లలో మార్పు చేయరాదని కొంతమంది జీవోఎం సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మరిన్ని చర్చలు జరుగుతాయి, ఆపై తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది'' అని పేర్కొన్నారు. ప్రస్తుత జీఎస్‌టీ విధానంలో సున్నా, 5, 12, 18, 28 శాతం ఐదు విస్తృత పన్ను స్లాబ్‌లు ఉన్నాయి. లగ్జరీ– డీమెరిట్ వస్తువులపై అత్యధికంగా 28 శాతం రేటు కంటే ఎక్కువ సెస్‌ను విధిస్తున్నారు.

హిందాల్కో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

భారత్, అమెరికాలో విస్తరణ

న్యూఢిల్లీ: సమీప భవిష్యత్తులో భారత్, అమెరికాలో కార్యకలాపాల విస్తరణపై 10 బిలియన్ డాలర్ల వరకు (సుమారు రూ. 83,900 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు హిందాల్కో ఇండస్ట్రీస్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. ప్రస్తుత, కొత్త ప్రాజెక్టులపై ఈ నిధులను వెచ్చించనున్నట్లు కంపెనీ 65వ వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సందర్భంగా వివరించారు. కంపెనీ ఒరిస్సాలోని రాయగఢలో అల్యూమినా రిఫైనరీని ఏర్పాటు చేస్తున్నట్లు బిర్లా చెప్పారు. ప్రాజెక్టు తొలి దశ 2027 ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి రాగలదని వివరించారు. మరోవైపు తమ కాపర్ స్మెల్టింగ్ యూనిట్‌ను విస్తరించడంతో పాటు గుజరాత్‌లో యూనిట్‌ను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు బిర్లా పేర్కొన్నారు. గుజరాత్‌లోని వాగోడియాలో ఏర్పాటు చేస్తున్న కాపర్ ఇన్నర్ గ్రూవ్ ట్యూబ్ ప్లాంటు ప్రాజెక్టు ఈ ఏడాది ఆఖరు నాటికి అందుబాటులోకి రాగలదన్నారు. దీనితో ఎయిర్ కండీషనర్లలో కీలకమైన పరికరం కోసం దిగుమతులపై ఆధారపడటం తగ్గించుకోవచ్చని బిర్లా చెప్పారు.

రత్నాభరణాల ఎగుమతుల్లో క్షీణత

జూలై నెలలో 13,819 కోట్లు

ముంబై: రత్నాభరణాల ఎగుమతులు జూలై నెలలో 23 శాతం మేర క్షీణించినట్టు జెమ్ అండ్ జ్యుయలరీ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) తెలిపింది. 1,665 మిలియన్ డాలర్ల (రూ.13,819 కోట్లు) విలువైన రత్నాభరణాల ఎగుమతులు నమోదైనట్టు ప్రకటించింది. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు వినియోగ డిమాండ్‌ను దెబ్బతీసినట్టు వివరించింది. ఈ మేరకు జూలై నెలకు సంబంధించి గణాంకాలను విడుదల చేసింది. ఆర్థిక సంక్షోభం కారణంగా చైనా మార్కెట్లో డిమాండ్ గణనీయంగా తగ్గిపోయినట్టు తెలిపింది.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
GRASIM	2,756.00	2.65
TATACONSUM	1,206.00	2.42
BHARTIARTL	1,486.90	1.6
APOLLOHOSP	6,844.95	1.37
TATASTEEL	154	1.37

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	519.15	-1.37
NTPC	403.85	-1.25
TATAMOTORS	1,072.00	-1.22
M&M	2,736.00	-1.21
DRREDDY	6,979.90	-1.17

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	9,347
ఎన్‌ఎస్‌ఈ	1,18,639
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,03,600
ఎఫ్ఐఐ	+ 1,372
డీఐఐ	+ 2,972

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72.64	$ 71.93
బ్రెంట్	76.84	$ 76.05

2047 నాటికి 55 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

భారత్‌పై ఐఎంఎఫ్ ఈడీ కృష్ణమూర్తి సుబ్రమణియన్ అంచనా

- డాలర్ ప్రాతిపదికన వృద్ధి 12 శాతంగా ఉండాలని విశ్లేషణ



కోల్‌కతా: డాలర్ ప్రాతిపదికన వార్షిక వృద్ధి రేటు 12 శాతంగా ఉంటే, 2047 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 55 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్ పేర్కొన్నారు. 2018 నుండి 2021 వరకు ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా సుబ్రమణియన్ బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే. 2020–2021 కోవిడ్ సంవత్సరాల్లో ఆర్థిక వ్యవస్థ పటిష్టత చెక్కుచెదరకుండా కీలకపాత్ర పోషించిన ఆయన, మహమ్మారిపై దేశం ప్రతిస్పందన ప్రపంచంలోని ఇతర ప్రాంతాల కంటే భిన్నంగా ఉందని ఈ సందర్భంగా అన్నారు. ఇక్కడ జరిగిన సీఐఐ కార్యక్రమంలో ఆయన చేసిన ప్రసంగంలో ముఖ్యాంశాలు..

- 2016 నుండి ద్రవ్యోల్బణం కట్టడికి దేశం పటిష్ట చర్యలు తీసుకుంది. దీనితో దేశం సగటు ధరల పెరుగుదల రేటును ఐదు శాతం వద్ద కట్టడి జరిగింది. 2016 ముందు ఈ రేటు 7.5 శాతంగా ఉండేది.
- ద్రవ్యోల్బణం కట్టడితో దేశం ఎనిమిది శాతం వృద్ధి సాధిస్తుందని విశ్వసిస్తున్నాం. దీనిని పరిగణనలోకి తీసుకొని నామినల్ గ్రోత్‌రేట్ 13 శాతంగా ఉంటుంది. ఐదు శాతం వద్ద ద్రవ్యోల్బణం కట్టడి కొనసాగుతుందని విశ్వసిస్తున్నాం.
- పారిశ్రామికీకరణ, నూతన ఆవిష్కరణలు, ప్రైవేటు రుణ వ్యవస్థ పురోగతి ఎకానమీకి మూడు కీలక స్తంభాలు. ఇవి ఆర్థిక వ్యవస్థ ఎనిమిది శాతం వృద్ధికి సహాయపడతాయి.
- దీర్ఘకాలంలో డాలర్‌తో పోలిస్తే భారత కరెన్సీ తరుగుదల రేటు ఒక శాతం కంటే తక్కువగా ఉండటంతో, ఆర్థిక వ్యవస్థ ఫండమెంటల్స్ పటిష్టంగా, స్థిరంగా కొనసాగుతున్నాయి.
- డాలర్‌లో భారత్ వాస్తవ వృద్ధి రేటు 12 శాతంగా ఉంటుందని భావిస్తున్నాం. ఇదే జరిగితే ఆర్థిక వ్యవస్థ పరిమాణం ప్రతి ఆరు సంవత్సరాలకు రెట్టింపు అవుతుంది. ఈ లెక్కన ప్రస్తుత 3.8 ట్రిలియన్ డాలర్ల భారత్ ఎకానమీ 2047 నాటికి 55 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది.
- అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో పెట్టుబడులతో సంబంధం లేకుండా, ఉత్పాదకత మెరుగుదల మాత్రమే వృద్ధికి కారణమవుతుంది.
- ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ ఇంకా సగం నుంచి రెండు వంతులు ఇంకా అనధికారిక (అన్‌ఫార్మల్) రంగంలోనే ఉంది.
- ఆర్థిక వ్యవస్థ ఎంత అధికారికంగా మారితే (ఫార్మల్‌గా) అది అంత అధిక ఉత్పాదకతకు దారి తీస్తుంది. ప్రపంచ సహచర దేశాలతో పోలిస్తే భారత్ ఫార్మల్ సెక్టార్‌లో ఉత్పాదకతను పెంచడానికి ఇంకా ఎంతో అవకాశం ఉంది.
- భారతదేశ ద్రవ్యోల్బణం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల చారిత్రక సగటు కంటే తక్కువగా ఉన్నందున, ప్రభుత్వం 'సానుకూల ఫలితాల సాధన సాధ్యమేనన్న' విశ్వాసంతో ఆర్థిక విధానాలను రూపొందించగలిగింది.

ప్రస్తుత జీడీపీ తీరిది..

భారత్‌ను 2047 నాటికి అధిక ఆదాయ ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా నిర్దేశించుకుని ఇందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయితే వృద్ధి మందగమనం, అనిశ్చితమైన ప్రపంచ ఆర్థిక పరిస్థితులు భారత్ వృద్ధికి సవాళ్లుగా ఉన్నాయి. 25.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఎకనామిగా కొనసాగుతోంది. ప్రపంచం మొత్తం జీడీపీలో పావుశాతం వాటాను కలిగి ఉంది. ఇక 17.9 శాతం ప్రపంచ జీడీపీ వాటాతో 18 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చైనా రెండవ స్థానంలో ఉంది. తరువాతి స్థానాల్లో జపాన్ (4.2 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్ డాలర్లు)లు ఉన్నాయి. కాగా, 2022 నాటికి భారత్ ఎకానమీ బ్రిటన్, ఫ్రాన్స్‌ను అధిగమించగా, త్వరలో జర్మనీని అధిగమించే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. ప్రస్తుత దేశ ఎకానమీ విలువ 3.8 ట్రిలియన్ డాలర్లు. ఇక ప్రస్తుతం భారత్ తలసరి ఆదాయం దాదాపు 2,300 డాలర్లు. 2031 ఆర్థిక సంవత్సరం భారత్ తలసరి ఆదాయం 4,500 డాలర్లకు పెరగాలన్నది లక్ష్యం . ఇదే జరిగితే దేశం ఎగువ మధ్య–ఆదాయ దేశాల క్లబ్‌లో ప్రవేశిస్తుంది. ప్రస్తుతం అనుసరిస్తున్న ఆర్థిక సూత్రాల ప్రకారం... తలసరి ఆదాయం 1,036 డాలర్ల నుంచి 4,045 డాలర్ల మధ్య ఉన్న దేశాన్ని దిగువ మధ్య తరగతి ఆదాయ దేశంగా పరిగణిస్తారు. 4046 డాలర్ల నుంచి 12,535 డాలర్ల మధ్య ఆదాయ దేశాలను ఎగువ మధ్య తరగతి ఆదాయ దేశాలుగా పేర్కొంటారు. 12,000 డాలర్ల తలసరి ఆదాయం దాటితే అది అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది.

ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 6 శాతం : ఇక్రా


న్యూఢిల్లీ: ప్రభుత్వ మూలధన వ్యయాలు, పట్టణ వినియోగదారుల డిమాండ్ తగ్గుదల కారణంగా భారతదేశ ఆర్థిక (జీడీపీ) వృద్ధి ఏప్రిల్–జూన్‌లో ఆరు త్రైమాసిక కనిష్ట స్థాయి.. 6 శాతంగా ఉంటుందని ఇక్రా అంచనావేసింది. 2023–24 క్యూ1లో భారత్ ఎకానమీ వృద్ధి రేటు 8.2 శాతం. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఎకానమీ పురోగతి 6.8 శాతంగా ఉంటుందని పేర్కొంది. గత 2023–24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. జూన్ త్రైమాసిక వృద్ధికి సంబంధించిన అధికారిక డేటాను గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆగస్టు 30న విడుదల చేయనున్న నేపథ్యంలో ఇక్రా తాజా నివేదికను వెలువరించింది.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో పార్లమెంట్ ఎన్నికల కారణంగా కొన్ని రంగాలు తాత్కాలికంగా మందగించాయని, కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ప్రభుత్వ స్థాయిలో మూలధన వ్యయాలు మందగించాయని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ చెప్పారు. అంతేకాకుండా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారుల విశ్వాస సర్వే ప్రకారం పట్టణ వినియోగదారుల విశ్వాసం ఆశ్చర్యకరమైన రీతిలో తగ్గుదల నమోదుచేసుకున్న విషయం సైతం గమనార్హమని తెలిపింది. గత సంవత్సరం అననుకూల రుతుపవనాల ప్రభావం, అలాగే 2024 రుతుపవనాల అసమాన ప్రారంభం గ్రామీణ సెంటిమెంట్ స్పీడ్‌ను తగ్గించిందని నివేదిక విశ్లేషించింది. కమోడిటీ ధరల తీవ్రత, వ్యాపార మందగమనం వంటి అంశాలు కొన్ని పారిశ్రామిక రంగాల లాభదాయకతపై ప్రభావం చూపుతుందని వివరించింది. విద్యుత్ డిమాండ్ బాగున్నప్పటికీ, తాజాగా ముగిసిన క్వార్టర్‌లో వడగాల్పులు కొన్ని సేవా రంగాలపై ప్రతికూల ప్రభావం చూపిందని పేర్కొంది.

ఏడేళ్లలో 200 బిలియన్ డాలర్లకు వాణిజ్యం

- ఆఫ్రికా–భారత్ లక్ష్యంగా పెట్టుకోవాలి
- సాగు, ఫార్మాలో కలిసి పని చేసేందుకు అవకాశాలు
- కేంద్ర మంత్రి గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్, ఆఫ్రికా మధ్య ఆర్థిక సహకారం మరింతగా పెరిగేందుకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియుష్ గోయల్ తెలిపారు. వచ్చే ఏడేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 200 బిలియన్ డాలర్ల రెట్టింపు స్థాయికి పెంచుకోవడంపై ఇరు దేశాలు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఇందుకోసం వ్యవసాయం, ఫార్మా, మైనింగ్, టూరిజం, ఆటో, కీలక లోహాలు, పునరుత్పాదక విద్యుత్ తదితర రంగాల్లో కలిసి పని చేయొచ్చని మంత్రి చెప్పారు. పరిశ్రమల సమాఖ్య సీఐఐ నిర్వహించిన ఇండియా–ఆఫ్రికా సదస్సులో పాల్గొన్న సందర్భంగా గోయల్ ఈ విషయాలు వివరించారు. ప్రస్తుతం కొన్ని ఆఫ్రికన్ దేశాలు మాత్రమే భారత్‌తో వాణిజ్య లావాదేవీలు నిర్వహిస్తున్నాయని, ఈ సంఖ్య మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

'ఈ భాగస్వామ్య ఫలాలు మరిన్ని దేశాలకు లభించేలా చూడాలి. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఏడేళ్లలో 100 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 200 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని నిర్దేశించుకోవాలి' అని గోయల్ చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన, వైద్యం, ఆర్థిక, ఐటీ రంగాల్లో కూడా ఆఫ్రికా దేశాలకు భారత్ తోడ్పాటు అందించగలదని మంత్రి తెలిపారు. ఆఫ్రికాలో ఖనిజ నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయని, భారత్‌కి కావాల్సిన కీలక లోహాలను, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల రంగానికి అవసరమైనవి సరఫరా చేయడంపై ఆఫ్రికా మరింతగా దృష్టి పెట్టొచ్చని సూచించారు. స్వచ్ఛ ఇంధన టెక్నాలజీలు, విండ్ టర్బైన్‌లు, ఎలక్ట్రిక్ కార్లు మొదలైన వాటిల్లో కోబాల్ట్, రాగి, లిథియం, నికెల్ వంటి లోహాల వినియోగం అవసరం ఉంటుందని గోయల్ పేర్కొన్నారు.

ఈ-కామర్స్‌కు వ్యతిరేకం కాదు

ఈ-కామర్స్ సంస్థలకు (ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు) తాను వ్యతిరేకం కాదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. కాకపోతే ఆయా సంస్థలు పారదర్శకంగా, నిజాయితీగా వ్యవహరించాలని భారత్ కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ-కామర్స్ సంస్థల వ్యాపార విధానాలను విమర్శించిన మరుసటి రోజే కేంద్ర వాణిజ్య మంత్రి దీనిపై వివరణ ఇవ్వాల్సి వచ్చింది. వినియోగదారుల ప్రయోజనాలను ఆల్గోరిథమ్‌లు ప్రభావితం చేయరాదన్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరలకు ఉత్పత్తులను విక్రయిస్తూ, లక్షలాది రిటైలర్ల ప్రయోజనాలకు విరుద్ధంగా ఈ-కామర్స్ సంస్థలు వ్యవహరిస్తున్నాయంటూ బుధవారం గోయల్ విమర్శించడం గమనార్హం. ఈ-కామర్స్ సంస్థలతో పోటీపడే సమాన అవకాశాలు చిన్న వ్యాపార సంస్థలకూ ఉండాలన్నదే తమ ఉద్దేశ్యమని మంత్రి వివరణ ఇచ్చారు. ''మాకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), కావాలి. టెక్నాలజీ కావాలి. ఆన్‌లైన్ రిటైలర్లకు మేము ఎంత మాత్రం వ్యతిరేకం కాదు'' అని చెప్పారు.

ఎంఎస్‌ఎంఈలకు దన్నుగా నిలవండి

ఆర్థిక సంస్థలకు ఆర్‌బీఐ డిప్యుటీ గవర్నర్ స్వామినాథన్ సూచన



ముంబై: చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ)పై మరింత సానుకూల ధోరణితో వ్యవహరించాలని ఆర్థిక సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ డిప్యుటీ గవర్నర్ జె. స్వామినాథన్ సూచించారు. ఎకానమీలో కీలక పాత్ర పోషించే ఈ పరిశ్రమకు మద్దతుగా నిల్చే క్రమంలో రుణాల పునర్‌వ్యవస్థీకరణ, గ్రేస్ పీరియడ్ ఇవ్వడం తదితర చర్యల రూపంలో తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విదేశీ మారక డీలర్ల అసోసియేషన్ (ఫెడాయ్) వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా స్వామినాథన్ ఈ విషయాలు తెలిపారు. తక్కువ వడ్డీలకు రుణాలు దొరక్కపోవడం, చెల్లింపుల్లో జాప్యాలు, మౌలికసదుపాయాలపరమైన సమస్యలు మొదలైన అనేక సవాళ్లను ఎంఎస్‌ఎంఈలు ఎదుర్కొంటూ ఉంటాయని ఆయన పేర్కొన్నారు. చిన్న సంస్థలు ఎకానమీకి వెన్నెముకలా మాత్రమే కాకుండా వృద్ధి, కొత్త ఆవిష్కరణలు, ఉద్యోగాల కల్పనకు చోదకాలుగా కూడా ఉంటున్నాయని స్వామినాథన్ వివరించారు. అయితే, ఈ సంస్థలు వృద్ధిలోకి రావాలంటే ఆర్థిక రంగం వినూత్న పరిష్కారమార్గాలతో వాటికి తగు మద్దతు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిర్దిష్ట మద్దతు కల్పించడం ద్వారా ఎంఎస్‌ఎంఈ ఎగుమతులు పెరగడంలో ఆర్థిక రంగం కీలక పాత్ర పోషించగలదని స్వామినాథన్ వివరించారు. ఫైనాన్స్, ఫ్యాక్టరింగ్, ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ వంటి సంప్రదాయ ప్రోడక్టులతో పాటు ఎగుమతులకు రుణ బీమా, కరెన్సీ రిస్క్ హెడ్జింగ్ సొల్యూషన్స్ వంటివి ఆఫర్ చేయొచ్చని పేర్కొన్నారు. చెల్లింపులపరమైన డిఫాల్ట్‌లు, కరెన్సీ హెచ్చుతగ్గుల సవాళ్ల నుంచి ఇలాంటివి రక్షణ కల్పించడంతో పాటు అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లలో విస్తరించేందుకు ఎంఎస్‌ఎంఈలకు ఆత్మవిశ్వాసం ఇవ్వగలవని స్వామినాథన్ పేర్కొన్నారు.

ఐపీవోకు ట్రూఆల్ట్ బయోఎనర్జీ

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: బయోఇంధన తయారీ కంపెనీ ట్రూఆల్ట్ బయోఎనర్జీ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీని ప్రకారం రూ. 750 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 36 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ముందస్తు ఐపీవో ప్లేస్‌మెంట్ కింద రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీ జారీ చేసే యోచనలో ఉంది. ఇది జరిగితే ఐపీవోలో ఈక్విటీ జారీ ఆమేర తగ్గనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 425 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 173 కోట్లు మల్టీఫీడ్ స్టాక్ నిర్వహణకు వినియోగించనుంది. ఇథనాల్ తయారీలో ఉన్న ఈ బెంగళూరు కంపెనీ రోజుకి 1,400 కిలోలీటర్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2024 అక్టోబర్‌కల్లా ఉత్పత్తి సామర్థ్యానికి మరో 600 కేఎల్‌పీడీని జత చేసుకునే ప్రణాళికల్లో ఉంది.

దక్షిణాదిలో డాబర్ తొలి ప్లాంటు


టిండివనంలో రూ. 400 కోట్లతో ఏర్పాటు



చెన్నై: ఎఫ్‌ఎంసీజీ దేశీ దిగ్గజం డాబర్ ఇండియా తమిళనాడులోని విల్లుపురం జిల్లాలో తయారీ ప్లాంటును నెలకొల్పనుంది. రూ. 400 కోట్ల పెట్టుబడితో విల్లుపురం జిల్లాలోని టిండివనం(సిప్‌కాట్ ఫుడ్‌పార్క్) వద్ద యూనిట్‌కు తెరతీయనుంది. తద్వారా తొలిసారి దక్షిణాదిలో తయారీ విభాగాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంటులో ఆరోగ్య పరిరక్షణ(ఆయుర్వేదిక్), వ్యక్తిగత, గృహ సంరక్షణ ఉత్పత్తులను రూపొందించనుంది. ఇందుకు ప్రభుత్వంతో కంపెనీ అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు తమిళనాడు రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీఆర్‌బీ రాజా వెల్లడించారు. ఎంవోయూలో భాగంగా కంపెనీ తొలి దశలో రూ. 135 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. తదుపరి ఐదేళ్ల కాలంలో రూ. 400 కోట్లకు పెట్టుబడులను పెంచనుంది. ప్రస్తుతం కంపెనీ దేశీ బిజినెస్‌లో దక్షిణాది నుంచి 20 శాతంవరకూ లభిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, రాజా, చీఫ్ సెక్రటరీ ఎస్ మురుగానందం సమక్షంలో ఒప్పందంపై గైడెన్స్ తమిళనాడు తరఫున ఎండీ విష్ణు, డాబర్ ఇండియా సీఈవో మోహిత్ మల్హోత్రా సంతకాలు చేశారు. తద్వారా 250 మందికి ఉపాధి లభించడంతోపాటు.. రైతులకు ప్రయోజనం చేకూరనున్నట్లు రాజా పేర్కొన్నారు.

రుతుపవనాలు అస్థిరంగా ఉన్నా వృద్ధికి ఢోకా లేదు

ఆర్థికశాఖ నివేదిక



న్యూఢిల్లీ: రుతుపవనాలు కొంత అస్థిరంగా ఉన్నప్పటికీ భారతదేశ ఆర్థిక పురోగమనం యథాతథంగా కొనసాగుతోందని ఆర్థిక మంత్రిత్వ శాఖ జూలై నెలవారీ నివేదిక తెలిపింది. ఆర్థిక సర్వే అంచనాలకు అనుగుణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 6.5 శాతం నుంచి 7 శాతం శ్రేణిలోనే నమోదవుతుందన్న ధీమాను వ్యక్తం చేసింది. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరం గడచిన నాలుగు నెలల్లో ఎకానమీ పురోగమనం సంతృప్తికరంగా ఉందని పేర్కొంది. ప్రత్యేకించి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్ల (రూ.7.39 లక్షల కోట్లు) పూర్తి సానుకూల నమోదుకావడం హర్షణీయ పరిణామమని అభిప్రాయపడింది. తయారీ, సేవల రంగాలు సైతం పురోగతి బాటలో ఉన్నాయని వివరించింది. తాజా 2024–25 బడ్జెట్ దేశ ద్రవ్య, ఆర్థిక పటిష్టతకు బాటలు వేస్తుందని భరోసాను ఇచ్చింది. ద్రవ్యోల్బణం కట్టడి (ఐదేళ్ల కనిష్ట స్థాయిలో జూలైలో 3.4 శాతంగా రిటైల్ ద్రవ్యోల్బణం నమోదు) సానుకూల అంశంగా వివరించింది. రిజర్వాయర్‌లో నీటి మట్టాలు భారీగా పెరగడం వల్ల ప్రస్తుత ఖరీఫ్, రాబోయే రబీ పంటల ఉత్పత్తి విషయంలో మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొన్న నివేదిక, రాబోయే నెలల్లో ఆహార ద్రవ్యోల్బణాన్ని తగ్గించడంలో ఈ పరిణామం మరింత దోహదపడుతుందని విశ్లేషించింది.

శ్రీవారు మోటార్స్ ప్రాణ 2.0 ఈ–బైక్

చెన్నై: ఎలక్ట్రిక్ వాహన రంగంలో ఉన్న కోయంబత్తూరు కంపెనీ శ్రీవారు మోటార్స్ ప్రాణ 2.0 పేరుతో ఈ–బైక్‌ను ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.2.55 లక్షలు ఉంది. ఒకసారి చార్జింగ్‌తో 150 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. రూ.3.20 లక్షల ధర గల ప్రాణ ఎలైట్ 250 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని వివరించింది. ఆసియాన్ దేశాలకు ఈ బైక్‌లను ఎగుమతి చేయనున్నట్టు వెల్లడించింది. నాస్డాక్‌లో లిస్ట్ అయిన శ్రీవారు హోల్డింగ్స్ ఈ కంపెనీని ప్రమోట్ చేస్తోంది. 2021లో ప్రాణ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అలైవ్ బ్రాండ్‌లో ఎలక్ట్రిక్ స్కూటర్స్‌ను రాబోయే రోజుల్లో పరిచయం చేయనున్నట్టు శ్రీవారు మోటార్స్ వెల్లడించింది.



స్టీల్ రంగంలో టెక్నాలజీకి పెద్దపీట

- రూ.22వేల కోట్ల పెట్టుబడులు
- ఫిక్కీ డెలాయిట్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: స్టీల్ రంగంలో డిజిటల్ టెక్నాలజీకి ప్రాధాన్యం పెరుగుతోందని, ఇందుకోసం 2030 నాటికి పరిశ్రమ 2.7 బిలియన్ డాలర్లను (రూ.22,400 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుందని ఫిక్కీ–డెలాయిట్ నివేదిక వెల్లడించింది. ఈ పెట్టుబడులు అత్యాధునిక సాంకేతిక సామర్థ్యాల పెంచుకునేందుకు, మరింత సమర్థవంతమైన, సుస్థిరమైన మైనింగ్‌కు వీలు కల్పిస్తుందని పేర్కొంది. ''స్టీల్ రంగంలోని మొత్తం వ్యాల్యూ చైన్ వ్యాప్తంగా డిజిటల్ సాంకేతికతలు, ప్రాసెసింగ్‌పై పెట్టుబడులు 2024లో ఉన్న 1–1.2 బిలియన్ డాలర్ల నుంచి, 2030 నాటికి 2.3–2.7 బిలియన్ డాలర్లకు పెరగొచ్చు'' అని ఈ నివేదిక తెలిపింది. 2030 భారత ఉక్కు రంగానికి కీలకమని గుర్తు చేసింది. 2030 నాటికి స్టీల్ తయారీ సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2017లో నేషనల్ స్టీల్ విధానాన్ని ప్రకటించినట్టు తెలిపింది. తలసరి ఉక్కు వినియోగం 2030 నాటికి 160 కిలోలు, 2047 నాటికి 220 కిలోలకు పెరుగుతుందని వెల్లడించింది. పర్యావరణ సంబంధిత నిబంధనల అమలుకు డిజిటల్ టూల్స్ సాయపడతాయంటూ.. మెరుగైన ఇంధన సామర్థ్యం, ఉద్గారాల పర్యవేక్షణ సాధ్యపడుతుందని పేర్కొంది. అలాగే, మార్కెట్లో వచ్చే మార్పులకు అనుగుణంగా కార్యకలాపాల విస్తరణకు, ఆవిష్కరణలకు, కార్మికుల భద్రత పెంచేందుకు డిజిటల్ సాంకేతికతలు ఉపకరిస్తాయని తెలిపింది. భారత మైనింగ్, స్టీల్ రంగం కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సాంకేతికతల పరంగా ఆవిష్కరణల మద్దతుతో పరివర్తన క్రమంలో ఉన్నట్టు డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ రజీబ్ మైత్రా పేర్కొన్నారు.



ప్రజ్ఞానంద, గుకేశ్ గేమ్ 'డ్రా'

సెయింట్ లూయిస్: సింక్‌ఫీల్డ్ కప్ క్లాసికల్ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, దొమ్మరాజు గుకేశ్ వరుసగా మూడో 'డ్రా' నమోదు చేసుకున్నారు. వీరిద్దరి మధ్య జరిగిన మూడో గేమ్ 62 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద కాటాలాన్ ఓపెనింగ్‌తో గేమ్‌ను ప్రారంభించాడు. మరోవైపు గుకేశ్ తొలి నాలుగు నిమిషాల్లోనే 18 ఎత్తులు పూర్తి చేయగా... ఆచితూచి ఆడిన ప్రజ్ఞానంద 18 ఎత్తులకు ఒక గంట సమయం తీసుకున్నాడు. 34వ ఎత్తుల్లో గుకేశ్ తప్పిదం కారణంగా ప్రజ్ఞానందకు గెలుపు దారులు తెరుచుకున్నాయి. అయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ప్రజ్ఞానంద విఫలమయ్యాడు. చివరకు ఇద్దరూ గేమ్‌ను 'డ్రా'గా ముగించేందుకు అంగీకరించారు. మూడో రౌండ్ తర్వాత గుకేశ్, ప్రజ్ఞానంద ఖాతాలో 1.5 పాయింట్లు ఉన్నాయి. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా గుకేశ్ నాలుగో ర్యాంక్‌లో, ప్రజ్ఞానంద ఏడో ర్యాంక్‌లో ఉన్నారు.

'2028లో పసిడి సాధించాలి'

భారత హాకీ జట్టుతో ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: వరుసగా రెండు ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకాలు సాధించిన భారత హాకీ జట్టు 2028 లాస్ ఏంజెలెస్ విశ్వక్రీడల్లో పసిడి పతకం నెగ్గాలని ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు. పారిస్ క్రీడల్లో కాంస్యం సాధించి స్వదేశానికి తిరిగి వచ్చిన హాకీ జట్టును బుధవారం ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సన్మానించగా.. గురువారం మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పలువురు ప్లేయర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సుదీర్ఘ విరామం తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు రావడం ఆనందంగా ఉంది. ఇదే ఆటతీరు కొనసాగిస్తూ లాస్ ఏంజెలెస్‌లో స్వర్ణం సాధించాలి' అని ఆకాంక్షించారు. 2018 నుంచి భారత హాకీ జట్లకు ఒడిశా ప్రభుత్వం అధికారిక స్పాన్సర్‌గా వ్యవహరిస్తుండగా... హాకీ పూర్వ వైభవం దిశగా అడుగులు వేయడంలో నవీన్ పట్నాయక్ పాత్ర ఎంతో ఉందని ప్లేయర్లు కొనియాడారు. ఆటగాళ్ల అవసరాలను తీరుస్తూ అత్యుత్తమ సదుపాయాలు అందుబాటులోకి తేవడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని సుమిత్ పేర్కొన్నాడు. ఈ కార్యక్రమంలో హాకీ ఇండియా అధ్యక్షుడు దిలిప్ టిర్కీ, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, అభిషేక్, సుమిత్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడింది చాలు... చదువుకుంటాను!

- టేబుల్ టెన్నిస్‌కు అర్చనా కామత్ గుడ్‌బై
- 24 ఏళ్లకే రిటైర్మెంట్ ప్రకటించిన భారత ప్లేయర్
- పారిస్ ఒలింపిక్స్‌లో జట్టుకు ప్రాతినిధ్యం



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్, ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన అర్చనా కామత్ ఆటకు వీడ్కోలు పలికింది. బెంగళూరుకు చెందిన 24 ఏళ్ల అర్చన భవిష్యత్తులో చదువుపై దృష్టి పెట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. టీటీలో ఇకపై కొనసాగనని తన కోచ్ అన్షుల్ గార్గ్‌కు ముందుగా అర్చన సమాచారం అందించింది. ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ చదివిన అర్చన అమెరికాలో తన రెండో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పబ్లిక్ పాలసీ) చేసేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించి మిచిగాన్ యూనివర్సిటీలో అడ్మిషన్ తదితర ఇతర ప్రక్రియ పూర్తి కాగా, ఆమె తరగతులు కూడా మొదలైనట్లు అర్చన తండ్రి గిరీశ్ కామత్ వెల్లడించారు. టేబుల్ టెన్నిస్‌లో కొనసాగుతూనే ఆమె ఇప్పటికే 'ఇంటర్నేషనల్ రిలేషన్స్'లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుంది. అర్చన తల్లిదండ్రులిద్దరూ కంటి వైద్య నిపుణులు కాగా సోదరుడు అమెరికాలో ఏరో స్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే ఆమె ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లలో 98.7, 97 శాతం మార్కులు సాధించింది. చదువుపై ఆసక్తితోనే ఆటను వీడుతున్నానని... టేబుల్ టెన్నిస్‌లో తాను ఎలాంటి ఆర్థిక సమస్యలు ఎదుర్కోలేదని ఆమె స్పష్టం చేసింది. 'చదువుకోవడం అంటే నాకు చాలా ఇష్టం. గత ఏడాదే ఈ కోర్సు గురించి వివరాలు తెలుసుకున్నా. అయితే మా జట్టు ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంతో ఇది ఆలస్యమైంది. రెండేళ్ల తర్వాత భారత్‌కు తిరిగొచ్చి మరో రూపంలో దేశానికి సేవ చేసే అవకాశం కోసం ఎదురు చూస్తున్నా. టీటీ ప్లేయర్‌గా అన్ని వైపుల నుంచి నాకు మంచి మద్దతు లభించింది. 15 ఏళ్ల నా కెరీర్ అద్భుతంగా సాగింది. ఎలాంటి ఫిర్యాదులూ లేవు. భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గొప్ప గౌరవం' అని అర్చన వ్యాఖ్యానించింది. జర్మనీ కోచ్ పీటర్ ఇంగెల్ వద్ద సుదీర్ఘ కాలం శిక్షణ పొందిన ఆమె ఇప్పటి వరకు బెంగళూరులోని ప్రకాశ్ పదుకోన్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్‌లో సాధన కొనసాగించింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన భారత జట్టులో మనిక బాత్రా, ఆకుల శ్రీజలతో పాటు అర్చన కూడా సభ్యురాలిగా ఉంది. ఫామ్‌లో ఉన్న ఐహిక ముఖర్జీ స్థానంలో అర్చనను ఒలింపిక్స్‌కు ఎంపిక చేయడం వివాదం రేపినా అర్చన తన ఆటతో సత్తా చాటింది. క్వార్టర్స్‌లో జర్మనీ చేతిలో భారత్ 1-3తో పరాజయంపాలైంది. ఈ పోరులో మనిక, శ్రీజ సింగిల్స్ మ్యాచ్‌లలో ఓడినా అర్చన మాత్రం వరల్డ్ నంబర్ 40 షాన్ గ్జియోనాను 19-17, 1-11, 11-5, 11-9తో ఓడించిన సంచలనం సృష్టించింది.

తొమ్మిదేళ్ల వయసులో అర్చన టేబుల్ టెన్నిస్‌లోకి అడుగు పెట్టింది. కర్ణాటక రాష్ట్ర స్థాయిలో పెద్ద సంఖ్యలో టైటిల్స్ గెలుచుకున్న తర్వాత 14 ఏళ్ల వయసులో జాతీయ అండర్-21 టోర్నీలో విజేతగా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించింది. 2018లో ఆమె తొలి జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. 2018 యూత్ ఒలింపిక్స్‌లో అర్చన నాలుగో స్థానంలో నిలిచింది. 2021లో మనిక బత్రాతో కలిసి ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ లాస్కో ఓపెన్‌లో... 2024లో ఆకుల శ్రీజతో కలిసి డబ్ల్యూటీటీ కంటెండర్ లాగోస్ ఓపెన్‌లో అర్చన డబుల్స్ టైటిల్స్ సాధించింది.

అదృష్టం కలిసొస్తేనే...

మెగా ఈవెంట్స్‌లో ఫలితాలు అనుకూలంగా వస్తాయి
భారత జట్టు మాజీ కోచ్ ద్రవిడ్ వ్యాఖ్య



ముంబై: మెగా ఈవెంట్లలో జరిగే ఫైనల్ మ్యాచ్‌లకు కొన్నిసార్లు ప్రదర్శనతో పాటు కాస్తంత అదృష్టం కూడా తోడవ్వాలని భారత మాజీ కెప్టెన్, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ అన్నారు. 'సియెట్' సంస్థ అందించే వార్షిక క్రికెట్ అవార్డుల్లో ద్రవిడ్‌కు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' పురస్కారం లభించింది. ఈ అవార్డుల కార్యక్రమం సందర్భంగా ద్రవిడ్ తన అనుభవాలను వివరించాడు. ద్రవిడ్ ఏమన్నాడంటే...

'గతేడాది భారత్ వన్డే ప్రపంచకప్‌లో అజేయంగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో వరుసగా పది మ్యాచ్‌ల్లో గెలిచిన టీమిండియాకు అనూహ్యంగా టైటిల్ పోరులో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం ఎదురైంది. ఓ ఆరు నెలల తిరిగేసరికి... ఈ ఏడాది జరిగిన టి20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ డెత్ ఓవర్లలో కనబరిచిన అద్భుత పోరాటంతో దక్షిణాఫ్రికాను ఓడించి రెండోసారి టి20 వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకుంది. ఈ రెండు సందర్భాల్లోనూ కెప్టెన్‌గా రోహిత్, కోచ్‌గా నేను ఉన్నాను. మాకు టి20 ప్రపంచకప్ టైటిల్‌కు మధ్య దక్షిణాఫ్రికా అడ్డుగా ఉంది. అయితే ఆటతోపాటు కొంచెం అదృష్టం కలసిరావడంతో కప్‌తో ఆనందం మా వశమైంది. ఎంత చేసినా ఆ రోజు మనది కావాలంటే రవ్వంత అదృష్టం కూడా మనతో ఉండాలి. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో 30 బంతుల్లో 30 పరుగుల సమీకరణం ప్రత్యర్థికే అనుకూలంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రశాంత చిత్తంతో అనుకున్న ప్రణాళికను కెప్టెన్ రోహిత్ అమలు చేయాలి. ఎవరో ఒకరు మా ప్రయత్నాలకు కలిసి రావాలి. చివరకు సూర్యకుమార్ యాదవ్ పట్టిన క్యాచ్ రూపంలో అదృష్టం మా పక్షాన నిలిచింది. ఈ క్యాచ్ తుది ఫలితాన్ని మావైపునకు తిప్పింది. కానీ వన్డే ప్రపంచకప్ ఫైనల్ జరిగిన నవంబర్ 19న మాత్రం ఆసీస్ ఓపెనర్ ట్రవిస్ హెడ్ శతకం శతకోటికి పైగా భారతీయుల కలల్ని కల్లలు చేసింది. టి20లకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు రిటైర్మెంట్ ఇచ్చినప్పటికీ యువ బ్యాటర్లు వారి స్థానాలను భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇకముందు కూడా భారత క్రికెట్ వెలిగిపోతుంది. ప్రస్తుతం దేశంలో నాణ్యమైన అకాడమీలు, మెరుగైన మౌలిక వసతులు, లీగ్‌లతో అపార అవకాశాలు యువ క్రికెటర్ల భవిష్యత్తుకు బంగారుబాట వేస్తున్నాయి' అని ద్రవిడ్ వివరించారు.

ఇంద్రా నూయి స్థానంలో ఎవరు?

ఐసీసీలో మహిళా డైరెక్టర్ పదవి ఖాళీ



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కొత్త మహిళా ఇండిపెండెంట్ డైరెక్టర్ కోసం ఎదురుచూస్తోంది. 2018 నుంచి ఆ పదవిలో కొనసాగుతున్న పెప్సికో హెడ్ ఇంద్రా నూయి పదవీ కాలం గత నెలాఖరుతో ముగియగా... ఆమె స్థానంలో అంతర్జాతీయ స్థాయిలో ఆటతో పాటు వ్యాపార రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న మహిళను ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఐసీసీ చైర్మన్‌గా కొనసాగుతున్న గ్రేగ్ బార్క్‌లే కూడా త్వరలోనే పదవీ విరమణ చెందనున్న విషయం తెలిసిందే. 'క్రికెట్‌లో సమానత్వం, వైవిధ్యాన్ని సమ్మిళితం చేయగల ఆసక్తి ఉన్న వారిని డైరెక్టర్‌గా ఎంపిక చేయనున్నాం. కొత్తగా ఎంపికైన మహిళా డైరెక్టర్‌కు చైర్మన్ ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకునే అధికారం ఉంటుంది. ఆటకు మరింత ప్రోత్సాహం అందిచగల వారి కోసం చూస్తున్నాం' అని ఐసీసీ తెలిపింది. ఐసీసీ తొలి మహిళా స్వతంత్ర డైరెక్టర్‌గా ఎన్నికైన ఇంద్రా నూయి... ఆరేళ్ల పాటు సమర్థవంతంగా విధులను నిర్వర్తించారు.

గోవా చాలెంజర్స్ శుభారంభం



చెన్నై: ఫ్రాంచైజీ లీగ్ టోర్నీ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) ఐదో సీజన్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రోజు డిఫెండింగ్ చాంపియన్ గోవా చాలెంజర్స్ శుభారంభం చేసింది. చాలెంజర్స్ 9-6 పాయింట్ల తేడాతో ఈ టోర్నీలో తొలిసారి ఆడుతున్న జైపూర్ పేట్రియాట్స్‌పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 1-2 తేడాతో చో సుంగ్ మిన్ చేతిలో ఓడగా... మహిళల సింగిల్స్‌లో ల్యూ యాంగ్ జి 3-0తో సుతాసిని సవేతాత్‌ను చిత్తు చేసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్మీత్-ల్యూ ద్వయం 2-1తో రోనిత్ భాంజా-సుతాసినిలపై గెలుపొందింది. రెండో పురుషుల సింగిల్స్‌లో మిహాయి బొబొసికా 2-1తో రోనిత్ భాంజాను ఓడించగా... రెండో మహిళల సింగిల్స్‌లో నిత్యశ్రీ మణి 2-1తో యశస్విని ఘోర్పడేపై విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల ఈ పోరులో మూడు మ్యాచ్‌లు నెగ్గిన గోవా ఖాతాలో 9 పాయింట్లు చేరగా... రెండు మ్యాచ్‌లలో విజయం సాధించిన పేట్రియాట్స్‌కు మొత్తం 6 పాయింట్లు లభించాయి. అంతకుముందు తమిళనాడు క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ లీగ్‌ను ప్రారంభించారు.

మహిళా రెజ్లర్లకు భద్రత కల్పించండి: కోర్టు


వినేశ్

న్యూఢిల్లీ: ముప్పున్న మహిళా రెజ్లర్లకు భద్రతను ఉపసంహరించడం తగదని పేర్కొన్న కోర్టు తక్షణమే భద్రత కల్పించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ముగ్గురు రెజ్లర్లు గతంలో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఇదివరకే ఢిల్లీ పోలీసులు చార్జిషీట్ నమోదు చేశారు. కేసు విచారణలో ఉంది. కాగా... కేంద్రంలో అధికారపక్షం నేత అయిన బ్రిజ్‌భూషణ్ నుంచి హాని ఉంటుందని గతంలో ఆ ముగ్గురు రెజ్లర్లకు ఢిల్లీ పోలీసులు భద్రత కల్పించారు. కానీ ఇప్పుడు ఉన్నపళంగా పోలీసు భద్రతను ఉపసంహరించడం ఏంటని అడిషనల్ చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ప్రియాంక రాజ్‌పుత్ ఢిల్లీ పోలీసులను తలంటారు. వెంటనే భద్రతను పునరుద్ధరించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. రెజ్లర్ల భద్రతపై స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ 'ఎక్స్' వేదికగా అభ్యంతరం వ్యక్తం చేసింది. బ్రిజ్‌భూషణ్‌పై పోరాడుతున్న రెజ్లర్లకు భద్రతను తొలగించారని వినేశ్ పోస్ట్ చేసింది.

క్వాలిఫయర్‌తో జొకోవిచ్ తొలి పోరు



న్యూయార్క్: రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌పై గురి పెట్టిన సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్‌కు యూఎస్ ఓపెన్‌లో అనుకూలమైన 'డ్రా' ఎదురైంది. ఈనెల 26 నుంచి మొదలయ్యే సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో క్వాలిఫయర్‌తో జొకోవిచ్ తలపడతాడు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఈ టోర్నీలో ఆడుతున్న జొకోవిచ్ తొలి రౌండ్‌ను దాటితే రెండో రౌండ్‌లో అతనికి జర్మనీ ప్లేయర్ జాన్ లెనార్డ్ స్ట్రఫ్ లేదా లాస్లో జెరె (సెర్బియా) ఎదురవుతారు. జొకోవిచ్ జోరు కొనసాగించి క్వార్టర్ ఫైనల్ చేరితే అతనికి ప్రత్యర్థికి ఆరో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) ఉండే అవకాశముంది. సెమీఫైనల్లో నాలుగో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), ఫైనల్లో టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ)లతో జొకోవిచ్ ఆడే చాన్స్ ఉంది. మరో పార్శ్వంలో ఉన్న వరల్డ్ నంబర్‌వన్ యానిక్ సినెర్ తొలి రౌండ్‌లో అమెరికా ఆటగాడు మెకంజీ మెక్‌డొనాల్డ్‌తో ఆడతాడు.

పుజారాకు నిరాశ



లండన్: భారత టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజారా వచ్చే ఏడాది కౌంటీ చాంపియన్‌షిప్‌లో ససెక్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించబోడని గురువారం ససెక్స్ క్లబ్ వెల్లడించింది. పుజారా స్థానంలో ఆస్ట్రేలియా ఆటగాడు డేనియల్ హ్యూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. గత మూడేళ్లుగా ససెక్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న పుజారాను ఈసారి ఆ క్లబ్ రిటైన్ చేసుకోలేదు. 'పుజారాను కాదని హ్యూస్‌ను ఎంపిక చేసుకోవడం కష్టమైన పనే. కానీ, హ్యూస్ సీజన్ మొత్తానికి అందుబాటులో ఉంటాడు. అంతేకాక టి20 మ్యాచ్‌లు కూడా ఆడతాడు. పుజారాకు సరైన ప్రత్యామ్నాయం అతడే అనిపించింది' అని ససెక్స్ హెడ్ కోచ్ పాల్ ఫార్బ్స్ అన్నాడు.

లక్నో మెంటార్‌గా జహీర్ ఖాన్!

భారత మాజీ పేసర్‌తో ఫ్రాంచైజీ మంతనాలు ● పంజాబ్ కింగ్స్ కోచ్ రేసులో వీవీఎస్ లక్ష్మణ్

న్యూఢిల్లీ: భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్‌ను మెంటార్‌గా నియమించుకునేందుకు ఐపీఎల్ ఫ్రాంచైజీ లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ప్రయత్నాలు చేస్తోంది. మెగా వేలం ప్రారంభానికి ముందే జహీర్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని లక్నో జట్టు యాజమాన్యం భావిస్తోంది. ముంబై ఇండియన్స్ గ్లోబల్ డెవలప్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తున్న జహీర్ ఖాన్.. ఐపీఎల్‌లో 10 సీజన్లపాటు మూడు జట్ల తరఫున 100 మ్యాచ్‌లు ఆడి 102 వికెట్లు పడగొట్టాడు. 2017లో అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన జహీర్... అప్పటి నుంచి ముంబై ఇండియన్స్‌తో కొనసాగుతున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా వ్యవహరించిన గౌతమ్ గంభీర్ 2023 సీజన్ అనంతరం లక్నోను వీడి కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్టుకు మారాడు. ఈ సీజన్‌లో గంభీర్ మార్గదర్శకత్వంలో కోల్‌కతా జట్టు అద్వితీయ ప్రదర్శన కనబర్చి మూడోసారి ఐపీఎల్ ట్రోఫీ కైవసం చేసుకుంది. 'టీమ్ మెంటార్‌గా జహీర్ ఖాన్‌ను నియమించేందుకు లక్నో సూపర్ జెయింట్స్ యాజమాన్యం ప్రయత్నిస్తోంది. గంభీర్ నిష్క్రమణతో అతడి స్థానాన్ని జహీర్‌తో భర్తీ చేయాలని అనుకుంటున్నారు' అని పలు కథనాలు వెలుగులోకి వచ్చాయి. గంభీర్ మెంటార్‌షిప్‌లో 2022, 2023లో ప్లేఆఫ్స్‌కు చేరిన లక్నో... ఈ ఏడాది అంతగా ఆకట్టుకోలేకపోయింది. తాజాగా లక్నో బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా ఆ జట్టును వీడి... భారత జాతీయ జట్టు బౌలింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. దీంతో లక్నో జట్టు ఐపీఎల్ మెగా వేలానికి ముందు సహాయక సిబ్బంది ఎంపిక పూర్తి చేయాలని భావిస్తోంది.





మరోవైపు పంజాబ్ కింగ్స్ జట్టు కూడా కోచ్ కోసం అన్వేషణ కొనసాగిస్తోంది. హెడ్ కోచ్ ట్రేవర్ బేలిస్ స్థానంలో భారత ఆటగాడికే ఈ బాధ్యతలు అప్పగించాలని పంజాబ్ యాజమాన్యం భావిస్తోంది. అయితే ఈ జాబితాలో వీవీఎస్ లక్ష్మణ్ పేరు బలంగా వినిపిస్తోంది. ఆటపై అపార అనుభవం ఉన్న లక్ష్మణ్ ప్రధాన కోచ్ పదవికి సరైన ప్రత్యామ్నాయం అని పంజాబ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అయితే గత కొన్నాళ్లుగా బీసీసీఐతో కొనసాగుతున్న వీవీఎస్.. ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) హెడ్‌గా వ్యవహరిస్తున్నాడు. మరో ఏడాది కాలం లక్ష్మణ్ ఎన్‌సీఏ హెడ్‌గా కొనసాగే అవకాశాలు ఉన్నాయి. మరి ఈ నేపథ్యంలో పంజాబ్ ప్రయత్నాలు ఫలిస్తాయా చూడాలి!

బోట్స్‌వానా గనిలో
2,492 క్యారెట్ల వజ్రం

ఇప్పటి వరకు గనుల్లో దొరికిన రెండో అతిపెద్ద వజ్రంగా రికార్డు

గబొరోన్(బోట్స్‌వానా): ఆఫ్రికా దేశం బోట్స్‌వానా గనిలో అతిపెద్దదిగా భావిస్తున్న వజ్రం లభ్యమైంది. తమ గనుల్లో ఇంతటి భారీ వజ్రం దొరకడం ఇదే మొదటిసారని బోట్స్‌వానా ప్రభుత్వం తెలిపింది. దీని బరువు 2,492 కేరట్లని వివరించింది. కెనడాకు చెందిన లుకారా డైమండ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కరోవె గనిలో ఈ అరుదైన ముడి వజ్రం లభించింది. ఎక్స్‌రే సాంకేతికతను ఉపయోగించి అధిక నాణ్యతతో, చెక్కు చెదరకుండా ఉన్న ఈ వజ్రాన్ని కనుగొన్నట్లు లుకారా తెలిపింది. ఇంత పెద్ద వజ్రం లభించడం వందేళ్లలో ఇదే మొదటిసారని పేర్కొంది. గతంలో 1905లో దక్షిణాఫ్రికాలోని ఓ గనిలో కల్లినాన్ డైమండ్ బయటపడింది. 3,106 కేరట్లున్న ఆ భారీ వజ్రాన్ని 9 భాగాలు చేశారు. వాటిలో కొన్ని భాగాలను బ్రిటిష్ రాజవంశీకుల ఆభరణాల్లో వాడారు. అంతకుపూర్వం, 1800లో బ్రెజిల్‌లో అతి పెద్ద బ్లాక్ డైమండ్ దొరికింది. అయితే, ఇది భూ ఉపరితలంలోనే లభించింది. ఇది ఉల్కలో భాగం కావొచ్చని నమ్ముతున్నారు. బోట్స్‌వానా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వజ్రాల ఉత్పత్తిదారు. మొత్తం 20 శాతం వరకు వాటా బోట్స్‌వానా గనులదే. ఇటీవలి సంవత్సరాల్లో ఇక్కడి గనుల్లో భారీ వజ్రాలు లభించాయి. 2019లో కరోవె గనిలోనే 1,758 కేరట్ల సెవెలో వజ్రాన్ని తవ్వి తీశారు. దీనిని ఫ్రాన్సుకు చెందిన ప్రఖ్యాత ఫ్యాషన్ సంస్థ లూయిస్ విట్టన్ కొనుగోలు చేసింది. అయితే, ధరను వెల్లడించలేదు. కరోవె గనిలోనే 1,111 కేరట్ల లెసెడి లా రొనా అనే డైమండ్ లభ్యమైంది. దీనిని, బ్రిటిష్ ఆభరణాల సంస్థ 2017లో 5.30 కోట్ల డాలర్ల(సుమారు రూ.440 కోట్లు)కు దక్కించుకుంది.





మేం ఆకలితో చస్తుంటే...
మీకు మరో విమానమా?

అధ్యక్షుడిపై నైజీరియన్ల ఆగ్రహం

ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలి నైజీరియా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో అధ్యక్షుడు బోలా టినుబు కోసం కొత్త విమానాన్ని కొనడంపై నైజీరియన్లు మండిపడుతున్నారు. ఆకలి, పెరుగుతున్న జీవన వ్యయంపై దేశవ్యాప్తంగా అసంఖ్యాకులు రోడ్లపైకెక్కి నిరసన వ్యక్తం చేసిన రెండు వారాలకే ఈ పరిణామం జరిగింది. ఆఫ్రికాలో అత్యధిక జనాభా కలిగిన దేశం నైజీరియా. గతేడాది అధ్యక్షునిగా ఎన్నికైన టినుబు పలు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడానికి, దీర్ఘకాలిక వృద్ధికి ఊతమివ్వడానికి తప్పదంటూ ఇంధన సబ్సిడీలను తొలగించారు. దాంతో ద్రవ్యోల్బణం చుక్కలనంటుతోంది. దీంతో తన సొంత పరివారంతో సహా అధికారిక ప్రయాణాలను, ప్రతినిధులను తగ్గిస్తున్నట్లు జనవరిలో ప్రకటించారు. ఉన్నట్టుండి ఇప్పుడిలా ఎయిర్ బస్ ఎ330 విమానాన్ని కొనుగోలు చేశారు. ఆయన సొంత విమానాల శ్రేణిలో ఇది ఏడోది! కొత్త విమానంలోనే గత సోమవారం ఫ్రాన్స్ వెళ్లారు.

డబ్బు ఆదా అవుతుందట!

తాము ఆకలితో చస్తుంటే అధ్యక్షునికి కొత్త విమానం కావాల్సొచ్చిందా అంటూ నైజీరియన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. మెరుగైన రేపటి కోసం ఈ రోజు కష్టాలు భరించక తప్పదంటూ అధ్యక్షుడు సుద్దులు చెప్పారు! ఇదేనా ఆ మెరుగైన రేపు?'' అంటూ సోషల్ మీడియాలో మండిపడుతున్నారు. 150 నైజీరియన్ బిలియన్లు పెట్టి మరీ విమానం కొనుక్కోవడం సగటు నైజీరియన్ల పట్ల అధ్యక్షునికి ఏమాత్రం బాధ్యత లేదనేందుకు రుజువంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం విమాన కొనుగోలును సమర్థించుకుంటున్నారు. పాత విమానాలకు కాలం చెల్లడంతో వాటి నిర్వహణ వ్యయం తడిసి మోపెడవుతోంది. ఆ లెక్కన కొత్త విమానం వల్ల డబ్బు ఆదాయే అవుతుంది''అంటూ అధ్యక్షుని మీడియా సహాయకుడు సూత్రీకరించడం విశేషం! ప్రస్తుత విమానాలు సురక్షితం కాదంటూ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుని కోసం రెండు కొత్త విమానాల కొనుగోలుకు చట్టసభ సభ్యులు గతంలోనే సిఫార్సు చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఈ పోస్టుకార్డు..
జీవితకాలం లేటు!

1903లో పోస్టు చేస్తే 121 ఏళ్లకు చేరిన వైనం

ఇప్పుడంటే వాట్సప్, మెసెంజర్ల కాలం. కానీ వందేళ్ల కిందట సమాచారం చేరవేతకు ఏకైక మార్గం పోస్టే. ఒక లెటర్ చేరడానికి మూడు నుంచి వారం రోజులు, ఒక్కోసారి పది రోజుల నుంచి నెల దాకా కూడా పట్టేది. కానీ ఒక పోస్టుకార్డు చేరడానికి ఏకంగా 121 ఏళ్లు పట్టింది! 1903లో పోస్ట్ చేసిన ఆ లేఖ శతాబ్దం ఆలస్యంగా చేరుకుంది. బ్రిటన్‌లో స్వాన్సీ బిల్డింగ్ సొసైటీ అడ్రస్‌తో ఉన్న ఈ క్రిస్మస్ థీమ్ కార్డు క్రాడాక్ స్ట్రీట్ శాఖకు గతవారం చేరింది. ఆ చిరునామాలో గతంలో నివసించిన మిస్ లిడియా డేవిస్ బంధువులను కనిపెట్టి ఈ కార్డు ఎవరికి రాసిందో తెలుసుకుని వాళ్లకు చేర్చాలని సిబ్బంది భావిస్తున్నారు. ఈ పోస్టుకార్డును ఎవార్ట్ అనే వ్యక్తి లిడియాకు రాశారు. స్వాన్సీ బిల్డింగ్ సొసైటీలో 121 ఏళ్ల కిందట అండ్రూ డల్లీ తన భార్య మరియాతో కలిసి నివసించారు. వారి ఆరుగురు పిల్లల్లో పెద్ద కూతురు లిడియా. ఈ పోస్టు కార్డు పంపిన సమయంలో ఆమెకు 16 ఏళ్లు. వారి కుటుంబం గురించిన సమాచారం ఆన్‌లైన్‌లో చాలా తక్కువగా ఉందని స్వాన్సీ బిల్డింగ్ సొసైటీ వర్గాలన్నాయి. ఆమెతో సంబంధం ఉన్నవాళ్లు ఎవరైనా ఉన్నారేమో కనుగొని లేఖను అందజేస్తామని చెప్పుకొచ్చాయి.

లేఖలో ఏముందంటే..

'డియర్ 'ఎల్'.. నన్ను క్షమించండి. నేనా జత (ఏదో తెలియని వస్తువు) తీసుకోలేకపోయాను.



నువ్వు ఇంట్లో ఎంజాయ్ చేస్తున్నావని ఆశిస్తున్నా'అని రాశారు. తన వద్ద 10 షిల్లింగ్‌లు ఉన్నాయని, రైలు చార్జీలను లెక్కించడం లేదని, తాను బాగానే ఉన్నానని పేర్కొన్నారు. 'గిల్బర్ట్, జాన్‌లను కలవాలి.. గుర్తుంచుకోండి' అంటూ ముగించారు. 'అందరికీ ప్రేమతో'అంటూ సంతకం చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏకైక చాయిస్ హారిస్

ఆమె జన నేత: బిల్ క్లింటన్ | ట్రంప్ షోమ్యాన్, స్వార్థపరుడు | డెమొక్రటిక్ కన్వెన్షన్‌లో ధ్వజం



షికాగో: రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఫక్తు షోమ్యాన్‌గా అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ అభివర్ణించారు. ఆయనలో నాయకత్వ లక్షణాలు పూజ్యమన్నారు. బుధవారం డెమొక్రాట్ల జాతీయ కన్వెన్షన్‌లో ఆయన ప్రసంగించారు. ''మతం, జాతి, ఒంటి రంగు తదితరాల ఆధారంగా దేశాన్ని విడదీయడం, అందరినీ కించపరచడం, ఎదుటి వారిపై నిందలేయడమే ట్రంప్ నైజం. కుట్రలు, ప్రతీకారాలు, నిత్యం గందరగోళ పరిస్థితులను సృష్టించడం ఆయన స్వభావం. ఎంతసేపూ 'నేను, నేను, నేను' అంటూ తన గురించే చెప్పుకునే అత్యంత స్వార్థపరుడు'' అంటూ దుయ్యబట్టారు. డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌ను నిత్యం ఇతరుల సంక్షేమం గురించే ఆలోచించే జన నేతగా క్లింటన్ అభివర్ణించారు. ''దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు, అపార అనుభవమున్న హారిసే ఈ ఎన్నికల్లో ప్రజలకు ఏకైక చాయిస్. అది సుస్పష్టం'' అన్నారు. సమర్థ పాలకురాలిగా దేశ ప్రజలందరినీ ఆమె మెప్పిస్తారని జోస్యం చెప్పారు.

ప్రెసిడెంట్ ఆఫ్ జాయ్

హారిస్‌ను 'ప్రెసిడెంట్ ఆఫ్ జాయ్'గా బిల్ క్లింటన్ అభివర్ణించారు. ''హారిస్ విద్యార్థి దశలో మెక్‌డొనాల్డ్స్‌లో పార్ట్‌టైమర్‌గా చాలాకాలం పని చేశారు. 'మీకెలా సాయపడగలను?' అంటూ ప్రతి కస్టమర్‌నూ చక్కని చిరునవ్వుతో పలకరించేవారు. ఇప్పుడు అత్యున్నత అధికార హోదాలో కూడా 'మీకెలా సాయపడగలను?' అని అదే చిరునవ్వుతో ప్రజలందరినీ అడుగుతున్నారు. హారిస్ ప్రెసిడెంట్‌గా వైట్‌హౌస్‌లో అడుగు పెడితే అందరికంటే ఎక్కువగా నేనే సంతోషిస్తా. ఎందుకంటే మెక్‌డొనాల్డ్స్‌లో అత్యధిక కాలం పని చేసిన ప్రెసిడెంట్‌గా నా రికార్డును బద్దలు కొడతారు'' అంటూ ఛలోక్తులు విసిరారు. అనంతరం మాట్లాడిన సీనియర్ డెమొక్రటిక్ నేతలంతా ట్రంప్‌పై ముక్త కంఠంతో విమర్శలు గుప్పించారు. ''అమెరికాకు ట్రంప్ పెను ముప్పు. ఆయన విధానాలన్నీ దేశాన్ని తిరోగమన బాట పట్టించేవే'' అని ఆక్షేపించారు.

అభ్యర్థిత్వం స్వీకరించిన వాల్జ్

హారిస్ రన్నింగ్‌మేట్‌గా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ (60) లాంఛనంగా స్వీకరించారు. తనది అతి సాధారణ నేపథ్యమని గుర్తు చేసుకున్నారు. తనకు ఇంతటి అవకాశం కల్పించినందుకు పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ''కమల చాలా గట్టి నాయకురాలు. అత్యంత అనుభవజ్ఞురాలు. అమెరికాకు నాయకత్వం వహించేందుకు అన్ని అర్హతలతో సన్నద్ధంగా ఉన్నారు'' అని చెప్పుకొచ్చారు. ప్రజలందరి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం రాజీ లేని పోరును ఆమె కొనసాగిస్తున్నారు. ''ట్రంప్ స్వయానా కుబేరుడు. కేవలం కుబేరులకు, అతివాద శక్తులకు ఉపయోగపడటమే ఆయన ఏకైక అజెండా'' అంటూ దుయ్యబట్టారు.

ట్రంప్ వయసుపై క్లింటన్ విసుర్లు

ట్రంప్ వయసుపై బిల్ క్లింటన్ చెణుకులు విసిరారు. 78 ఏళ్ల ట్రంప్ కంటే క్లింటన్ వయసులో కేవలం కొద్ది నెలలే చిన్నవాడు. దీన్ని ప్రస్తావిస్తూ, "రెండ్రోజుల క్రితమే నాకు 78 ఏళ్లు నిండాయి. నా కుటుంబంలో నాలుగు తరాల్లో నేనే అత్యంత పెద్ద వయస్కుణ్ని. ట్రంప్‌కన్నా వయసులో కాస్తంత చిన్నవాడినని గుర్తు చేసుకోవడమే నాకు ఏకైక ఊరట" అని క్లింటన్ చెప్పుకొచ్చారు. తద్వారా, వయసుపరంగా అమెరికాకు సారథ్యం వహించేందుకు ట్రంప్ అనర్హుడంటూ సంకేతాలిచ్చారు.

అలవికాని షరతులు పెడితే..
అది బెయిలే కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అలవికాని షరతులతో బెయిల్ మంజూరు చేస్తే.. అది బెయిలే కాదని సుప్రీంకోర్టు గురువారం వ్యాఖ్యానించింది. బెయిల్ పేరిట ఊరట కలిగిస్తూ అసాధ్యమైన షరతులు విధించడం.. కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాక్కోవడమేనని వ్యాఖ్యానించింది. చీటింగ్‌తో సహా పలు అభియోగాలపై వివిధ రాష్ట్రాల్లో 13 కేసులు నమోదైన ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం తీర్పును వెలువరించింది. మొత్తం 13 కేసుల్లోనూ తనకు బెయిల్ లభించిందని, రెండింటిలో మాత్రమే అవసరమైన ష్యూరిటీలను సమర్పించానని, మిగతా 11 కేసుల్లో ష్యూరిటీలను ఇవ్వలేకపోయానని పిటిషనర్ తన అసహాయతను కోర్టు దృష్టికి తెచ్చారు. 'పిటిషనర్ వాస్తవ ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. బెయిల్ ఇచ్చినపుడు నిందితుడు తిరిగి కోర్టులో హాజరయ్యేలా చూడటానికి పూచీకత్తులు అవసరం. అదే సమయంలో.. ష్యూరిటీలు ఇవ్వలేని స్థితిలో పిటిషనర్ ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో కోర్టు.. ఆర్టికల్ 21 ప్రసాదించే వ్యక్తి స్వేచ్ఛకు, ష్యూరిటీల అవసరానికి మధ్య సమతూకాన్ని పాటించాల్సిన అవసరం ఉంది'అని ధర్మాసనం పేర్కొంది. రాజస్తాన్‌లో నమోదైన ఒక కేసులో స్థానిక పూచీకత్తు ఇవ్వాలని కోరారని, హరియాణాకు చెందిన పిటిషనర్‌కు ఇది దుస్సాధ్యమని పేర్కొంది. ప్రతి రాష్ట్రానికి రూ. 50 వేల వ్యక్తిగత బాండు, రూ.30 వేల చొప్పున రెండు ష్యూరిటీలు ఇవ్వాలని.. సంబంధింత రాష్ట్రంలో ఎన్ని కేసులున్నా ఇవి సరిపోతాయని తీర్పునిచ్చింది.

కూలిన విమానం కోసం డ్యామ్‌లో గాలింపు

ట్రెయినీ పైలట్, ఇన్‌స్ట్రక్టర్‌ల మృతదేహాలు లభ్యం

జంషెడ్‌పూర్: జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో మంగళవారం ఉదయం కూలిన శిక్షణ విమానం కోసం గాలింపు కొనసాగుతోంది. అందులోని శిక్షణ పైలట్ సుభ్రదీప్ దత్తాతోపాటు అతడి ఇన్‌స్ట్రక్టర్ జీత్ శత్రు ఆనంద్‌ల మృతదేహాలు గురువారం ఉదయం చండిల్ జలాశయంలో బయటపడ్డాయి. ఒక జత షూలను కూడా కనుగొన్నారు. దీంతో, విమానం జలాశయంలోనే కూలి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. విశాఖ నుంచి వచ్చిన 19 మందితో కూడిన భారత నేవీ బృందం డ్యామ్‌లో గాలింపు చేపట్టింది. అననుకూల వాతావరణం అన్వేషణకు అంతరాయం కలిగిస్తోందని అధికారులు తెలిపారు. రెండు సీట్ల సామర్థ్యమున్న సెస్నా 152 రకం ఈ బుల్లి విమానం మంగళవారం ఉదయం సొనారి ఏరోడ్రోమ్ నుంచి బయలుదేరింది. 11.10 గంటల సమయంలో జంషెడ్‌పూర్‌లోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్(ఏటీసీ)తో సంబంధాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

ఆస్పత్రి ఆవరణలో వృద్ధురాలిపై అత్యాచారం

చిక్కబళ్లాపూర్ (కర్ణాటక): ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన వృద్ధురాలిపై ఓ ప్రబుద్ధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్‌లో బుధవారం ఈ ఘోరం జరిగింది. 65 ఏళ్ల మహిళ మంగళవారం చిక్కబళ్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. రాత్రికి అక్కడే ఉండాల్సి రావడంతో ఆస్పత్రి ఆవరణలోనే పడుకుంది. తెల్లవారుజాము 2 గంటలప్పుడు ఇర్ఫాన్ (25) అనే వ్యక్తి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అతనిపై కేసు పెట్టి విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు. బాధితురాలు చికిత్స పొందుతోందన్నారు.

మద్యం తాగించి.. బాలికపై టీనేజర్ రేప్

పుణె: ఫ్రెండ్ ఇంట్లో పార్టీ ఉందని మాయమాటలు చెప్పి 13 ఏళ్ల స్నేహితురాలిని తీసుకెళ్లిన టీనేజర్, అక్కడ ఆమెకు బలవంతంగా మద్యం తాగించి, లైంగికదాడికి పాల్పడ్డాడు. పుణెలో ఏప్రిల్ 15వ తేదీన ఘటన జరగ్గా బుధవారం బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. రేప్ ఘటనను టీనేజర్ స్నేహితులు ముగ్గురు మొబైల్‌లో రికార్డు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు టీనేజర్, అతడి స్నేహితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, జువెనైల్ హోంకు తరలించారు. నిందితుడిపై భారతీయ న్యాయ్ సంహిత(బీఎన్ఎస్)తో పాటు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న మరో మైనర్, అతడి గర్ల్‌ఫ్రెండ్ కోసం గాలింపు చేపట్టారు.



అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలోని సుగర్‌లాండ్‌లో అష్టలక్ష్మీ ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన 90 అడుగుల ఎత్తయిన హనుమాన్ కాంస్య విగ్రహం

హారిస్‌కు ఓప్రా మద్దతు



వాషింగ్టన్: డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌కు ప్రఖ్యాత అమెరికా టీవీ హోస్ట్ ఓప్రా విన్‌ఫ్రే మద్దతు పలికారు. షికాగోలో జరుగుతున్న డెమొక్రటిక్ జాతీయ సదస్సులో బుధవారం మూడో రోజు ఆమె ఉత్సాహపూరిత ప్రసంగం చేశారు. తద్వారా అందరినీ ఆశ్చర్యపరిచారు. విన్‌ఫ్రే ఓ రాజకీయ వేదికపై మాట్లాడటం ఇదే తొలిసారి. ''పుస్తకాలు ప్రమాదకరమని, రైఫిల్స్ సురక్షితమని, ప్రేమించడం తప్పుడు మార్గమనే విధ్వంసకర భావనలను మనపై రుద్దుతున్నారు. మనల్ని విభజించి, చివరికి జయించడం వారి లక్ష్యం''అంటూ రిపబ్లికన్ల అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్ పేర్లు ప్రస్తావించకుండానే వారిని తూర్పారబట్టారు. ''హారిస్‌ను, ఆమె రన్నింగ్‌మేట్ టిమ్ వాల్జ్‌ను గెలిపించాలి. అదే అమెరికా గెలుపు''అని పిలుపునిచ్చారు. ''ఇల్లు అగ్నికి ఆహుతైతే ఆ ఇంటి యజమాని జాతి, మతం చూడం. భాగస్వామి ఎవరని అడగం. ఎవరికి ఓటేశారో చూడం. వాళ్లను కాపాడేందుకే ప్రయత్నిస్తాం. ఆ ఇల్లు సంతానం లేని పిల్లిదైతే ఆ పిల్లిని కూడా రక్షిస్తాం''అన్నారు. సంతానం లేని మహిళ అంటూ హారిస్‌ను వాన్స్ గేలి చేయడాన్ని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. పిల్లల్లేని పిల్లుల్లాంటి మహిళల సమూహం అమెరికాను పాలిస్తోందంటూ ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. విన్‌ఫ్రేకూ పిల్లల్లేరు. ''అభ్యర్థులకు విలువలు, వ్యక్తిత్వం ముఖ్యం. హారిస్, వాల్జ్ మనకు హుందాతనం, గౌరవం అందిస్తారని నా మనస్సాక్షి చెబుతోంది'' అన్నారు.

డెమొక్రాట్ల సదస్సులో వైదిక ప్రార్థనలు



షికాగో: డెమొక్రటిక్ జాతీయ కన్వెన్షన్ (డీఎన్‌సీ) మూడో రోజు బుధవారం వైదిక ప్రార్థనతో ప్రారంభమైంది. ఇలా జరగడం ఆ పార్టీ చరిత్రలో ఇదే తొలిసారి. ''మనది వసుధైక కుటుంబం. సత్యమే మనకు పునాది. అదే ఎల్లప్పుడూ గెలుస్తుంది. అసతో మా సద్గమయ.. తమసో మా జ్యోతిర్గమయ.. మృత్యోర్మా అమృతంగమయం (అసత్యం నుంచి సత్యానికి, అంధకారం నుండి వెలుగుకు, మరణం నుండి అమరత్వానికి సాగుదాం). ఓం శాంతిః శాంతిః శాంతిః''అంటూ భారత సంతతికి చెందిన అమెరికా పూజారి రాకేశ్ భట్ ప్రార్థనలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం విషయానికి వచ్చినప్పుడు అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. ''మన మనసులు ఒకేలా ఆలోచించాలి. సమాజ శ్రేయస్సు కోసం మన హృదయాలు ఒక్కటవ్వాలి. అందుకు మనల్ని శక్తిమంతులను చేయాలని, తద్వారా మనం ఐక్యమై, దేశం గర్వపడేలా చేయాలని కోరుకుంటున్నా''అని చెప్పారు. మేరీలాండ్‌లోని శ్రీ శివ విష్ణు ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న భట్ బెంగళూరుకు చెందిన వ్యక్తి. ఉడిపి అష్ట మఠానికి చెందిన పెజావర్ స్వామీజీ వద్ద ఋగ్వేదం, తంత్రసార (మాధ్వ) ఆగమాలలో శిక్షణ పొందిన మధ్వా పూజారి. కన్నడతో పాటు తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లిష్, తుళు, సంస్కృతం అనర్గళంగా మాట్లాడతారు. సంస్కృతం, ఆంగ్లం, కన్నడ భాషల్లో బ్యాచిలర్స్, మాస్టర్స్ చేశారు. ఉడిపి అష్ట మఠం, సేలంలోని బద్రీనాథ్, రాఘవేంద్ర స్వామి ఆలయాల్లో పని చేసి 2013లో మేరీలాండ్ శివవిష్ణు ఆలయంలో చేరారు.

నెలకు రూ. 6.16 లక్షలా?.. మీరే సంపాదించుకోండి

సాయం ఇప్పించాలని కోరిన మహిళపై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం

బెంగళూరు: తన జీవనం కోసం భర్త నుంచి నెలకు రూ.6,16,300 ఇప్పించాలని కోరిన మహిళపై కర్ణాటక హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక ఒంటరి మహిళ జీవించడానికి అంత భారీ ఖర్చు ఎందుకవుతుందని ప్రశ్నించింది. నెలకు రూ. 6.16 లక్షలంటే ఏమనుకుంటున్నారని నిలదీసింది. నిజంగా అంత డబ్బు కావాల్సి వస్తే సొంతంగా సంపాదించుకోవాలని, ఆ భారం భర్తపై మోపవద్దని హితవు పలికింది. రాధా మునుకుంట్ల అనే మహిళ భర్త నుంచి దూరంగా ఉంటోంది. హిందూ వివాహ చట్టం–1955లోని సెక్షన్ 24 కింద తనకు భర్త నుంచి జీవన వ్యయం ఇప్పించాలని కోరుతూ కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 20 న్యాయస్థానం విచారణ చేపట్టింది. రాధా మునుకుంట్ల తరఫు లాయర్ వాదనలు వినిపించారు. తన క్లయింట్ ఖర్చుల చిట్టాను వినిపించారు. నెలకు మొత్తం రూ.6,16,300 ఖర్చవుతున్నట్లు తెలిపారు. ఈ ఖర్చును తన క్లయింట్ భరించే స్థితిలో లేరు కాబట్టి చట్ట ప్రకారం భర్త నుంచి ఇప్పించాలని విన్నవించారు. నెలకు రూ.6.16 లక్షల ఖర్చు అనగానే న్యాయమూర్తి నివ్వెరపోయారు. కుటుంబ బాధ్యత, పిల్లల బాధ్యత లేని మహిళలకు భర్త ఆర్థిక సాయం అందజేయాలని సెక్షన్ 24 చెప్పడం లేదని అన్నారు. ''భార్యతో వివాదం ఉంటే అందుకు భర్తకు ఇలా శిక్ష వేయాల్సిందేనా? నెలకు రూ.6.16 లక్షలు ఇప్పించాలా? ఇదెక్కడి న్యాయం?'' అని న్యాయమూర్తి ప్రశ్నించారు.

అత్యంత వృద్ధురాలిగా జపాన్ మహిళ



జపాన్‌కు చెందిన 116 ఏళ్ల టొమికో ఇటుకా ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా నిలిచారు. ఆమె గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్నట్లు అమెరికాకు చెందిన జెరోంటాలజీ రీసెర్చ్ గ్రూప్ బుధవారం ప్రకటించింది. ఇంతకీ ఆమె పుట్టిందెప్పుడో తెలుసా? రైట్ బ్రదర్స్ ఐరోపా, అమెరికాల్లో తొలిసారిగా విమానాలను ప్రారంభించిన 1908లో. అదే ఏడాది ఈఫిల్ టవర్ నుంచి తొలి సుదూర రేడియో సందేశం పంపించారు. ఇటుకా జపాన్‌లోని నగరమైన అషియా నివాసి. ఆమె 70వ ఏట జపాన్‌లోని 3,067 మీటర్ల ఎత్తయిన ఒంటాకే పర్వతాన్ని రెండుసార్లు అధిరోహించారు. అది కూడా బూట్లు ధరించకుండా స్నీకర్స్‌తో ఎక్కి గైడ్‌నే ఆశ్చర్యపరిచారు. 100 ఏళ్ల వయసులో అషియా మందిరంలోని అతి పొడవైన రాతి మెట్లెక్కారు. ఇప్పటిదాకా అత్యంత వృద్ధురాలిగా ఉన్న స్పెయిన్‌కు చెందిన మరియా బ్రాన్యాస్ మొరెరా (117) మంగళవారం కన్నుమూయడంతో ఇటుకాకు రికార్డు దక్కింది. ప్రపంచంలో అత్యంత ఎక్కువ కాలం బతికిన వ్యక్తి ఫ్రెంచ్ మహిళ జీన్ లూయిస్ కాల్మెంట్. ఆమె 122 ఏళ్ల 164 రోజులు జీవించి 1997లో మరణించారు.

మరో 30 మంది పాలస్తీనియన్లు మృత్యువాత

జెరూసలేం: ఇజ్రాయెల్ ఆర్మీ గాజా, వెస్ట్‌బ్యాంక్‌లపై జరిపిన దాడుల్లో 24 గంటల వ్యవధిలో మరో 30 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత గాజాపై చేపట్టిన దాడుల్లో 10 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒక మహిళ, ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు అల్–అక్సా మార్టిర్స్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని టుల్కారెమ్ శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన మరో దాడిలో ముగ్గురు చనిపోయారు. ఘటనపై ఇజ్రాయెల్ స్పందించలేదు. కాగా, బుధవారం గాజాలోని ఖాన్‌యూనిస్‌పై యుద్ధ ట్యాంకులు, డ్రోన్లతో చేపట్టిన దాడుల్లో మరో 17 మంది చనిపోయారు.

కశ్మీర్, హరియాణాకు 400 మంది పరిశీలకులు

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్, హరియాణా రాష్ట్రాల్లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం 400 మంది పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) నియమించింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ సహా ఇతర కేంద్ర సర్వీసుల నుంచి తీసుకున్న 200 మంది సాధారణ వ్యవహారాల పరిశీలకులు కాగా, 100 మంది పోలీసు, మరో 100 మంది వ్యయ పరిశీలకులుగా ఉంటారు.



దోమల దండయాత్రతో..

దోమలపై దండయాత్ర సంగతేమో కానీ దోమల దండయాత్రకు మాత్రం ఈ చిత్రం అద్దంపడుతోంది. దోమల దాడితో పల్లె, పట్నం మంచానపడుతున్నాయి. నిర్మూలనకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. రాత్రిపూట ఆరుబయట విధులు నిర్వర్తించే సెక్యూరిటీ సిబ్బంది వీటి బారినుంచి తప్పించుకోవడానికి ఇలా దోమతెరలు కప్పుకుని కూర్చుంటున్నారు. విజయవాడ బందరు రోడ్డులోని ఒక షాపింగ్ మాల్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డు అర్ధరాత్రి సమయంలో ఇలా దోమతెర కప్పుకుని ఉండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– పవన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



మూలుగుతూ.. ముసురుతున్న ఈగలతో వేగలేక..

అనారోగ్యం బారిన పడితే ఆస్పత్రిలో చేర్పిన కుటుంబ సభ్యులు.. కొన్నాళ్లకు భారంగా భావించి విడిచివెళ్లిపోతే కదలలేక ఎదురుచూపులతో కాలంగడిపే వారి పరిస్థితి దయనీయం. అనంతపురం సర్వజనాస్పత్రిలోని సందర్శకుల వసతిగృహంలో ఎందరో అభాగ్యులు ఇలా రోజులు వెళ్లదీస్తున్నారు. ఈగలు, దోమలతో సహవాసం చేస్తూ తమకోసం కుటుంబ సభ్యులు వస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలోనే ఉన్నా వీరికి వైద్యం అందడం లేదు.

– బాషా, సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



గరుడినిపై వెండి మబ్బుల సోయగం

వినువీధిలోని మబ్బులు దొంతరలుగా ఏర్పడ్డాయి. ఉదయభానుడి లేత కిరణాలతో వెండి సంద్రంలా.. గరుడ రెక్కలపై పందిరి వేసినట్టుగా కనువిందు చేశాయి. తిరుగరిలోని శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ విద్యుత్ స్తంభంపై ఉన్న గరుడ ప్రతిమపై కనిపిస్తున్న సోయగం ఇది. ఈ అద్భుత దృశ్యాన్ని స్థానికులు తమ సెల్ ఫోన్లలో బంధించి మురిసిపోయారు.

–కేతారి మోహన్ కృష్ణ, సాక్షి ఫోటోగ్రాఫర్, తిరుపతి



గండిలో తుని-నర్సీపట్నం రోడ్డును ఆనుకుని అక్రమంగా తరలించిన గ్రావెల్‌తో ఎత్తు చేసిన భూమి

కొండలకు గుండు!

'యనమల' ఇలాకాలో కొండలు మాయం

- తెలుగు తమ్ముళ్ల గ్రావెల్ దోపిడీ
- కాకినాడ జిల్లాలో అడ్డగోలుగా తవ్వకాలు
- జేబులు నింపుకొన్న టీడీపీ నేతలు
- డి.పట్టా భూముల్లోనూ దందా
- డి.పోలవరం, తేటగుంటల్లో వెలుగులోకి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికారం చేతికొచ్చిందని తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. అధికారులను బెదిరించి దారికి తెచ్చుకుని కొండలకు కొండలనే మాయం చేసేస్తున్నారు. మైనింగ్ నిబంధనలకు తూట్లు పొడిచి అడ్డగోలుగా గ్రావెల్ తవ్వేసి కొండలను పిండి చేస్తున్నారు. అడిగేవాడు లేడనే ధైర్యంతో అడ్డగోలు దోపిడీకి తుని పరిసర ప్రాంతాలను అడ్డాగా చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడైన యనమల రామకృష్ణుడు ఇలాకాలో గ్రావెల్ దోపిడీ గడచిన నెల రోజులుగా ఇష్టారాజ్యంగా సాగుతోంది. తెలుగుదేశం పార్టీ నేతల అండదండలు చూసుకుని తమ్ముళ్లు పగలు, రాత్రి అనే తేడా లేకుండా గ్రావెల్‌ను దోచుకుపోతూ కొండలను పిండి చేసేస్తున్నారు. దళితులు, బలహీనవర్గాల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం డి.పట్టా భూములను ఇచ్చి సాగుకు మలుచుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. అటువంటి సాగుకు అనుకూలంగా లేని భూమిని చదును చేయిస్తున్నామనే కుంటి సాకులతో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. గతంలో ప్రభుత్వాలు దళితులు, బీసీల స్వయం సమృద్ధి కోసం ఇచ్చిన పట్టా భూములను కూడా వదిలి పెట్టడం లేదు. ఇందుకు తుని పరిసర ప్రాంతాలలో ఉన్న కొండలను తమ్ముళ్లు ఒకటొకటిగా మాయం చేస్తున్నారు.

అడ్డూ, అదుపూ లేదనే ధైర్యంతో..

మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య ప్రాతినిధ్యం వహిస్తోన్న తుని నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా బరితెగిస్తోంది. తుని రూరల్ మండలం డి.పోలవరం శివారు అశోక్‌నగర్ గండి సమీపాన ఎ.నాయుడికి గతంలో ప్రభుత్వం 1.15 ఎకరాలు కేటాయించింది. ఆ భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగించాలనేది డి పట్టాభూములు ఇవ్వడంలో ప్రభుత్వ ఆశయం. అటువంటి డి పట్టా భూమికి మైనింగ్, రెవెన్యూ సహా ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే లారీలకు లారీలలో గ్రావెల్‌ను తవ్వేసి ఇప్పటికే రూ.లక్షలు వెనకేసుకున్నారు. డి.పట్టా భూమి నుంచి అనుమతి లేకుండా తట్ట గ్రావెల్‌ను కూడా తరలించే వెసులుబాటు ఎవరికీ లేదు. అటువంటిది గ్రావెల్ తవ్వకాలు జరిపి తుని-నర్సీపట్నం రోడ్డును ఆనుకుని ఉన్న రూ.లక్షల విలువైన 40 సెంట్ల స్థలాన్ని మెరక చేశారు. డి.పోలవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు పీఎస్ రావు అధికార అండతో గ్రావెల్ తవ్వేసి రూ.లక్షలు మింగేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల తిరగకుండానే గ్రావెల్, రాయి తవ్వేసి ట్రాక్టర్లపై తరలిస్తూ రూ.లక్షలు వెనకేసుకున్నారు. గడచిన రెండు నెలల్లోనే ఈ డి పోలవరం పరిధిలో రూ.కోటికి పైనే ఎర్ర గ్రావెల్‌ను కొల్లగొట్టారని స్థానికులు విమర్శిస్తున్నారు. డి పోలవరం నుంచి డైలీ పాతిక, ముప్పై లారీలకు తక్కువగాకుండా రాత్రి, పగలు అనే వ్యత్యాసం లేకుండా అడ్డగోలుగా తవ్వేసుకుపోయారు. తమ వెనుక యనమల ఉన్నారని తమకు అడ్డూ, అదుపూ లేదనే ధైర్యంతో తెలుగు తమ్ముళ్లు అడ్డగోలుగా గ్రావెల్‌ను తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు.

పోలవరం ఎడమ కాలువ మట్టినీ తరలించారు

ఇందుకు తీసిపోని రీతిలోనే కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారికి అతి సమీపాన తుని రూరల్ మండల పరిధిలో తేటగుంట శివారు రాజులకొత్తూరులో ఇదే దందా నడుస్తోంది. రాజులకొత్తూరు సమీపాన జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న జిరాయితీ భూమి చదును చేసుకుంటున్నామంటూ దొడ్డిదారిన గ్రావెల్‌ను తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ సర్పంచ్, మండల స్థాయి నాయకుడు కుమ్మక్కై రెడ్ గ్రావెల్ తవ్వకాలతో అక్రమాలకు పాల్పడుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఇక్కడి నుంచి నిత్యం 10, 12 టైర్ల లారీల్లో 50 వరకు గ్రావెల్‌ను తరలించేసి రూ.లక్షలు కూడబెడుతున్నారు. అటవీ భూములు అక్రమంగా తవ్వేస్తున్నారన్న ఫిర్యాదుతో రెవెన్యూ, ఫారెస్టు అధికారులు సర్వే జరిపి జిరాయితీ భూమికి, అటవీ భూమికి సరిహద్దులు ఏర్పాటు చేశారు. కానీ గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్ తవ్వకాల దందాకు మాత్రం అడ్డుకట్ట వేసే నాథుడే లేకుండా పోయాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోవకొత్తూరు, తేటగుంట సమీపాన పోలవరం ఎడమ ప్రధాన కాలువ గట్ల వెంబడి ఎర్రమట్టిని కూడా అయినకాడికి తెగనమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. కాలువల నుంచి తీసిన మట్టితో పాటు గట్లను కూడా పెకలించి వేసి మట్టిని దోచుకుపోతున్నారు. డైలీ లారీల్లో ఎడమ కాలువ మట్టిని తవ్వి లారీకి రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వంతున అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు.



తుని తేటగుంట సమీపాన కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిని ఆనుకుని 18 అడుగుల లోతున గ్రావెల్ తీసివేసిన జిరాయితీ భూమి

అట్లుంటయ్..
చింతమనేని వేధింపులు

- ఏలూరు జిల్లాలో 63 మంది కార్యదర్శులకు పదోన్నతి
- తన నియోజకవర్గంలో పదోన్నతి పొందిన వారే లక్ష్యం
- ఆరుగురు కార్యదర్శులను రిలీవ్ చేయకూడదంటూ హుకుం
- ఆయన ఆదేశాలకు జీహుజూర్ అన్న ఉన్నతాధికారులు
- ఎమ్మెల్యే వేధింపులతో ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: అధికారులు, ఉద్యోగులపై టీడీపీ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వేధింపులకు ఇదో మచ్చుతునక. ఏలూరు జిల్లావ్యాప్తంగా 63 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు రాగా 57 మంది కొత్త స్థానాల్లో చేరారు. తన నియోజకవర్గానికి చెందిన మిగిలిన ఆరుగురి పదోన్నతికి మాత్రం చింతమనేని మోకాలడ్డు పెడుతున్నారు. ఆ ఆరుగురిని టార్గెట్ చేసి వారిని రిలీవ్ చేయడానికి వీల్లేదంటూ ఉన్నతాధికారులకు అధికారపార్టీ ఎమ్మెల్యే హుకుం జారీచేశారు. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మరో 3 రోజులు జాప్యం జరిగితే వచ్చిన పదోన్నతులు దక్కకపోగా స్థానికంగా తీవ్ర అవమానాలు, భౌతిక దాడులు భరిస్తూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏలూరు జిల్లాలో ఈనెల 8న 63 మంది గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-2 పదోన్నతి దక్కింది. పదోన్నతి ఉత్తర్వులు జారీ అయిన రోజు నుంచి 15 రోజుల్లోగా కొత్త స్థానంలో విధుల్లో చేరాల్సి ఉంటుంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పదోన్నతుల వ్యవహారం సజావుగా సాగింది. దెందులూరు నియోజకవర్గంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ 12 మందికి పదోన్నతి దక్కితే ఆరుగురు నానా తంటాలు పడి గత వారంలో రిలీవ్ అయి కొత్త స్థానంలో విధుల్లో చేరారు. మిగిలిన ఆరుగురిని మాత్రం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ టార్గెట్ చేశారు. గతంలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరించారని, స్థానిక నేతలతో సన్నిహితంగా ఉన్నారని, ఇలా రకరకాల ముద్రలు వేసి ఆ ఆరుగురు పదోన్నతులు అడ్డుకున్నారు. తనకు చెప్పకుండా వారిని రిలీవ్ చేయడానికి వీల్లేదని జిల్లా పంచాయతీ అధికారికి ఆయన ఆదేశించారు. దీంతో ఆ ఆరుగురి భవితవ్యం గాలిలో ఉంది.

రెడ్‌బుక్ రాజకీయాలు

దెందులూరు మండలంలో రామారావుగూడెం, పెదవేగి మండలంలోని విజయరాయి, నడిపల్లి, భోగాపురం, జగన్నాథపురం, ఏలూరు రూరల్ మండలంలో మల్కాపురం పంచాయతీ కార్యదర్శులను వేధిస్తూ ఎమ్మెల్యే రెడ్‌బుక్ రాజకీయాలకు తెరతీశారు. కక్ష సాధింపులతో నిరంతరం అవమానాలకు గురిచేయడంతో పాటు మాటలతోనూ వేధిస్తున్నారు. వీరిలో ఒక పంచాయతీ కార్యదర్శిపై కొద్దిరోజుల క్రితం జరిగిన సమావేశంలో 40 నిమిషాల పాటు బహిరంగ వేదికపైనే తీవ్రస్థాయిలో చింతమనేని విరుచుకుపడ్డారు. ప్రొటోకాల్ పాటించలేదనే కారణంతో సదరు కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డీపీఓను ఆదేశించడంతో డీపీఓ ఆగమేఘాలపై సస్పెన్షన్‌కు ఫైల్ రెడీ చేశారు. మరో పంచాయతీ కార్యదర్శి రిలీవ్ కోసం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లగా ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు ఆ కార్యదర్శిని మందలించి మరీ పంపినట్లు సమాచారం.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై నేడు హైకోర్టు తీర్పు

ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: రెంటచింతల, కారంపూడి పోలీసులు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ కోరుతూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో వాదనలు గురువారం ముగిశాయి. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం శుక్రవారం తీర్పు వెలువరిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు తెలిపారు.

పోలింగ్ రోజు పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసి, టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేశారని, ఆ మరునాడు కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడి చేశారంటూ రామకృష్ణారెడ్డిపై రెంటచింతల, కారంపూడి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ రెండు పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కింద కూడా రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో బెయిల్ ఇచ్చేందుకు గురజాల కోర్టు తిరస్కరించడంతో రామకృష్ణారెడ్డి బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా వీటిపై జస్టిస్ మల్లికార్జునరావు గురువారం విచారణ జరిపారు.

జోగి రమేష్ ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేయండి

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయన ఇంటి వద్ద జరిగిన గొడవపై నమోదైన కేసులో విచారణకు మాజీ మంత్రి జోగి రమేష్ సహకరించడం లేదని అందువల్ల ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేయాలంటూ పోలీసులు గురువారం హైకోర్టును కోరారు. ఈ కేసులో ముందుస్తు బెయిల్ కోరుతూ జోగి రమేష్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్ గురువారం విచారణ జరిపారు. పోలీసుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. అప్పటి వరకు జోగిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తుత్తి గ్రామసభలే!

కూటమి ప్రభుత్వ తీరుపై అధికారవర్గాల్లో విస్మయం

- నేడు గ్రామసభల నిర్వహణపై ప్రభుత్వం విస్తృత ప్రచారం
- ముందే గుర్తించిన పనులకు ఆమోదం కోసమే గ్రామ సభలు
- తమ నేతలకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు ఆరాటం
- ఇప్పటికే కొనసాగుతున్న పనులు ఇక పక్కకే..



సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పనుల్లో ఏమేమి చేయాలో ముందే నిర్ణయించుకుని, వాటికి అధికార ముద్ర కోసం ఉత్తుత్తి గ్రామ సభలు నిర్వహించడానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. శుక్రవారం (నేడు) రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తామంటూ ఆర్భాటం చేస్తోంది. ఉపాధి హామీ పథకం నిబంధనలకు తూట్లు పొడుస్తూ గ్రామ సభల నిర్వహణకు సంబంధించి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సచివాలయాల భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులన్నింటినీ పక్కనపెట్టి, ఉపాధి హామీ పథకం మెటీరియల్ కేటగిరీ నిధులతో కొత్తగా గ్రామాల్లో అధికార పార్టీ నేతలకు పనులను కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు సిద్ధమయ్యారు. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కేటగిరి నిధుల నుంచి ఒక్కో నియోజకవర్గానికి రూ. 10 కోట్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 2 వేల కోట్ల మేర కొత్త పనులు గుర్తింపు ప్రక్రియ అంతా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో దాదాపు పూర్తయింది. నిజానికి.. ఉపాధి పథకంలో చేపట్టే ఏ పనైనా నిబంధనల ప్రకారం ముందుగా గ్రామసభ ఆమోదం పొందాలి. అందుకే కూటమి పెద్దలు తమ వాళ్లకి కట్టబెట్టే పనులకు ఆమోదం తెలపడానికి ఉత్తుత్తి గ్రామ సభలు నిర్వహించనున్నారు.

ఎందుకీ హడావుడి పవన్..

ఈ ఉత్తుత్తి గ్రామ సభల నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కొద్దిరోజులుగా ఎక్కడాలేని హడావుడి చేస్తుండడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. మొత్తం 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించాలని పక్షం రోజులుగా పవన్ కళ్యాణ్ చెబుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఇదే అంశంపై ఆయన సోమవారం అన్ని జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు జరగడం కొత్త కాదని, ఏటా నాలుగు విడతలుగా (ఏప్రిల్ 24న, ఆగస్టు 15న, అక్టోబర్ 2న, జనవరిలో మరో విడత) గ్రామ సభలు జరుగుతూనే ఉంటాయని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడే ఎందుకింత హడావుడి చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు.

9.92 లక్షల పనులకు జనవరిలోనే ఆమోదం

సాధారణంగా ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి ఆరు నెలల ముందు నుంచే.. పంచాయతీలో చేపట్టాల్సిన పనులు, పేదలకు పనిదినాల కల్పనకు ఉన్న అవకాశాలు గుర్తించే ప్రక్రియ మొదలు పెట్టి ఫిబ్రవరిలో పూర్తి చేస్తారు. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూడా గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయి లేబర్ బడ్జెట్ రూపకల్పనతో గ్రామాల వారీగా పనుల గుర్తింపు, ఆ పనులకు గ్రామ సభలో ఆమోదం వంటి ప్రక్రియ కూడా ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు కల్లా అధికారులు పూర్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూలీలకు కల్పించే పనులతో పాటు మెటీరియల్ నిధులతో చేపట్టే ఇతర అభివృద్ధి పనులన్నీ కలిపి మొత్తం 9.92 లక్షల పనులకు ఈ ఏడాది జనవరిలోనే గ్రామ సభల్లో ఆమోదం తీసుకొని, ఆ పనుల జాబితాను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పుడే అందజేశారు. అందులో దాదాపు 8.53 లక్షల పనులు పురోగతి దశలో ఉన్నాయి. అయితే, తమ నాయకులకు ఆర్థిక లబ్ధిని చేకూర్చే మట్టి రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు కొత్తగా అనుమతులు తెలిపేందుకు కూటమి ప్రభుత్వం రెడీ అయింది.

పలు రైళ్లు దారి మళ్లింపు, పాక్షికంగా రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతోన్న ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లించడంతో పాటు మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ మండ్రుప్కర్ గురువారం తెలిపారు.

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు...

మచిలీపట్నం-విజయవాడ-మచిలీపట్నం (07896/07769), నర్సాపూర్-విజయవాడ (07863), విజయవాడ-మచిలీపట్నం(07866), మచిలీపట్నం-విజయవాడ (07770), విజయవాడ-భీమవరం జంక్షన్ (07283), మచిలీపట్నం-విజయవాడ (07870), విజయవాడ-నర్సాపూర్ (07861) రైళ్లు సెప్టెంబర్ 2 నుంచి 29 వరకు రామవరప్పాడు, విజయవాడ మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

దారి మళ్లింపు...

సెప్టెంబర్ 2, 9, 16, 23 తేదీల్లో యర్నాకుళం-పాట్నా (12756), సెప్టెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో భావ్‌నగర్-కాకినాడ పోర్టు (12756), సెప్టెంబర్ 4, 6, 11, 13, 18, 20, 25, 27 తేదీల్లో బెంగళూరు-గౌహతి (12509), సెప్టెంబర్ 2, 4, 6, 7, 9, 11, 13, 14, 16, 18, 20, 21, 23, 25, 27, 28 తేదీల్లో ఛత్రపతి శివాజీ టర్మినల్-భువనేశ్వర్ (11019), సెప్టెంబర్ 2-29 వరకు ధన్‌బాద్-అలప్పూజ (13351), సెప్టెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో టాటా-యశ్వంత్‌పూర్ (18111), సెప్టెంబర్ 4, 11, 18, 25 తేదీల్లో జసిదిహ్-తాంబరం (12376), సెప్టెంబర్ 2, 9, 16, 23 తేదీల్లో హతియా-యర్నాకుళం (22837), సెప్టెంబర్ 7, 14, 21, తేదీల్లో హతియా-బెంగళూరు (18637), సెప్టెంబర్ 3, 8, 10, 15, 17, 22, 24, 29 తేదీల్లో హతియా-బెంగళూరు (12835), సెప్టెంబర్ 6, 13, 20, 27 తేదీల్లో టాటా-బెంగళూరు (12889) రైళ్లు రెండు మార్గాల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్లించనున్నారు.

స్టార్ లేబులింగ్ ప్రోగ్రామ్‌ను ప్రోత్సహించండి

ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాలకు బీఈఈ సూచన

సాక్షి, అమరావతి: భవిష్యత్ తరాలకు విద్యుత్ వెలుగులు, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించడం కోసం స్టార్ లేబులింగ్ (ఎస్ఎల్) ఎలక్ట్రానిక్ ఉపకరణాల వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్‌తోపాటు దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సూచించింది. ఈ మేరకు ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్(ఏపీఎస్ఈసీఎం) సహా దక్షిణాది రాష్ట్రాల స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ(ఎస్‌డీఏ)లకు బీఈఈ మార్గనిర్దేశం చేసింది. రాష్ట్రానికి, విద్యుత్ రంగానికి మాత్రమే కాకుండా వినియోగదారులకు, ఆర్థికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణలో ఈ ఎస్ఎల్ ప్రోగ్రామ్ కీలకమని తెలిపింది. వివిధ కార్యక్రమాల ద్వారా ఇంధన సామర్థ్యం, పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించడంపై రాష్ట్రం మరింత దృష్టి సారించాలని బీఈఈ కోరింది. విద్యుత్ పొదుపు కార్యక్రమాల్లో ప్రతి వినియోగదారుడు ఒక స్టార్‌గా మారాలని పిలుపునిచ్చింది. రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, ఎలక్ట్రిక్ కుక్కర్లు, ఫ్యాన్లు మొదలైన స్టార్-లేబుల్ ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఉపయోగించడం వల్ల వినియోగదారులు లాభపడతారని వివరించింది. ఈ ప్రచారాన్ని ఎస్‌డీఏలతో కలిసి ప్రతి గ్రామానికి తీసుకెళ్తున్నామని బీఈఈ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్(ఏపీఎస్ఈసీఎం)తో కలిసి స్టార్ లేబుల్ ఉత్పత్తుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి కొన్నేళ్లుగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపింది. స్టార్ లేబులింగ్ ప్రోగ్రామ్‌ను 2006లో ప్రారంభించిన బీఈఈ ఇంధన సామర్థ్యం ఆధారంగా ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు స్టార్ రేటింగ్‌ను (1-5 స్టార్‌లు) కేటాయిస్తుంది. 5-స్టార్ రేటింగ్ లేబుల్ ఉంటే అత్యంత సమర్థవంతమైన మోడల్‌గా సూచిస్తుంటుంది.

క్లుప్తంగా...

పెళ్లి పీటలపై వధువు ఆత్మహత్యాయత్నం

గుంటూరు జిల్లా పెదకాకాని శివాలయంలో ఘటన

పెదకాకాని: పెళ్లి పీటలపై వధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గుంటూరు జిల్లా పెదకాకాని శివాలయంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గోగినేని రాజేష్‌కు, దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన ప్రవళికకు వివాహం నిశ్చయమైంది. ఇరువైపు పెద్దలు పెదకాకానిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి సన్నిధిలో వివాహం జరిపించేందుకు నిర్ణయించుకున్నారు. రెండు కుటుంబాల వారు బంధుమిత్రులతో గురువారం ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాకార మండపంలో ముందుగా అనుకున్న లగ్నానికి వివాహం జరిపించేందుకు వధూవరులను పీటలపై కూర్చొబెట్టారు. వివాహ బంధంలో ప్రధాన ఘట్టమైన జీలకర్ర బెల్లం పెట్టించిన అర్చకులు బంధుమిత్రులచే ఆశీర్వాద అక్షింతలు వేయించారు. అనంతరం తలంబ్రాల దుస్తులు మార్చుకునే గదిలోకి వెళ్లిన వధువు తన చేతికి ఉన్న గాజును పగులగొట్టి చేతి మణికట్టుపైన, గొంతుపైన గాయం చేసుకుంది. గమనించిన బంధువులు ఆమెను స్థానిక వైద్యుని వద్దకు తీసుకువెళ్లి చికిత్స చేయించి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని ప్రవళిక తేల్చి చెప్పింది. చివరకు పెద్దల చర్చల అనంతరం ఇరువురికీ ఎటువంటి సంబంధం లేదని తెల్ల కాగితాలపై సంతకాలతో రాసుకుని వివాహాన్ని రద్దు చేసుకున్నారు. ప్రవళిక తల్లి ఆందోళనకు గురై పడిపోవడంతో ఆస్పత్రికి తరలించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం

వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

సాక్షి, అమరావతి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి.. వారికి ఆరోగ్య భద్రత కల్పించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ అధికారులకు సూచించారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'ప్రకృతి వ్యవసాయం–వాటి ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాల'పై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. రాబోయే మూడేళ్లలో 40 శాతం మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు వస్తారని, ఆ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలలో సమూల మార్పులు అవసరమన్నారు. రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి పెట్టుబడి సాయం, పంట రుణాలు తక్షణమే అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు కౌలు రైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎ.కాటమయ్య, పి.జమలయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి 60 రోజులు పూర్తైందని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమై కూడా 75 రోజులు దాటిందని తెలిపారు. కానీ కౌలు రైతులు పెట్టుబడి సాయం అందక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రతి కౌలు రైతుకు రూ.20వేలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.



ఐ లవ్ వెస్ట్ గోదావరి.. తణుకు సిటీ.. భీమవరం టౌన్.. గ్రేట్ పాలకొల్లు.. హై ఆచంట.. మన ఉండి.. సోషల్ మీడియాలో ఇలా చాలా పేజీలే నడుస్తుంటాయి. సొంత జిల్లా.. సొంత ఊరి పేరిట నిర్వహించే పేజీలకు ఉండే ఆదరణే వేరు. తమ ఊరి పేరిట పేజీ క్రియేట్ చేసి స్థానిక సంగతులు అప్‌లోడ్ చేయడం ద్వారా అధిక సంఖ్యలో ఫాలోవర్లను సంపాదించుకుంటున్నారు నేటి యువత. కొందరు సామాజిక స్పృహతో వీడియోలు చేస్తూ సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములవుతున్నారు.



ఆయ్.. మన ఊరి సంగతులండి!

ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో పట్టణాలు, పల్లెల పేరిట ప్రత్యేక పేజీలు

- స్థానిక వింతలు, విశేషాలు అప్‌లోడ్ చేస్తున్న యువత
- దేశ విదేశాల్లోని వారికీ చేరువవుతున్న స్వస్థలాల సమాచారం
- లక్షల్లో ఫాలోవర్లు, వ్యూస్
- సామాజిక సేవల్లోనూ భాగస్వామ్యం

సాక్షి, భీమవరం: పనిలో కాస్త ఖాళీ దొరికితే రిలాక్స్ అయ్యేందుకు ఇప్పుడు చాలామంది చేసే పని సెల్‌ఫోన్‌లో రీల్స్ చూడటమే. సోషల్ మీడియాలో రకరకాల పేజీలు, గ్రూపులు, ఇండివిడ్యువల్ ప్రొఫైల్స్‌లో అప్‌లోడ్ చేసే రీల్స్‌కు కొదవే లేదు. అయితే.. తమ సొంత ఊరి పేరిట క్రియేట్ చేసే పేజీలకు సోషల్ మీడియాలో అధిక ఫాలోయింగ్ ఉంటోంది. విద్య, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం సొంత ఊరిని వదిలి దేశ విదేశాల్లో ఉంటున్న వారు స్థానిక సంగతులు తెలుసుకోవాలన్న ఆసక్తితో తమ ఊరి పేరిట ఉండే పేజీలను ఫాలో కావడం పెరుగుతోంది. కొందరు ఔత్సాహిక యువకులు తమ ఊరి పేరిట పేజీలను క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు సొంత ఊరి సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చే చిత్రాలు, ప్రకృతి సోయగాలు, పల్లెటూళ్ల అందాలు, అమ్మవార్ల జాతరలు, పండుగలు, సంప్రదాయాలు ఇలా ఒకటేమిటి స్థానిక వింతలు, విశేషాలు, ఘటనలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఎక్కడో దూరంగా ఉన్న వారికి నిత్యం సొంత ఊరి వాసనలను అందిస్తున్నారు. స్థానికంగా దొరికే స్వీటు, హాటు, ఇతర వంటకాల వీడియోలు అప్‌లోడ్ చేస్తూ వేలల్లో ఫాలోవర్లను సంపాదించుకుంటున్నారు.

'నెయిల్ ఫ్రీ ట్రీ'తో స్ఫూర్తి నింపారు

కొన్ని పేజీల నిర్వాహకులు సామాజిక స్పృహతో వీడియోలు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. అటువంటి వాటిలో తణుకు సిటీ పేజీ ఒకటి. 'తణుకును చేరువ చేసేందుకు, స్థానిక సంస్కృతి, సంగతులు తెలిపేందుకు' ట్యాగ్‌లైన్‌తో ఏర్పాటు చేసిన ఈ పేజీ ద్వారా తణుకు, పరిసర గ్రామాల సంగతులను ఎప్పటికప్పుడు ఫాలోవర్లకు అందిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో స్థానికులను భాగస్వాములను చేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా పట్టణ పారిశుధ్యంపై ప్రజల్లో చైతన్యం నింపే కార్యక్రమాలు చేస్తున్నారు. డాగ్స్ వ్యాక్సినేషన్ చేయించడం, తణుకు రైల్వే స్టేషన్‌లో కోచ్ ఇండికేటర్ బోర్డ్స్ లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తమ పేజీ ద్వారా రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి ఏర్పాటుకు కృషి చేయడం వంటివి ఇందుకు ఉదాహరణ. తాజాగా పశ్చిమ గోదావరి జిల్లా పట్టణంలో 'నెయిల్ ఫ్రీ ట్రీ' కార్యక్రమం నిర్వహించారు. చెట్ల మనుగడకు ముప్పు కలుగజేస్తున్న ప్రచార బోర్డులను తొలగించారు. పేజీ అడ్మిన్ మద్దాల సతీష్ (బాబి)తో పాటు మరికొందరు యువకులు కలిసి పట్టణంలోని పాలంగి రోడ్డు, సజ్జాపురం ఏరియా తదితర చోట్ల చెట్లకు అమర్చిన పబ్లిసిటీ బోర్డులు, వాటికి చెట్లకు కొట్టిన మేకులు, ఇనుప తీగలను తీసేశారు. వాటిని చెట్లకు అమర్చిన వారికి ఫోన్లు చేసి చెట్లకు మేకులు కొట్టి బోర్డులు పెట్టవద్దని కోరారు. ఇందుకు సంబంధించిన వీడియోకు సోషల్ మీడియాలో మంచి స్పందన వచ్చింది. అప్‌లోడ్ చేసిన రెండు రోజుల్లోనే 10 లక్షలకు పైగా వ్యూస్ రావడంతో పాటు పెద్ద సంఖ్యలో షేర్ అయ్యాయి. వీరి ప్రయత్నాన్ని నెటిజన్లు అభినందించారు. తమ ఇళ్ల వద్ద చెట్లకు ఉన్న పబ్లిసిటీ బోర్డులను, వాటికి కొట్టిన మేకులను తొలగిస్తున్నామని పలువురు కామెంట్లు చేశారు.

లక్షల్లో వ్యూస్

ఈ తరహా పేజీల్లోని వీడియోలకు లక్షల్లో వ్యూస్, లైక్స్ వస్తున్నాయి. అధిక సంఖ్యలో షేర్ అవుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని పట్టణాలతో పాటు చాలా గ్రామాల పేరిట సోషల్ మీడియాలో ప్రత్యేక పేజీలు కనిపిస్తున్నాయి. కొన్ని ఊళ్లకైతే పేజీల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. వీటిలో వివాదరహితంగా ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్ సమాచారం ఇచ్చే పేజీలనే ఎక్కువ మంది ఫాలో అవుతున్నారు. మరికొందరు స్థానికంగా పేరొందిన హోటళ్లు, రెస్టారెంట్లు, వివిధ వ్యాపార సంస్థలకు ప్రమోషన్ వీడియోలు చేసి పేజీల్లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.



చెట్లకు అమర్చిన ప్రచార బోర్డులను తొలగిస్తున్న తణుకు సిటీ పేజీ నిర్వాహకులు

స్థానిక సంగతులు తెలిపేందుకే..



తణుకు సంగతులను ప్రజలకు తెలియజేసేందుకు 2013లో తణుకు సిటీ పేజీని స్టార్ట్ చేశాను. ప్రస్తుతం ఫేస్‌బుక్‌లో లక్షా 16 వేల మంది, ఇన్‌స్టాగామ్‌లో 65 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని నింపే, వివాద రహితమైన వీడియోలు మాత్రమే అప్‌లోడ్ చేస్తాం. పేజీ ద్వారా చేసే సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములవుతుండటం ఆనందంగా ఉంది.

– మద్దాల సతీష్ (బాబి), తణుకు సిటీ పేజీ నిర్వాహకుడు

సొంతూరి సంగతులు తెలుస్తున్నాయి



మా స్వస్థలం తణుకు. కెనడాలో జాబ్ చేస్తున్నా. ఐదేళ్లుగా తణుకు సిటీ పేజీని ఫాలో అవుతున్నాను. ఎప్పటికప్పుడు మా పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల సంగతులు తెలుస్తుంటాయి. ప్రజల్లో చైతన్యం నింపేలా సామాజిక స్పృహతో పేజీని మెయింటైన్ చేయడం బాగుంది.

– వి.కృష్ణ చైతన్య, కెనడా

పులస పులుసు @ రూ.999

రావులపాలెం నుంచి మెట్రో నగరాలకు స్టీల్ బాక్సుల్లో సరఫరా

- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి ఆన్‌లైన్ ఆర్డర్లు
- సరదాగా ప్రారంభించి సక్సెస్ సాధించిన ముగ్గురు యువకులు



సాక్షి, అమలాపురం/ రావులపాలెం: గోదావరి రుచులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ఆహార పదార్థాలలో 'పులస పులుసు' ఒకటి. పుస్తెలు అమ్ముకునైనా పులస తినాల్సిందేనని గోదావరి జిల్లాల్లో నానుడి. గోదావరికి వరద పోటు తగలగానే పులస చేపలు దొరుకుతుంటాయి. ఒకప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు పులస రాక చాలా వరకూ తగ్గిపోయింది. ఇదే సమయంలో దీనికి మీడియా, డిజిటల్ మీడియాలో జరుగుతున్న విస్తృత ప్రచారం దక్షణాది రాష్ట్రాల్లో గోదావరి పులస రుచి మార్మోగుతోంది. గతంలో స్థానికంగా లభ్యమయ్యే పులసలను ఇక్కడ వండి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రాంతాల్లో బంధువులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు పంపడం ఆనవాయితీగా ఉండేది. తర్వాత కాలంలో గోదావరి జిల్లాల తోపాటు హైదరాబాద్ వంటి నగరాల్లో పులస పులుసు అందించే రెస్టారెంట్‌లు పలు పుట్టుకొచ్చాయి. వీటికి కొనసాగింపుగా స్థానికంగా పులస పులుసు తయారు చేసి ప్రత్యేకంగా సిద్ధం చేసిన స్టీల్ డబ్బాలో ప్యాక్ చేసి ఆన్‌లైన్ విక్రయాలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన ముగ్గురు యువకులు తెరలేపారు. వీరి ఆన్‌లైన్ వ్యాపారం వల్ల పులస పులుసు రుచి కాస్తా హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు విస్తరించింది. ఆన్‌లైన్‌లో పులస అమ్మకాలు చేస్తూ పులస రుచిని గోదావరి జిల్లాలకే కాకుండా ఇతర ప్రాంతాల వారికి కూడా రుచి చూపిస్తున్నారు. 'కోనసీమ గోదావరి పులస చేప పులుసు' పేరుతో ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు చేస్తున్నారు.

సాయంత్రం ప్యాకింగ్.. మరుసటిరోజు ఉదయానికి డెలివరీ

ప్రతిరోజూ ఉదయం మార్కె ట్ నుంచి పులసను కొనుగోలు చేస్తారు. వాటిని అనుభవం ఉన్న వంట మాస్టర్లతో వండించి సాయంత్రానికి బాక్సుల్లో ప్యాకింగ్ చేస్తారు. ఆ తర్వాత వివిధ మార్గాల్లో ఆయా ఊర్లకు రవాణా చేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు మరుసటి రోజు ఉదయం వినియోగదారుల ఇంటికి చేరుతుంది. గత సంవత్సరం సరదాగా ప్రారంభించిన ఈ వ్యాపారం ప్రారంభంలో వారానికి ఒక్క రోజు మాత్రమే జరిగేది. ఇప్పుడు రోజుకు 50 నుంచి 100 వరకూ బాక్సులు అమ్మకాలు సాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం సాయంత్రం ఇంతకన్నా అధికంగా బాక్సులు ఆన్‌లైన్ ఆర్డర్లలో వెళుతున్నాయి.



స్టీల్ డబ్బాలో కిలో పులస పులుసు

స్టీల్ డబ్బాలో ఇస్తున్న పులస పులుసు బరువు కిలో ఉంటుంది. దీని ధర రూ.999 మార్కెట్లో పులస లభ్యత ధరలతో సంబంధం లేకుండా ఇదే రేటును సీజన్ మొత్తం కొనసాగిస్తున్నారు. ఒక్కో బాక్సులో చేపలోని రెండు నడుంముక్కలు, ఒక తల లేదా తోక ముక్కతో పాటు అరకేజీ పులుసు, వాటిలోనే బెండకాయలు, పచ్చి మిరపకాయలు, వంకాయ చీలికలు వేసి అందిస్తున్నారు.



టిన్‌లలో పులస పులుసు

సామాన్యులకు సైతం రుచి చూపించేందుకు..



పులస అంటేనే అత్యంత ఖరీదైన చేప. పులస కూర వండాలన్నా, తినాలన్నా అందరికీ సాధ్యం కాదు. సామాన్యులకు సైతం రుచి అందించాలనే ఆలోచనతో గత ఏడాది దీనిని ప్రారంభించాం. ప్రతి ఒక్కరికి ధర అందుబాటులో ఉండాలని మార్కెట్లో పులస రేటుతో సంబంధం లేకుండా కిలో రూ.999కే అందిస్తున్నాం.

– కోనాల మంగారెడ్డి, నిర్వాహకుడు, రావులపాలెం

ఆదరణ బాగుంది



పులస రుచిని ఇతర ప్రాంత వాసులకు కూడా పరిచయం చేయాలన్న ఆలోచనతో దీనిని మొదలుపెట్టాం. ప్రారంభంలో కొంచెం ఒడిదొడుకులు ఎదుర్కొన్నా ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో ఆదరణ చాలా బాగుంది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కడప ప్రాంతాల నుంచి ఆర్డర్లు రావడంతో ఇప్పుడు రోజూ ప్యాకింగ్ చేసి పంపుతున్నాం.

– కర్రి విశ్వేశ్వర్‌రెడ్డి, పులస పులుసు నిర్వాహకుడు, రావులపాలెం

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,957 మంది స్వామివారిని దర్శించుకోగా 33,066 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.12 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

దుర్గమ్మ సేవలో ఏర్పేడు పీఠాధిపతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఏర్పేడులోని శ్రీ వ్యాసాశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామిజీ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్వామిజీకి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు వేదస్వస్తి పలికారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో గురువారం గణపతికి విశేష అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం గణపతి స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గణపతి మంత్ర హవనం(హోమం)ను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఆగిరిపల్లి: ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని వరాహ పుష్కరిణి వద్ద గల ముక్తేశ్వర స్వామి వారి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కలన్యాసం, మండపారాధన, పూర్ణాహుతి, ఆలయ సంప్రోక్షణ, శివ పార్వతుల శాంతి కల్యాణం వైభవంగా చేపట్టారు. అనంతరం అయ్యప్ప స్వామి, కుమారస్వామి విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

కలిగిరి: నెల్లూరు జిల్లా కలిగిరి మండలంలోని చంద్రారెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు వేద పండితులు నారాయణం వెంకటరమణ దీక్షితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

నేడు పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు

సామర్లకోట: శ్రావణ మాసం సందర్భంగా కాకినాడ జిల్లాలోని సామర్లకోట కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మూడో శుక్రవారంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతాలకు కావలసిన సామగ్రి దాతలు సమకూరుస్తారన్నారు.

విద్యా సమాచారం

ఏపీ పీజీ సెట్‌లో ఆప్షన్ల ఎంపికలో కోడ్‌ను గమనించాలి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎంకామ్ కోర్సులో ఆప్షన్లు పెట్టుకునే విద్యార్థులు కోడ్‌లను గమనించాలని కామర్స్ విభాగపు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంకామ్ రెగ్యులర్ కోసం ఎస్వీయూసీ, పేమెంట్‌కోసం ఎస్వీయూసీపీఏకోడ్‌నూ, ఎంకామ్ అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ కోర్సు, ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ వంటి సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు ఎస్వీయూసీఎస్ఎఫ్ కోడ్‌ను ఆప్షన్లల్లో ఉంచుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: తపాలా బిళ్లల సేకరణను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం దీన్ దయాల్ స్పర్శ్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకర్ బాబు గురువారం తెలిపారు. తపాలా బిళ్లలను సేకరించే 6,7,8,9 తరగతులు చదివే విద్యార్థులు అర్హులని చెప్పారు. ఎంపికైన వారికి ప్రతి నెలా రూ.500 చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి గుర్తింపు కలిగిన పాఠశాలలో చదవడంతో పాటు 60 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలని వెల్లడించారు. వివరాలకు సమీపంలోని పోస్టాఫీసులో గానీ, www.indianport.gov.in వెబ్‌సైట్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

ఆర్‌జీయూకేటీ క్లాస్‌వర్క్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) క్లాస్ వర్క్ గురువారం ప్రారంభమైంది. మొదటి ఏడాది ప్రస్తుతం 820 మంది విద్యార్థులు రిపోర్టు చేశారు. క్యాంపస్ ట్రాన్స్‌ఫర్, ప్రత్యేక కేటగిరి ప్రవేశాలు వంటి ప్రక్రియ పూర్తయ్యాక పూర్తి స్థాయి ప్రవేశాలకు అవకాశం ఉంది.

ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలకు శిక్షణ

నెల్లూరు (టౌన్): అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నెల్లూరు దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పన, ఏఎంఓ సుధీర్‌బాబు, బాలరక్ష భారత్ మేనేజర్ నగేష్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, రిసోర్స్ పర్సన్లు రమేష్, రంగనాథన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ జయశంకర్‌కు రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది. ఈ మేరకు కేరళలోని తిరువనంతపురంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయనకు అవార్డును అందజేశారు.


28న 'నన్నయ'లో తెలుగు జాతీయ సదస్సు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'గురు విశ్వస్ఫూర్తి రచనలు–ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం' అనే అంశంపై సెప్టెంబరు 28న తెలుగు జాతీయ సదస్సు నిర్వహించనున్నామని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బ్రోచర్ గురువారం ఆవిష్కరించారు. వర్సిటీ తెలుగు విభాగం, స్ఫూర్తి కుటుంబం–ఏపీ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

అప్పుడు కరోనా.. ఇప్పుడు డెంగీ

కోవిడ్ తర్వాత పెనుముప్పుగా పరిణామం

- భారత్ సహా దక్షిణాసియా దేశాల్లో ప్రధాన ప్రజారోగ్య సమస్యగా...
- వాతావరణ మార్పులు, పట్టణీకరణ, వలసలు, మౌలిక వసతులలేమి కారణం
- దేశంలో మళ్లీ కలరా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడి
- ప్రజారోగ్య ప్రమాదాలను ముందుగా గుర్తించడంలో ఇప్పటికీ మనం వైఫల్యం
- నేటికీ భారత్ వంటి దేశాలను అప్రమత్తం చేస్తున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ
- త్వరలో డెంగీకి వ్యాక్సిన్ వస్తుందంటున్న వైద్యులు



సాక్షి, హైదరాబాద్: కరోనా ప్రపంచాన్ని వణికించింది. దాని బారిన పడి లక్షలాది మంది మృత్యువాతపడ్డారు. కోట్లాది మంది ఆసుపత్రులపాలయ్యారు. అనేక కుటుంబాలను కోవిడ్ ఛిన్నాభిన్నం చేసింది. అటువంటి వైరస్ పీడ విరగడైంది. కానీ కరోనా తర్వాత ఇప్పుడు డెంగీ... భారత్ సహా దక్షిణాసియా దేశాలను వణికిస్తోంది. డెంగీ ప్రాణాంతకమైనదిగా పరిణమించిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇంటెలిజెన్స్ నివేదిక హెచ్చరించింది. ఈ మేరకు తాజాగా నివేదిక విడుదల చేసింది. మొత్తం 47 రకాల జబ్బులపై పరిశోధన చేసి వాటిపై నివేదిక రూపొందించింది. అందులో ఎక్కువ ప్రమాదకరంగా ఉన్న మొదటి 10 వ్యాధుల పేర్లను విడుదల చేసింది. అందులో భారత్‌లో డెంగీ, నిఫా, పోలియో, డిఫ్తీరియా, జికా వైరస్, ఫుడ్ పాయిజనింగ్, రేబిస్ వంటివి ఉన్నాయని పేర్కొంది. ప్రజారోగ్యానికి ముప్పుగా ఉన్న వాటిల్లో అంటువ్యాధులు 80 శాతం, ప్రకృతి వైపరీత్యాలు 3 శాతం, రసాయనపరమైనవి 1 శాతం, మిగిలినవన్నీ కలిపి 16 శాతంగా ఉన్నాయి. అంటువ్యాధులే ప్రధానంగా ప్రజారోగ్యానికి పెనుసవాళ్లుగా ఉన్నాయని పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసే బులెటిన్లలో కోవిడ్ తర్వాత డెంగీపైనే అత్యధికంగా అలర్ట్ బులెటిన్లు విడుదలయ్యాయి. ఆ తర్వాత ఎబోలా ఉందని వెల్లడించింది. 2023లో ఇండియాలో మళ్లీ కలరా కేసులు వెలుగుచూశాయని తెలిపింది. డెంగీ, కలరా విజృంభిస్తున్నాయనీ... జాగ్రత్తగా ఉండాలని... మౌలిక సదుపాయాలు మెరుగుపరుచుకోవాలని సూచించింది.

దక్షిణాసియాలో డెంగీనే ప్రమాదకరం

భారత్ వంటి దేశాల్లో డెంగీ వల్ల ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. దక్షిణాసియా రీజియన్‌లో డెంగీనే ప్రధానమైనదిగా పరిణమించిందని పేర్కొంది. బంగ్లాదేశ్‌లో 2002తో పోలిస్తే 2023లో డెంగీ కేసులు 4.8 రెట్లు పెరిగాయి. అక్కడ మరణాలు 9.3 రెట్లు పెరిగాయి. అలాగే థాయ్‌లాండ్‌లో కేసులు 2.3 రెట్లు పెరగ్గా మరణాలు 2.5 రెట్లు పెరిగాయి. వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, ఎండలు... తదితర కారణాల వల్ల కూడా డెంగీ ముప్పు పెరుగుతోంది. ఎప్పుడు వర్షాలు కురుస్తాయో.. ఎప్పుడు తీవ్రమైన ఎండలు ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంటోంది. దీనివల్ల అందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా సరిగ్గా చేసే పరిస్థితి ఉండటంలేదు. ఆకస్మిక ఉష్ణోగ్రతల వల్ల కూడా దోమల సంతతి వృద్ధి చెందుతోంది. మరోవైపు పట్టణీకరణ పెరగడంతో డెంగీ వ్యాప్తి చెందుతోంది. నగరీకరణ వల్ల జనం గుంపులుగా ఉండటం... నీటి నిల్వ, మౌలిక సదుపాయాలు లేకపోవడం, నిర్మాణాలు ఎక్కువకావడం...తదితర కారణాలతో డెంగీ త్వరగా పాకుతోంది. డెంగీ ఒకసారి మొదలైతే అది సులువుగా వ్యాపిస్తుంది.

27 దేశాల్లో ఇన్ఫెక్షన్ వ్యాధులు

సోమాలియా, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ సహా 27 దేశాల్లో ఇన్ఫెక్షన్ వ్యాధులు వస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో మయన్మార్, సూడాన్ సహా 10 దేశాలు ప్రజారోగ్యంలో సమస్యాత్మకంగా ఉన్నాయి. సామాజిక సమస్యల కారణంగా ప్రజారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న దేశాలు కెమరూన్, మయన్మార్, సిరియా. కాగా, ఇన్‌ఫ్లూయెంజా కేసులు బంగ్లాదేశ్‌లో 2023 ఆగస్టులో, థాయ్‌లాండ్‌లో అక్టోబర్‌లో వెలుగుచూశాయి. నిఫా వైరస్ కేసులు బంగ్లాదేశ్, కేరళలో 2023లో నమోదయ్యాయి. 2023లో కేరళలో ఆరు నిఫా కేసులు నమోదు కాగా రెండు మరణాలు సంభవించాయి. థాయ్‌లాండ్, ఇండోనేసియాల్లో మంకీఫాక్స్ కేసులు నమోదయ్యాయి.

ఇంకా ఆ సంస్థపైనే ఆధారం..

ఏదైనా ప్రజారోగ్య సమస్య తలెత్తితే వాటిని ముందస్తుగా గుర్తించడంలో భారత్ సహా అభివృద్ధి చెందుతున్న దేశాలు వెనుకబడుతున్నాయి. ఆయా దేశాల్లోని ప్రజారోగ్య సంస్థలు ప్రమాదాన్ని పసిగట్టడం లేదు. 2004–08 మధ్య ఇండియా వంటి దేశాల్లో ప్రజారోగ్య సమస్యలు తలెత్తితే వాటిలో 93 శాతం మొదటగా గుర్తించి అలర్ట్ చేసింది ప్రపంచ ఆరోగ్య సంస్థే. అలాగే 2009–13 మధ్య 63 శాతం, 2014–18 మధ్య కాలంలో 84 శాతం, 2019–23 వరకు 91 శాతం ప్రపంచ ఆరోగ్య సంస్థే వాటిని గుర్తించి అప్రమత్తం చేసింది. అమెరికా వంటి దేశాల్లో సగటున 60–70 శాతం వరకు సంఘటనలను ఆయా స్థానిక ప్రభుత్వాలే గుర్తించి అలర్ట్ అవుతున్నాయి. కానీ మనలాంటి దేశాల్లో అటువంటి వ్యవస్థ నేటికీ లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది.

ఇద్దరిలో ఒకరికి డెంగీ రిస్క్

ప్రపంచంలో 2022తో పోలిస్తే 2023లో కోవిడ్ మరణాలు 90 శాతం తగ్గాయి. అయితే ఇప్పుడు భారత్‌లో డెంగీ వ్యాప్తి పెరిగింది. దేశంలో నిర్మాణాలు జరుగుతున్న 6 శాతం ప్రాంతాల్లో డెంగీ వ్యాప్తి జరుగుతోందని గుర్తించారు. వలసల వల్ల కూడా డెంగీ వ్యాప్తి విస్తరిస్తోంది. వాతావరణ మార్పుల కారణంగా భవిష్యత్తులోనూ ప్రజారోగ్య సమస్యలు పెరుగుతాయని, ప్రజారోగ్య వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. డెంగీకి వ్యాక్సిన్ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం పరిశోధన దశలో ఉంది.

- డాక్టర్ కిరణ్ మాదల, గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాద్

రవీంద్రనాయకా? అమర్‌సింగా?

ప్రజారోగ్య సంచాలకుడి పదవి ఎవరికి దక్కేను

వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగ వర్గాల్లో ఉత్కంఠ

సీనియారిటీ జాబితా విడుదల.. ఐదుగురి పేర్లతో ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య సంచాలకుడి (డీహెచ్)గా ఎవరిని నియమిస్తారన్న అంశంపై చర్చ మొదలైంది. సీనియారిటీ జాబితాలో ఐదుగురు ఉండటంతో మొదటి రెండు స్థానాల్లో ఉన్న డాక్టర్ రవీంద్రనాయక్, డాక్టర్ అమర్‌సింగ్‌లలో ఎవరిని నియమిస్తారోనన్న ఉత్కంఠ ఉద్యోగుల్లో నెలకొంది. ఇటీవల ప్రభుత్వం డీహెచ్ పోస్టుతో పాటు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్, ఔషధ నియంత్రణ సంచాలకుడి రెగ్యులర్ పోస్టులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. డీహెచ్ పోస్టుకు అర్హత ఉన్న అడిషనల్ డైరెక్టర్ల సీనియారిటీ జాబితాను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. దీంతో ఐదుగురు పేర్లతో ఉన్న ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలో రవీంద్రనాయక్, అమర్‌సింగ్ నాయక్, మోజీరాం రాథోడ్, డాక్టర్ కె.పద్మజ, డాక్టర్ ఆర్.పుష్ప ఉన్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే వెంటనే తెలపాలని డీహెచ్ కార్యాలయం పేర్కొంది. కాగా, ప్రస్తుతం రవీంద్రనాయక్ ఇన్‌చార్జి డీహెచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే సీనియర్ అయిన ఆయనను నియమించారు. అయితే ఇటీవలి సాధారణ బదిలీల్లో డీహెచ్ పరిధిలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రధానంగా స్టాఫ్‌నర్సుల పోస్టుల బదిలీల్లో అవకతవకలు జరిగాయని, సీనియారిటీ జాబితాను కూడా తప్పులతడకగా మార్చారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో స్టాఫ్‌నర్సులు రాత్రి వరకు పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసనలు చేసిన విషయం విదితమే. ఈ విషయంలో పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారాయని నిఘా వర్గాలు కూడా సర్కారుకు నివేదికలు ఇచ్చాయి. ఒకవైపు ఇంటెలిజెన్స్, మరోవైపు విజిలెన్స్ నివేదికలు ఇచ్చినప్పటికీ ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రవీంద్రనాయక్ డీహెచ్‌గా ఉన్న సమయంలో ఇవన్నీ జరగడంతో కేవలం సీనియర్ అన్నపేరుతో కీలక పోస్టును ఆయనకే ఇస్తారా లేదా అన్న చర్చ జరుగుతోంది. ఈ ఆరోపణలకు బాధ్యులను చేస్తారా? మెమోలు ఇస్తారా? ఇస్తే ఆయనకు డీహెచ్ పోస్టు దక్కుతుందా లేదా అన్న చర్చ వైద్య, ఆరోగ్యశాఖలో జరుగుతోంది. ఒకవేళ ఏదైనా కారణంతో రవీంద్రనాయక్‌ను పక్కనపెడితే, ఆయన తర్వాత సీనియర్ అయిన అమర్‌సింగ్‌కు ఇస్తారా అన్న ప్రచారం జోరుగా జరుగుతోంది.

తెలంగాణలో 67 వేల మంది 'లక్‌పతి దీదీ'లు

- ఆంధ్రప్రదేశ్‌లో 1.22 లక్షల మంది
- వర్చువల్‌గా 11 లక్షల మందికి ధ్రువపత్రాలు అందజేయనున్న ప్రధాని

సాక్షి, న్యూఢిల్లీ: మహిళలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన 'లక్‌పతి దీదీ' పథకంలో భాగంగా తెలంగాణలో 67,500 మంది, ఏపీలో కొత్తగా 1,22,160 మంది లక్షాధికారులయ్యారని కేంద్రం తెలిపింది. వీరికి ఆగస్టు 25న ప్రధాని మోదీ వర్చువల్‌గా ధ్రువపత్రాలు అందజేస్తారని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి శివరాజ్‌సింగ్ గురువారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ, ఆగస్టు 25న మహారాష్ట్ర జల్‌గావ్‌లో లక్‌పతి దీదీలతో ప్రధాని మోదీ మాట్లాడతారని తెలిపారు. వంద రోజుల్లో 11 లక్షల మంది లక్‌పతి దీదీలు లక్ష్యంగా పెట్టుకోగా మొత్తం 15 లక్షల మంది కొత్తగా లక్షాధికారులు అయ్యారని అన్నారు. వారిలో 11 లక్షల మందికి వర్చువల్‌గా ప్రధాని మోదీ ధ్రువపత్రాలు అందజేస్తారని తెలిపారు. అలాగే 4.3 లక్షల స్వయం సహాయ సంఘాలకు రూ.2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్, రూ.5 వేల కోట్ల బ్యాంకు లోన్‌లు కూడా విడుదల చేస్తారని చౌహాన్ వెల్లడించారు.

కేంద్ర పథకాలతో ప్రయోజనం పొందేలా చూడండి

అధికారులతో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంలోని పలు శాఖలు, కేంద్ర ప్రాయోజితపథకాల నుంచి వీలైనంత అధిక ప్రయోజనం పొందేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సూచించారు. గురువారం రాజ్‌భవన్‌లో మున్సిపల్, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ గ్రామీణాభి వృద్ధి, వైద్య ఆరోగ్య, గిరిజన సంక్షేమం, పర్యాటక, సాంస్కృతిక, ఆర్థికప్రణాళిక, తదితర శాఖల అధికారులతో గవర్నర్ చర్చించారు. ప్రతీ శాఖకు సంబంధించిన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తాము నిర్వహిస్తున్న కార్యక్రమాలు పురోగతిని వివరించారు.

2.85 హెక్టార్ల అటవీ భూమి మళ్లింపు

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం డివిజన్‌లోని రామవరం రిజర్వ్ ఫారెస్ట్‌లోని 2.85 హెక్టార్లలోని అటవీ భూమిని మళ్లిస్తూ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతంలో పద్మావతిఖని వద్ద సబ్‌మెర్సిబుల్, శాండ్ స్టోవింగ్ ప్లాంట్ ఏర్పాటుకు అటవీయేతర అవసరాల నిమిత్తం భూమిని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు అప్పగించాలనే ప్రతిపాదనకు కేంద్రం నుంచి కూడా ఆమోదం లభించింది. తెలంగాణ అటవీ (సంరక్షణ) చట్టం, 1980 'వన (సంరక్షణ, సంవర్ధన) అధినియం'కు అనుగుణంగా కేంద్రం నుంచి ముందస్తు అనుమతి తీసుకున్నారు. గురువారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీ చేశారు. అటవీ చట్టాలు, కోర్టు ఉత్తర్వులు, ఇతర నియమ నిబంధనలకు లోబడి అటవీ భూమిని వినియోగించాలని స్పష్టం చేశారు. మార్గదర్శకాలకు భిన్నంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు.

కమ్యూనిటీ మీడియేటర్లకు శిక్షణ

ప్రారంభించిన హైకోర్టు సీజే

సాక్షి, హైదరాబాద్ : కమ్యూనిటీ మీడియేటర్ వలంటీర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ, నిజామాబాద్ జిల్లా న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో మూడురోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సీజేతోపాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర న్యాయసేవల ప్రాధికార సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు.

ఆ నాలుగు మెడికల్ కాలేజీలకు అనుమతివ్వండి

కేంద్ర ఆరోగ్యశాఖకు రాష్ట్ర అధికారుల విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: కుత్బుల్లాపూర్, మహేశ్వరం, మెదక్, యాదాద్రి మెడికల్ కాలేజీలకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, నేషనల్ మెడికల్ కమిషన్ అధికారులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. డీఎంఈ వాణి, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్, ఇతర ఉన్నతాధికారులు బుధవారం ఢిల్లీకి వెళ్లి అక్కడి అధికారులతో భేటీ అయ్యారు. గతంలో ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను సవరించుకున్నామని, అనుమతి ఇవ్వాలని కోరారు. ఇంకేమైనా లోపాలుంటే సరిదిద్దుకుంటామని, అవసరమైన నిధులను కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉందని చెప్పారు.

ప్రజాభవన్‌కు చేరిన 'డిస్‌లొకేషన్' లొల్లి

ఉదయం నుంచి ప్రజాభవన్, సచివాలయం చుట్టూ టీచర్ల చక్కర్లు ● ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డితో భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని ఉపాధ్యాయుల డిస్ లొకేషన్ గోల ప్రజాభవన్‌కు చేరింది. సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి బుధవారం సొసైటీ పరిధిలోని వివిధ కేటగిరీలకు చెందిన 177 మంది టీచర్లకు నూతన కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జాబితాలో కోర్టు కేసులు, ఇతరత్రా అంశాలకు సంబంధించిన వారంతా కొత్త పోస్టింగ్‌లలో చేరేదిలేదని, స్థానికత ఆధారంగా కేటాయింపులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రజాభవన్‌కు చేరుకున్నారు. అక్కడ నిరసన కార్యక్రమాన్ని చేపడుతుండగా.. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి జోక్యం చేసుకుని వారితో చర్చించారు. నిరసన వీడాలని సూచిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. అనంతరం సాయంత్రంలోగా స్పష్టత వస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ప్రజాభవన్ నుంచి ఆయా ఉపాధ్యాయులంతా సచివాలయం వద్దకు చేరుకుని పడిగాపులు కాశారు. కానీ అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. శుక్రవారం ప్రజాభవన్‌లో వినతుల స్వీకరణ నిర్వహించనున్న నేపథ్యంలో ఉదయం అక్కడికి చేరుకుని వ్యక్తిగతంగా వినతులు ఇచ్చేందుకు ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు.

ఎక్కడివారక్కడే!

ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో నూతన కేటాయింపులపై ముఖ్యమంత్రి కార్యాలయం టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ అధికారులను ఆరా తీసినట్లు తెలిసింది. అక్కడి పరిస్థితిని తెలుసుకున్న సీఎంఓ అధికారులు నూతన కేటాయింపుల అంశాన్ని తాత్కాలికంగా నిలిపివేసేలా యోచిస్తున్నట్లు సమాచారం. ముందుగా జీవో 317 వినతుల సమస్య పూర్తయ్యేవరకు వాటిని నిలిపివేయాలని, ఆ తర్వాత డిస్‌లొకేషన్ అంశాన్ని పరిశీలించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

కేంద్ర పరిరక్షణ చట్టం అమలులోకి తేవాలి

వైద్యుల ధర్నాలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం

సాక్షి, హైదరాబాద్: దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన అమానవీయమైందని, జూనియర్ వైద్యులు కోరుతున్నట్లు వారి భద్రతకు కేంద్ర పరిరక్షణ చట్టాన్ని వెంటనే అమలులోకి తేవాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. పీపుల్స్ ప్లాజా వద్ద గురువారం ధర్నా చేస్తున్న వైద్యులకు ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సుమోటోగా స్పందించి కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో తాను ఒక సామాజిక బాధ్యత కలిగిన పౌరుడిగా మాత్రమే వచ్చి సంఘీభావం తెలుపుతున్నానని చెప్పారు.

అలయ్ బలయ్‌కు రండి

ఉపరాష్ట్రపతికి దత్తాత్రేయ ఆహ్వానం



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో అక్టోబర్ 13వ తేదీన జరగనున్న అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరుకావాలని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. ఢిల్లీలో గురువారం ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను కలిసిన దత్తాత్రేయ అలయ్ బలయ్ కార్యక్రమం విశిష్టతను వివరించారు.


అచేతన స్థితిలో రోడ్డుపై యువకుడు



బద్దిపోచమ్మ గుడి ఎదుట రోడ్డుపై వదిలివెళ్లడంతో బిక్కుబిక్కుమంటూ చూస్తున్న వ్యక్తి


వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని బద్దిపోచమ్మ ఆలయ ప్రాంతంలో ఓ యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి వదిలివెళ్లారు. 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు అచేతన స్థితిలో ఉన్నాడు. అతని ముఖంపై ఎరుపెక్కిన కురుపులు ఉండటం, అనారోగ్యంగా కనిపిస్తుండటంతో దగ్గరికి వెళ్లి వివరాలు సేకరించేందుకు ఎవరూ సాహసించడం లేదు. దీంతో ఆ యువకుడు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు. కాలనీ వాసులు పోలీసులకు, ఆలయ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇటీవల అనారోగ్యానికి గురైన వారిని ఆలయ ప్రాంతంలో వదిలివెళ్లడం వేములవాడలో పరిపాటిగా మారిందని ఆలయ సిబ్బంది చెబుతున్నారు. ఈనెల 18న వొడ్డేటి లక్ష్మి అనే వృద్ధురాలిని కుటుంబ సభ్యులు గుడి ప్రాంతంలో వదిలివెళ్లిన సంఘటన మరవకముందే మరో యువకుడిని వదిలివెళ్లడం చర్చనీయాంశమైంది.

భూంకాల్ పోరాటం



1910లో పోరాటానికి నాయకత్వం వహించిన గుండాధూర్ విగ్రహం

- రిజర్వ్ ఫారెస్ట్‌చట్టంతో బస్తర్ ఆదివాసీలకు ఇక్కట్లు
- పాలన వ్యవహారాల్లో బ్రిటీష్ జోక్యం
- అందుకు వ్యతిరేకంగా ఆదివాసీల పోరాటం
- బ్రిటీష్ అధికారులను గడగడలాడించిన గుండాధూర్
- మూడు రోజుల్లో సగం బస్తర్ రాజ్యం హస్తగతం
- కుట్రతో పోరాటాన్ని అణచివేసిన ఆంగ్లేయులు


బ్రిటీష్ సైన్యంపై పోరాడుతున్న గుండాధూర్, ఆయన అనుచరులు (ఊహాచిత్రం)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాజ్యసంక్రమణ సిద్ధాంతం, సైన్యసహకార పద్ధతి వంటి కుట్రపూరిత విధానాలతో బస్తర్ రాజ్యాన్ని కూడా ప్రిన్సిలీ స్టేట్‌గా బ్రిటీషర్లు మార్చారు. రాజును నామమాత్రం చేస్తూ పరోక్షంగా పాలన సాగించారు. ఈ క్రమంలో 1878లో బ్రిటీష్ ప్రభుత్వం రిజర్వ్ ఫారెస్ట్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో బస్తర్ అడవుల్లో 66 శాతం భూభాగంపై ఆదివాసీలు హక్కులు కోల్పోయారు. రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించిన ప్రదేశాల్లో కర్ర పుల్ల తీసుకెళ్లాలన్నా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. మరోవైపు బ్రిటీషర్ల కాలంలో బస్తర్ పాలకుడిగా ఉన్న భైరామ్‌దేవ్ కుష్ఠువ్యాధి బారిన పడ్డారు. దీంతో ఆయన్ను పదవి నుంచి దూరంగా ఉంచి అతని కొడుకైన రుద్ర ప్రతాప్‌దేవ్‌ని 1891లో రాజుగా బ్రిటీష్ సర్కార్ గుర్తించింది. అయితే మేజర్ అయ్యేంత వరకు ఆయనకు పట్టాభిషేకం చేసే అవకాశం లేదు. అలా రాజుతోపాటు రాజకుటుంబంలో ప్రధాన పదవుల్లో ఉన్నవారు తమ అధికారాలు కోల్పోయారు. ఇలా బ్రిటీషర్ల ఆధిపత్య ధోరణి కారణంగా ఇటు రాజవంశానికే కాక అటు ఆదివాసీలకు ఇక్కట్లు మొదలయ్యాయి.

తిరుగుబాటుకు పిలుపు

1909 అక్టోబర్‌లో జరిగిన దసరా వేడుకల్లో రిజర్వ్ ఫారెస్ట్ చట్టం, దాన్ని అమలు చేస్తున్న బ్రిటీష్ ప్రభుత్వంపై పోరాటం చేయాలంటూ బస్తర్ రాజ్య మాజీ దివాన్ లాల్ కాళీంద్రసింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానికంగా పేరున్న ఆదివాసీ నేత గుండాధుర్ నాయకత్వ బాధ్యతలు తీసుకున్నారు. ఫారెస్ట్ చట్టం కారణంగా తాము పడుతున్న బాధలను ఊరూరా ప్రచారం చేస్తూ తిరుగుబాటుకు ప్రజలను సిద్ధం చేశారు. ప్రతీ ఇంటి నుంచి ఒకరు పోరాటానికి రావాలని, ఆయుధాలు పట్టలేనివారు రాళ్లు, కర్రలు, కారం పొడి అయినా అందించాలని స్ఫూర్తి నింపారు. 1909 అక్టోబర్ నుంచి 1910 ఫిబ్రవరి మొదటివారం నాటికి బస్తర్‌లో అటవీ గ్రామాలన్నీ పోరాటానికి సంసిద్ధమయ్యాయి. ముఖ్యంగా బస్తర్‌లో ఉత్తర ప్రాంతమైన కాంకేర్ నిప్పు కణికలా మారింది.

మూడు రోజుల్లోనే....

1910 ఫిబ్రవరి 4న కుకనార్‌లో గుండాధూర్ నాయకత్వంలో ఆదివాసీలు బ్రిటీష్ అధికార కార్యాలయాలు, గోదాములు, మార్కెట్, ప్రభుత్వ అధికారుల ఇళ్లపై మెరుపుదాడులు జరిపారు. కేవలం మూడురోజుల్లోనే బస్తర్‌లోని 84 పరగణాల్లో 46 పరగణాలు తిరుగుబాటుదారుల అధీనంలోకి వచ్చాయి. కాంకేర్ ప్రాంతంలో బ్రిటీష్ అధికారులు, వ్యాపారులు ఇళ్లు వదిలి పారిపోయారు. దండకారణ్యంలో భూకంపం లాంటి తిరుగుబాటు వచ్చిందని తక్షణ సాయం అవసరమంటూ బ్రిటీష్ ప్రభుత్వానికి అప్పటి మహారాజు రుద్ర ప్రతాప్‌దేవ్ టెలిగ్రామ్ పంపారు. దీంతో ఈ పోరాటానికి భూంకాల్ పోరాటమని పేరు వచ్చింది.

గుండాధూర్ చిక్కలేదు

భూంకాల్ విప్లవాన్ని అణచివేసే పనిని కెప్టెన్ గేర్‌కు బ్రిటీష్ సర్కార్ అప్పగించింది. పదిరోజులు బ్రిటీష్, బస్తర్ స్టేట్ సైన్యాలు అడవుల్లో గాలించినా విప్లవకారుల్లో కేవలం 15 మందినే పట్టుకోగలిగారు. మరోవైపు తనను పట్టుకునేందుకు వచ్చిన కెప్టెన్ గేర్‌పైనే నేరుగా దాడి చేసి బ్రిటీషర్ల వెన్నులో గుండాధూర్ వణుకు పుట్టించాడు. తృటిలో కెప్టెన్ గేర్ ఆ దాడి నుంచి తప్పించుకొని ప్రాణాలు కాపాడుకున్నాడు. దీంతో బెంగాల్, జైపూర్ రాజ్యాల నుంచి అదనపు బలగాలను బస్తర్‌కు రప్పించారు. ఆ తర్వాత గుంధాదూర్‌కు నమ్మకస్తుడైన సోనుమాంఝీ ద్వారా కోవర్టు ఆపరేషన్ జరిపి 1910 మార్చి 25 రాత్రి గుండాధూర్ ఆయన సహచరులు బస చేసిన అటవీ ప్రాంతంపై బ్రిటీష్ సైన్యం దాడి జరిపింది. ఇందులో 21 మంది చనిపోగా మరో ఏడుగురు పట్టుబడ్డారు. కెప్టెన్ గేర్ ఎంతగా ప్రయత్నించినా ఆదివాసీ పోరాట యోధుడు గుండాధూర్ మాత్రం చిక్కలేదు. మెరుపు తిరుగుబాటుతో బ్రిటీషర్లకు చుక్కలు చూపించిన బస్తర్ ఆదివాసీలు ఆ తర్వాత తమ హక్కుల కోసం స్వతంత్ర భారత దేశంలో ఏర్పడిన ప్రభుత్వంతోనూ ఘర్షణ పడ్డారు. ఈ పోరులో తాము దైవంగా భావించే మహారాజునే కోల్పోయారు.

జయక్‌వాడీ ప్రాజెక్టు ఏ నదిపై ఉంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

భారతదేశం - బహుళార్థ సాధక ప్రాజెక్టులు

'ఆనకట్టలే ఆధునిక దేవాలయాలు' అని భారత దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అన్నమాట నాటికి, నేటికీ అక్షర సత్యం. మన దేశ ప్రగతిని సరి కొత్త మలుపు తిప్పినవి బహుళార్థ సాధక ప్రాజెక్టులే అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి దేశంలో మొదటి పంచవర్ష ప్రణాళిక(1951) నుంచి వివిధ ప్రాంతాల్లో పలు బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మించారు.

- ఒకటి కంటే ఎక్కువ సదుపాయాల కల్పనకు ఉద్దేశించి నిర్మించిన ప్రాజెక్టునే బహుళార్థ సాధక ప్రాజెక్టు అంటారు.
- భారతదేశంలో వ్యవసాయ నీటిపారుదల, గృహ, పరిశ్రమ అవసరాలకు నీటి సరఫరా, విద్యుదుత్పాదన, వరద నివారణ, స్థానిక రవాణా, భూ సంరక్షణ, మత్స్య పరిశ్రమ అభివృద్ధి, విహారయాత్ర, కృత్రిమ వనాల పెంపకం మొదలైన అనేక ప్రయోజనాల కోసం ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు.
- బెంగాల్‌లో 1948లో వరదలను, వాటి అనుబంధ సమస్యలను నివారించడానికి దామోదర్ నదీ, దాని ఉపనదులపైన ప్రాజెక్టులు కట్టడం కోసం మొట్టమొదటి నదీలోయ ప్రాజెక్టు సంస్థను ఏర్పాటు చేశారు.
- ఈ సంస్థను అమెరికాలోని టెన్నిస్ వేలీ అథారిటీ (టీవీఏ) నమూనా ఆధారంగా ఏర్పాటు చేశారు.
- 1948 ఫిబ్రవరి 18న భారత పార్లమెంట్ ఈ సంస్థను ఆమోదించడంతో ఇది దామోదర్ లోయ కార్పొరేషన్ (డీవీసీ)గా వాస్తవ రూపం దాల్చింది.
- డీవీసీ ఏర్పడక ముందు వరదలతో బెంగాల్ దుఃఖదాయినులుగా దామోదర్, దాని ఉపనదులున్నాయి. తర్వాత వాటిపై ప్రాజెక్టులు నిర్మించడంతో బెంగాల్ వరదాయినులుగా ఉన్నాయి.
- భారతదేశంలో నీటి పారుదల ప్రాజెక్టులను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి...
  1) భారీ నీటిపారుదల పథకాలు
  2) మధ్య తరహా నీటి పారుదల పథకాలు
  3) చిన్న తరహా నీటి పారుదల పథకాలు
- ప్రాజెక్టు కల్పించే నీటి పారుదల విస్తీర్ణాన్ని బట్టి ప్రాజెక్టులను విభజించారు.

1. భారీ నీటిపారుదల పథకాలు
- 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ ఆయకట్టు ప్రాంతం ఉన్న పథకాలను భారీ నీటిపారుదల పథకాలు అంటారు.
- వీటిని ప్రధానంగా నదులపై నిర్మిస్తారు.

2. మధ్య తరహా నీటిపారుదల పథకాలు
- 2,000 నుంచి 10,000 హెక్టార్ల వరకు ఆయకట్టు ప్రాంతం ఉన్న పథకాలు.
- వీటిని నదులపై, ఉపనదులపై నిర్మిస్తారు.

3. చిన్న తరహా నీటిపారుదల పథకాలు
- 2,000 హెక్టార్ల కంటే తక్కువ ఆయకట్టు గల పథకాలు.
- భూగర్భ జల పథకాలు, ఉపరితల జల పథకాలు ఈ తరహా పథకాల్లోకి వస్తాయి.
- భూగర్భ జల పథకాలు: సాధారణ బావులు, గొట్టపు బావులు.
- **ఉపరితల జల పథకాలు:** చెరువులు, జలాశయాల నుంచి నీటిని మళ్లించే పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు.

ఆయకట్టు ప్రాంత అభివృద్ధి పథకం

- నీటిపారుదల ఆవశ్యకత, ఉత్పత్తి, వినియోగాల మధ్య అంతరాన్ని పూడ్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 1974-75లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.
- భారతదేశంలో 1990లో జాతీయ జల మండలిని ఏర్పాటు చేశారు.
- 2008 నవంబర్ 4న గంగానదిని 'జాతీయ నది'గా ప్రకటించారు.

దేశంలో కొన్ని ప్రధాన బహుళార్థ సాధక ప్రాజెక్టులు

1. భాక్రానంగల్ ప్రాజెక్టు
- దేశంలో నిర్మించిన మొట్టమొదటి ప్రాజెక్టు, అన్నిటికంటే పెద్దది.
- దీన్ని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1962 అక్టోబర్ 22న జాతికి అంకితం చేశారు.
- ఈ ప్రాజెక్టు పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌ల ఉమ్మడి పథకం. వీటితోపాటు హిమాచల్ ప్రదేశ్ కూడా లబ్ధి పొందుతోంది.
- సట్లెజ్ నదిపై హిమాచల్‌ప్రదేశ్‌లో భాక్రా అనే ప్రాంతంలో భాక్రా ఆనకట్ట (226 మీటర్లు), పంజాబ్‌లోని నంగల్ ప్రాంతం వద్ద నంగల్ ఆనకట్ట(29 మీటర్లు)ను నిర్మించారు.
- ఈ ప్రాజెక్టు 1204 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తుంది.

2. హీరాకుడ్ ప్రాజెక్టు
- ఈ ప్రాజెక్టును ఒడిశాలో మహానదిపై నిర్మించారు.
- ఈ ప్రాజెక్టు 4801 మీటర్ల పొడవుతో ప్రపంచంలోనే అతి పొడవైన ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది.
- దీన్ని విద్యుదుత్పాదన, నీటిపారుదల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేశారు.

3. నాగార్జున సాగర్ ప్రాజెక్టు
- తెలంగాణలోని నల్గొండ జిల్లాలో నందికొండ గ్రామ సమీపంలో కృష్ణానదిపై నిర్మించారు.
- ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల పథకం.
- దీనికి భారత తొలి ప్రధాని నెహ్రూ 1955 డిసెంబర్ 10న శంకుస్థాపన చేశారు.
- ఈ ప్రాజెక్టు 1450 మీటర్ల పొడవుతో, రాతి కట్టడపు ఆనకట్టల్లో ప్రపంచంలోనే ప్రథమ స్థానం పొందింది.
- దీని కుడి కాలువను జవహర్ కాలువ అంటారు. ఈ కాలువ 204 కి.మీ. పొడవు ఉంది. ఇది గుంటూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందిస్తుంది.
- దీని ఎడమ కాలువను లాల్ బహదూర్ కాలువ అంటారు.ఈ కాలువ 179కి.మీ. పొడవుతో నల్గొండ, ఖమ్మం జిల్లాలకు నీటిని సరఫరా చేస్తోంది.
- ఈ ప్రాజెక్టు పూర్తిగా భారతీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంది.

4. దామోదర్ నదీలోయ ప్రాజెక్టు
- ఈ ప్రాజెక్టు పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం బెంగాల్ ప్రాంతాన్ని.. దామోదర్ నది, దాని ఉపనదుల వల్ల వచ్చే వరదల నుంచి కాపాడడం.
- ఈ పథకంలో భాగంగా తిలయ్యా, మైథాన్ ఆనకట్టలు - బరాకర్ నదిపై, పంచట్‌హిల్ ఆనకట్ట - దామోదర్ నదిపై, కోనార్ ఆనకట్ట- కోనార్ నదిపై నిర్మించారు.

5. బియాస్ పథకం
- ఇది పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- ఇది బియాస్ జలాలను సట్లెజ్ జలాలతో కలుపుతుంది.
- బియాస్ నదిపై 'పోంగ్' వద్ద ఈ ఆనకట్టను నిర్మించారు.

6. కోసి ప్రాజెక్టు
- దీన్ని బీహార్ - నేపాల్ సరిహద్దులోని హనుమాన్ నగర్ సమీపంలో 'కోసి' నదిపై నిర్మించారు.
- ఇది అంతర్జాతీయ పథకం

7. గండక్ పథకం
- దీన్ని బీహార్‌లోని వాల్మీకినగర్ వద్ద గండక్ నదిపై నిర్మించారు.
- ఇది బీహార్,ఉత్తరప్రదేశ్,నేపాల్‌ల ఉమ్మడి పథకం.

8. చంబల్ పథకం
- ఇది మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- దీన్ని చంబల్ నదిపై నిర్మించారు.
- ఈ పథకంలో మూడు ఆనకట్టలున్నాయి. అవి ...
  1) గాంధీసాగర్ ఆనకట్ట
  2) రాణా ప్రతాప్‌సాగర్ ఆనకట్ట
  3) జవహర్ సాగర్ ఆనకట్ట

9. తెహ్రీడ్యామ్ ప్రాజెక్టు
- ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్, ఢిల్లీ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- దీన్ని 'భాగీరథి' నదిపై హిమాలయ ప్రాంతం(ఉత్తరాఖండ్)లోని భూకంపాలు సంభవించే ప్రదేశంలో నిర్మించడం వల్ల ఇది వివాదాస్పదమైంది.
- తెహ్రీడ్యామ్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టిన వ్యక్తి-సుందర్‌లాల్ బహుగుణ.

10. ఇందిరాసాగర్ ప్రాజెక్టు
- ఇది నర్మద నదిపై ఉంది.
- దీన్ని గుజరాత్‌లోని పూర్ణసా ప్రాంతంలో నిమొరి జిల్లాలో నిర్మించారు.
- ఇది మధ్యప్రదేశ్, గుజరాత్‌ల ఉమ్మడి ప్రాజెక్టు

11. సర్దార్ సరోవర్ ప్రాజెక్టు
- దీన్ని నర్మద నదిపై, గుజరాత్‌లోని బరూచ్ జిల్లాలో బడగావ్ అనే ప్రాంతంలో నిర్మించారు.
- ఇది రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల ఉమ్మడి ప్రాజెక్టు.
- ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ మేథాపాట్కర్ చేపట్టిన ఉద్యమమే- నర్మదా బచావో.

మరికొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు

	ప్రాజెక్టు పేరు	నది	రాష్ట్రాలు	ఇతర అంశాలు
1.	బాగ్లీహార్ ప్రాజెక్టు	చీనాబ్	జమ్మూ - కాశ్మీర్	భారత్, పాకిస్థాన్‌ల మధ్య -వివాదాస్పదమైంది
2.	ధూల్‌హస్తి	చీనాబ్	జమ్మూ - కాశ్మీర్	
3.	నాథ్‌పాజాక్రి	సట్లెజ్	హిమాచల్ ప్రదేశ్	-
4.	రిహాండ్	రిహాండ్	ఉత్తరప్రదేశ్	-
5.	రామ్‌గంగా	రామ్‌గంగా	ఉత్తరప్రదేశ్	ఢిల్లీ నగరానికి 200 క్యూసెక్కుల నీటి సరఫరా
6.	సువర్ణరేఖ	సువర్ణరేఖ	బీహార్	-
7.	ఫరక్కా	హుగ్లీ	పశ్చిమ బెంగాల్	-
8.	మయూరాక్షి	మురళీ	పశ్చిమ బెంగాల్	-
9.	జయక్‌వాడీ	గోదావరి	మహారాష్ట్ర	-
10.	బాబ్లీ	గోదావరి	మహారాష్ట్ర	-
11.	ఆల్మట్టి	కృష్ణా	కర్ణాటక	-
12.	ఇడుక్కి	పెరియార్	కేరళ	-
13.	శబరిగిరి	పంప	కేరళ	-
14.	మెట్టూరు	పైకారా	తమిళనాడు	పైకారా నది కావేరి నదికి ఉపనది
15.	ఉకాయ్	తపతి	గుజరాత్	-
16.	కాక్రపార	తపతి	గుజరాత్	-
17.	శ్రీరాంసాగర్	గోదావరి	తెలంగాణ	దీని కాలువ కాకతీయ కాలువ. దీన్ని నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు వద్ద నిర్మించారు.
18.	సుంకేసుల	తుంగభద్ర	ఆంధ్రప్రదేశ్	కర్నూలు జిల్లాలో ఉంది
19.	పులిచింతల	కృష్ణానది	ఆంధ్రప్రదేశ్	గుంటూరు జిల్లాలో ఉంది. దీని పేరు కెఎల్.రావు సాగర్
20.	జంఝావతి	జంఝావతి నది	ఆంధ్రప్రదేశ్	విజయనగరం
21.	ఎల్లంపల్లి (శ్రీ పాదసాగర్)	గోదావరి	తెలంగాణ	కరీంనగర్

మాదిరి ప్రశ్నలు

1. 'మెట్టూరు జల విద్యుత్ కేంద్రం' ఏ నదిపై ఉంది?
   1) తుంగభద్ర 2) మహానది
   3) కావేరి 4) గోదావరి
2. కిందివాటిలో 'దామోదర్ వ్యాలీ కార్పొరేషన్'లో భాగాలైన ఆనకట్టలు ఏవి?
   1) తిలైయా 2) మైథాన్
   3) పంచట్ 4) పైవన్నీ
3. భారతదేశ జాతీయ నది?
   1) గోదావరి 2) గంగా
   3) కృష్ణా 4) నర్మద
4. ఆల్మట్టి ప్రాజెక్టు ఏ నదిపై ఉంది?
   1) గోదావరి 2) కృష్ణా
   3) పెన్‌గంగా 4) పూర్ణ
5. దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు ఒక?
   1) జలవిద్యుత్ 2) నీటిపారుదల
   3) బహుళార్థ సాధక 4) ఏదీకాదు
6. కింది వాటిలో ఏ జల విద్యుత్ కేంద్రం ఉత్తరప్రదేశ్‌లో ఉంది?
   1) మయూరాక్షి 2) రిహాండ్
   3) కంగ్సబతి 4) హీరాకుడ్
7. అత్యధిక ప్రాజెక్టులను ఏ నదిపై నిర్మించారు?
   1) గోదావరి 2) గంగా
   3) నర్మద 4) కావేరి
8. భారతదేశంలో కెల్లా అత్యంత ఎత్తైన ప్రాజెక్టు?
   1) నాథ్ ప్రాజెక్టు
   2) భాక్రా ప్రాజెక్టు
   3) నాగార్జున ప్రాజెక్టు
   4) హీరాకుడ్ ప్రాజెక్టు
9. కిందివాటిలో అంతర్జాతీయ ప్రాజెక్టు?
   1) కోసి 2) చంబల్
   3) తెహ్రీడ్యామ్ 4) మయూరాక్షి
10. ప్రపంచంలో అతి పెద్ద రాతికట్టడపు ఆనకట్ట ఏది?
   1) భాక్రానంగల్ 2) హీరాకుడ్
   3) నాగార్జున సాగర్ 4) కోసి
11. భారతదేశంలో జాతీయ జల మండలిని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1975 2) 1948
   3) 1951 4) 1990

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2; 5) 3; 6) 2; 7) 3; 8) 2; 9) 1; 10) 3; 11) 4.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. 'సుంకేసుల' ప్రాజెక్టును ఏ నదిపై నిర్మిస్తున్నారు? (కానిస్టేబుల్-2012)
   1) గోదావరి 2) నాగావళి
   3) తుంగభద్ర 4) పెన్నా
2. ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో జంఝావతి రబ్బర్ డ్యాం ఉంది? (కానిస్టేబుల్-2009)
   1) వరంగల్ 2) శ్రీకాకుళం
   3) విశాఖపట్నం 4) విజయనగరం
3. పులిచింతల ప్రాజెక్టు ఎవరి పేరుతో నిర్మించారు? (కానిస్టేబుల్-2009)
   1) డి. సంజీవయ్య
   2) కె.ఎల్.రావు
   3) కోట్ల విజయభాస్కర్ రెడ్డి
   4) జె. చొక్కారావు
4. ఇందిరాసాగర్ ఆనకట్టను ఏ నదిపై నిర్మించారు? (కానిస్టేబుల్-2013)
   1) మహానది 2) చంబల్
   3) నర్మద 4) యమున
5. జపాన్ సహాయంతో పూర్తి చేసిన పైథాన్ (జయక్‌వాడీ) జల విద్యుత్ ప్రాజెక్టు ఏ నదిపై ఉంది? (కానిస్టేబుల్ - 2013)
   1) గంగ 2) గోదావరి
   3) నర్మద 4) కావేరి

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 3; 5) 2.

ఉద్యోగాలు

ఇండియా ఆప్టెల్ లిమిటెడ్‌లో 13 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని ఇండియా ఆప్టెల్ లిమిటెడ్(ఐఓఎల్)..ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.

» **పోస్టుల వివరాలు:** సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్(ఎలక్ట్రోఆప్టిక్స్ సిస్టమ్ డిజైన్-03, సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్(రోబోటిక్స్ ఫర్మ్‌వేర్ అండ్ కంట్రోల్)-02, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)-08.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, డిగ్రీ, బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకట్రానిక్స్, కంప్యూటర్స్), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

» **వయసు:** 40 ఏళ్ల మించకూడదు.

» **వేతనం:** నెలకు డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టుకు రూ.85,000, మిగతా పోస్టులకు రూ.లక్ష.

» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సీనియర్ మేనేజర్/హెచ్‌ఆర్, ఇండియా ఆప్టెల్ లిమిటెడ్ కార్పొరేట్ హెచ్‌క్యూ(ఓఎఫ్‌ఐఎల్ క్యాంపస్), రాయ్‌పూర్, డెహ్రాడూన్ చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 06.09.2024.

» **వెబ్‌సైట్:** https://www.indiaoptel.in

ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టులు

మాల్పే(కర్ణాటక)లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్).. ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.

» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, నావల్ ఆర్కిటెక్చర్.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 65 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

» **వయసు:** 05.09.2024 నాటికి 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా

» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**06.08.2024

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**05.09.2024

» **వెబ్‌సైట్:** https://udupicsl.com

'అనాటమీ ఆఫ్ ప్లాంట్స్' గ్రంథ రచయిత?



టెట్/డీఎస్సీ

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. జంతు రాజ్యంలో మొదటి త్రిస్తరిత జీవులు ఏ వర్గానికి చెందినవి?
   1) అనెలిడ 2) మొలస్కా
   3) ప్లాటీహెల్మింథిస్ 4) ఆర్థ్రోపొడ
2. జంతు రాజ్యంలో మొదటి నిజ శరీర కుహర జీవులు ఏవి?
   1) ప్లాటీహెల్మింథిస్ 2) నెమటోడ
   3) అనెలిడ 4) పొరిఫెర
3. ద్విపార్శ్వ సౌష్టవం మొదటిసారిగా ఏ వర్గపు జీవుల్లో కనిపించింది?
   1) గుండ్రటి పురుగులు 2) బద్దె పురుగులు
   3) వానపాములు 4) కీటకాలు
4. నాలుగు రాజ్యాల వర్గీకరణను ప్రతిపాదించిన శాస్త్రవేత్త ఎవరు?
   1) హెకెల్ 2) విట్టేకర్
   3) కోప్‌లాండ్ 4) లిన్నియస్
5. కింది వాటిలో విట్టేకర్ వర్గీకరణలో ఉండి, కోప్‌లాండ్ వర్గీకరణలో లేని రాజ్యం ఏది?
   1) ప్రొటిస్టా 2) ఎనిమేలియా
   3) ఫంజై 4) మొనీరా
6. కింది వాటిలో హెకెల్ తన వర్గీకరణలో లిన్నియస్ ప్రతిపాదించిన రెండు రాజ్యాలకు దేన్ని కలిపాడు?
   1) ఫంజై 2) మొనీరా
   3) ప్రొటిస్టా 4) ప్లాంటే
7. 'ద్వినామీకరణం'లో మొదటి పదం దేన్ని సూచిస్తుంది?
   1) ప్రజాతి 2) జాతి
   3) ఉపజాతి 4) కుటుంబం
8. 'జాతి' అనే పదాన్ని తొలిసారిగా వర్ణించిన శాస్త్రవేత్త ఎవరు?
   1) లిన్నియస్ 2) హెకెల్
   3) జాన్‌రే 4) హుకర్
9. పరాశరుడు భూచర మొక్కలను ఏ లక్షణం ఆధారంగా వర్గీకరించాడు?
   1) ఆయుర్వేద గుణం 2) పుష్ప లక్షణం
   3) ఆవాసం 4) ఏదీకాదు
10. వర్గీకరణ అంతస్తులో పెద్దది ఏది?
   1) రాజ్యం 2) వర్గం
   3) కుటుంబం 4) రంగం
11. కింది వాటిలో ఏ రాజ్యానికి చెందిన జీవులు అతి పురాతనమైనవి?
   1) ప్రొటిస్టా 2) ఫంజై
   3) మొనీరా 4) ప్లాంటే
12. ఏక కణ నిజకేంద్రక జీవుల రాజ్యం ఏది?
   1) ప్రొటిస్టా 2) మొనీరా
   3) మెటాఫైటా 4) మెటాజోవా
13. ఏక కణ కేంద్రక పూర్వ జీవుల రాజ్యం ఏది?
   1) మొనీరా 2) ప్రొటిస్టా
   3) ఫంజై 4) ఎనిమేలియా
14. ఫంజై రాజ్యానికి సంబంధించి కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
   1) అన్నీ బహుకణ జీవులు
   2) ఎక్కువ బహుకణ జీవులు, కొన్ని ఏకకణ జీవులు
   3) ఎక్కువ శాతం సిద్ధబీజాలను ఉత్పత్తి చేస్తాయి
   4) పైవన్నీ సరైనవే
15. జంతు రాజ్యంలో మొదటిసారిగా సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ ఏ జీవుల్లో కనిపించింది?
   1) మొలస్కా 2) ఆర్థ్రోపొడ
   3) అనెలిడ 4) పొరిఫెరా
16. వివృత రక్త ప్రసరణ మొదటిసారిగా ఏ జీవుల్లో కనిపించింది?
   1) ఇఖైనోడర్మట 2) మొలస్కా
   3) అనెలిడ 4) ఆర్థ్రోపొడ
17. కింది వాటిలో ఏ జీవుల్లో మొదటిసారిగా తల, వక్షం, ఉదరం అనే భాగాలు కనిపించాయి?
   1) అనెలిడ 2) మొలస్కా
   3) ఆర్థ్రోపొడ 4) ఇఖైనోడర్మట
18. కింది వాటిలో ఏ వర్గం జీవులు మంచినీటిలో, భూమి మీద నివసించలేవు?
   1) అనెలిడ 2) ఇఖైనోడర్మట
   3) మొలస్కా 4) ఆర్థ్రోపొడ
19. నవీన జీవుల కంటే పురాతనమైన జీవులు..?
   1) సరళమైనవి 2) సంక్లిష్టమైనవి
   3) చెప్పలేం 4) అభివృద్ధి చెందినవి
20. 'ద్వినామీకరణం'ను ఏ సంవత్సరంలో ప్రతిపాదించారు?
   1) 1856 2) 1758
   3) 1859 4) 1885
21. పట్టుపరుగు గుడ్లను సూక్ష్మజీవులు పాడుచేస్తాయని కనుగొని, వాటిని నిర్మూలించే పద్ధతిని కూడా కనిపెట్టిన శాస్త్రవేత్త?
   1) లూయిస్ పాశ్చర్
   2) ఆంటోనీ వాన్ లివెన్ హుక్
   3) ఆచార్య మహేశ్వరి
   4) టి.ఎస్. వెంకట్రామన్
22. 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ షుగర్‌కేన్ రీసెర్చ్' అనే సంస్థ ఏ నగరంలో ఉంది?
   1) నాగ్‌పూర్ 2) పుణె
   3) లక్నో 4) కటక్
23. పిండోత్పత్తి శాస్త్రానికి నాంది పలికిన శాస్త్రవేత్త?
   1) అరిస్టాటిల్ 2) లూయిస్ పాశ్చర్
   3) విలియమ్ హార్వే
   4) ఆంటోనీ వాన్ లివెన్ హుక్
24. భూమి మీద ఉన్న మొక్కలు, జంతువుల విస్తరణను తెలిపే జీవశాస్త్ర శాఖ ఏది?
   1) జంతు భౌగోళిక శాస్త్రం
   2) జంతు భూ విజ్ఞాన శాస్త్రం
   3) ఆర్నిథాలజీ 4) ఫైకాలజీ
25. 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫైకాలజీ' అని ఎవరిని పేర్కొంటారు?
   1) వెంకట్రామన్ 2) స్వామినాథన్
   3) అయ్యంగార్ 4) బీర్బల్ సహానీ
26. కింది వాటిలో పెంటా వాలెంట్ వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు తోడ్పడదు?
   1) ధనుర్వాతం 2) హెపటైటిస్
   3) కోరింత దగ్గు 4) టైఫాయిడ్
27. MMR (Measles,Mumps and Rubella) వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు ఉపయోగిస్తారు?
   1) బాక్టీరియల్ 2) వైరల్
   3) 1, 2 4) ఫంగల్
28. విద్యార్థి.. జీవశాస్త్రం చదవడం ద్వారా దోమల వల్ల ఏయే వ్యాధులు వ్యాపిస్తాయని తెలుసుకున్నాడు?
   ఎ) మలేరియా బి) బోదకాలు
   సి) డెంగ్యూ డి) మెదడువాపు
   1) ఎ, బి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
29. పాశ్చరైజేషన్ ప్రక్రియ వల్ల సూక్ష్మజీవులు ఏ పరిస్థితుల్లో మనుగడ సాగించలేవని విద్యార్థి అర్థం చేసుకుంటాడు?
   1) అతి శీతల 2) అతి ఉష్ణ
   3) సాధారణ 4) 1, 2
30. మార్షల్, వారెన్ కింది వాటిలో దేనిపై పరిశోధనలు జరిపారు?
   1) కలరా బాక్టీరియా 2) క్షయ బాక్టీరియా
   3) అల్సర్ బాక్టీరియా 4) ప్లేగు బాక్టీరియా
31. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ నోబెల్ బహుమతిని కింది వారిలో ఎవరితో కలిసి పంచుకున్నారు?
   1) విల్కిన్‌సన్, మేయర్ 2) ఫ్లోరి, చైన్
   3) హార్వే, ఫలాడే 4) మాల్ఫీజీ, హార్వే
32. నెఫ్రాన్ నిర్మాణాన్ని అంతర్నిర్మాణ శాస్త్రంలో చదివితే, మూత్రం ఏర్పడే విధానాన్ని గురించి ఏ శాస్త్రంలో చదవాలి?
   1) సూక్ష్మ అంతర్నిర్మాణ శాస్త్రం
   2) శరీర ధర్మ శాస్త్రం 3) అణుజీవ శాస్త్రం
   4) జీవరసాయన శాస్త్రం
33. కింది వాటిలో లక్నోలో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి?
   1) NBRI(National Botanical Research Institute), IARI(Indian Agricultural Research Institute)
   2) CICR(Central Institute for Cotton Research), CRRI(Central Rice Research Institute)
   3) NBRI, IISR(Indian Institute of Sugarcane Research)
   4) IARI, IISR
34. కింది వాటిలో హైదరాబాద్‌లో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి?
   ఎ) NIN(National Institute of Nutrition)
   బి) NIO(National Institute of Oceanography)
   సి) ICRISAT (International Crops Research Institute for the Semi-Arid Tropics)
   డి) NIV(National Institute of Virology)
   1) ఎ, డి 2) బి, సి
   3) బి, డి 4) ఎ, సి
35. కింది వాటిలో ద్వినామీకరణంలో దేన్ని తిరిగి ఉపయోగించవచ్చు?
   1) కుటుంబం 2) ప్రజాతి
   3) జాతి 4) తరగతి
36. కింది వాటిలో 'జాతి'కి సంబంధించి సరికాని వాక్యం ఏది?
   1) అంతర ప్రజననం జరుపుకొనే జీవుల సమూహం
   2) గతిశీలమైంది 3) స్థిరమైంది
   4) ఒకే కేంద్రక నిర్మాణాన్ని కలిగి ఉండే జీవుల సమూహం
37. జతపరచండి.
   శాస్త్రవేత్త
   a) ఎడ్వర్డ్ జెన్నర్ b) లూయిస్ పాశ్చర్
   c) ఎల్లాప్రగడ సుబ్బారావు
   d) జోనస్ సాల్క్
   ఆవిష్కరణ
   i) టెట్రాసైక్లిన్ ii) రేబిస్ వ్యాక్సిన్
   iii) పోలియో వ్యాక్సిన్
   iv) మశూచి వ్యాక్సిన్
   1) a-ii, b-iii, c-iv, d-i
   2) a-iv, b-ii, c-i, d-iii
   3) a-iv, b-iii, c-i, d-ii
   4) a-iii, b-ii, c-i, d-iv
38. కేంద్రకాన్ని 'సైటో బ్లాస్ట్' అంటారని ఊహించిన వారెవరు?
   1) రాబర్ట్ బ్రౌన్ 2) ష్లీడన్
   3) గాల్జీ 4) అరిస్టాటిల్
39. 'అనాటమీ ఆఫ్ ప్లాంట్స్' గ్రంథ రచయిత?
   1) నెహెమియా గ్రూ 2) రాబర్ట్ బ్రౌన్
   3) ష్వాన్ 4) స్టీఫెన్ హేల్స్
40. జతపరచండి.
   శాస్త్రవేత్త
   a) సర్ రొనాల్డ్ రాస్
   b) వాట్సన్, క్రిక్
   c) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
   d) హరగోవింద్ ఖొరానా
   నోబెల్ బహుమతి పొందిన సంవత్సరం
   i) 1902 ii) 1968
   iii) 1945 iv) 1962
   1) a-i, b-iv c-iii, d-ii
   2) a-iv, b-ii, c-i, d-iii
   3) a-iv, b-iii, c-i, d-ii
   4) a-iii, b-ii, c-i, d-iv
41. జతపరచండి.
   శాస్త్రవేత్త
   a) డార్విన్
   b) చార్లెస్ లయెల్ c) మాల్థస్
   d) రుడాల్ఫ్ విర్ఛోవ్
   గ్రంథం
   i) అమ్నిస్ సెల్యూలా డే సెల్యులే
   ii) ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్
   iii) ప్రిన్సిపుల్స్ ఆఫ్ జియాలజీ
   iv) ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పాపులేషన్
   1) a-i, b-iv c-iii, d-ii
   2) a-iv, b-ii, c-i, d-iii
   3) a-ii, b-iii, c-iv, d-i
   4) a-iii, b-ii, c-i, d-iv
42. జోనాస్ సాల్క్, అల్బర్ట్ సాబిన్ అనే శాస్త్రవేత్తలు ఏ వ్యాధి నివారణకు కృషి చేశారు?
   1) కేన్సర్ 2) టైఫాయిడ్
   3) పోలియో 4) డెంగ్యూ

సమాధానాలు

1) 3 2) 3 3) 2 4) 3 5) 3
6) 3 7) 1 8) 3 9) 2 10) 4
11) 3 12) 1 13) 1 14) 1 15) 3
16) 4 17) 3 18) 2 19) 1 20) 2
21) 1 22) 3 23) 1 24) 1 25) 3
26) 4 27) 3 28) 4 29) 4 30) 3
31) 2 32) 2 33) 3 34) 4 35) 3
36) 3 37) 2 38) 2 39) 1 40) 1
41) 3 42) 3

'దేవానాం ప్రియ' అనేది ఎవరి బిరుదు?

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

జైనమతం (క్రీ.పూ. 540-468)

జైనమత స్థాపకుడు రుషభనాథుడు. జైన ప్రవక్తలను 'తీర్థంకరులు' అంటారు. మొత్తం 24 మంది తీర్థంకరులు ఉండేవారు. రుషభనాథుడు మొదటి తీర్థంకరుడు. 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు. చివరివారైన 24వ తీర్థంకరుడు మహావీరుడు.

మహావీరుడు క్రీ.పూ. 540లో వైశాలి నగరానికి సమీపాన ఉన్న 'కుంద' గ్రామంలో క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు సిద్ధార్థుడు, వైశాలి. మహావీరుడి భార్య యశోధ, కుమార్తె ప్రియదర్శిని. ఈయన జీవిత సుఖాలతో తృప్తి చెందక కొంత కాలం దిగంబరుడిగా కఠోర నియమాలను పాటించి తపస్సు చేశాడు. 'జృంబిక' గ్రామంలో పరిపూర్ణజ్ఞానాన్ని పొందిన తర్వాత 'మహావీరుడు'గా పేరు పొందాడు. ఈయన ప్రబోధించిన సరైన క్రియ, సరైన విశ్వాసం, సరైన జ్ఞానం అనే మూడు అంశాలను 'త్రిరత్నాలు'గా పేర్కొంటారు. పంచవ్రతాల ద్వారా మోక్షాన్ని సాధించవచ్చని మహావీరుడు ప్రవచించాడు. ఈయన తన 72వ ఏట క్రీ.పూ. 468లో 'పావాపురి' వద్ద నిర్యాణం చెందాడు.

జైనులు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. ఉపవాసాలు చేసి శరీరాన్ని కృశింపజేసుకొని మరణించడాన్ని 'సల్లేఖన వ్రతం'గా పేర్కొంటారు. చాలా మంది రాజులు జైనమతాన్ని ఆదరించి అభివృద్ధి చేశారు. చంద్రగుప్త మౌర్యుడు ఈ మతాన్ని అనుసరించి, అన్నింటినీ త్యజించి శ్రావణ బెళగొళలో మరణించాడు. జైనులు ప్రజల భాష అయిన ప్రాకృతంలో తమ సందేశాన్ని ప్రచారం చేశారు. చంద్రగుప్తుడి కాలంలో పాటలీపుత్రంలో స్థూలభద్ర ఆధ్వర్యంలో జైనమత మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జైనమత బోధనలను 12 అంగాలుగా విభజించి క్రోడీకరించారు. కొంతకాలం తర్వాత వస్త్రధారణ విషయంలో అభిప్రాయభేదాలు తలెత్తడం వల్ల జైనమతం దిగంబర, శ్వేతాంబర శాఖలుగా చీలిపోయింది. రెండో జైన సంగీతి క్రీ.శ. 512లో వల్లభి (గుజరాత్)లో దేవార్థి క్షమపణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 'గంధర్వ' అనే పవిత్ర గ్రంథాలను క్రమానుసారంగా రాశారు. జైనులు శిల్పకళను అభివృద్ధి చేశారు.

క్రీ.పూ. 4వ శతాబ్దం చివరి రోజుల్లో గంగా లోయ ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చాలామంది జైన గురువులు, సన్యాసులు దక్షిణ భారతదేశానికి తరలివెళ్లారు. ముఖ్యంగా శ్రావణ బెళగొళ ప్రాంతానికి ఎక్కువ మంది వచ్చారు. దక్షిణానికి వచ్చినవారిలో భద్రబాహుడు, చంద్రగుప్త మౌర్యుడు లాంటి ప్రముఖులు ఉన్నారు. మగధలో ఉన్న జైనులు శ్వేతాంబరులయ్యారు. వీరికి గురువు స్థూల బాహుడు.

జైనమత మహత్వ సూత్రాలు

1) అహింస
2) సత్యభాషణ
3) అపరిగ్రహం (దొంగిలించకపోవడం)
4) అస్తేయం (ఆస్తి లేకుండా ఉండటం)
5) బ్రహ్మచర్యం

వీటిలో మొదటి నాలుగు సూత్రాలు మహావీరుడి ముందు కాలం నుంచే అమల్లో ఉన్నాయి. మహావీరుడు బ్రహ్మచర్యాన్ని పంచమ సూత్రంగా కలిపాడు.

జైనుల ప్రధాన కట్టడాలు

- అబూ పర్వతం-మహావీరుడి దేవాలయం
- శ్రావణ బెళగొళ-గోమతేశ్వరుడి విగ్రహం
- అజంతా, ఎల్లోరా, ఉదయగిరి గుహలు
- బాదామి - జైన దేవాలయాలు

అజీవికులు: గోశాల మస్కారిపుత్రుడు అజీవిక మతశాఖను స్థాపించారు. ఇది జైన మత సిద్ధాంతాలకు సన్నిహితంగా ఉంది. అశోకుడి కాలంలో ఇది బాగా వ్యాప్తి చెందింది.

హర్యాంక వంశం (క్రీ.పూ.542-490)

క్రీ.పూ. 542-490 మధ్య కాలంలో రాజకీయంగా అనేక పరిణామాలు సంభవించాయి. ఉత్తర భారతదేశంలో మహాజనపదాలుగా పేర్కొనే పదహారు పెద్ద రాజ్యాలు ఏర్పడ్డాయి. వీటినే 'షోడశ మహాజనపదాలు' అంటారు. వీటిలో మగధ రాజ్యం శక్తిమంతమైంది. గిరివ్రజం, పాటలీపుత్రం దీని రాజధాని నగరాలు. మొదటగా దీన్ని బృహద్రథ వంశస్థులు పాలించారు. తర్వాత హర్యాంక వంశస్థులు పరిపాలించారు. వీరిలో బింబిసారుడు గొప్పవాడు. ఈయన తర్వాత అజాతశత్రువు పాలించాడు.

అజాతశత్రువు పాలనా కాలం క్రీ.పూ. 495-464. ఈయన హర్యాంక వంశ స్థాపకులైన బింబిసారుడి కుమారుడు. అజాతశత్రువు భార్య వజీరాదేవి. ఈమె కోసలరాజు ప్రసేనజిత్తు కుమార్తె. అజాతశత్రువు వజ్జి గణరాజ్య సమాఖ్యతో 16 ఏళ్ల యుద్ధం చేసి జయించాడు. కంటక శిల, కంటక బోధన అనే రాళ్లు, విసరు రథాలను యుద్ధంలో ఉపయోగించి శత్రురాజులను జయించాడు. ఈయన పాటలీపుత్రాన్ని నిర్మించాడు. ఈయనకు కుణిక అనే పేరు కూడా ఉంది. ఉదయనుడు ఈయన వారసుడు. అజాతశత్రువు గౌతమబుద్ధుడి సమకాలీకుడు.

హర్యాంక వంశం తర్వాత మగధను శిశునాగ వంశం (క్రీ.పూ. 490-458) పాలించింది. వీరి తర్వాత నంద వంశస్థులు రాజ్యానికి వచ్చారు. నంద వంశంలో మహాపద్మనందుడు గొప్పరాజుగా పేరు పొందాడు. ఈయనకు 'మహాక్షత్రాంతక' అనే బిరుదు ఉంది. ఆ తర్వాత చంద్రగుప్త మౌర్యుడు చాణక్యుని సహాయంతో నందవంశాన్ని నిర్మూలించి మౌర్యవంశాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు (క్రీ.పూ. 327-325)

భారతదేశంలో రాజకీయ అనైక్యత కారణంగా విదేశీయులు దండయాత్రలు ప్రారంభించారు. పారశీకులు మొదటగా భారత్‌పై దండయాత్ర చేశారు. వీరిలో 'సైరస్', 'డేరియస్' గొప్పవారు. పారశీక చక్రవర్తి 'సైరస్' గాంధారను జయించారు. వీరి తర్వాత గ్రీకులు భారతదేశంపై దండెత్తారు. గ్రీకు రాజ్యాల్లో అగ్రగామి అయిన మాసిడోనియా చక్రవర్తి అలెగ్జాండర్ విశ్వవిజేతగా పేరు పొందారు. గ్రీకు దండయాత్రల ఫలితంగా భారతదేశానికి, యూరప్ దేశాల మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. భారతీయులు గ్రీకుల నుంచి నాణేల ముద్రణ; శిల్ప, ఖగోళ శాస్త్రాలను నేర్చుకున్నారు.

మౌర్య సామ్రాజ్యం (క్రీ.పూ. 322)

మౌర్యుల చరిత్రకు ఆధారాలు: విదేశీ గ్రంథాలు: మెగస్తనీస్ (గ్రీకు రాయబారి) రాసిన 'ఇండికా', స్ట్రాబో, డియోడరస్, ఏరియస్, ప్లీనీ రచనలు మౌర్యుల చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

సాహిత్య ఆధారాలు: కౌటిల్యుడి 'అర్థశాస్త్రం', విశాఖదత్తుడి 'ముద్రారాక్షసం'.

మత సంబంధ ఆధారాలు: పురాణాలు, బౌద్ధుల దివ్య వదన, అశోకవదన, శ్రీలంకకు సంబంధించిన దీపవంశ, మహావంశ, జైనులకు సంబంధించిన పరిశిష్ట పర్వణ్ మొదలైనవి కూడా మౌర్యుల చరిత్రను తెలుసుకోవడానికి దోహదపడుతున్నాయి.

వీటితో పాటు శిలా శాసనాలు, రాతి చెక్కడాలు, గుహలు కూడా మౌర్యుల చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి.

చంద్రగుప్త మౌర్యుడు: ఈయన మౌర్యవంశ స్థాపకుడు. చంద్రగుప్త మౌర్యుడు తన చివరి రోజుల్లో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో జీవించాడు. 'సల్లేఖన వ్రతం' ద్వారా మరణించాడు. ఈయన క్రీ.పూ. 303లో 'సెల్యూకస్ నికే టర్'తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మౌర్య సామ్రాజ్యానికి ఎక్కువ ప్రయోజనం కలిగింది.



బిందుసారుడు (క్రీ.పూ. 298-273): ఈయన చంద్రగుప్త మౌర్యుడి కుమారుడు. బిందుసారుడికి 'అమిత్రఘాత', 'సింహసేనుడు' అనే బిరుదులు ఉన్నాయి. ఈయన రాజ్యాన్ని మైసూరు వరకు విస్తరించాడు. చాణక్యుడు కొంత కాలంపాటు బిందుసారుడికి కూడా మహామంత్రిగా ఉండి ఆయనకు రాజ్య రక్షణలో సాయపడినట్లుగా టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ పేర్కొన్నారు. బిందుసారుడి పాలనా కాలంలో తక్షశిలలో తిరుగుబాటు జరిగింది. ఈయన ఆజ్ఞ ప్రకారం అశోకుడు తక్షశిలకు వెళ్లి శాంతి నెలకొల్పాడు. బిందుసారుడు గ్రీకు రాజ్యాలతో స్నేహ సంబంధాలు పెంపొందించాడు.

అశోకుడు (క్రీ.పూ. 273-232): ఈయన బిందుసారుడి కుమారుడు. అశోకుడు పట్టాభిషేకం చేసుకున్న తొమ్మిదేళ్లకు (క్రీ.పూ. 262- 61లో) సామ్రాజ్యకాంక్షతో కళింగ రాజ్యంపై దండెత్తి జయించాడు. ఈ యుద్ధం 'ధర్మాశోకుడు'గా పూర్తిగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ఆ తర్వాత ఉపగుప్తుడు అనే బౌద్ధ ఆచార్యుడి వద్ద అశోకుడు బౌద్ధమత దీక్ష స్వీకరించాడు. ధర్మప్రచారానికి పూనుకొని 'దేవానాం ప్రియ', 'ప్రియదర్శిని' బిరుదులు పొందాడు. బానిసలు, సేవకుల పట్ల కరుణ, తల్లిదండ్రులు, పెద్దల పట్ల విధేయత, గురువుల పట్ల గౌరవం, స్నేహితులు, బంధువులు, పరిచయస్థుల పట్ల ఔదార్యం, పురోహితులు, భిక్షువుల పట్ల ఆదరణ అనేవి అశోకుడు ప్రబోధించిన 'ధర్మం'లోని సూత్రాలు. 'అహింసా' అనేది 'ధర్మం'లోని ముఖ్యసూత్రం. అశోకుడు 42 ఏళ్ల పరిపాలించి క్రీ.పూ. 232లో మరణించాడు.

వివిధ శాసనాల ఆధారంగా అశోకుడి సామ్రాజ్య సరిహద్దుల గురించి తెలుస్తోంది. షహబద్‌గిరి, మాన్‌షేషరా శాసనాలు వాయవ్య సరిహద్దును, రుమిందై శాసనం ఈశాన్య సరిహద్దును, సొపారా, గిర్నార్ శాసనాలు పశ్చిమ సరిహద్దును తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. బబ్రూ శాసనం అశోకుడి బౌద్ధమత స్వీకారం గురించి, ధౌలీ, జునాగఢ్ శాసనాలు ఉదాత్త రాజ ధర్మ స్వరూపం గురించి, బరాబర్ శాసనం పరమత సహనం గురించి, 13వ శిలాశాసనం కళింగ యుద్ధం గురించి తెలుపుతున్నాయి. మస్కీలో అశోక అనే పదం ఉంది. కళింగ యుద్ధం తర్వాత అశోకుడి పాలన గురించి కళింగ శాసనం ద్వారా తెలుస్తోంది. రుమిందై, ఇగ్లివ శాసనాలు అశోకుడికి బుద్ధుడిపై ఉన్న గౌరవాన్ని వివరిస్తాయి. తరాయి శాసనం అశోకుడికి బౌద్ధమతంపై ఉన్న గౌరవాన్ని తెలుపుతుంది.

అన్ని మతాల సారాంశం ఆధారంగా అశోకుడు కొన్ని సూత్రాలతో దమ్మను తయారు చేశాడు. ఈయన దమ్మ ప్రచారం కోసం ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను పంపిస్తే వారు బౌద్ధ మతాన్ని ప్రచారం చేశారు. భారత ఉపఖండంలో అశోకుడు వేయించిన 14 ప్రధాన శిలా శాసనాలు, ఏడు స్తంభ శాసనాలు, అనేక చిన్నరాతి శాసనాలు లభించాయి. ఇందులో చాలావాటిపై ప్రజల కోసం చేసిన ప్రకటనలు చెక్కారు. 14 శిలా శాసనాలు అశోకుడి దమ్మ సూత్రాల గురించి తెలుపుతున్నాయి. మస్కీ శాసనంలో 'దేవానాం ప్రియ' అని ఉంది.

మౌర్య వంశ చివరి పాలకులు (క్రీ.పూ. 232 - 185): అశోకుడి తర్వాత వచ్చిన రాజులు అర్ధ శతాబ్దం పాటు పాలించారు. మౌర్య వంశ చివరి రాజైన బృహద్రధుడిని ఆయన సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించడంతో వీరి పాలన అంతమైంది.

మౌర్యుల పాలనా వ్యవస్థ

భారతదేశంలో ప్రప్రథమంగా కేంద్రీకృత అధికారాలు కలిగిన నిర్దిష్టమైన పరిపాలన రూపొందించింది మౌర్య చక్రవర్తులే. వీరికి పాలనలో సలహా కోసం మంత్రితో పాటు పరిషత్తు ఉండేది. పాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించి వాటికి రాజప్రతినిధులను నియమించారు. భూమిశిస్తు ప్రభుత్వ ప్రధాన ఆదాయం. పంట దిగుబడిలో 4 నుంచి 6వ వంతు వరకు శిస్తు వసూలు చేసేవారు. పాటలీపుత్ర నగర పాలన ముప్పై మంది సభ్యులున్న బోర్డు నిర్వహణలో ఉండేది. వర్తకుల 'శ్రేణులు' బ్యాంకులుగా పనిచేశాయి. సమాజంలో బహు భార్యత్వం, కన్యల విక్రయం, సతీసహగమనం లాంటి దురాచారాలు ఉండేవి. ఈ కాలంలో స్త్రీల స్థాయి తగ్గింది. మౌర్యులు ఎక్కువగా ప్రజల భాష అయిన ప్రాకృతాన్ని ఉపయోగించారు. శిలా శాసనాల్లో 'ఖరోష్టి', 'బ్రాహ్మి' లిపులను వాడారు.

అడ్మిషన్స్

నిమ్స్ హైదరాబాద్‌లో పీజీడీఎన్‌ఎంటీలో ప్రవేశాలు

హైదరాబాద్ పంజాగుట్టలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లొమా ఇన్ న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం సీట్ల సంఖ్య:** 08.
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- **అర్హత:** బీఎస్సీ(ఏదైనా సైన్స్ సబ్జెక్టులు/లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 31.12.2024 నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ప్రవేశపరీక్షలో మెరిట్ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**02.09.2024
- **దరఖాస్తు హార్డ్‌కాపీ సమర్పణకు చివరితేది:** 05.09.2024.
- **హాల్ టిక్కెట్ల జారీ తేది:** 18.10.2024.
- **ప్రవేశ పరీక్ష తేది:** 23.10.2024.
- **వెబ్‌సైట్:** https://www.nims.edu.in

నిట్ వరంగల్‌లో బీఎస్సీ-బీఈడీ ఇంటిగ్రేటెడ్ ప్రవేశాలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో నాలుగేళ్ల బీఎస్సీ-బీఈడీ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్(సెకండరీ స్టేజ్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్‌లో కోర్సు ప్రారంభం కానుంది.

- **కోర్సుల వివరాలు:** నాలుగేళ్ల బీఎస్సీ-బీఈడీ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్(సెకండరీ స్టేజ్)-50 సీట్లు.
- **విభాగాలు:** మ్యాథ్స్(మైనర్ సబ్జెక్టుగా కంప్యూటర్ సైన్స్), ఫిజికల్ సైన్స్(మైనర్ సబ్జెక్టుగా మ్యాథ్స్)
- **అర్హత:** 2022/2023/2024 విద్యా సంవత్సరాల్లో 10+2 లేదా 12వ తరగతి/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులు) 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎన్‌సీఈటీ)-2024 స్కోరు సాధించి ఉండాలి.
- **ఎంపిక:** ఎన్‌సీఈటీ-2024 స్కోరు,రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**27.08.2024
- **మొదటి దశ ఎంపిక జాబితా వెల్లడి తేది:** 02.09.2024. » **రెండో దశ ఎంపిక జాబితా వెల్లడి తేది:** 06.09.2024.
- **తరగతుల ప్రారంభం:** 17.09.2024.
- **వెబ్‌సైట్:** https://nitw.ac.in

How is the girl related to the boy?



BLOOD RELATIONS

In this chapter a relationship between two persons is to be established based on a single statement or relationship within the whole family based on a group of statements.

First let us look at the relations:

- Father's or mother's son: Brother
- Father's or mother's daughter: Sister
- Father's or mother's father: Grandfather
- Father's or mother's mother: Grandmother
- Father's or mother's brother: Uncle
- Father's or mother's sister: Aunt
- Uncle's or aunt's son or daughter: Cousin
- Brother's or sister's son: Nephew
- Brother's or sister's daughter: Niece
- Brother's wife: Sister-in-law
- Sister's husband: Brother-in-law
- Son's or daughter's son: Grandson
- Son's or daughter's daughter: Granddaughter
- Son's wife: Daughter-in-law
- Daughter's husband: Son-in-law

Family Tree:

The relations among the members of a family can be represented in a family tree. The following method is used to represent the relations.

1) A male member is represented by a (+) sign and a female is represented by a (-) sign.
2) A parent-child relationship is denoted by a vertical or diagonal line where parent is at the top and child is at the bottom.
   Parent   Parent
   /   (or)   /
   Child   Child
3) A wife and husband relation is denoted by a double arrow between them. (husband⇔ wife)
4) A sibling relation (brother - brother / brother - sister / sister - sister) relation is represented by a horizontal line between them. (brother ____ sister)
5) If data is insufficient to draw a conclusion, then it is denoted by a question mark (?).

MODEL PROBLEMS

1. Introducing a girl, a boy says, "She is the daughter of my father's only brother-in-law". How is the girl related to the boy?
   1) Sister-in-law
   2) Granddaughter
   3) Cousin 4) Daughter
   5) None of these
2. Pointing to Sam in a photograph Samridhi said, "His brother's father is the only son of my grandfather." How is Samridhi related to the Sam in the photograph?
   A) Mother B) Aunt
   C) Sister D) Daughter
   1) D 2) B 3) A
   4) C 5) None of these
3. Rahul said, "The boy in that picture is the brother of the daughter of my paternal grand-father's only son". How is the boy in the picture related to Rahul?
   1) Cousin 2) Father
   3) Nephew 4) Brother
   5) None of these
4. Pointing to the photograph of a woman, Rohit said, "The woman in the photograph is the mother of the only daughter-in-law of my mother." How is the woman related to Rohit?
   1) Aunt 2) Wife
   3) Daughter 4) Mother-in-law
   5) Daughter-in-law

Directions (5-6): Study the following information carefully and answer the questions given below:

U is the sister of S. S is the son of Y. Y is the only child of D. D is married to X. D is the sister of P.

5. If T is the daughter-in-law of X, how T is related to S?
   1) Father 2) Sister
   3) Mother 4) Cousin
   5) Cannot be determined
6. How is D related to U?
   1) Cannot be determined
   2) Grandfather 3) Uncle
   4) Grandmother 5) Aunt

Directions (7-11): Study the following information carefully and answer the questions given below:

Seven people - P, Q, R, S, T, U and V - are related to each other in some or the other way. Each person is different age, but not necessarily in the same order.

(Note: It is assumed that the husband is older than the wife.)

T is older than V but younger than U. P is the mother of Q. R is the sister-in-law of P. R is unmarried. T is the daughter-in-law of S. S is the eldest member of the family. U is the father of only R and V. U does not have any sibling. V does not have any son. R is older than V. The third eldest member of the family is 54 years old. The youngest member of the family is 4 years old.

7. If in the given arrangement, Q + V = 31, then what is the possible age of R?
   1) 27 2) 56 3) 23
   4) 59 5) 30
8. If P is 24 years old, what will be the sum of ages of P and T?
   1) 28 2) 78 3) 64
   4) 49 5) 75
9. How is T related to Q?
   1) Grandmother
   2) Granddaughter
   3) Aunt 4) Mother-in-law
   5) Mother
10. If M is married to S, then how is S related to R?
    1) Grandmother
    2) Granddaughter
    3) Grandfather
    4) Uncle
    5) Cannot be determined
11. Who amongst the following is/are younger than V?
    1) Both P and U
    2) Only Q 3) Only P
    4) Both P and Q
    5) No one

KEY & EXPLANATION

1) My father's only brother-in-law ⇒ My only uncle
   ∴ Daughter of my father's only brother-in-law ⇒ daughter of my only uncle
   Daughter of my only uncle ⇒ My cousin
   Therefore the boy says the girl is his cousin. Ans: 3
2) His brother's father Þ his father
   Only son of my grandfather Þ my father
   ∴ "His brother's father is the only son of my grandfather" ⇒ "His father is my father"
   ⇒ Both Sam and Samridhi have same father.
   ∴ Sam and Samridhi are siblings in which Sam is male and Samridhi is female.
   ⇒ Samridhi is Sam's sister.
   Ans: 4
3) My paternal grandfather's only son ⇒ my father
   Daughter of my paternal grandfather's only son ⇒ daughter of my father
   ∴ Daughter of my father ⇒ My sister
   Brother of my sister ⇒ My brother
   Ans: 4
4) Only daughter-in-law of my mother ⇒ My wife
   (∵ statement is given by a male)
   ∴ Mother of only daughter-in-law of my mother ⇒ Mother of my wife
   Mother of my wife ⇒ My mother-in-law
   ∴ The woman in photograph is Rohit's mother-in-law.
   Ans: 4

(5-6):

U is the sister of S ⇒ U ___ S

S is the son of Y ⇒ Y / S+

∴ U is the daughter of Y Þ

Y
S(+) ___ U(-)

Y is the only child of D and D is married to X ⇒

D ⇔ X
/
Y

D is the sister of P ⇒ D ___ P
∴ X is a male

Now combining the relations

X(+) ⇔ D(-) ___ P(?)
|
Y
/\
S(+) ___ U(-)
(?)

5) If 'T' is daughter-in-law of X, then 'T' should be the wife of Y and hence the mother of S.
   Ans: 3
6) 'D' is the mother of parent of 'U'. Therefore D is the grandmother of U. Ans: 4

(7-11):

T is older than V but younger than U
⇒ T > V and U > T
∴ U > T > V

P is mother of Q and R is sister-in-law of P.

P(-) ⇔ (+) ___ R(-)
/
Q

⇒ P, R > Q

T is the daughter-in-law of S and S is eldest member of family.

S
|
(+) ⇔ T(-)

U is the father of only R and V. Therefore V got married to P.

U
△+
P ⇔ V(+)   R(-)
/
Q

U doesn't have any sibling means U should get married to T.

S
/
U(+) ⇔ T(-)
△
P(-) ⇔ V(+)   R(-)
/
Q(-)

R is older than V
⇒ S > U > T > R > V > P > Q
∴ T = 54 Q = 4

7) If Q + V = 31 ⇒ V = 31 - 4 = 27
   S > R > V
   ⇒ 54 > R > 27
   The possible value of 'R' from the options is 30
   Ans: 5
8) T = 54
   P = 24
   ∴ P + T = 78
   Ans: 2
9) T is the grandmother of Q.
   Ans: 1
10) If M is married to S, S is the husband (As S is eldest in the family) and M is the wife. Hence S is the grandfather of R
    Ans: 3
11) Both P and Q are younger than V
    Ans: 4